'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 321

బుధవారం 11-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ఏఐ, డీప్‌ఫేక్'పై కొరడా

ప్రతి ఏఐ కంటెంట్‌పై లేబుల్ ఉండాలన్న కేంద్ర ప్రభుత్వం -6లో

విన్స్ మోర్

జపాన్ తొలి మహిళా ప్రధాని సనై తకాయిచిపై కథనం - 13లో



స్పీకర్‌ను తొలగించాలి

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుంచి తొలగించాలని కోరుతూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని కాంగ్రెస్ నోటీసులిచ్చింది.

వివరాలు 6లో ▸

నేటి నుంచి అసెంబ్లీ

ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నేడు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు.

వివరాలు 10లో ▸

శివ భక్తులపై లాఠీచార్జి చేస్తున్న ఏఎస్పీ యుగంధర్ ▸

శివ శివా.. ఇదేం దారుణం?

శ్రీశైలంలో చంద్రబాబు సర్కార్ ఘోర వైఫల్యం

కనీస సదుపాయాలు కల్పించకపోగా భక్తులపై లాఠీచార్జీనా..

ఇంత దుర్మార్గమా అంటూ శివస్వాముల ఆగ్రహం

సరైన ప్రణాళిక లేకే క్యూలైన్లలో తొక్కిసలాట..

రక్షించు శివా అంటూ భక్తుల ఆర్తనాదాలు

గతంలో ఎన్నడూ చూడలేదంటున్న ధార్మిక సంఘాలు

సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యత వహించాలంటున్న భక్తులు

తిరుపతి, సింహాచలం, కాశీబుగ్గ తరహాలోనే తొక్కిసలాట..

అదృష్టవశాత్తూ తప్పిన ప్రమాదం..

వరుస ఘటనలు జరుగుతున్నా బాబు సర్కార్ నిర్లక్ష్యం

భక్తుల మనోభావాలు దెబ్బతీస్తూ తిరుమల ప్రసాదంపైనా నిరాధార ఆరోపణలు.. అందుకే బాబుగారి భక్తిపై భక్తులకు సందేహాలు

పుణ్యక్షేత్రాల నిర్వహణే చేతకావడంలేదంటే కనీస అడ్మినిస్ట్రేషన్ తెలియడం లేదనుకోవాలి.. ఎల్లో మీడియా ప్రచారం చేస్తున్న సమర్థవంతమైన పరిపాలన అంటే ఇదేనా? అని ప్రశ్నిస్తున్న విశ్లేషకులు

2లో

శివ భక్తులపై లాఠీచార్జి దుర్మార్గం

- భక్తులకు కనీస ఏర్పాట్లు చేయడంలో టీడీపీ సర్కార్ విఫలం
- సనాతన ధర్మం గురించి మాట్లాడే చంద్రబాబు, పవన్ మౌనం వహిస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు
- బాబు సర్కార్‌ను నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2లో

శ్రీశైలం ఘటన ప్రభుత్వ తప్పిదమే

తప్పు ఒప్పుకున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం

ముందస్తు ప్రణాళిక విఫలం కావడం వల్లే దుస్థితి

3లో

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా

బాలాజీ మెడమల్లి

రాష్ట్రపతి ఆమోద ముద్ర

నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం.. రెండు మూడు రోజుల్లో ప్రమాణం

10లో

'విజనరీ' పాలనలో కల్పిత గణాంకాలు

పన్ను ఆదాయాల వృద్ధిలో దేశంలో 22వ స్థానంలో ఏపీ

- చిట్టచివరి నుంచి రెండో స్థానంలో మన రాష్ట్రం
- 2024–25, 2025–26లో దేశం కంటే రాష్ట్ర వృద్ధి రేటు ఎక్కువంటూ చంద్రబాబు ప్రచారం
- రెండేళ్లలో సగటు వార్షిక వృద్ధి రేటు 11.09 శాతంగా చూపిస్తున్న చంద్రబాబు సర్కార్
- కానీ.. రెండేళ్లలో కేంద్ర ప్రభుత్వ స్థూల పన్నుల ఆదాయాలు 9.64% పెరిగితే.. రాష్ట్ర పన్నుల ఆదాయం పెరిగింది కేవలం 1.97 శాతమే
- ఇది ప్రపంచంలో ఆర్థిక నిపుణులు అందరికీ ఆశ్చర్యం అనిపించక మానదు
- కాగ్ గణాంకాలను ఉటంకిస్తూ చంద్రబాబు సర్కార్‌ను కడిగిపారేసిన వైఎస్ జగన్
- అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, దుష్ప్రచారాల్లో రాష్ట్రాన్ని చంద్రబాబు మొదటి స్థానంలో నిలిపారంటూ వ్యంగ్యోక్తులు

3లో

అప్పుల్లో ఏపీ టాప్

దేశంలోనే అత్యధికంగా బాబు సర్కారు రూ.3.27 లక్షల కోట్ల అప్పులు

9 నెలల్లోనే బడ్జెట్ అంచనాలకు మించి అప్పుల మోత

బడ్జెట్ అప్పులు రూ.85,269 కోట్లు

వెల్లడించిన 'కాగ్'

3లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹75

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 120 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 147 కిలో

డ్రెస్డ్ స్కిన్‌తో 213 కిలో

స్కిన్ లెస్ 243 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

పోలవరంపై రాజీపడొద్దు..

ఏపీని అప్పుల కుప్పగా మార్చొద్దు

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

5లో

ఉద్యోగుల ఉసురు తీస్తున్న చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి

16లో

చంద్రబాబూ.. దేవుడితో ఆటలా?

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మండిపాటు



తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో దేవుడితోనూ ఆటలాడుకుంటున్న ఘనత సీఎం చంద్రబాబుదేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మండిపడ్డారు. దేవుడితో రాజకీయం చేయడం తగదని తప్పు పట్టారు. లడ్డూపై ప్రజల్లో భయం కలిగించేలా చేశారని.. ఇది దైవ ద్రోహమేనన్నారు.

2లో

ఇంతంతే!

దేశవ్యాప్తంగా ఉన్న ఐఏఎస్‌లందరూ కలసి ఏర్పాటు చేశార్సార్! రోజూ ఓ రెండు గంటలు కోచింగ్ ఇవ్వాలట!

జంతువుల కొవ్వు కలిసిందని చెప్పు

- ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు బెదిరింపులు
- పందికొవ్వు, ఆవుకొవ్వు, బాత్రూం రసాయనాలు కలిశాయని ఎందుకు చెప్పడం లేదంటూ హూంకరింపులు
- అవే కాకుండా మరికొన్ని దారుణమైనవి కలిశాయని చెప్పాలంటూ దాదాపు 20 నుంచి 30 ఫోన్లు.. మూడు రోజుల క్రితమే ఫిర్యాదు చేసినా పట్టించుకోని మంత్రి లోకేశ్

3లో



క్లుప్తంగా...

శివ స్వాములపై లాఠీచార్జి సిగ్గుచేటు

విశ్వ హిందూ పరిషత్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం క్షేత్రంలో దర్శనానికి వచ్చిన శివ స్వాములు, సాధు సంతులు, భక్తులపై లాఠీచార్జి చేయడం సిగ్గుచేటని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) వ్యాఖ్యానించింది. భక్తుల భద్రత, దర్శన ఏర్పాట్లలో అధికారులు విఫలమయ్యారని, తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి లాఠీచార్జీ చేయడం అమానుషమని విమర్శించింది. మహిళలు, వృద్ధులు, చిన్నారులపై కూడా దౌర్జన్యం జరగడం హిందూ వ్యతిరేక వైఖరిని బయటపెడుతోందని పేర్కొంది. లాఠీచార్జికి బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, గాయపడిన భక్తులకు వైద్యసాయం, పరిహారం అందించాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరింది. మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు సముచిత ఏర్పాట్లు చేయాలని వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బాబూ.. దేవుడితో ఆటలా?

- శ్రీవారి లడ్డూ విషయంలో రాజకీయం తగదు
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మండిపాటు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో దేవుడితోనూ ఆటలాడుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మండిపడ్డారు. దేవుడితో రాజకీయం చేయడం తగదని తప్పు పట్టారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబుతో మంగళవారం ఆయన ములాఖత్ అయ్యాక మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూ విషయంలో వేంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి లాగొద్దన్నారు. ఒకవేళ కల్తీ జరిగి ఉంటే అలా చేసిన వారిని పట్టుకుని శిక్షించాలే తప్ప, ఎంతో ఇష్టంగా తినే పవిత్రమైన తిరుమల లడ్డూపై ప్రజల్లో భయం కలిగించేలా చేశారని, ఇది దైవ ద్రోహమేనని స్పష్టం చేశారు. స్వామిని రాజకీయాల్లోకి లాగకుండా, నిజ నిర్ధారణ చేసుకోవాలని హితవు పలికారు.

శ్రీశైలంలో భక్తులపై లాఠీచార్జిని ఖండించిన బీజేపీ

సాక్షి, అమరావతి : శ్రీశైలంలో శివ మాలధారులపై లాఠీచార్జి చేయడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం ఒక ప్రకటనలో తప్పుబట్టారు. 'మాల ధారణ చేసిన భక్తులు శ్రీశైలంలో ఇరుముడులు సమర్పిస్తారు. వారికి సహకరించాల్సిన యంత్రాంగం సంయమనం కోల్పోతే ఎలా ? అడిషనల్ ఎస్పీనే లాఠీచార్జి చేయడం ఏంటి?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం ఆలయ పాలక మండలి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో చంద్రబాబు పాలన ఓ సామాజిక వర్గం వారికే ప్రాధాన్యత ఇచ్చేలా సాగుతోందంటూ జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని బీజేపీ శాసనసభా పక్షం సమావేశంలో మాధవ్ స్పష్టం చేశారు. మరోవైపు తన వ్యాఖ్యలపై ఆదినారాయణరెడ్డి వివరణ ఇచ్చారు. తాను ప్రాసగా మాట్లాడిన మాటలను ప్రయాసతో మరో భావం కలిగించే ప్రయత్నం చేశారని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

శ్రీశైలం ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

సుంకేసుల ఫణీంద్రనాథ్

బొమ్మలసత్రం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివ భక్తులపై పోలీసులు లాఠీచార్జి చేసిన ఘటనపై నంద్యాలకు చెందిన సీనియర్ న్యాయవాది సుంకేసుల ఫణీంద్రనాథ్ మంగళవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తులకు సరైన వసతులు కల్పించడంలో ఆలయ అధికారులు విఫలమయ్యారన్నారు. గంటల కొద్దీ చిన్న పిల్లలు, వృద్ధులు, వికలాంగులు క్యూలైన్లలో వేచి ఉన్నా కనీసం తాగడానికి మంచినీరు, సరైన వసతులు కల్పించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో భక్తులకు సరైన క్యూలైన్లు ఏర్పాటు చేసి తోపులాట జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారులు ప్రేక్షక పాత్ర వహించారన్నారు. భక్తులు క్యూలైన్లలో నిలబడలేక బారికేడ్లను తెంచుకొని బయటకు వస్తుండగా పోలీసులు విచక్షణా రహితంగా శివభక్తులపై లాఠీచార్జి చేయడం దారుణమన్నారు. హిందూ దేవాలయాల్లో కొంతకాలంగా జరుగుతున్న ఘటనలు చూస్తే భక్తులకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోందన్నారు. పోలీసులు భక్తులకు సహకరించాల్సింది పోయి అమానుషంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన పోలీసులు, భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన ఆలయ అధికారులు, పాలక మండలిపై నేషనల్ హ్యూమన్ రైట్స్‌కు ఫిర్యాదు చేశామన్నారు. భవిష్యత్తులో ఆలయాల్లో భక్తులపై ఇలాంటి దాడులు జరిగితే చట్టపరంగా పోరాడుతామని ఆయన హెచ్చరించారు.

భక్తులపై లాఠీచార్జ్ చేస్తున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు (ఇన్‌సెట్‌లో) శ్రీశైలం ఆలయ రాజగోపురం వద్ద ఆందోళన చేస్తున్న శివస్వాములు

శివ శివా.. ఇదేం దారుణం?

శ్రీశైలంలో బాబు సర్కార్ ఘోరవైఫల్యం

శ్రీశైలం టెంపుల్: వరుసగా ఆలయాల్లో విషాద ఘటనలు.. ఎన్నడూ లేని విధంగా తొక్కిసలాటలు.. భక్తుల మరణాలు.. చంద్రబాబు సర్కార్ అంతులేని నిర్లక్ష్యానికి ప్రబల నిదర్శనాలు. తిరుపతి, సింహాచలం, కాశీబుగ్గ పుణ్య క్షేత్రాలలో భక్తులు ప్రాణాలు కోల్పోయినా బాబుసర్కార్ మొద్దునిద్ర వీడలేదు. ఇపుడు శ్రీశైలం వంతు వచ్చింది. హర హర మహాదేవ.. శంభోశంకర అంటూ నల్లమల కొండగుట్టల్లో ప్రతిధ్వనించే శివస్వాముల గొంతులు.. భయంతో రక్షించు శివా అంటూ ఆర్తనాదాలు చేసే పరిస్థితి వచ్చింది. కనీస ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వం దారుణంగా విఫలమవడంతో శివస్వాములు ప్రత్యక్ష నరకాన్ని చవిచూశారు. గంటల తరబడి క్యూలైన్లలో మగ్గిపోతూ చివరకు తాళాలను పగులగొట్టి గోడలు ఎక్కి ప్రాణాలు రక్షించుకున్నారు. ప్రాణభయంతో పరుగులుపెడుతున్న శివభక్తులపై పోలీసులు లాఠీచార్జి చేయడం మరీ దారుణం. ఆలయాల్లో సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం వహించిన ఈ ప్రభుత్వం భక్తులపై కాఠిన్యం ప్రదర్శించడం అత్యంత దుర్మార్గమని హిందూ ధార్మిక సంఘాలు, ప్రజాస్వామిక వాదులు విమర్శిస్తున్నారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. వరుసగా దేవాలయాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం, కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తిరుమల పవిత్ర ప్రసాదంపై అదేపనిగా నిరాధార ఆరోపణలు చేయడం చూస్తుంటే అసలు చంద్రబాబుకు భక్తి అనేది ఉందా అన్న అనుమానం కలుగుతోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబుకు పుణ్యక్షేత్రాలలో ఉత్సవాల నిర్వహణే చేతకావడంలేదని వరుస ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. అంటే దీనిని బట్టి ఆయనకు కనీస అడ్మినిస్ట్రేషన్ కూడా చేతకావడం లేదని అర్థం చేసుకోవచ్చు. విజనరీ అంటూ ప్రచారమే గానీ నిజానికి ఆయన ఎల్లో మీడియా తయారుచేసిన ఓ ఈవెంట్ మేనేజరేనని విమర్శకులంటున్నారు.

అసహనానికి గురై ప్రత్యేక క్యూలైన్లను ధ్వంసం చేస్తున్న శివస్వాములు

స్వామివారి దర్శనం కోసం ఎండలో భక్తులు ఇలా మాడాల్సిందే..

భయాందోళనతో ఉన్న భక్తులపై లాఠీలా..?

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భారీగా తరలివచ్చే శివస్వాములకు, భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాల్సిన రాష్ట్రప్రభుత్వం ఆ విషయంలో దారుణంగా విఫలమయ్యింది. ముగ్గురు మంత్రులు శ్రీశైలంలో ఏర్పాట్లపై సమీక్షలు జరిపారు. కానీ ఫలితం సున్నా. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది శివ స్వాముల దర్శనం రోజులను కుదించారు. దాంతో సోమవారం రాత్రికే వేలాది మంది శ్రీగిరి చేరుకున్నారు. పాదయాత్రగా, వాహనాల్లో భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. దేవస్థానం అధికారుల సమన్వయ లోపం, వీఐపీ ప్రోటోకాల్ పేరుతో ఇతరులకు స్పర్శదర్శనాలు కల్పించడంతో కంపార్ట్‌మెంట్లలో, క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సేపు వేచిఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. ఉదయం 9గంటల నుంచి శివ స్వాముల లైన్లను నిలిపివేశారు. అప్పటికే చంద్రావతి కళ్యాణ మండపంలోకి భారీగా చేరుకున్న శివస్వాములు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మరోవైపు సాధారణ భక్తులు సైతం కంపార్ట్‌మెంట్లలో నిండిపోయారు. కంపార్ట్‌మెంట్లలో, క్యూలైన్లలో కనీస సౌకర్యాలు లేవు. తాగునీరు, అల్పాహారం, పాలు, బిస్కెట్లు అక్కడక్కడా అరకొరగా అందాయి.. గంటల తరబడి క్యూలైన్లలో మగ్గిపోయిన భక్తులు భయాందోళనలకు లోనయ్యారు. క్యూలైన్ల తాళాలు పగులగొట్టి, గోడలు ఎక్కి తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటపడ్డారు. ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీస్తున్న తమపై పోలీసులు లాఠీలను ఝుళిపించడంతో భక్తుల ఆగ్రహం తారస్థాయికి చేరుకుంది. ఈ పరిస్థితికి కారణమైన సీఎం, డిప్యూటీ సీఎం, చైర్మన్, ఈఓ డౌన్ డౌన్ అంటూ భక్తులు తమ నిరసనను తెలియజేశారు. భక్తులపై లాఠీచార్జీ ఘటనలో నంద్యాల ఏఎస్పీ యుగంధర్ బాబు తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

తూతూమంత్రంగా సమీక్షలు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఈ నెల 2న శ్రీశైలంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి అనం రామనారాయణరెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, హోంశాఖ మంత్రి అనితలు జిల్లా అధికారులతో, దేవస్థాన అధికారులతో సమీక్షలు నిర్వహించారు. భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా 30శాతం ఏర్పాట్లు చేస్తున్నామని ప్రగల్భాలు పలికారు. కానీ ఆచరణలో మాత్రం శూన్యంగా కనిపించింది. తూతూ మంత్రంగా జరిపిన మంత్రుల సమీక్షలను అధికారులు పట్టించుకోలేదు. అరకొర ఏర్పాట్లతో సరిపెట్టినట్లు తెలుస్తోంది. భక్తులు భారీగా తరలివచ్చే శ్రీశైల పుణ్యక్షేత్రంలో కనీస సౌకర్యాలపై చంద్రబాబు ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్వాముల యాత్రకు అనుమతిలోనూ అలక్ష్యమే..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం శివభక్తులు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో చాలా మంది శివస్వాములు నల్లమల అడవుల్లో పాదయాత్ర చేసుకుంటూ శ్రీగిరి చేరుకుని మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం ఆనవాయితీ. బ్రహ్మోత్సవాల కంటే ముందుగానే తమ ఇంటి వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభించి శ్రీగిరి చేరుకుంటారు. అయితే ఈ ఏడాది జాతీయ పులుల గణన పేరుతో అటవీశాఖ అధికారులు నల్లమల అడవుల్లో పాదయాత్రకు ముందస్తు అనుమతి ఇవ్వలేదు. చివరకు ఈ నెల 6వ తేది నుంచి అనుమతి ఇచ్చారు. దీంతో భక్తులు, శివస్వాములు ఒక్కసారిగా పాదయాత్రతో శ్రీగిరి చేరుకున్నారు. అటవీశాఖ నుంచి భక్తుల పాదయాత్రకు అనుమతి ఇప్పించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అంటున్నారు.

తప్పు కప్పిపుచ్చుకునేందుకు ఈవో పాట్లు..

శివస్వాముల ముసుగులో కొంత మంది అసాంఘిక శక్తులు తనపై కుట్ర పన్ని భక్తులను రెచ్చగొట్టేలా చేశారని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో పేర్కొనడం గమనార్హం. తనని ఈఓ బాధ్యతల నుంచి తప్పించేందుకు కొందరు కుట్ర పన్ని.. ప్రణాళికాబద్ధంగా భక్తులను రెచ్చగొట్టి ఆందోళనలు చేయించారని తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఇదిలాఉంటే రద్దీని కంట్రోల్ చేయాల్సిన దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్, ఈఓ కంట్రోల్ రూంకే పరిమితం కావడం గమనార్హం. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజే భక్తుల రద్దీని కంట్రోల్ చేయలేని దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఇక మహాశివరాత్రి రోజు లక్షన్నరకు పైగా భక్తులు తరలివస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉచిత కంపార్ట్‌మెంట్లలో ఉండలేక అసహనానికి గురై గేటు దూకుతున్న భక్తులు

గ్రామోత్సవం చేయకపోవడం మహాపచారం!

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు విశేష వాహనసేవలో అలంకరించి ప్రత్యేకంగా వాహన పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రత్యేక వాహనాధీశులైన స్వామి అమ్మవార్లకు అంగరంగ వైభవంగా క్షేత్ర ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు. అయితే సరైన ప్రణాళిక లేకపోవడంతో శ్రీశైలం చరిత్రలో ఇంతవరకు ఎప్పుడు లేని విధంగా స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించలేదు. గ్రామోత్సవం నిర్వహించకపోవడాన్ని భక్తులు మహాపచారంగా భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యంతో అలంకార మండపంలో పూజలకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సనాతన ధర్మం అన్నాడు.. ఇప్పుడు ఎక్కడున్నాడు?

సనాతన ధర్మాన్ని కాపాడ తానని గొప్పలు చెప్పే డిప్యూటీ సీఎం శ్రీశైలంలో భక్తులకు ఇన్ని సమస్యలు ఎదురవుతుంటే ఎక్కడున్నాడు. కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం దారుణం. బ్రహ్మోత్సవాల సమయంలో కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చూస్తే భక్తుల పట్ల ఎంతటి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది.

– మల్లికార్జున, శివస్వామి, అనంతపురం

కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు శ్రీశైలం వచ్చాను. 6గంటలకు పైగా క్యూలైన్లలో ఉండాల్సిన పరిస్థితి. క్యూలైన్లలో ఉండలేక బయటికి వచ్చి కూర్చున్నా. కనీస సౌకర్యాలైన తాగునీరు, అన్నప్రసాదం, బాత్‌రూం సౌకర్యాలు లేవు. వృద్ధులకు సైతం ప్రత్యేక క్యూలైన్ లేదు. బ్రహ్మోత్సవాల్లో సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది.

– నాగరాజు, భక్తుడు, అనంతపురం

ప్రభుత్వానికి, పాలక మండలికి మంచి బుద్ధి ప్రసాదించు మల్లన్నా

బ్రహ్మోత్సవాల్లో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేని చంద్రబాబు ప్రభుత్వానికి, శ్రీశైల దేవస్థానం పాలక మండలికి మంచి బుద్ధి ప్రసాదించాలని మల్లన్నను కొరుకుంటున్నా. గంటల తరబడి భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నా, ఒక్క అధికారి, వలంటీర్ కూడా పలకరించిన దాఖలాలు లేవు. చంద్రబాబు ప్రభుత్వం ఇంత అధ్వాన్నంగా ఏర్పాట్లు చేసింది. పదవులు తీసుకోవడానికి కాదు పాలక మండలి సభ్యులు ఉండేది. భక్తులకు సేవలందించేందుకని గుర్తుంచుకోవాలి.

– నరసింహారెడ్డి, శివస్వామి, తెలంగాణ

30 ఏళ్లలో ఎన్నడూ మల్లన్న దర్శనం చేసుకోకుండా వెళ్లలేదు

నేను గత 30 ఏళ్ల నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటా. చాలా సార్లు శివమాలను స్వీకరించి 41రోజులు నిష్టగా ఉండి ఇరుముడి సమర్పించేందుకు శ్రీశైలం చేరుకుంటా. గత 30ఏళ్లలో ఎన్నడూ జరగని రీతిలో ఈ ఏడాది మల్లన్నను దర్శించుకోకుండానే వెనుతిరిగి వెళ్తున్నా. ప్రభుత్వం, దేవస్థానం అధికారుల నిర్లక్ష్యంతోనే పరమేశ్వరుడిని దర్శించుకోకుండా వెనక్కి వెళ్తున్నా.

– వెంకటరామిరెడ్డి, శివభక్తుడు, హైదరాబాద్

శివ భక్తులపై లాఠీచార్జి దుర్మార్గం

- శ్రీశైలంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోరవైఫల్యం
- వరుసగా ఆలయాల్లో విషాద ఘటనలు
- ఆలయాలకు వెళ్లే భక్తుల్లో తీవ్ర భయాందోళనలు
- భక్తులకు కనీస ఏర్పాట్లు చేయడంలో టీడీపీ సర్కార్ విఫలం
- సనాతన ధర్మం గురించి మాట్లాడే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మౌనం వహిస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు
- 'ఎక్స్' వేదికగా చంద్రబాబు సర్కార్‌ను నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి:రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ పాలనలో శ్రీశైలంలో శివమాల ధారణ చేసిన భక్తులపై పోలీసులు విచక్షణరహితంగా లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం, బాధాకరమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన రూపంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోర వైఫల్యం బయటపడిందన్నారు. దురదృష్టవశాత్తూ చంద్రబాబు నీచ రాజకీయాలు పవిత్ర ఆలయాల ప్రాంగణాల్లోకే చొరబడుతున్నాయని ఎత్తిచూపారు. తిరుమల లడ్డూనూ పదే పదే వివాదాల్లోకి లాగి, రాజకీయ లాభం పొందే ప్రయత్నం చేయడంతో కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని.. ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగిందని.. ఈ ధోరణి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాలకూ వ్యాపిస్తోందని వివరించారు. శ్రీశైలంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడి, చివరకు పోలీసుల చేతిలో లాఠీ దెబ్బలు తిన్నప్పటికీ.. సనాతన ధర్మం గురించి మాట్లాడే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు, మౌనం వహిస్తే, బాధ్యత ఎవరు తీసుకుంటారు? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారని 'ఎక్స్'లో తన ఖాతాలో వైఎస్ జగన్ మంగళవారం పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే..

''ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ పాలనలో శివమాల ధారణ చేసిన భక్తులపై పోలీసులు విచక్షణ రహితంగా లాఠీచార్జ్ చేయడం బాధాకరం. చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఆలయాలకు వెళ్లే భక్తులు భయకంపితులవుతున్నారు. ఒకప్పుడు భక్తితో, నమ్మకంతో తీర్థయాత్రలు చేసిన భక్తులు, ఇప్పుడు ఆందోళనతో, అనిశ్చితితో ఆలయాలకు వస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చంద్రబాబుగారి పాలనలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలు, వైఫల్యాలు అత్యంత బాధ కలిగిస్తున్నాయి. నివారించగలిగిన ఘటనలు అయినప్పటికీ, ప్రభుత్వం విఫలంకావడం వ్యవస్థలపై భక్తులకున్న విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేస్తోంది. ఇంత జరిగినా టీడీపీ ప్రభుత్వం స్పందిస్తున్న తీరు దారుణంగా ఉంది. కేవలం ప్రచార విన్యాసాలు, ఘటన తర్వాత జరిగే రొటీన్ సమీక్షలకే ప్రభుత్వం పరిమితమవుతోంది. జవాబుదారీతనం, బాధ్యత అన్నవి ఈ ప్రభుత్వంలో ఎక్కడా కనిపించడం లేదు. శ్రీశైలం ఆలయంలో, శివ మాల ధారణ చేసిన భక్తులపై పోలీసులు లాఠీచార్జ్ రూపంలో ప్రభుత్వ యంత్రాంగంలో ఘోరమైన వైఫల్యం బయటపడింది. సంవత్సరాలుగా మహాశివరాత్రి సమయంలో పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే భక్తులకు ఇస్తున్న సమయాన్ని ఏడు రోజులకు కుదించారు. దీనివల్ల పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అధికారులకు ముందే తెలిసినా, సరైన ఏర్పాట్లు చేయలేదు. తాగునీరు, క్యూల నిర్వహణ, వైద్య సదుపాయాలు అన్నీ లోపించాయి. తమ పిల్లాపాపలతో ఆలయానికి వచ్చిన కుటుంబాలు గంటల తరబడి దారుణమైన పరిస్థితుల్లో వేచి చూడాల్సి వచ్చింది. ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు వ్యతిరేకంగా భక్తులు నినాదాలు చేశారు. భక్తులకు ఉపశమనం ఇవ్వాల్సిన చోట, పోలీసులు బలప్రయోగానికి దిగారు. దర్శనానికి వచ్చిన భక్తులను లాఠీలతో కొట్టి తరిమారు. రాష్ట్రంలో తిరుపతి సహా అనేక ఆలయాల్లో గతంలో జరిగిన విషాద ఘటనల తరువాత కూడా, భక్తులకు సరైన ఏర్పాట్లు చేయడంలో టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2025లో ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల్లో జరిగిన విషాదాలు చూస్తే..:

తిరుపతిలో జనవరి 8, 2025న వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్ల కోసం క్యూలో ఉన్న సమయంలో జరిగిన తొక్కిసలాటలో 6గురు భక్తులు మృతి చెందారు. టీటీడీ చరిత్రలో ఇలాంటి దుర్ఘటన జరగడం ఇదే తొలిసారి.

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, సింహాచలంలో ఏప్రిల్ 30, 2025న చందనోత్సవం సమయంలో నూతనంగా నిర్మించిన నాసిరకం గోడ కూలిపోవడంతో ఏడుగురు భక్తులు మృతి చెందారు.

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో నవంబర్ 1, 2025న కార్తీక ఏకాదశి సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందారు. ఇవికాకుండా ఆలయాల్లో అనేక ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

- జాగ్రత్తపడాల్సిన, తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను వరుసగా జరుగుతున్న ఘటనలు ఎత్తి చూపుతున్నప్పటికీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంలో కూరుకుపోయింది.
- దురదృష్టవశాత్తూ ఇప్పుడు చంద్రబాబు గారి నీచ రాజకీయాలు పవిత్ర ఆలయ ప్రాంగణాల్లోకే చొరబడుతున్నాయి. తిరుమల లడ్డూను పదే పదే వివాదాల్లోకి లాగి, రాజకీయ లాభం పొందే ప్రయత్నం చేయడంతో కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి, ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగింది. ఈ ధోరణి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాలకూ వ్యాపిస్తోంది.
- భక్తులు తీవ్ర ఇబ్బందులు పడి, చివరకు పోలీసుల చేతిలో లాఠీ దెబ్బలు తిన్నప్పటికీ.. సనాతన ధర్మం గురించి మాట్లాడే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు, మౌనం వహిస్తే, బాధ్యత ఎవరు తీసుకుంటారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు''

క్లుప్తంగా...

చంద్రబాబు ఫ్రస్టేషన్‌లో ఉన్నారు

శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్రస్టేషన్‌లో ఉన్నారని.. ఆయన ఏదేదో చేద్దామనుకుంటున్నారని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ''రాష్ట్రంలో శాంతిభద్రతలు అసలు బాగాలేవు. ప్రజలు అర్థాకలితో ఉంటే పట్టించుకోవటం లేదు. పాలన గాలికి వదిలేశారు. లడ్డూలో జంతు కొవ్వు లేదని సీబీఐ చెప్పింది. ఇక దాని గురించి టైం వేస్ట్ ఎందుకు? సిట్ నివేదిక ఇచ్చాక ఇంకా కమిషన్ వేయటం ఎందుకు? అసలు ఆ కమిషన్‌కి చట్టబద్ధత ఉంటుందా? చంద్రబాబు సిట్ నివేదికను బయట పెట్టాలి. ఎల్లుండి(12న) శాసనసభా పక్ష సమావేశం జరుగుతుంది. అన్ని విషయాలూ అందులో చర్చించి నిర్ణయం తీసుకుంటాం'' అని బొత్స తెలిపారు.

నేడు మంత్రివర్గ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం నేపథ్యంలో అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్న బిల్లులు తదితర అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మహిళా స్నేహ పూర్వక పంచాయతీగా బొక్కిసంపాలెం

జాతీయ స్థాయిలో ఎంపిక

మహిళా సంఘాలతో చర్చిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి రూరల్: జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా స్నేహ పూర్వక పంచాయతీగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కిసంపాలెం పంచాయతీ ఎంపికైంది. ఈ నేపథ్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక బృందం విచ్చేసి, గ్రామాన్ని పరిశీలించింది. మహిళా సంఘాలతో చర్చించింది. గ్రామంలో జరిగిన అభివృద్ధిని చిత్రీకరించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ కేంద్ర బృందం బొక్కిసంపాలెం గ్రామంపై ఒక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం గ్రామానికి రూ.కోటి నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. గ్రామ సర్పంచ్ కప్పా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం అందించిన సహకారంతో గ్రామాభివృద్ధి సాధించామన్నారు. డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా చిన్న తరహా వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించామని చెప్పారు. తమ పంచాయతీ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, డ్వాక్రా సంఘాల సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'విజనరీ' పాలనలో కల్పిత గణాంకాలు

పన్ను ఆదాయాల వృద్ధిలో దేశంలో 22వ స్థానంలో ఏపీ...

కాగ్ గణాంకాలను ఉటంకిస్తూ చంద్రబాబు సర్కార్‌ను కడిగిపారేసిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'పన్నుల ఆదాయం వృద్ధిలో మన రాష్ట్రం.. దేశంలో చిట్టచివరి నుంచి రెండో స్థానంలో ఉంది. ఇదీ చంద్రబాబు 22వ ర్యాంక్ విజన్..!' అంటూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలలకు సంబంధించి కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) విడుదల చేసిన గణాంకాలను ఉటంకిస్తూ.. సీఎం చంద్రబాబు కల్పిత గణాంకాలతో చెబుతున్న అవాస్తవాలను ఎండగడుతూ.. కూటమి సర్కారు ఆర్థిక విధానాలను కడిగిపారేశారు. చంద్రబాబు నాయకత్వంలో అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, దుష్ప్రచారం చేయడం లాంటి అంశాల్లో మాత్రం ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానం సాధించగలిగిందంటూ వ్యంగ్యాస్త్రాలు విసురుతూ తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ మంగళవారం పోస్టు చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే..

ప్రచారం ఎక్కువ.. పని తక్కువ.. అబద్ధాలు, మోసాలు.. ఇదీ బాబు 22వ ర్యాంక్ విజన్

➤ రాష్ట్రం తీవ్ర ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొంటోందనేందుకు ప్రభుత్వ ఆదాయాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కానీ చంద్రబాబునాయుడు ప్రభుత్వం కల్పిత జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) గణాంకాలతో ప్రజలను మభ్యపెట్టి, రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే తప్పుడు భావన కలిగిస్తోంది.

> "11.09 శాతం భారీ జీఎస్‌డీపీ వృద్ధిని చూపిస్తున్న మన రాష్ట్రం... పన్ను ఆదాయాల్లో మాత్రం కేవలం 1.97 శాతం వృద్ధి సాధించడం ప్రపంచంలోని ఆర్థిక నిపుణులందరికీ ఆశ్చర్యంగా అనిపించకమానదు. 'విజనరీ' నాయకత్వంలో తయారు చేసిన కల్పిత గణాంకాల వల్లే ఇలాంటి అంకెలు సాధ్యమవుతాయి"
> – 'ఎక్స్'లో వైఎస్ జగన్ ట్వీట్

➤ 2024–25లో రాష్ట్ర ఆర్థిక వృద్ధి 11.75 శాతం (నామినల్ జీఎస్‌డీపీ)గా ఉందని, జాతీయ వృద్ధిరేటు 9.8 శాతం మాత్రమేనని.. అలాగే 2025–26లో రాష్ట్ర వృద్ధి 10.75 శాతంగా ఉంటుందని, జాతీయ వృద్ధిరేటు 8.0 శాతం మాత్రమేనని చంద్రబాబు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది.

దీని ప్రకారం 2023–24 నుంచి 2024–25 మధ్య రెండేళ్ల కాలానికి సగటు వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) 11.09 శాతంగా చూపిస్తోంది. అంతేకాదు.. వాస్తవ (రియల్) జీఎస్‌డీపీ వృద్ధి పరంగా ఈ ఏడాది రాష్ట్రం దేశంలో 3వ స్థానంలో ఉందని కూడా ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇవేవీ స్వతంత్ర సంస్థలు విడుదల చేసిన గణాంకాలు కావు. ఇవి పూర్తిగా చంద్రబాబు కార్యాలయంలో తయారు చేసిన అంకెలే. వాటినే వాస్తవాలుగా ప్రచారం చేస్తున్నారు.

➤ ఆ గణాంకాలే నిజమైతే ప్రభుత్వ ఆదాయాల్లోనూ అదే స్థాయి వృద్ధి కనిపించాలి. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి 9 నెలలకు కాగ్ గణాంకాలు చూస్తే వాస్తవ పరిస్థితులు ఎంత భిన్నంగా ఉన్నాయో స్పష్టమవుతోంది. ఆశ్చర్యకరంగా రెండేళ్ల కాలంలో ప్రభుత్వ పన్ను ఆదాయాల వృద్ధి (సీఏజీఆర్) కేవలం 1.97 శాతం మాత్రమే ఉంది. 11.09 శాతం భారీ జీఎస్‌డీపీ వృద్ధిని చూపిస్తున్న రాష్ట్రం.. పన్ను ఆదాయాల్లో మాత్రం కేవలం 1.97 శాతం వృద్ధి సాధించడం ప్రపంచంలోని ఆర్థిక నిపుణులందరికీ ఆశ్చర్యంగా అనిపించక మానదు. 'విజనరీ' నాయకత్వంలో తయారుచేసిన కల్పిత గణాంకాల వల్లే ఇలాంటి అంకెలు సాధ్యమవుతాయి.

➤ ఇంకా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి 9 నెలల పాటు 23 రాష్ట్రాల పన్నుల ఆదాయాలను కాగ్ విడుదల చేసింది. పన్ను ఆదాయాల వృద్ధి పరంగా ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత ఆందోళనకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 23 రాష్ట్రాల్లో పన్ను ఆదాయాల వృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్ 22వ స్థానంలో ఉంది. అంటే చివర నుంచి రెండో స్థానంలో ఉంది.

➤ అదే కాలంలో కేంద్ర ప్రభుత్వ స్థూల పన్ను ఆదాయాలు 9.64 శాతం పెరిగితే, ఆంధ్రప్రదేశ్ పన్ను ఆదాయాలు మాత్రం 1.97 శాతం మాత్రమే పెరిగాయి. అయినా కూడా చంద్రబాబు ప్రకారం ఆర్థిక రంగంలో ఆంధ్రప్రదేశ్ పనితీరు కేంద్ర ప్రభుత్వానికంటే మెరుగైనదట! చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఏదైనా విషయంలో మొదటి స్థానం సాధించగలదంటే... అది కేవలం ప్రభుత్వ అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, విషప్రచారం లాంటి విషయాల్లో మాత్రమే!!



ఏపీ పన్ను ఆదాయాల్లో వృద్ధి 1.97 శాతమేనని, రాష్ట్రం 22వ స్థానంలో ఉందని స్పష్టం చేస్తున్న కాగ్ గణాంకాలు

అప్పుల్లో ఏపీ టాప్

దేశంలోనే అత్యధికంగా బాబు సర్కారు రూ.85,269 కోట్ల బడ్జెట్ అప్పులు

తొమ్మిది నెలల్లోనే బడ్జెట్ అంచనాలకు మించి అప్పల మోత

- రాష్ట్ర పన్నుల రాబడికి మించి రుణభారం
- అమ్మకం పన్నుల రాబడి రూ.622 కోట్లు తగ్గుదల
- ఇతర పన్నులు, డ్యూటీల్లో రూ.1,583 కోట్లు కొరత
- ఏకంగా రూ.15,247 కోట్లు తగ్గిన కేంద్ర గ్రాంట్లు
- రూ.60,048 కోట్లతో రెవెన్యూ లోటు రెట్టింపు
- ఈ ఆర్థిక ఏడాది తొలి తొమ్మిది నెలల బడ్జెట్ కీలక సూచికలను వెల్లడించిన 'కాగ్'

సాక్షి, అమరావతి: అంతులేని అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నెల నెలా దిగజార్చేస్తున్నారు! రుణభారం, రెవెన్యూ లోటుతో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారు. ఈ ఆర్థిక ఏడాది డిసెంబర్ నాటికి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ అప్పులు దేశంలోనే అత్యధికంగా రూ.85,269 కోట్లుగా ఉన్నట్లు కాగ్ వెల్లడించింది. బిహార్‌ను మించిపోయి టీడీపీ కూటమి సర్కారు అప్పులు చేయడం గమనార్హం. ఈమేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ వరకు బడ్జెట్ కీలక సూచికలను కాగ్ విడుదల చేసింది.

రెవెన్యూ లోటు రెట్టింపు..

ఆంధ్రప్రదేశ్ అప్పులు, రెవెన్యూ లోటు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి. ఈ ఆర్థిక ఏడాదికి సంబంధించి బడ్జెట్‌లో పేర్కొన్న అప్పులను ఇంకా మూడు నెలలు మిగిలి ఉండగానే దాటేసింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది మొత్తానికి బడ్జెట్ అంచనాల అప్పు రూ.79,952 కోట్లు కాగా ఇప్పటికే గీత దాటి రూ.85,269 కోట్లు అప్పులు చేసింది. ఇక రాష్ట్ర సొంత పన్నుల రాబడిని మించి అదనంగా రూ.10 వేల కోట్లకు పైగా అప్పులు చేయడం విస్మయం కలిగిస్తోంది. రాష్ట్ర సొంత పన్నుల రాబడి డిసెంబర్ నాటికి రూ.74,163 కోట్లు కాగా అప్పు ఏకంగా రూ.85,269 కోట్లకు ఎగబాకింది. మరోపక్క బడ్జెట్‌లో మొత్తం రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లుగా పేర్కొనగా డిసెంబర్ నాటికే రెట్టింపు స్థాయిలో రూ.60,480 కోట్ల రెవెన్యూ లోటులోకి రాష్ట్రం వెళ్లిపోయిందని కాగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇంకోవైపు కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రాష్ట్రానికి నిధులు తగ్గిపోయాయి. 2023–24 డిసెంబర్‌తో పోల్చితే ఈ ఆర్థిక ఏడాది డిసెంబర్ వరకు కేంద్ర గ్రాంట్ల రూపంలో నిధులు ఏకంగా రూ.15,247 కోట్లు తగ్గిపోవడం గమనార్హం.

సంక్షేమానికి తూట్లు..

చంద్రబాబు అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి నెలా అమ్మకం పన్ను రాబడి తగ్గడమే గానీ పెరగడం లేదని కాగ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పన్నులు, డ్యూటీ రూపంలో రావాల్సిన రాబడి కూడా తగ్గడమే గానీ వృద్ధి అనేదే లేదు. 2023–24 డిసెంబర్‌తో పోలిస్తే ఈ ఆర్థిక ఏడాది డిసెంబర్ నాటికి ఇతర పన్నులు, డ్యూటీల రూపంలో రావాల్సిన రాబడి రూ.1,583 కోట్లు తగ్గిపోయింది. 2023–24 ఆర్థిక ఏడాది డిసెంబర్ వరకు పోల్చితే.. ఈ ఆర్థిక ఏడాది డిసెంబర్ నాటికి అమ్మకం పన్ను రాబడి ఏకంగా రూ.6,22 కోట్లు తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో పన్ను ఆదాయాల వృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్ 22వ స్థానంలో నిలిచింది. చిట్ట చివరి నుంచి ఏపీ రెండో స్థానంలో ఉంది. అమ్మకం పన్ను రాబడి క్షీణించడం అంటే ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడమేనని స్పష్టం అవుతోంది. ఇక 2023–24 డిసెంబర్ వరకు పోల్చి చూస్తే సామాజిక రంగ వ్యయం 2025–26 డిసెంబర్ నాటికి రూ.5,874 కోట్లు తగ్గిపోయింది.



రాష్ట్ర బడ్జెట్ సూచికలపై కాగ్ గణాంకాలు ఇలా..

వివరం	2023-24 ఏప్రిల్ – డిసెంబర్	2025-26 ఏప్రిల్ – డిసెంబర్
అమ్మకం పన్ను	రూ.13,806 కోట్లు	రూ.13,184 కోట్లు
ఇతర పన్నులు, డ్యూటీస్	రూ.5,638 కోట్లు	రూ.4,055 కోట్లు
కేంద్రం గ్రాంట్లు	రూ.24,018 కోట్లు	రూ.8,771 కోట్లు
సామాజిక రంగ వ్యయం	రూ.95,304 కోట్లు	రూ.89,430 కోట్లు
రెవెన్యూ లోటు	రూ.49,996 కోట్లు	రూ.60,480 కోట్లు
ద్రవ్యలోటు	రూ.69,716 కోట్లు	రూ.85,269 కోట్లు

రైతుల రుణ భారంలో ఏపీ నంబర్ వన్

- రైతు కుటుంబాలపై రుణభారం సగటున రూ.74,121
- ఏపీలో ప్రతి రైతుపై రూ.2.45లక్షల భారం

సాక్షి, న్యూఢిల్లీ: రైతుల రుణ భారంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే ప్రతి రైతుపై రుణ భారం రూ.74,121 ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రూ.2.45లక్షలతో నంబర్ వన్‌గా ఉన్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు. రైతుల రుణ భారాలపై ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కలిపాడ సారెన్ ఖేర్వాల్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి మౌఖిక సమాధానమిచ్చారు. గ్రామీణ రైతు కుటుంబం (అగ్రికల్చరల్ హౌజ్‌హోల్డ్)పై సగటు ఔట్ స్టాండింగ్ రుణం రూ.74,121 అని తెలిపారు. ఈ గణాంకాలు నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్‌ఎస్‌ఓ) నిర్వహించిన 77వ రౌండ్ సిచ్యుయేషన్ అసెస్‌మెంట్ సర్వే(ఎస్ఏఎస్) ద్వారా స్పష్టమైందన్నారు. వ్యవసాయ గృహాల చివరి సర్వే 2019లో నిర్వహించబడినందున 2026, ఫిబ్రవరి 1 నాటికి ప్రతి వ్యవసాయ గృహానికి ఎంత రుణం బకాయి ఉందనే సమాచారం అందుబాటులో లేదన్నారు. ఇక దేశవ్యాప్తంగా 2025 సెప్టెంబర్ 30 నాటికి కిసాన్ క్రెడిట్ కార్డు కింద రూ.10.39లక్షల కోట్లు బకాయిలు ఉన్నట్లు కేంద్ర మంత్రి వివరించారు.

రూ.40 వేల కోట్లకు చేరుకున్న ఉద్యోగుల బకాయిలు

- చనిపోయిన ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- 11వ పీఆర్సీ బకాయిల వివరాలు వెల్లడించాలి
- ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



సాక్షి, అమరావతి: ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.40 వేల కోట్లకు చేరుకున్నాయని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ని కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. చనిపోయిన ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 11వ పీఆర్సీ బకాయిలతోపాటు, సరెండర్ లీవులు, లీవ్–ఎన్ క్యాష్‌మెంట్ చెల్లింపుల వివరాలను తెలపాలన్నారు. వెంటనే 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

జంతువుల కొవ్వు కలిసిందని చెప్ప

- ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు బెదిరింపులు
- పందికొవ్వు, ఆవుకొవ్వు, బాత్రూం రసాయనాలు కలిశాయని ఎందుకు చెప్పడం లేదంటూ హూంకరింపులు
- అవే కాకుండా మరికొన్ని దారుణమైనవి కలిశాయని చెప్పాలంటూ దాదాపు 20 నుంచి 30 ఫోన్లు
- మూడు రోజుల క్రితమే ఈ వేధింపులపై ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోని మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి: ''ఒరేయ్.. నా కొడకా.. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో పందికొవ్వు, ఆవుకొవ్వు, బాత్రూం రసాయనాలు కలిశాయని ఎందుకు చెప్పవురా నువ్వు.. ఇదే కాదు ఇంత కన్నా దారుణమైంది కలిసిందని కూడా చెప్పాలి.'' అంటూ కొంతమంది ఆగంతకులు ఫోన్లు చేసి తనను బెదిరిస్తున్నట్లు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ వెల్లడించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో మంగళవారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. కొద్ది రోజులుగా లడ్డూలో కల్తీ జరిగిందంటూ చంద్రబాబు, పవన్, లోకేశ్ చేస్తున్న ప్రచారాన్ని నాగేశ్వర్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ–సిట్ చార్జ్‌షీట్‌లో స్పష్టం చేసిన తరువాత కూడా కలిసిందని నిరూపించాలని యత్నం చేయడం హిందూ దేవుళ్లు, హిందూ సమాజంపై జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు కూటమి అనుకూల వర్గీయులు బెదిరింపు ఫోన్లు చేస్తున్నారు. జంతువుల కొవ్వు, బాత్రూం రసాయనాలే కాకుండా మరికొన్ని దారుణమైనవి లడ్డూలో కలిశాయని చెప్పాలంటూ దాదాపు 20 నుంచి 30 ఫోన్లు వచ్చాయని నాగేశ్వర్ తెలిపారు. అలా చెప్పడం అన్యాయమవుతుందని, కావున తానలా చెప్పలేనన్నానని ఆయన వివరించారు.

'రెడ్‌బుక్ రాజ్యాంగం' వారిపై అమలు కాదా?

మూడు రోజుల క్రితమే ఈ వేధింపులపై ఫిర్యాదు చేసినా మంత్రి లోకేశ్ కనీసం పట్టించుకోలేదని నాగేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్ రికార్డులను లోకేశ్ టీమ్ జైకు పంపించానని, దీనికి స్పందనగా ఆయన పోలీసులు ఆగంతకులను హెచ్చరించారని, మళ్లీ ఆ నెంబర్ నుంచి బెదిరింపు ఫోన్లు రావని చెప్పారని నాగేశ్వర్ వివరించారు. అయితే ఒకరు కాదు, ఇద్దరు కాదు రోజుకు 20 నుంచి 30 మంది ఫోన్లు చేస్తున్నారని, బెదిరిస్తున్న వారి నంబర్లు రాష్ట్ర మంత్రికి స్వయంగా పంపితే వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయాలి కదా అని లోకేశ్‌ను నిలదీశారు. ''మీరు నన్ను కొట్టినా, తిట్టినా, చంపుతామని బెదిరించినా, నేను మాత్రం నిరూపణ కాకుండా, ఆధారాలు లేకుండా దేవుని లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిసిందనే మాటను చచ్చినా అనను. పంది కొవ్వు కలిసిందని, బాత్రూం రసాయనాలు కలిశాయని మీరు వాడుతున్న భాషను నేను వాడను. ఏం చేసుకుంటారో చేసుకోండి. నేను దేనికైనా సిద్ధం.'' అని ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పష్టం చేశారు.

కల్తీ జరిగితే నిరూపించండి:

మరో వైపు లడ్డూ విషయంలో జరుగుతున్న ప్రచారం, వస్తున్న వార్తలపై నాగేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఐఆర్‌గానీ, విచారణగానీ జరగకుండా సీఎం చంద్రబాబు లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ప్రకటన చేయడం, దానిని పట్టుకుని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ కూడా అదే మాట్లాడటం దారుణమని మరోసారి నాగేశ్వర్ తప్పుబట్టారు.

శ్రీశైలం ఘటన ప్రభుత్వ తప్పిదమే

- తప్పు ఒప్పుకున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం
- ముందస్తు ప్రణాళిక విఫలం కావడం వల్లే దుస్థితి
- సాయంత్రానికి ప్రణాళిక మార్చినట్టు ఆనం వెల్లడి

సాక్షి, అమరావతి: శ్రీశైలం ఆలయంలో ప్రభుత్వ వైఫల్యం వల్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తప్పు ఒప్పుకున్నారు. మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలం సహా వివిధ శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ, వసతులు, ఏర్పాట్లపై మంగళవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ ఆలయాల ఈవోలుగా పని చేస్తున్న జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అన్నిజిల్లాల దేవదాయ శాఖ అధికారులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అంతర్గతంగా జరిగిన ఈ సమావేశంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం మాట్లాడుతూ సోమవారం శ్రీశైలం ఆలయంలో చోటు చేసుకున్న ఘటన ప్రభుత్వ తప్పిదమేనని, ఏర్పాట్లపై తాము ముందుగా అనుకున్న ప్రణాళిక సరైన ఫలితాలు ఇవ్వలేదని, భక్తుల ఆగ్రహం, పోలీసుల అత్యుత్సాహం తర్వాత వెంటనే ప్రణాళిక మార్చి సాయంత్రానికి పరిస్థితులు పూర్తి అదుపులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు.

భక్తుల రద్దీకి తగ్గట్లు ఆలయాల్లో ఏర్పాట్లు

మహా శివరాత్రి నేపథ్యంలో అన్ని శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున పటిష్ట చర్యలు తీసుకోవాలని మంత్రి ఆనం అధికారులను ఆదేశించారు. దేవదాయ, పోలీస్ శాఖలను కలెక్టర్లు సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలని, నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడేలా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో దేవదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి టీసీసీ పరీక్షలు

సాక్షి, అమరావతి: డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ ట్రేడ్స్‌లో నిర్వహించే టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు ఈనెల 18 నుంచి 21 వరకు నిర్వహిస్తామని పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలో 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల హాల్ టికెట్లను అభ్యర్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరీక్షలకు హాజరయ్యే సమయంలో అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లతోపాటు ధ్రువీకరణ కోసం ప్రభుత్వం జారీ చేసిన పాస్‌పోర్టు, పాన్‌కార్డ్, ఓటరు ఐడీ, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వాటిలో ఒక ఫొటో గుర్తింపు కార్డును పరీక్ష కేంద్రం వద్ద చూపించాలన్నారు.

మార్చి 16 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

208 సెంటర్లలో సీసీ కెమెరాలు | అన్ని జిల్లాలకు పరిశీలకుల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మార్చి 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్ని జిల్లాల్లో 8 చొప్పున సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్టు గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా 208 కేంద్రాల్లో కెమెరాలు అమర్చనున్నారు. ఈ ప్రక్రియను ఈనెల 12వ తేదీ నాటికి కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా అధికారులకు డైరెక్టరేట్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రెగ్యులర్ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షలు సైతం ఇవే తేదీల్లో జరగనున్నాయి. అన్ని పరీక్షల పరిశీలన కోసం రాష్ట్ర స్థాయి అధికారులను ప్రతి జిల్లాకు ఒకరిని పరిశీలకులుగా నియమించారు.

ఆపద్బాంధవులకు రహ్ వీర్ పురస్కారం

రోడ్డు ప్రమాద మరణాలు తగ్గించేందుకు కేంద్రం కార్యాచరణ

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు రూపొందించిన 'రహ్‌వీర్' పథకంపై విస్తృత అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రమాదం సంభవిస్తే క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సహాయం అందించడంలో జాప్యంతోనే మృతుల సంఖ్య పెరుగుతోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. క్షతగాత్రులకు సహాయం చేస్తే తర్వాత కేసుల దర్యాప్తునకు హాజరు కావాల్సి ఉంటుందనే భావన నెలకొనడంతో పలువురు చొరవ చూపడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగానే 'గుడ్ సామరిటన్' పేరుతో కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ ఓ కార్యక్రమాన్ని 2019లో రూపొందించింది. గుడ్ సామరిటన్ కార్యక్రమానికి 'రహ్ వీర్' పేరుతో విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించినట్టు కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. క్షతగాత్రులకు సహాయం చేసే వారికి రహ్‌వీర్ పురస్కారాల కోసం జిల్లా, రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేసి... క్షతగాత్రులకు సహాయం చేసే వారికి రూ.25వేలు చొప్పున 'రహ్ వీర్' నగదు పురస్కారం అందిస్తారు. ఏటా అత్యధికంగా రహ్‌వీర్ పురస్కారాలు పొందిన పది మందికి రూ.లక్ష నగదుతో జాతీయ పురస్కారాలు అందిస్తారు.

తను మూర్ఖుడినని తెలిసిన మూర్ఖుడు
కనీసం ఆ మేరకు జ్ఞాని. కానీ, తనను తాను
జ్ఞానిగా భావించే జ్ఞాని నిజంగా మూర్ఖుడు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 11 ఫిబ్రవరి 2026

బంగ్లాకు పరీక్షా సమయం

ఏణ్ణర్థంక్రితం విద్యార్థి ఉద్యమం ధాటికి మాజీ ప్రధాని షేక్ హసీనా అధికారాన్నీ, దేశాన్నీ వదిలిపెట్టిన నాటినుంచీ రాజకీయ, సామాజిక అస్థిరతలో కూరుకుపోయిన బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ఆర్థిక నిపుణుడు అయిన మహ్మద్ యూనస్ ప్రధాన సలహాదారుగా ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ఉన్న వైషమ్యాలను మరింత పెంచి పోషించింది. జవాబుదారీతనం లేని అధికారంతో ఆయన తీసుకుంటున్న వరస నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై, తక్షణం ఎన్నికలు నిర్వహించాలని ఒత్తిళ్లు పెరగటంతో ఇవి తప్పనిసరి అయ్యాయి. మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఆధ్వర్యంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) గెలుపుగుర్రంగా కనబడటమే గత ఎన్నికలకూ, ప్రస్తుత ఎన్నికలకూ కొట్టొచ్చినట్టు కనబడుతున్న తేడా. పదిహేనేళ్లపాటు దేశాన్నేలిన షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్‌పై నిషేధం విధించటంతో ఆ పార్టీ జాడలేదు.

పాకిస్తాన్ నుంచి విడివడి 1971లో స్వతంత్ర ప్రయాణం ప్రారంభించిననాటి నుంచీ బంగ్లాదేశ్‌కు ఆటుపోట్లు తప్పడం లేదు. సైనిక కుట్రలు, మత ఛాందసవాదం షరా మామూలైన పాకిస్తాన్ చీడ దానికి కూడా అంటి, ఆటుపోట్లు ఎదుర్కొంటూనే ఉంది. 17 కోట్ల 30 లక్షల జనాభాతో ప్రపంచంలోనే ఎనిమిదో స్థానంలో ఉన్న బంగ్లా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నదని ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థలు ప్రశంసిస్తూ ఉండేవి. అదే జరిగుంటే హసీనా పదవికి ముప్పు వచ్చి ఉండేది కాదు. కానీ ఆర్థిక అసమానతలకు తోడు పేదరికం, అవినీతి, కక్షసాధింపు ఆమెను దెబ్బతీశాయి. 2022 నుంచి బంగ్లా ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌ల నుంచి వందలకోట్ల డాలర్ల రుణాలు తీసుకొస్తున్నా మారిందేమీ లేదు. ఆ డబ్బంతా పాలకపార్టీని ఆశ్రయించుకున్నవారి జేబుల్లోకి పోయింది. అధిక ధరలు, ఉపాధిలేమి సగటు మధ్యతరగతి, దిగువతరగతి కుటుంబాలను తీవ్రంగా దెబ్బతీశాయి.

బీఎన్‌పీయే విజేతగా నిలుస్తుందని సర్వేలు చెబుతున్నా ఆ పార్టీకి అంత మంచి పేరేమీ లేదు. తూర్పు పాకిస్తాన్‌గా ఉన్నకాలంలో అప్పటి పాక్ పాలకులు తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడినా, అనంతరకాలంలో అధికారంలోకొచ్చిన బీఎన్‌పీ ఆ దేశంతో అంటకాగిందనీ, అవినీతిలో కూరుకుపోయిందనీ జనం గుర్తు చేసుకుంటున్నారు. అందుకే రెహ్మాన్ కొత్త బాణీ అందుకుని అన్ని సభల్లోనూ గత తప్పులకు క్షమాపణ కోరుతున్నారు. 1971 విముక్తి పోరాటంలోనూ, 2024 ప్రజాస్వామ్య ఉద్యమంలోనూ మరణించిన వారికి నివాళులర్పిస్తున్నారు. బీఎన్‌పీ మాదిరే పాకిస్తాన్ అనుకూల పార్టీగా పేరున్న జమాతే ఇస్లామీ(జేఈఐ)కు ఉన్న అనుకూలాంశమల్లా ఆ పార్టీ ఎప్పుడూ అధికారంలో లేకపోవటమే! మహిళల హక్కుల విషయంలో ఆ పార్టీది ఛాందసవాద ధోరణి. దీన్ని బీఎన్‌పీ తనకు అనుకూలంగా మలుచుకుని, తమ పాలనలో లింగవివక్ష ఉండబోదంటోంది. అయితే యూనస్ ప్రభుత్వం ఏర్పడ్డాక హిందువులపై పెరిగిన దాడుల్ని తామే దృఢంగా ఎదిరించి, రక్షణగా నిలిచామని జేఈఐ చెప్పుకుంటోంది. కానీ ఆ దాడులు ఆగింది లేదు. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక అవి మరింత ఎక్కువయ్యాయి. మంగళవారం హిందూ వ్యాపారి సుసేన్ చంద్ర సర్కార్‌ను ఆయన దుకాణంలోనే దుండగులు కాల్చిచంపారు.

బంగ్లాలో ఎవరు పాలకులైనా చైనా, పాకిస్తాన్‌ల ప్రభావం దండిగానే ఉంటుంది. బీఎన్‌పీ ఈ విషయంలో బహిరంగంగా ఏమీ చెప్పకపోయినా, జేఈఐ తన పాక్ అనుకూలతను చాటుకోవటంతో పాటు ఇటీవల చైనా దౌత్యవేత్తలతో భేటీ అయింది. విషాదమేమంటే, హసీనాను పదవీచ్యుతురాలిని చేయటంలో కీలకపాత్ర పోషించిన జెన్ జీ తరానికి ఈ ఎన్నికల్లో పెద్దగా ప్రాధాన్యం లేదు. విద్యార్థుల నాయకత్వంలోని నేషనల్ సిటిజెన్ పార్టీకి ఆశించినంత మద్దతు లభిస్తున్న దాఖలా లేదు. నిరుడు తాత్కాలిక ప్రభుత్వ ప్రతినిధులతో పాటు 30 రాజకీయ పార్టీలు పాల్గొన సదస్సు ఆమోదించిన 'జూలై ఛార్టర్'పై కూడా గురువారం రిఫరెండమ్ జరగబోతోంది. ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చేందుకే, చరిత్ర వక్రీకరించేందుకే దీన్ని తీసుకొచ్చారని వామపక్షాల విమర్శ. మొత్తానికి బంగ్లాదేశ్ భవితవ్యం ఎలా ఉండబోతున్నదో ఈ ఎన్నికలూ, రిఫరెండమ్ తేల్చబోతున్నాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.నవమి ప.9.38 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** అనూరాధ ప.10.52 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.5.04 నుండి 6.50 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.52 నుండి 12.36 వరకు, **అమృత ఘడియలు:** రా.3.40 నుండి 5.28 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం : 5.55
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

రైతుల పాలిట పిడుగుపాటు

విశ్లేషణ



దేవీందర్ శర్మ

షేక్‌స్పియర్ నాటకంలోలాగా, ఎవరి మాటలు నమ్మాలో ఎవరివి నమ్మకూడదో తెలియని సంకటం. 'అమెరికన్ రైతులకు మేలు చేసే విధంగా' ఇండియాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటున్నందుకు ట్రంప్‌కు అమెరికా వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ కృతజ్ఞతలు తెలిపారు. సున్నిత అంశాలైన వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాలకు తగు రక్షణ కల్పిస్తూనే అమెరికాతో 'చారిత్రక' ఒప్పందం కుదుర్చుకుంటున్నందుకు మోదీని మన వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రశంసించారు.

ఒప్పందంలోని వివరాలు పూర్తిగా వెల్లడైన తర్వాతనే, అది రెండు పెద్ద ప్రజాస్వామిక దేశాలకు ఉభయ తారకమైనదా లేక బెదిరింపు ధోరణితో మెడలు వంచి ఒప్పిస్తున్నదా అన్నది తేలుతుంది. కానీ, ఇంతవరకు బహిర్గతమైన వివరాలే రైతుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.

ముంచెత్తితే ప్రమాదమే!

దేశంలో వ్యవసాయ రంగం ఇప్పటికే దయనీయ స్థితిలో ఉంది. ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కన్నా 30–40 శాతం తక్కువ ధరకు రైతులు తమ పంటలను అమ్ముకుంటున్నారు. ఈ స్థితిలో భారత మార్కెట్లోకి ద్వారాలు తెరిస్తే... హెచ్చు సబ్సిడీలు పొందుతున్న, చౌకైన అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులు ఇక్కడి మార్కెట్లను ముంచెత్తి, రైతుల జీవనోపాధిని దెబ్బతీసే ప్రమాదం ఉంది.

వ్యవసాయ వనరుల నిర్వహణ (2020) సర్వే ప్రకారం, అమెరికన్ రైతులు ఏటా భారీ సబ్సిడీలు పొందుతున్నారు. అక్కడి రైతుకు ఏటా సగటున 66,314 డాలర్ల సబ్సిడీ లభిస్తున్నట్లు అంచనా. ఆ సబ్సిడీలు మార్కెట్లోని హెచ్చుతగ్గుల నుంచి అక్కడి రైతులకు రక్షణ కల్పిస్తున్నాయి. రైతులకు వాటిల్లుతున్న నష్టాలను భర్తీ చేసేందుకు 'ఫార్మర్స్ బ్రిడ్జ్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్' (ఎఫ్బీయే) కింద ఎకరాకు వస్తు చెల్లింపుల కింద మొత్తం 12 బిలియన్ డాలర్లను సమకూర్చాలని అమెరికన్ ప్రభుత్వం భావిస్తోంది. ట్రంప్ ఆ పథకాన్ని 'ఒక పెద్ద అందమైన బిల్లు'గా అభివర్ణిస్తున్నారు.

అయితే, అమెరికాలోకి ప్రవేశించే భారతీయ వస్తువులపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికన్ ఎగుమతులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. నాన్–ట్యారిఫ్ ప్రతిబంధకాలను తొలగిస్తున్నట్లు చెప్పారు.

రైతుల నిరసన హెచ్చరికలు

రైతుల ప్రయోజనాలను జాగ్రత్తగా 'సంరక్షించిన' తర్వాతనే ఒప్పందం కుదిరిందని మన వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ప్రయోజనాలకు భంగం వాటిల్లదనే హామీలు వెలువడుతున్నా ఇది రైతుల్లో సందిగ్ధాన్ని సృష్టిస్తోంది. అమెరికా దిగుమతులపై సుంకాలను సున్నా చేస్తే, ఆహార పదార్థాలు దేశంలోకి కుప్పతెప్పలుగా వచ్చిపడతాయని 2020–21లో న్యూఢిల్లీ చుట్టుపక్కల రైతుల ఆందోళనకు నేతృత్వం వహించిన సంయుక్త్ కిసాన్ మోర్చా హెచ్చరిస్తోంది. 2020–21 తరహాలోనే కొత్తగా నిరసనలకు దిగుతామని అది బెదిరిస్తోంది.

భారతీయ రైతులు 2000–01 నుంచి 2024–25 మధ్య కాలంలో సమష్టిగా రూ. 111 లక్షల కోట్ల నష్టాన్ని చవిచూశారని 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' తన తాజా నివేదికలో అంచనా వేసింది. ''అది రైతులకు అశనిపాతమే కాదు, మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన అవుతుంది'' అని హిమాచల్ ప్రదేశ్ ఆపిల్ పండ్ల తోటల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు హరీశ్ చౌహాన్ అంటున్నారు.

యూరోపియన్ యూనియన్, న్యూజిలాండ్‌లతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల ఆపిల్ పండ్లకు మార్కెట్ అసాధారణమైన రీతిలో అందుబాటులోకొచ్చింది. ఫలితంగా, పర్వత ప్రాంత రాష్ట్రాల్లో ఆపిల్ తోటల పెంపకం పరిశ్రమ క్రమంగా తుడిచిపెట్టుకుపోతుందేమోనని భయ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సుంకాలు ఏమీ లేకుండా అమెరికా ఆపిల్ పండ్లు దిగుమతి అయితే, మన దేశంలో ఆపిల్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని పోతుందని హరీశ్ హెచ్చరిస్తున్నారు.

◆ పత్తి, పప్పుధాన్యాలు, ఉల్లిపాయల వంటి విషయంలో ఒక కోటా మేరకే దిగుమతి ఉంటుందని వార్తలు సూచిస్తున్నాయి. అయినప్పటికీ, అమెరికా నుంచి ఆహారాన్ని దిగుమతి చేసుకోవడమంటే నిరుద్యోగాన్ని దిగుమతి చేసుకోవడమే!

సుంకాలు లేకపోతే సమస్యే!

పడిపోయిన ధరలతో పత్తి, సోయా, ఉల్లిపాయల రైతులు ఇప్పటికే బిక్కుబిక్కుమంటున్నారు. సుంకాలు ఏమీ లేకుండా అవి దిగుమతి అయి, ధరలు మరింతగా పతనమైతే, వారు ఆ పంటలను వదిలేసి చేతులెత్తేయడం మినహా చేయగలిగింది లేదు.

ఏడాదికి 500 బిలియన్ల విలువైన అమెరికన్ ఎగుమతుల గురించి ట్రంప్ మాట్లాడుతున్నారు. అందులో ఇంధనం, టెక్నాలజీ, బొగ్గు, వ్యవసాయం వంటి రంగాలవి కూడా ఉన్నాయి. అయితే, అది ఏడాదికి దాదాపు 100 బిలియన్ డాలర్ల చొప్పున ఐదేళ్ళ కాలానికి లెక్క చెప్పినదై ఉంటుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికన్ ఎగుమతులన్నీ వ్యవసాయం, పాడి పరిశ్రమ, వాటి అనుబంధ రంగాల ఉత్పత్తులతోనే నిండి ఉంటాయని భావించడం కూడా సబబు కాదు.

పత్తి, పప్పుధాన్యాలు, ఉల్లిపాయల వంటి వస్తువుల విషయంలో ఒక కోటా మేరకు మాత్రమే మార్కెట్ అందుబాటులో ఉంటుందని వార్తలు సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఆహారాన్ని దిగుమతి చేసుకోవడం నిరుద్యోగాన్ని దిగుమతి చేసుకోవడం లాంటిదేనని అర్థం చేసుకోవాలి.

గత ఏడాది సెప్టెంబర్–డిసెంబర్ మధ్య కాలంలో, పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని తొలగించినపుడు చౌక ధరకు పత్తి బేళ్ళు అపారంగా వచ్చిపడ్డాయి. దేశంలో పత్తి ధరలు తగ్గాయి. అందుకు వస్త్ర పరిశ్రమవారు సంతోషించారు కానీ, రైతులు నష్టపోయారు. మూడు నెలల్లో 30 లక్షల పత్తి బేళ్ళు దిగుమతి అయ్యాయి. పత్తి ధర క్వింటాల్‌కు రూ. 1,000–రూ.1,500 వరకు పడిపోయింది.

అభివృద్ధి చెందుతున్న దేశాలపై బలవంతంగా రుద్దాలని ట్రంప్ చూస్తున్న నూతన వాణిజ్య వ్యవస్థ... ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు వ్యతిరేకమైనది. ట్రంప్ తన కొత్త వ్యవస్థకు 'యూరోపియన్ యూనియన్ కూడా తలొగ్గేట్లు చేయాలని చూస్తున్నారు. వాణిజ్య సంస్థ 1995లో ఏర్పడినప్పటి నుంచి అమెరికా పప్పులు ఉడకడం లేదు. అది ఇపుడు ఎలాగైనా తన పంతం నెగ్గించుకోవాలని చూస్తోంది. ఒత్తిడికి లొంగిపోతున్న దేశాలతో, నూతన ప్రపంచ వ్యవస్థ ఆవిష్కృతమవుతోంది. 'కండ గలవాడిదే రాజ్యం' అన్న లోకోక్తి ఎంతకాలం కొనసాగుతుందో కాలమే చెప్పాలి.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

మూలాన్ని గుర్తించని జెన్-జీ ఉద్యమాలు?

సందర్భం

డి. పాపారావు

బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలలో జెన్–జీ ఉద్యమాలు జరిగి, అక్కడి ప్రభుత్వాలు కూలిపోవడం తెలిసినదే. ఈ ఆందోళనలకు ప్రేరణ ఆ యా సమాజాలలో పెరిగిపోతోన్న నిరుద్యోగం, ధరలు, అవినీతి వంటి అంశాలే. ఈ రెండు దేశాలు త్వరలో ఎన్నికలకు వెళ్ళబోతున్నాయి. సరికొత్త రాజకీయ 'అవతారం' ఎత్తిన పాత రాజకీయ పక్షాలు కానీ... ప్రస్తుతం రాజకీయ రూపం సంతరించుకున్న జెన్–జీ ఉద్యమకారులు కానీ సమస్యల పరిష్కారం కోసం ముందుకు తెస్తోన్న క్రొంగొత్త, సృజనాత్మక అజెండా మాత్రం ఏమీ లేదు!

ఈ పోరాటాల వెనుక ఉన్న ఉద్దేశం మంచిదే కావొచ్చు. కానీ, ఇవి ఆవేశకావేశాల ప్రాతిపదికన సాగాయే తప్ప, స్పష్టమైన కార్యాచరణతో జరిగినవి కావు. నేపాల్, బంగ్లాదేశ్‌లలోనే కాదు, నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సంక్షోభానికి జవాబు వెతకడం కష్టంగా మారుతోంది.

ప్రస్తుత నిరుద్యోగ విలయానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది– 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా పడిపోయింది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థల్లో మందగమనం ఏర్పడి ఉపాధి కల్పన కుంటుపడింది. రెండోది– దశాబ్దాలుగా సాగుతున్న సాంకేతిక పురోగతి నేడు పరాకాష్ఠకు చేరింది. మానవ శారీరక శ్రమను రోబోలు ఆక్రమిస్తుంటే, మేధా శ్రమ స్థానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కైవసం చేసుకుంటోంది. ఫలితంగా బ్లూ కాలర్, వైట్ కాలర్ రంగాల్లో మనిషికి స్థానం లేకుండా పోతోంది. ఉదాహరణకు, అమెజాన్ సంస్థలో 30 వేల మంది వరకూ ఉద్యోగులను తొలగించనున్నారు. దీనికి కారణం ఆ కంపెనీ ఒక ఉద్యోగస్థుడికి సాలీనా సగటున 36 వేల డాలర్ల వేతనం చెల్లించవలసి ఉంటే... అదే స్థానంలో మరమనిషిని (రోబో) పెట్టుకుంటే అయ్యే ఖర్చు 3,600 డాలర్లు మాత్రమే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో తన సంస్థకు సంబంధించిన కొత్త కోడ్‌ను గూగుల్ 2025 నాటికి 30% మేరకు రాయగలుగుతోంది. అంటే, ఆ మేరకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాల కోతలు అనివార్యమన్నమాట.



వ్యవస్థ ఇక కొత్త ఉద్యోగాలను ఇవ్వలేదని గ్రహించిన బిల్‌గేట్స్ వంటి వారు 'సార్వజనీన కనీస ఆదాయం' (యూబీఐ) వంటి ప్రతిపాదనలు తెస్తున్నారు. అంటే, పెరిగిపోతున్న నిరుద్యోగుల తిరుగుబాట్లను అడ్డుకోవడానికి ప్రజల ఖాతాల్లో కొంత నిరుద్యోగ భృతి జమ చేసి వ్యవస్థను కాపాడుకోవాలనేది వారి ఎత్తుగడ. ఈ స్థితిని 180 ఏళ్ల క్రితమే కారల్ మార్క్స్ తన 'కమ్యూనిస్ట్ ప్రణాళిక'లో అంచనా వేశారు.

'...ఒక వర్గాన్ని పీడించాలంటే ఆ పీడిత వర్గం తన బానిస బతుకును కొనసాగించడానికైనా హామీ ఇవ్వాలి... కానీ, ఈనాటి బూర్జువా వర్గ ఆధిపత్యం కింద, ఈనాటి పారిశ్రామిక క్రమంలో ఆధునిక శ్రామికుడు ఎదగడం మాట అటుంచి, నానాటికీ అడుగుకి పోతున్నాడు... కార్మికుడు బుక్కాఫకీరుగా మారుతున్నాడు. తన బానిసకు బానిస బతుకునైనా నమ్మకంగా చూపించగల సత్తా దానికి (వ్యవస్థకు) లేదు. తన బానిస శ్రమ మీద బతకాల్సిన వర్గం అది. కానీ, ఆ పరిస్థితి మారి ఆ బానిసే దాని బిచ్చం (పైన పేర్కొన్న సార్వజనీన కనీస ఆదాయం) మీద ఆధారపడాల్సి వస్తే అటువంటప్పుడు బూర్జువా వర్గం కింద సమాజం ఇక ఎంతమాత్రమూ బతకలేదు. కాబట్టి (ఆ) వర్గ పతనం తప్పదు. కార్మిక వర్గ విజయమూ తప్పదు.' అదీ విషయం. ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ దాని పరిణామక్రమంలో మార్క్స్ చెప్పిన పై దశను చేరుకుంది.

ప్రస్తుత వ్యవస్థలో నిర్జీవమైన పెట్టుబడి (డబ్బు), సజీవమైన మనుషులపై పెత్తనం చేస్తోంది. నిన్నటి ఉత్పత్తి సాధనాలే నేడు విధ్వంసక శక్తులుగా మారుతున్నాయి. ఈ వ్యవస్థాగత లోపాలను గుర్తించకుండా చేసే ఏ ఉద్యమమైనా నిష్ప్రయోజనమే! కమ్యూనిజానికి కాలం చెల్లిందన్న ప్రచారపు బూజును తలల నుంచి దులుపుకొని ఆ సిద్ధాంతపు వెలుగులో సమకాలీన సమస్యలను చూడగలిగితేనే మరో ప్రపంచానికీ, మానవాళి మహోదయానికీ దారులను అన్వేషించగలం.

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు

సోషల్ టాక్

నిర్వహణ



హోదాలు మిమ్మల్ని నిర్వచించలేవు. మీరు మేనేజర్, ప్రమోటర్, చివరికి ఛైర్మన్ అయినా... మీరు మీ బాధ్యతలను ఎలా నిర్వహిస్తున్నారనేది మాత్రమే మీరేమిటో చెబుతుంది. ఒక కంపెనీ బాగా పని చేస్తోందంటే, ఆ కంపెనీలో బాధ్యతల నిర్వహణ సరిగ్గా ఉందని అర్థం.

– దిలీప్ సంఘ్వీ, సన్ ఫార్మా ఎండీ

వట్టి సాకు!

నువ్వు చేయాలనుకున్న దానిని చేయలేకపోవటానికి డబ్బు లేదనేది కుంటిసాకు. నువ్వు నిజంగా సినిమా తీయాలనుకుంటే ఈ రోజే నీ ఫోన్‌లో దానిని తీయవచ్చు. ప్రశ్న ఏమిటంటే, నీ దగ్గర చెప్పటానికి ఏమైనా ఉందా అని!

– రజత్ కపూర్, నట–దర్శకుడు

వయసు

వయసును గురించిన ఆలోచనను దగ్గరకు రానీయకండి. ఏ వయసులోనైనా మన దేహాలు ఆ వయసుకు తగ్గ అందంతో, ఆకర్షణతో ఉంటాయి. ఏ దశకు ఆ దశ ప్రత్యేకమైనది. ఏ దశకు ఆ దశ సౌఖ్యమైనది. మీరు వయసు అనుకుంటున్నదంతా మీ ఆలోచన మాత్రమే!

– జెన్నీఫర్ ఆనిస్టన్, అమెరికన్ నటి

ధైర్యం

ధైర్యవంతురాలిగా ఉండటం అన్నది మీ వస్త్రధారణలో మాత్రమే కనిపించేది కాదు. మీ ఆలోచనల్లో ఉంటుంది. మీ బ్యాంకు బ్యాలెన్స్‌లో ఉంటుంది. 'కాదు' అని చెప్పటంలో ఉంటుంది. కష్టం వచ్చినప్పుడు సహాయం కోసం చూడకపోవటంలో ఉంటుంది.

– షెర్లిన్ చోప్రా, నటి–మోడల్

వేగం

సరైన దిశలో పయనిస్తున్నామని రూఢిగా తెలిసినప్పుడు మాత్రమే వేగం ఉపయోగపడుతుంది. దారులు వెతుక్కుంటున్నప్పుడు, మలుపు తిరుగుతున్నప్పుడు నెమ్మదిగా అడుగులు వేయటమే క్షేమం. ముఖ్యంగా స్టార్టప్ కంపెనీలకు ఈ సూత్రం వర్తిస్తుంది.

– శ్రీవిద్యా కన్నన్, అవ్వాలి సొల్యూషన్స్ సీఈవో

ఆచరణ



మీ ఆలోచన మంచిదో కాదో తెలుసుకోవటానికి ఉత్తమమైన మార్గం దానిని ఆచరణలోకి తీసుకువెళ్లటమే! మీరు ఏళ్ల తరబడిగా ప్రణాళిక వేసుకుంటూ ఉండవచ్చు. కానీ, మీరు నిజంగా దానిని ప్రారంభించే వరకూ ఏమీ తెలుసుకోలేరు. ఆలోచనకు ప్రాణం ఆచరణే!

– మార్క్ రాండోల్ఫ్, వ్యాపారవేత్త

బెయిల్ ఒక హక్కు!

ఇన్ బాక్స్

భారత రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రతి పౌరుడికీ జీవించే హక్కునూ, వ్యక్తిగత స్వేచ్ఛనూ నిరంతరం ప్రసాదిస్తోంది. ఏ వ్యక్తి స్వేచ్ఛను కూడా చట్టబద్ధమైన పద్ధతిలో తప్ప అన్యాయంగా హరించకూడదని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. న్యాయస్థానాలు ఈ హక్కును కాపాడే రక్షణ కవచాలుగా వ్యవహరించాలి. ఇటీవలి కాలంలో బెయిల్ పిటిషన్ల విచారణలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విచారణలో ఉన్న ఖైదీలను ఏళ్ల తరబడి జైళ్లలో ఉంచడం వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే అవుతుంది. 'వ్యక్తిగత స్వేచ్ఛ కంటే మరేదీ ముఖ్యం కాదు' అని సర్వోన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత న్యాయవ్యవస్థ స్థితిగతులకు అద్దం పడుతున్నాయి. బెయిల్ దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం వల్ల నిందితుడికి విచారణకు ముందే శిక్ష పడుతోంది. నేరం నిరూపణ కాకముందే ఒక వ్యక్తిని సుదీర్ఘ కాలం కారాగారంలో ఉంచడం రాజ్యాంగ నైతికతకు విరుద్ధం.

బెయిల్ పిటిషన్ల స్థితిగతులపై సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల హైకోర్టులకూ కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్‌లో ఉన్న బెయిల్ దరఖాస్తుల వివరాలను, వాటి విచారణకు పడుతున్న సమయాన్ని నివేదిక రూపంలో సమర్పించాలని కోరింది. కొన్ని సందర్భాల్లో హైకోర్టులు బెయిల్ దరఖాస్తులను వినడానికి కూడా నిరాకరించడం, లేదా వాయిదా వేయడం ఆందోళన కలిగిస్తోంది. న్యాయం కోసం వేచి చూసే బాధితుల గోడును కోర్టులు సత్వరమే వినాలి.

భారత న్యాయశాస్త్రం 'బెయిల్ నియమం – జైలు మినహాయింపు' అనే సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది. నిందితుడు సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం లేనప్పుడు, విచారణకు సహకరించే పరిస్థితుల్లో అతనికి బెయిల్ మంజూరు చేయడం న్యాయమూర్తుల బాధ్యత. భారతదేశంలోని జైళ్లలో అత్యధిక శాతం మంది విచారణ ఎదుర్కొంటున్న ఖైదీలే ఉండటం విచారకరం. వీరిలో చాలా మంది పేదలు, అట్టడుగు వర్గాలకు చెందినవారు. బెయిల్ పొందే ఆర్థిక స్థోమత లేక, సరైన న్యాయసహాయం అందక వారు చీకటి గదుల్లో మగ్గిపోతున్నారు. వీరి స్వేచ్ఛను కాపాడటంలో న్యాయం అందించే వ్యవస్థలు విఫలమవుతున్నాయి. కేవలం బెయిల్ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారానే జైళ్లలో కిక్కిరిసిపోతున్న నిస్సహాయుల సంఖ్యను తగ్గించగలం. బెయిల్ నిరాకరణను అసాధారణ చర్యగా మలిచిన రోజే న్యాయస్థానాల పట్ల ప్రజల్లో అచంచలమైన నమ్మకం ఏర్పడుతుంది. ప్రతి ఒక్కరికీ సత్వర న్యాయం అందడం ప్రజాస్వామ్య విజయం.

– డా॥ కట్కూరి । సైబర్ సెక్యూరిటీ–న్యాయ నిపుణుడు

ఆదాయం పెరిగితే పెరిగేవి...

డేటా సాయింట్

భారతీయ కుటుంబాల నెలవారీ ఖర్చులు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ గణాంక శాఖ జరిపే సర్వే ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తోంది. 1,07,596 పట్టణ కుటుంబాలను ఈ సర్వే కోసం పరిశీలించారు. ఆదాయం పెరిగితే తిండి కంటే ఇతర అవసరాలకు ప్రాధాన్యం పెరుగుతున్నదని ఈ సర్వే వెల్లడిస్తోంది. తిండి కంటే ఆహారేతర అవసరాల ఖర్చు ఎక్కువ (సుమారు 60 శాతం). అవి ఇలా ఉన్నాయి...

అవసరం	2022–23	2023–24
ఇంధనం, కరెంట్	6.26	5.59
చదువు	5.78	5.97
వైద్యం	5.91	5.85
రవాణా	8.59	8.46
దుస్తులు, బెడ్డింగ్, పాదరక్షలు	5.41	5.66
నిలిచే వస్తు సామగ్రి	7.17	6.87
చిల్లర వస్తువులు, వినోదం	6.56	6.92
వినియోగ సేవలు	5.92	5.72
ఇతర ఆహారేతర వస్తువులు	9.23	9.26

వెలుగు వైపు పయనం

జ్యోతిర్మయం

ప్రపంచంలో ఎన్నో దేశాలున్నాయి. మరి భారతదేశానికి సంబంధించిన ప్రత్యేకత ఏమిటి? ప్రపంచ దేశాల ప్రజలు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ భోగభాగ్యాలను అనుభవించటమే లక్ష్యంగా భావిస్తున్న కాలానికి ఎంతో పూర్వమే ఈ దేశాన్ని యావత్తు ప్రయోగశాలగా చేసి రాత్రి, పగలు... శాశ్వత సత్యం, నిత్యానందం ఎక్కడ ఉందో కనుగొనటానికి ప్రతి దాన్నీ నిశితంగా పరిశీలించిన పరిశోధకులను కలిగి ఉండటం ఈ దేశ ప్రత్యేకత. 'భా' అంటే ప్రకాశము, 'రతి' అనగా ఆసక్తి. భారతీయులనగా ప్రకాశములోనికి వెళ్ళాలనుకొనేవారని అర్థం. నేను భారతీయుడిని అని చెప్పుకొనే హక్కు కేవలం భారతదేశంలో పుట్టడం వలన రాదు. వెలుగు వైపు ప్రయాణం మొదలుపెట్టిన వాడే భారతీయుడు' అంటారు డా॥ పి. భానుమతి (అద్వైత పరిప్రశ్నోత్తర రత్నావళి).

ఇది చాలా మంచి నిర్వచనం. వేల ఏళ్ల కిందటనే **'అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ'** అనే పలుకులు పెల్లుబికింది భారతీయుల హృదయాంతరాళంలో నుంచే కదా! అసత్తులో, తమస్సులో మృత్యువులో ఉన్నామన్న విషయాన్ని గ్రహించి వాటి నుంచి బయటపడాలనే ఆరాటం, తీవ్ర కాంక్షను కల్గి ఉండటమే అసలైన భారతీయత. కట్టు, బొట్టుల్లో అది లేదు. ఏ స్విట్జర్లాండ్‌లోనో, స్కాట్లాండ్‌లోనో సూటు, బూటు వేసుకొన్న ఓ వ్యక్తి నిరంతరం సచ్చిదానందం కోసం కృషి చేస్తుంటే అతనిలో భారతీయత ఉన్నట్టే! ఆ రకంగా అతడు భారతీయుడే!! ఈ దేశంలోనే పుట్టి, అజ్ఞానాంధకారంలో మునిగి తేలుతుంటే అతడు భారతీయుడే కాడు, అతనిలో భారతీయత అన్నది లేనేలేదని చెప్పాల్సి వస్తుంది. వెలుగును కోరుతూ, సత్యాన్ని అన్వేషిస్తూ, తమ సర్వస్వాన్నీ త్యజించి ఎందరో విదేశీయులు ఈ గడ్డపై అడుగు పెట్టారు, ఇక్కడే స్థిరపడ్డారు. వారే అసలైన భారతీ యులు. మనం ఎక్కడ ఉన్నా జ్యోతిర్మయులవ్వడానికి శ్రమిద్దాం. భారతీయులు సార్థక నామధేయులని రుజువు చేద్దాం. మనం పరమాత్మ వైపు పయనిద్దాం, వెలుతురు వైపు సాగుదాం.

– రాచమడుగు శ్రీనివాసులు

చిల్లర నాణేలతో ధన శివలింగం

ఓ యువకుడు చిల్లర నాణేలతో శివలింగాన్ని తయారు చేసి అబ్బురపరిచాడు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం కొవ్వూరుపాడుకు చెందిన చిలకా సాయితేజ ఇప్పటి వరకూ ఐదుసార్లు అయ్యప్ప మాల వేసుకుని శబరిమల యాత్ర చేశారు. గ్రామంలోని శివాలయంలో ఈశ్వరుడికి రోజూ అభిషేకం చేస్తారు. తను ఉండే పరిసర ప్రాంతంలో ఎక్కడా అయ్యప్పస్వామి ఆలయం లేకపోవడంతో ఇంటి వద్దనే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో అయ్యప్ప స్వామి, వినాయకుని ఆలయం నిర్మించారు. నిత్యం శివుడికి అభిషేకం చేస్తున్న అతడికి చిల్లర నాణేలతో శివలింగం చేయాలని దేవుడు ఆదేశించినట్టు కలవచ్చింది. దీంతో బంధువులు, మిత్రుల నుంచి 1 లక్ష 25వేల చిల్లర నాణాలు సేకరించారు. రూ.1, 5, 10 నాణేలతో రెండు నెలలు కష్టపడి శివలింగం తయారీ ప్రారంభించారు. 98శాతం పూర్తయిందని, ఇంకా కొంతపని ఉందన్నారు. ఇప్పటి వరకూ రూ.1.25 లక్షలు ఖర్చయిందని చెప్పారు. 3.5 అడుగుల ఎత్తు, 400 కిలోల బరువుతో గ్రానైట్ రాతిపై ఈ ధన శివలింగాన్ని తయారు చేసినట్టు పేర్కొన్నారు. - దేవరపల్లి

చిల్లర నాణేలతో తయారు చేసిన ధన శివలింగం (ఇన్‌సెట్‌లో) సాయితేజ

మరియమాతను అనుసరిస్తే సకల దీవెనలు

మరియతల్లిని, ఆమె కుమారుడైన యేసుక్రీస్తును అనుసరించాలని నెల్లూరు సహవారస పీఠాధిపతి పిల్లి ఆంథోని దాస్ కోరారు. విజయవాడ గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో మంగళవారం రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరియమాతను ఆశ్రయించడం ద్వారా సకల దీవెనలు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ గురువులతో కలిసి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. విశ్వాసులకు సత్ప్రసాదాన్ని అందచేశారు. ఉత్సవాల రెండో రోజు యాత్రికులు పెద్ద సంఖ్యలో చేరుకుని మరియమాతను దర్శించుకునేందుకు విశ్వాసులు బారులు తీరారు. - గుణదల (విజయవాడ తూర్పు)

విద్యుద్దీపకాంతులతో ధగధగలాడుతున్న గుణదల కొండ.. సత్ప్రసాదాన్ని అందజేస్తున్న ఫాదర్

ముక్కంటీశుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఏర్పేడు: ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరుని శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 14 రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో మొదటి రోజు భక్త కన్నప్ప కొండ మీద కన్నప్ప ధ్వజారోహణం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య వేడుకగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా కన్నప్ప కొండకు తీసుకెళ్లారు. అక్కడ ధ్వజారోహణం చేసి మాఢ వీధుల్లో స్వామిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో మీడియా పాయింట్, దూర్జటి కళా ప్రాంగణం ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విద్యుత్ దీపాల అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మంగళగిరి ఎయిమ్స్‌లో 800 ఖాళీలు

గొల్ల బాబూరావు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఎయిమ్స్ ఆస్పత్రుల్లో ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ విభాగాల్లో ఖాళీలున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాధవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు ప్రశ్నకు కేంద్రమంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. మంగళగిరి ఎయిమ్స్‌లో 800 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. వీటిలో ఫ్యాకల్టీ 138, నాన్–ఫ్యాకల్టీ 662 పోస్టులున్నట్లు తెలిపారు. పోస్టుల రిక్రూట్‌మెంట్ అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. పోస్టులను భర్తీ చేసేందుకు స్టాండింగ్ సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు కేంద్రమంత్రి వివరించారు.

టీటీడీకి రూ.కోటి విరాళం

తిరుమల: టీటీడీ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన గుత్తా హర్ష సాయి చౌదరి మంగళవారం రూ.కోటి విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమల టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుకు డీడీని అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన దాతలు స్మార్ట్ సాఫ్ట్‌వేర్ మోహన్ ఇండస్ట్రీస్ ఎండీ యలమంచిలి మదన్‌మోహన్‌రావు టీటీడీ ట్రస్ట్‌లకు రూ.30లక్షల విరాళం డీడీని చైర్మన్‌కు అందజేశారు.

పోలవరంపై రాజీపడొద్దు.. ఏపీని అప్పుల కుప్పగా మార్చొద్దు

20 నెలల్లోనే రూ.3.20 లక్షలకోట్ల అప్పులా?

- పోలవరం ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదింపు ఆంధ్రులకు తీరని ద్రోహం
- వైఎస్ జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరికాదు
- విశాఖ ఉక్కును కాపాడండి.. కడప స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిచేయండి
- లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తమ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. పోలవరం ఎత్తు తగ్గించి ఆంధ్రప్రదేశ్ రైతులకు అన్యాయం చేయవద్దని కోరారు. 2026–27 బడ్జెట్‌పై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏపీకి జరుగుతున్న అన్యాయాన్ని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను లెక్కలతో సహా ఎండగట్టారు. తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రిని అభినందిస్తూ.. 2026–27 మూలధన వ్యయాన్ని రూ.12.21 లక్షలకోట్లకు పెంచడాన్ని స్వాగతించారు. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11.5 శాతం పెరుగుదల అని చెప్పారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు విషయంలో ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆయన విరుచుకుపడ్డారు. పోలవరాన్ని 194 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 45.72 మీటర్ల ఎత్తుతో నిర్మించాల్సి ఉండగా, బడ్జెట్ ప్రసంగంలో దీన్ని 41.15 మీటర్లకే పరిమితం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 41.15 మీటర్ల వద్ద కేవలం 75 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయగలమని, దీనివల్ల ప్రాజెక్టు లక్ష్యం నెరవేరదని చెప్పారు. తద్వారా లక్షలాదిమంది రైతులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.55 వేలకోట్లు కాగా, సవరించిన వ్యయం రూ.30,436 కోట్లకు కుదించడం రాష్ట్ర రైతులకు చేసే ద్రోహమేనని మండిపడ్డారు.

ఆఫ్ బడ్జెట్ అప్పులతో రాష్ట్రం ఎటు పోతోంది?

ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో మొత్తం అప్పులు రూ.3.32 లక్షలకోట్లు ఉంటే.. చంద్రబాబు ప్రభుత్వం కేవలం 20 నెలల్లోనే రూ.3.20 లక్షలకోట్ల అప్పులు చేసిందని దుయ్యబట్టారు. ఏపీఎండీసీ ద్వారా రూ.9 వేలకోట్లు, ఏపీఎస్‌సీఎల్ ద్వారా వేలకోట్లు అప్పులు చేస్తూ రాష్ట్ర ఖజానాను ఇబ్బందుల్లోకి నెడుతున్నారని చెప్పారు. ఏపీఎండీసీ నిధులను ప్రైవేట్ వ్యక్తులు నేరుగా వాడుకునేలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఇలాంటి ఆఫ్ బడ్జెట్ అప్పుల వల్ల భవిష్యత్తులో జీతాలు, పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి సంబంధించిన ఇతర కీలక డిమాండ్లు

రాష్ట్రానికి సంబంధించి ఆయన పలు డిమాండ్లు చేశారు. అవి..

- విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపేసి, దానికి ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలి.
- విభజన హామీ అయిన కడప స్టీల్‌ప్లాంట్‌ను త్వరితగతిన పూర్తిచేయాలి.
- కడప–బెంగళూరు రైల్వేలైన్ పనులను 100 శాతం కేంద్ర నిధులతో యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి.
- ఉపాధిహామీ పథకం స్థానంలో వచ్చిన వీబీజీ రామ్ పథకంలో రాష్ట్ర వాటాను 10 శాతం నుంచి 40 శాతానికి పెంచడం వల్ల ఏపీ వంటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలు నష్టపోతాయి. ఈశాన్య రాష్ట్రాల తరహాలో ఏపీకి కూడా 90:10 నిష్పత్తిలో నిధులు ఇవ్వాలి.
- రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఎగువ పెన్నార్ అనుమతులు రద్దయ్యాయి. కేంద్రం చొరవ తీసుకుని ఆ అనుమతులను పునరుద్ధరించాలి.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కుట్ర

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ 17 మెడికల్ కాలేజీలను ప్రతిష్టాత్మకంగా చేపట్టారని గుర్తుచేశారు. లక్షలకోట్లు అప్పులు చేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కాలేజీల కోసం రూ.5 వేలకోట్లు ఎందుకు ఖర్చు చేయలేకపోతోందని ప్రశ్నించారు. పేదలకు అందాల్సిన వైద్యవిద్యను ప్రైవేట్‌పరం చేయడం వెనుక మర్మమేమిటని నిలదీశారు. ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులు, సామాన్య ప్రజలు వైద్యానికి దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

బడ్జెట్‌లో సామాన్యుడికి ఊరటేది?

ధరల భారంతో మధ్యతరగతి విలవిల

రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని, పన్ను భారంతో సామాన్యుడు సతమతమవుతున్నాడని వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి చెప్పారు. 2026–27 కేంద్ర బడ్జెట్‌పై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని, ఆదాయం బాగుందని చెబుతున్న ప్రభుత్వం.. ఆ ఫలాలు సామాన్యుడికి అందేలా చూడాలని కోరారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు పెరుగుతున్నా, పన్ను స్లాబుల్లో మార్పులు చేయక పోవడం వల్ల ద్రవ్యోల్బణం ప్రభావంతో పన్ను చెల్లింపుదారులు నష్టపోతున్నారని చెప్పారు. ముఖ్యంగా రూ.15 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారు గృహ, ఆరోగ్య, విద్యా ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.1 లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. కొత్త పన్ను విధానంలో పొదుపు, బీమా వంటి కీలక మినహాయింపులు లేకపోవడం వల్ల దీర్ఘకాలిక ఆర్థికభద్రత దెబ్బతింటుందని హెచ్చరించారు.

ఏటా కోటి ఉద్యోగాలు రావాలి

భారతదేశంలో 65 శాతం జనాభా 35 ఏళ్లలోపు వారేనని, ఈ యువశక్తిని వాడుకోవాలంటే ఏటా కోటి ఉద్యోగాలను సృష్టించాల్సిందేనని చెప్పారు. స్టార్టప్ సంస్కృతి కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా టైర్–2, టైర్–3 పట్టణాలకు విస్తరించాలని సూచించారు. ఎంఎస్ఎంఈలకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తేనే వికసిత్ భారత్–2047 కల సాకారమవుతుందని చెప్పారు.

జీఎస్టీ అధికారుల వేధింపులు

వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంలో బడ్జెట్ ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 5.49 లక్షలకు పైగా పన్ను వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఫీల్డ్ లెవల్ అధికారులు జీఎస్టీ పేరుతో డీలర్లను వేధిస్తున్నారని, ఇది వ్యాపారాలకు ఆటంకమని చెప్పారు. ప్రభుత్వ పనుల్లో సబ్ కాంట్రాక్టర్లకు 5 శాతం జీఎస్టీ వర్తించాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో వారిపై 18 శాతం భారం పడుతోందని తెలిపారు. ఈ అహేతుక విధానాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

మత్తు మందుల ముఠా గుట్టురట్టు

33 పెట్టెల నిషేధిత మాత్రలు, 10 సిరప్ సీసాలు స్వాధీనం

ఎనిమిది మంది అరెస్ట్

తిరుపతి క్రైం: తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత మందులను అక్రమంగా విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించిన పోలీసులు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, 33 పెట్టెల నిషేధిత మత్తు మాత్రలు, 10 దగ్గు మందు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం డీఎస్పీ భక్తవత్సలం మాట్లాడారు. తాడిపత్రికి చెందిన నాగార్జున నిషేధిత మత్తు మందులను అక్రమంగా సరఫరా చేస్తుండగా, నాగేశ్వరరావు మెడికల్ షాప్ ముసుగులో వాటిని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం రాజ్‌కుమార్ తాడిపత్రికి వెళ్లి నిషేధిత మాత్రలు, సిరప్‌లు కొనుగోలు చేసి తిరుపతికి తీసుకువచ్చి ఆటో డ్రైవర్లు, వలస కూలీలకు అధిక ధరలకు విక్రయించాడు. లాభాల ఆశతో రాజ్‌కుమార్ తన స్నేహితులను కూడా ఈ అక్రమ వ్యాపారంలోకి దింపాడు. అనంతరం పెద్ద మొత్తంలో మందులు తెప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. చింతలచేను ప్రాంతంలో వాటిని పంచుకుంటుండగా పోలీసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి సంయుక్తంగా దాడులు చేసి నిందితులను పట్టుకున్నారు. లక్కిసెట్టి నాగార్జున, పాతకమూరి నాగేశ్వరరావు, అలతూరు రాజ్‌కుమార్, దిగవిందుల ఆంజనేయులు, కుడుముల జనార్దన్, మేదూరి గౌతమ్, కోనేటి జగదీష్ బాబు, వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు. ధనలక్ష్మి (ధనమ్మ), పద్మ, చందు, ప్రతాప్, విష్ణు, ప్రదీప్ పరారీలో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నట్టు డీఎస్పీ భక్తవత్సలం చెప్పారు.

75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

- 'ఏపీ ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ లోకల్ క్యాండిడేట్స్ చట్టం – 2019'ను అమలు చేయాలి
- ఐటీ కంపెనీలకు భూములు 99 పైసలకే ధారాదత్తం చేయడం సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధం
- కంపెనీలే నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలి
- సీఎం చంద్రబాబుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ

విశాఖ సిటీ: ప్రభుత్వ భూములు చౌకగా తీసుకుంటున్న ఐటీ కంపెనీలు స్థానికులకే 75 శాతం ఉద్యోగాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ మంగళవారం లేఖ రాశారు. ఐటీ కంపెనీలకు భూములు 99 పైసలకే ధారాదత్తం చేయడం సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని ఆ లేఖలో పేర్కొన్నారు. కనీసం ఉద్యోగాల విషయంలో అయినా 'ఏపీ ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ లోకల్ క్యాండిడేట్స్ చట్టం – 2019'ను అమలు చేసేలా చూడాలని కోరారు. చౌకగా భూములు తీసుకున్న కంపెనీలు ఎన్ని ఉద్యోగాలు ఇస్తాయో నోటి మాట ద్వారా కాకుండా ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే కంపెనీలే నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలన్నారు. గూగుల్ – అదానీ ప్రాజెక్ట్ కోసం విశాఖ జిల్లా తర్లువాడలోని 50 మంది దళితుల డీ పట్టా భూమి 100 ఎకరాలు బలవంతంగా సేకరించారని ఆరోపించారు. అక్కడ ఎకరా మార్కెట్ విలువ రూ.2 కోట్లకుపైగా ఉంటే.. ప్రభుత్వం మాత్రం రూ.50 లక్షలే ఇవ్వడం దారుణమన్నారు. నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డేటా సెంటర్ల వల్ల జలవనరులు దెబ్బతినే ప్రమాదం ఉందని, వ్యవసాయం, మత్స్య పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని ఆయన కోరారు.

హంసవాహనంపై పార్వతీ పరమేశ్వరుల కటాక్షం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు హంస వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ప్రధానార్చకులు, వేద పండితులు వేదమంత్రోచ్చారణలు పఠించగా.. మంగళవాయిద్యాలు మార్మోగగా, భక్తుల శివన్నామస్మరణ ప్రతిధ్వనించగా హంస వాహనాధీశులైన స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించి ఆలయం వెలుపలకు తీసుకువచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. హంస వాహనాధీశులైన స్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లు మయూర వాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం వారి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

టీడీపీ నేతల అరాచకం

కోర్టులో వివాదం నడుస్తున్న భూమిని ఆక్రమించుకునేందుకు యత్నం

అడ్డొచ్చిన బాధితులతోపాటు మహిళపై దాడిచేసిన టీడీపీ నేతలు

బాధితులపై దౌర్జన్యం చేస్తున్న చెంగల్రాయ శెట్టి

చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో మంగళవారం టీడీపీ నేతలు రెచ్చిపోయి ప్రవర్తించారు. కోర్టులో వివాదం నడుస్తున్న భూమిలో అక్రమంగా ప్రవేశించడమే కాకుండా బాధితులపై దాడి చేశారు. బాధితులు తెలిపిన మేరకు.. పనపాకం గ్రామ లెక్కదాఖల జక్కలవారిపల్లిలోని సర్వేనంబరు 652లో 92 సెంట్లు లేట్ విఘ్నేశ్వర్‌శెట్టి కుమారుడు నారాయణస్వామి శెట్టికి పూర్వీకుల నుంచి సంక్రమించింది. అప్పటినుంచి ఆ భూమిలో నారాయణస్వామి కుమారుడు హేమాద్రి సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2021లో సాగునీటిసంఘం అధ్యక్షుడు, స్థానిక టీడీపీ నాయకుడు చెంగల్రాయశెట్టి ఆ భూమిని ఆక్రమించి దౌర్జన్యంచేశాడు. అప్పట్లో బాధితులు కోర్టును ఆశ్రయించారు. దీంతో తిరుపతి మూడో అదనపు సివిల్ కోర్టులో ఈ కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం నారాయణస్వామి, కుటుంబసభ్యులు ఆ పొలంలో పనులు చేసుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన సాగునీటిసంఘం అధ్యక్షుడు చెంగల్రాయశెట్టి, రాజారత్నంశెట్టి తదితరులు దౌర్జన్యంగా ఆ భూమిలోకి ప్రవేశించారు. నారాయణస్వామిశెట్టి మీద దాడిచేశారు. వీరి దౌర్జన్యాన్ని వీడియో తీస్తున్న చంద్రకళను జుట్టుపట్టుకుని ఈడ్చి కొట్టారు. వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం బాధితులు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పొన్నెకల్లులో అర కిలో బంగారం చోరీ

తాడికొండ: గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన 70 సంవత్సరాల కేసరి అశోక్ రెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్న తన పెద్ద కుమారుడిని చూసేందుకు ఈ నెల 4వ తేదీన వెళ్లారు. 9వ తేదీ తెల్లవారు జామున 2.30 గంటలకు తిరిగి వచ్చారు. ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో సుమారు అర కిలో బంగారం, 3 కేజీల వెండి వస్తువులు తీసుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి.. వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చివరి మజిలీ.. కన్నీళ్లు మిగిల్చె..

బాపట్ల జిల్లా ఏరియా ఆస్పత్రిలో అమానవీయ ఘటన

ప్రభుత్వాస్పత్రిలో మహాప్రస్థానం వాహనం లేక బైక్‌పైనే శవం తరలింపు

నాగేశ్ మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్తున్న బంధువులు

కర్లపాలెం: ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి శవాలను తీసుకెళ్లడానికి పేదలు పడే బాధలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. మంగళవారం బాపట్ల జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. బాపట్ల జిల్లా చింతాయపాలెం గ్రామానికి చెందిన నక్కా నాగేశ్(55) అలియాస్ నాగేశ్వరరావు మంగళవారం ఉదయం భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు బైక్‌పై బాపట్ల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నాగేశ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని చింతాయపాలెం తరలించేందుకు బాపట్ల ఏరియా ఆస్పత్రిలో మహాప్రస్థానం వాహనం కావాలని అడిగారు. వాహనం లేకపోవడంతో ఓ ఆటోవాలాను సంప్రదించగా రూ.3 వేలు కిరాయి అడగడంతో.. అంత డబ్బు వారి వద్ద లేక నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. విధి లేని పరిస్థితుల్లో మృతదేహాన్ని మోటారు బైక్‌పైనే కూర్చోబెట్టుకుని 13 కిలోమీటర్ల మేర ప్రయాణించి గ్రామానికి తీసుకెళ్లారు. మృతిచెందిన నాగేశ్‌కు భార్యతో పాటు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

మహాప్రస్థానం కోసం ప్రతిపాదనలు పంపాం: జిల్లా కలెక్టర్

మృతదేహాన్ని మోటారు బైక్‌పై తీసుకెళ్లిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పాఠశాలల్లో భద్రత కరువు

మున్సిపల్ స్కూల్‌లో చిత్తుపేపర్లు అంటుకుని విద్యార్థినికి మంటలు

నారాయణ స్కూల్‌లో ఫ్యాన్ ఊడిపడి ముగ్గురు విద్యార్థులకు గాయాలు

గాయపడిన షేక్ హీనా, సాయి చరణ్

కర్నూలు సిటీ: కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల భద్రతను విద్యాశాఖ అధికారులు గాలికొదిలేశారనే విమర్శలకు బలం చేకూరుస్తూ రెండు ఘటనలు చోటుచేసుకున్నాయి. కర్నూలు నగరంలోని మున్సిపల్ స్కూల్‌లో చిత్తుపేపర్లకు పెట్టిన మంటల వల్ల ఓ చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఇదే సందర్భంలో నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఫ్యాన్ ఊడిపడటంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ రెండు ఘటలు సోమవారం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. కర్నూలు బండిమెట్టలో ఒకే ప్రాంగణంలో మున్సిపల్ ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు హైస్కూల్ ఉన్నాయి. ప్రైమరీ స్కూల్‌లో బాబు షేక్, హసీనా బీ దంపతుల కుమార్తె షేక్ హీనా (9) 3వ తరగతి చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో హైస్కూల్‌కు నూతన భవనాన్ని నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో పనులు మొదలు పెట్టగా.. కూటమి ప్రభుత్వం పనులు నిలిపివేసింది. దీంతో పిల్లర్లకే పరిమితమైన చోట చిత్తుపేపర్లకు ఓ విద్యార్థి నిప్పంటించాడు. ఆ సమయంలో నిప్పును చిన్నపుల్లతో పైకి ఎత్తగా ఆ నిప్పుతో కూడిన మంట హీనా దుస్తులకు అంటుకున్నాయి. మంటలతో హీనా కేకలు వేసుకుంటూ స్కూల్ బయటకు పరిగెత్తడంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు. చికిత్స కోసం జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. విషయం మంగళవారం బయటికి రావడంతో ఎంఈఓ రెహ్మాన్ స్కూల్‌కి వెళ్లి విచారణ జరిపారు. హీనాను డీఈఓ ఎల్.సుధాకర్ పరామర్శించారు. అనంతరం హెచ్ఎం మీనిగ ఆనందం జాన్సన్‌ను సస్పెండ్ చేసి, ఎంఈఓ రెహ్మాన్‌కు సైతం షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

ఫ్యాన్ ఊడిపడి గాయాలు

కర్నూలు మాధవనగర్‌లోని నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఫ్యాన్ ఊడి 7వ తరగతి విద్యార్థులపై పడింది. ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఇందులో సాయి చరణ్ కంటికిపై భాగంలో ఫ్యాన్ రెక్క తగిలింది. సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించి ఇంటికి పంపించారు. స్వల్ప గాయాలైన పిల్లలను సైతం ఇంటికి పంపించడం గమనార్హం. దీనిపై విద్యా శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు దారితీసింది.

డిమాండ్లు నెరవేర్చకుంటే 16 నుంచి సమ్మె

చెవుల్లో పువ్వులు పెట్టుకుని పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

మోకాళ్లపై నిలబడి చెవుల్లో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న పీఏసీఎస్ ఉద్యోగులు

కొరిటెపాడు (గుంటూరు): చెవుల్లో పువ్వులు పెట్టుకుని.. చొక్కాలు విప్పి, మోకాళ్లపై నిలబడి అర్ధనగ్నంగా వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగులు మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 16 నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శ్యామలానగర్‌లోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ కడప, బాపట్ల జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ పీఏసీఎస్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. పీఏసీఎస్ ఉద్యోగుల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు మువ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 12వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తామని, 13న రాష్ట్రంలోని పీఏసీఎస్ ఉద్యోగులందరితో సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే 16 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక నాయకులు టి.వెంకటరామయ్య, కె.సత్యనారాయణ, బి.రఘురామ్, పి.సత్యనారాయణ, ఈ.కొండయ్య, జి.రత్నం, గంగరాజు, రాజేంద్రనాథ్‌రెడ్డి, జగన్మోహనరావు, పి.హనుమంతరావు, అంజిరెడ్డి, ముత్యాలరావు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్
Roc. No.TTD-25021/3/2025- PAT SEC - TTD
పని పేరు: అన్నప్రసాదం డిపార్ట్‌మెంట్, తిరుపతి వద్ద పని చేయుటకు 8 నెలలు అనగా 20.10.2026 వరకు గల కాలానికి అన్‌స్కిల్డ్ కేటగిరి క్రింద అదనపు మ్యాన్‌పవర్– 34 నం.లు FMS వర్కర్లను ఏర్పాటు చేయుట. NIT డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 12.02.2026న ఉ. 10.00 గం॥కు, NIT డౌన్‌లోడ్ ముగింపు తేది: 19.02.2026న మ. 1.00 గం॥కు. నియమ నిబంధనలతో సహా తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org & http://tender.apeprocurement.gov.inకు లాగాన్ కాగలరు. విచారణల కొరకు, సంప్రదించాల్సిన ఫోన్ నం.: 9490361949/ 9440078825.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.393) Dt: 10-02-2026
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

స్పీకర్‌ను తొలగించాలి

ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానం

- ఆయన ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు
- లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు నోటీసు
- 118 మంది విపక్ష ఎంపీల సంతకం
- సంతకం చేయని టీఎంసీ ఎంపీలు
- మార్చి 9న సభ ముందుకు తీర్మానం?

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామంటూ కాంగ్రెస్ పార్టీ మంగళవారం నోటీసిచ్చింది. రాజ్యాంగంలోని 94–సి ఆర్టికల్ కింద లోక్‌సభ సెక్రెటరీ జనరల్ ఉత్పల్‌కుమార్ సింగ్‌కు దాన్ని అందజేసింది. ''సభా వ్యవహారాల నిర్వహణలో ఓం బిర్లా పూర్తిగా ఏకపక్షంగా, విపక్షాల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నారు. తద్వారా స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధ పదవిని దుర్వినియోగం చేస్తున్నారు''అని ఆరోపించింది. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్, ఆ పార్టీ చీఫ్ విప్ కె.సురేశ్, విప్ మొహమ్మద్ జావెద్ విపక్షాల తరఫున మంగళవారం మధ్యాహ్నం సెక్రెటరీ జనరల్‌కు నోటీసు అందజేశారు. ఓం బిర్లాను లోక్‌సభ స్పీకర్ పదవి నుంచి తొలగించాలంటూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ''సభలో పలుమార్లు విపక్ష సభ్యులను మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించలేదు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై విపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని పూర్తి కూడా చేయనివ్వలేదు. స్పీకర్ వివక్షాపూరిత ధోరణికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. విపక్ష నేతను సభలో అసలు మాట్లాడనివ్వనే లేదు. ఫిబ్రవరి 4న ఒక బీజేపీ ఎంపీ మాజీ ప్రధానులపై అత్యంత అభ్యంతరకరంగా మాటల దాడి చేసేందుకు స్పీకర్ అనుమతించారు. పైగా అలా చేసినందుకు ఆయనను కనీసం ఒక్కసారైనా మందలించలేదు. ఇలాంటి ప్రవర్తనను అలవాటుగా మార్చుకున్న సదరు సభ్యునిపై తక్షణం చర్యలు తీసుకోవాలని మేం పదేపదే విజ్ఞప్తి చేసినా స్పీకర్ పట్టించుకోలేదు''అని నోటీసులో ఎంపీలు ఆరోపించారు. పలువురు కాంగ్రెస్ సభ్యులు సభలో ప్రధాని నరేంద్ర మోదీ స్థానం వద్దకు వెళ్లి 'అనూహ్య చర్య'కు దిగాలని భావించినట్టు కచ్చితమైన సమాచారం తన వద్ద ఉందని స్పీకర్ చేసిన ప్రకటనను కూడా వారు ప్రస్తావించారు. ''స్పీకర్ చేసిన ఈ ఆరోపణలు పూర్తి నిరాధారం. అంతేగాక కాంగ్రెస్ ఎంపీల పరువుప్రతిష్టలకు భంగం కలిగించేలా ఉన్నాయి. పార్లమెంటరీ పద్ధతులను, నియమ నిబంధనలను పరిరక్షించాల్సిన స్పీకర్ ఇలాంటి నిరాధార ఆరోపణలు చేసేందుకు నిండు సభను వాడుకోవడం దారుణం. ఇది రాజ్యాంగబద్ధ పదవిని పూర్తిగా దుర్వినియోగం చేయడమే. ప్రజా సమస్యలపై గళమెత్తకుండా విపక్ష సభ్యులను స్పీకర్ పలుమార్లు అడ్డుకున్నారు''అంటూ నోటీసులో పేర్కొన్నారు. ఎనిమిది మంది విపక్ష ఎంపీలను ఏకపక్షంగా సస్పెండ్ చేయడం తదితరాలను కూడా అవిశ్వాస తీర్మానానికి కారణాలుగా వారు పేర్కొన్నారు. ఈ తీర్మానం మార్చి 9న సభ ముందుకు వచ్చే అవకాశమున్నట్టు లోక్‌సభ వర్గాలు పేర్కొన్నాయి.

స్పీకర్ ఓం బిర్లా

తీర్మానంపై తేలేదాకా విధులకు దూరం
స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం

కాంగ్రెస్ తదితర విపక్షాలు తనపై ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మాన అంశం పరిష్కారమయ్యేదాకా విధులకు దూరంగా ఉండాలని స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్ కార్యాలయాన్ని ఉటంకిస్తూ బిర్లా సన్నిహిత వర్గాలు ఈ మేరకు వెల్లడించాయి. నైతిక ప్రమాణాలకు కట్టుబడుతూ ఆయన ఈ నిర్ణయానికి వచ్చినట్టు వివరించాయి. స్పీకర్‌పై గానీ, డిప్యూటీ స్పీకర్‌పై గానీ అవిశ్వాస తీర్మానం సభ పరిశీలనలో ఉండగా ఆ కార్యకలాపాలకు వారు అధ్యక్షత వహించరాదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 96 కూడా నిర్దేశిస్తోంది. విపక్షాలు అందజేసిన అవిశ్వాస తీర్మానం నోటీసును పరిశీలించాల్సిందిగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్ ఉత్పల్‌కుమార్ సింగ్‌ను స్పీకర్ ఆదేశించారు. దానిపై నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెండోసారి నోటీసు!

స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి విపక్షాలు యోచిస్తున్నట్టు సోమవారం ఉదయమే వార్తలు రావడం తెలిసిందే. దానిపై మంగళవారం నిర్ణయం తీసుకుంటామని అనంతరం విపక్ష నేతలు తెలిపారు. మంగళవారం ఉదయమే రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో విపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. స్పీకర్‌పై నోటీసివ్వాలని ఈ సందర్భంగా వారంతా నిర్ణయించారు. అనంతరం చివరి ప్రయత్నంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజుతో విపక్ష నేతలు భేటీ అయి తమ డిమాండ్లపై మరోసారి చర్చించారు. ఆయన నుంచి సానుకూల స్పందన లేదంటూ మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశారు. అయితే తేదీని తప్పుగా పేర్కొనడంతో దాన్ని వెనక్కు తీసుకుని మరో నోటీసు సమర్పించారు.

సంతకం చేయని రాహుల్!

అవిశ్వాస తీర్మానం నోటీసుపై పలు పార్టీలకు చెందిన 118 మంది ఎంపీలు సంతకాలు చేసినట్టు విపక్షాలు తెలిపాయి. వారిలో కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, వామపక్షాలు, ఆర్జేడీ సభ్యులున్నారు. శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీలు సంతకాలు చేయకపోయినా అవిశ్వాస తీర్మానానికి తమ మద్దతు తెలిపాయి. మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు నోటీసుపై సంతకం చేయకపోవడం గమనార్హం. విపక్ష నేత రాహుల్‌గాంధీ కూడా సంతకం చేయలేదని సమాచారం!

ఇప్పుడేం జరుగుతుంది?

స్పీకర్ ఓం బిర్లాను తొలగించేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామంటూ విపక్షాలు నోటీసివ్వడం ఆసక్తికరంగా మారింది. అధికార బీజేపీ, విపక్షాల మధ్య పార్లమెంటులో పది రోజులుగా సాగుతున్న రగడ కాస్తా ఈ ఉదంతంతో కొత్త మలుపు తిరిగింది. దాంతో ఇకపై ఏం జరుగుతుందోనన్న ఆసక్తి మొదలైంది. స్పీకర్ తొలగింపు ప్రక్రియను ఆర్టికల్ 94సి లో స్పష్టంగా పొందుపరిచారు. దానిప్రకారం అవిశ్వాస తీర్మానం సాధారణ మెజారిటీతో నెగ్గితే స్పీకర్ ఉద్వాసనకు గురవుతారు. అవిశ్వాస తీర్మానం కోసం నోటీసివ్వడంతో ఈ ప్రక్రియ మొదలవుతుంది. దానిపై కనీసం ఇద్దరు ఎంపీలు సంతకం చేయాల్సి ఉంటుంది. అందులో స్పీకర్‌పై నిర్దిష్టమైన అభియోగాలను పేర్కొనడం తప్పనిసరి. అప్పుడు మాత్రమే స్పీకర్‌కు అవిశ్వాస తీర్మానంపై స్పందించేందుకు అవకాశం ఉంటుందని లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ పి.డి.టి.ఆచారి తెలిపారు. ''తర్వాత నోటీసును లోక్‌సభ ప్రమాణాల మేరకు ఉన్నదీ లేనిదీ డిప్యూటీ స్పీకర్ పరిశీలిస్తారు. ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్ ఎవరూ లేరు గనుక చైర్‌పర్సన్ల ప్యానల్‌లోని సీనియర్ మోస్ట్ సభ్యుడు ఆ బాధ్యత చేపట్టే అవకాశముంది. నోటీసిచ్చిన 14 రోజుల అనంతరం తీర్మానం సభ పరిశీలనకు వస్తుంది. సభాపతి దాన్ని సభ పరిశీలనకు ఉంచుతారు. తీర్మానానికి అనుకూలంగా ఉన్న వారు లేచి నిలబడాల్సిందిగా కోరతారు. కనీసం 50 మంది సభ్యులు లేచి నిలబడితే తీర్మానాన్ని పరిశీలనకు తీసుకుంటారు. సభ అనుమతి లభించినట్టు ప్రకటిస్తారు. అనంతరం తీర్మానంపై చర్చ ఉంటుంది. 10 రోజులలో దానిపై సభ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. తీర్మానంలో తనపై మోపిన అభియోగాలపై మాట్లాడేందుకు, తన చర్యలను సమర్థించుకునేందుకు ఆర్టికల్ 96 స్పీకర్‌కు అవకాశం కల్పిస్తోంది''అని ఆయన వివరించారు. స్పీకర్‌పై ఇప్పటికే మూడుసార్లు అవిశ్వాస తీర్మానాలు పెట్టినా, రెండుసార్లు ఓటింగ్ దాకా వచ్చినా అవి వీగిపోయాయి. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌కు అనుసరించే పద్ధతి భిన్నంగా ఉండటమే అందుకు కారణమని ఆచారి తెలిపారు. ''మెజారిటీ లెక్కింపు విషయంలో ఓటింగ్‌కు హాజరైన ఎంపీలను మాత్రమే కాకుండా, ఖాళీలను మినహాయించి లోక్‌సభ సభ్యులందరి సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటారు. అప్పుడు మెజారిటీ ఎట్టి పరిస్థితుల్లోనూ పాలక పక్షానికే అనుకూలం అవుతుంది. కనుక స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాలు వీగిపోవడం దాదాపు తప్పనిసరి''అని వివరించారు. గతంలో స్పీకర్లు జీవీ మావలంకర్ (1954), హుకుంసింగ్ (1966), బలరాం జాఖడ్ (1987)పై విపక్షాలు అవిశ్వాస తీర్మానాలిచ్చినా అవి వీగిపోయాయి.

తొలగించాల్సింది రాహుల్‌నే: బీజేపీ

ప్రజలే ఆయన్ను దేశం నుంచి బహిష్కరించాలని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి విపక్షాలు నోటీసివ్వడాన్ని అధికార బీజేపీ తీవ్రంగా దుయ్యబట్టింది. అసలు విపక్ష నేత రాహుల్‌గాంధీనే కాంగ్రెస్ నుంచి మొత్తంగా రాజకీయాల నుంచీ దేశ ప్రజలు బహిష్కరించాల్సిన సమయం వచ్చిందని పేర్కొంది. తమ అంతరాత్మనే బహిష్కరించుకున్న నేతలు ఇప్పుడిలా రాజ్యాంగబద్ధ పదవుల్లోని వారిని తొలగించాలంటున్నారని ఎద్దేవా చేసింది. మోదీ నేతృత్వంలో ఎన్డీఏ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు నిద్ర కరువైందని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. అందుకే అమెరికా బిలియనీర్ జార్జి సోరోస్‌తో కలిసి రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై అవి పథకం ప్రకారం ఇలా వ్యూహాత్మక దాడికి దిగుతున్నాయని ఆరోపించారు. ''పార్లమెంటులో రాహుల్‌గాంధీ, ఇతర కాంగ్రెస్ సభ్యులు ఎలా ప్రవర్తిస్తున్నదీ దేశమంతా చూస్తోంది. రాహుల్ ఉసిగొల్పిన మేరకు ఏకంగా ప్రధానినే నిండు సభలో ఘెరావ్ చేసి ఆయనకు హాని తలపెట్టేందుకు కాంగ్రెస్ ఎంపీలు ప్రయత్నించారు. ఇదెక్కడి భావజాలం? దీనిపై దేశమంతా ఆలోచించాల్సిన సమయం వచ్చింది''అని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలన్న తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్‌పై కూడా పాత్రా మండిపడ్డారు. ఇలాంటి డిమాండ్లు చేయడం విపక్షాలకు ఫ్యాషన్‌గా మారిపోయిందని ఎద్దేవా చేశారు.

తొలగిన ప్రతిష్టంభన

- సజావుగా సాగిన లోక్‌సభ
- బడ్జెట్‌పై మొదలైన చర్చ

న్యూఢిల్లీ: లోక్‌సభలో ఎట్టకేలకు ప్రతిష్టంభన వీడింది. అధికార, విపక్షాల నడుమ వారం రోజులకు పైగా సాగుతున్న వాగ్యుద్ధానికి మంగళవారం తాత్కాలికంగా తెరపడింది. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి మధ్యాహ్నం నోటీసు ఇచ్చిన అనంతరం విపక్షాలు శాంతించాయి. పలు అంశాలపై సభలో వారం రోజులుగా కొనసాగిస్తున్న నిరసనలు, ఆందోళనలకు స్వస్తి పలికాయి. దాంతో మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర బడ్జెట్‌పై సభలో చర్చ మొదలై రాత్రి సజావుగా 8 గంటల దాకా సాగింది. అవిశ్వాస తీర్మానంపై తేలేదాకా కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఓం బిర్లా నిర్ణయించుకోవడంతో ప్యానెల్ చైర్‌పర్సన్లే సభను నడిపించారు. కాంగ్రెస్ సభ్యుడు శశి థరూర్ బడ్జెట్‌పై చర్చను ప్రారంభించారు. అనంతరం పలు పార్టీల సభ్యులు అందులో పాలుపంచుకున్నారు. బడ్జెట్‌పై లోక్‌సభలో చర్చకు మొత్తం 18 గంటల సమయం కేటాయించారు. అనంతరం గురువారం మధ్యాహ్నం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చర్చకు బదులిచ్చే అవకాశముంది. కాంగ్రెస్, ఇతర విపక్షాల ఆందోళనల నేపథ్యంలో ఫిబ్రవరి 2 నుంచీ లోక్‌సభ కార్యకలాపాలేవీ చేపట్టకుండా వరుసగా వాయిదా పడుతూ వస్తుండటం తెలిసిందే. ఈ క్రమంలో ఏడుగురు కాంగ్రెస్, ఒక సీపీఎం సభ్యుడు బడ్జెట్ సెషన్ మొత్తానికీ సస్పెన్షన్‌కు గురయ్యారు కూడా.

మేం దీటుగా బదులిస్తే మరోలా ఉండేది

లోక్‌సభలో హేయమైన దృశ్యాలు కనిపించేవి: మంత్రి రిజిజు

న్యూఢిల్లీ: లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడాల్సిన రోజు ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా అలజడి సృష్టించాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు మంగళవారం మండిపడ్డారు. మోదీ స్థానాన్ని ఈ నెల 4న విపక్ష మహిళా ఎంపీలు చుట్టుముట్టి ఘెరావ్ చేసిన వీడియోను ప్రభుత్వ వర్గాలు బయటపెట్టాయి. విపక్ష సభ్యుల ప్రవర్తనను ఎవరైనా సమర్థిస్తారా అని వీడియోను ఉటంకిస్తూ రిజిజు ప్రశ్నించారు. ''విపక్షాలు ఎంత రెచ్చగొట్టినా సంయమనం పాటించాలని, సభ గౌరవాన్ని కాపాడాలని బీజేపీ నాయకత్వం మమ్మల్ని ఆదేశించింది. సభ్యత, మర్యాద లేకుండా ప్రవర్తించినా వారిని భౌతికంగా ఎదుర్కోవద్దని సూచించింది. విపక్షాలకు తగు రీతిలో బుద్ధి చెప్పాలని మా నాయకత్వం ఆదేశిస్తే పరిస్థితి మరోలా ఉండేది. సభలో హేయమైన దృశ్యాలు కనిపించేవి'' అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వం తమ సభ్యుల విచ్చలవిడి ప్రవర్తనను చూసి గర్విస్తోందని ఎద్దేవా చేశారు. సభలో ప్రధాని స్థానాన్ని చుట్టుముట్టామంటూ విపక్ష ఎంపీలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. స్పీకర్ ఓం బిర్లాతో కూడా విపక్ష నేతలు ఆయన చాంబర్‌లో బెదిరింపు ధోరణిలో మాట్లాడారని విమర్శించారు. విపక్ష సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ మహిళా ఎంపీలు స్పీకర్‌కు విజ్ఞాపన పత్రం ఇచ్చారని వెల్లడించారు.

హెచ్1బీ వీసాలను రద్దు చేయాలి

ప్రతినిధుల సభలో బిల్లు ప్రవేశపెట్టిన రిపబ్లికన్ నేత గ్రెగ్

న్యూయార్క్/వాషింగ్టన్: విదేశీ కార్మికులకు చట్టపర ఉపాధి కల్పిస్తున్న హెచ్–1బీ వీసా కార్యక్రమాన్ని శాశ్వతంగా రద్దుచేయాలని కోరుతూ అధికార రిపబ్లికన్ పార్టీ నేత ఒకరు అమెరికా దిగువసభలో బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఒకవేళ చట్టంగా మారితే అమెరికాలో స్థిరపడాలనుకునే లక్షలాది మంది భారతీయుల కల శాశ్వతంగా చెదిరిపోవడం ఖాయం. ఫ్లోరిడా రాష్ట్రంలోని 17వ కాంగ్రెషనల్ జిల్లా నుంచి ఆరేళ్లుగా దిగువ సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ నేత గ్రెగ్ స్టూబ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. స్థానికుల ఉద్యోగాలను విదేశీయులు కొల్లగొడుతున్నారనే అర్థం స్ఫురించేలా ఈ బిల్లుకు 'ఎండింగ్ ఎక్స్‌ప్లోటేటివ్ ఇంపోర్టెడ్ లేబర్ ఎగ్జెంప్షన్స్ (ఎక్సైల్) యాక్ట్'అని పేరుపెట్టారు. ''అమెరికా చట్టాలను బడా కార్పొరేషన్లు అవహేళన చేస్తున్నాయి. తక్కువ వేతనాలకు దొరికే విదేశీ కార్మికులను అమెరికాలోకి దిగుమతి చేస్తున్నాయి. విదేశాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకునే ఈ సంస్కృతికి చరమగీతం పాడుదాం. హెచ్–1బీ వీసా కార్యక్రమం కారణంగా మన కార్మికులు, యువతకు ఎలాంటి ఉపాధీ లభించట్లేదు. మన కార్మిక శక్తి ప్రయోజనాలను పణంగా పెట్టి బడా కార్పొరేషన్లు విదేశీయులకు ఉద్యోగాలిస్తున్నాయి. పౌరసత్వం లేని విదేశీయులకు లాభం చేకూరుస్తూ అమెరికన్ల కలలను కల్లలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవద్దు. అందుకే ఎక్సైల్ బిల్లు తెచ్చా. ఈ మేరకు అమెరికాకు వలసలు, గుర్తింపు చట్టంలో మార్పులు తెద్దాం. ఇకనైనా అమెరికన్ కార్మికులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి''అని స్టూబ్ అన్నారు.

అస్సాంలో 2.43 లక్షల ఓట్ల తొలగింపు

- పూర్తయిన ప్రత్యేక సవరణ ప్రక్రియ
- తుది ఓటర్ల జాబితాను ప్రచురించిన ఈసీ

గౌహతి: అస్సాంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయింది. తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రచురించింది. 2.43 లక్షల ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించారు. తుది జాబితాలో 2.49 కోట్ల మంది ఓటర్లకు స్థానం కల్పించారు. ముసాయిదా జాబితాతో పోలిస్తే 0.97 శాతం ఓటర్లు తగ్గిపోయినట్లు అస్సాం చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈఓ) ఒక ప్రకటనలో వెల్లడించారు. తుది జాబితాలో 1.25 కోట్ల మంది పురుషులు, 1.24 కోట్ల మంది మహిళలున్నారు. గత ఏడాది డిసెంబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 2.52 కోట్ల మంది ఓటర్లు ఉండగా, తుది జాబితాలో 2.49 కోట్ల మంది ఉన్నారు. అస్సాంలో మరికొన్ని నెలల్లో తాజా జాబితా ఆధారంగానే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అర్హుల పేర్లు గల్లంతైతే దరఖాస్తు చేసుకోవచ్చని ఈసీ సూచించింది.

ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్‌పై కేంద్రం ఆంక్షల కొరడా

- కోర్టులు ఆదేశిస్తే తప్పుడు కంటెంట్‌ను 3 గంటల్లోగా తొలగించాలి
- ప్రతి ఏఐ కంటెంట్‌పై లేబుల్ ఉండాలి
- సామాజిక మాధ్యమ వేదికలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ: యూట్యూబ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ వేదికల్లో తామరతుంపరలా పుట్టుకొస్తూ విస్తృతంగా షేర్ అవుతున్న ఏఐ కంటెంట్, డీప్‌ఫేక్ అంశాల ఉరవడికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షల కొరడా ఝుళిపించింది. కృత్రిమమేథ(ఏఐ) సృష్టించిన సమాచారం(కంటెంట్)తోపాటు అసలును భ్రమింపజేసేలా ఉండే డీప్‌ఫేక్ కంటెంట్ విస్తృతిని అరికట్టేందుకు మోదీ సర్కార్ నిబంధనలను కఠినతరం చేసింది. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఇంటర్మీడియేటరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్,2021లో సవరణలు చేస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. దీని ప్రకారం ఇకపై ప్రభుత్వం లేదా న్యాయస్థానాలు ఫలానా అభ్యంతర, అసభ్య, తప్పుడు ఏఐ/డీప్‌ఫేక్ కంటెంట్‌ను ఆన్‌లైన్ నుంచి తొలగించాలని ఆదేశిస్తే సోషల్‌మీడియా వేదికలు కేవలం మూడు గంటల్లోపే వాటిని తొలగించాలి. గతంలో 36 గంటల గడువు ఉండేది. ఇతర కంటెంట్‌లకు సంబంధించి గడువులను కొన్నింటికి 15 రోజుల నుంచి ఏడు రోజులకు తగ్గించగా మరికొన్నింటికి 24 గంటల నుంచి 12 గంటలకు గడువు తగ్గించారు. పూర్తి/పాక్షిక నగ్నత్వం లేదా శృంగార సంబంధ, ప్రైవేట్‌భాగాలను చూపించే కంటెంట్‌ను కేవలం 2 గంటల్లోపే తొలగించాలి ప్రభుత్వం నిబంధనను తీసుకొచ్చింది. ఏఐ టూల్స్ సాయంతో సృష్టించిన ఎలాంటి కంటెంట్‌కైనా దానిపై 'ఏఐ జనరేటెడ్'అనే లేబుల్‌ను ముద్రించాలి. ఆ సమాచారాన్ని తాము సృష్టించారో లేదా ఏఐ సాయంతో మార్పులు చేశారో స్పష్టంగా పేర్కొనాలి.

వెరిఫికేషన్ మెకానిజం తేవాలి..

హానికర, చట్టవ్యతిరేక కంటెంట్‌ను మూడుగంటల్లోపే ఆన్‌లైన్ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలి. ఏదైనా కంటెంట్‌ను ఎవరైనా అప్‌లోడ్ చేస్తే అది వాళ్లు తయారుచేసిందా? లేదా మరొకరి నుంచి కాపీ కొట్టారా? అనేది రూఢీచేసుకునేందుకు వీలుకల్పించే టూల్స్, వెరిఫికేషన్ మెకానిజంను సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి తేవాలి. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడంతోపాటు డీప్‌ఫేక్‌కు చెక్‌పెట్టేందుకే ఈ కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. వీటిని ఫిబ్రవరి 20వ తేదీ నుంచి అమల్లోకి తెస్తారు. ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'అదే తేదీన ముగుస్తుండటం విశేషం. ఏఐ కంటెంట్ లేదా ఏఐతో మార్పులుచేసిన ఆడియో, వీడియో, ఆడియో–వీడియో కంటెంట్‌ను సింథటికల్లీ జనరేటెడ్ ఇన్ఫర్మేషన్(ఎస్‌జీఐ)గా పరిగణిస్తారు. ఈ కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో చూసిన యూజర్లు ఇది నిజమైనదా? కల్పనా? అనేది తెల్సుకునేందుకు ఆ కంటెంట్‌పై ఖచ్చితంగా ఏఐ లేబుల్‌ను ముద్రించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఇంటర్మీడియేటరీ సంస్థలు ఈ లేబుల్‌ను తొలగించడానికి వీల్లేకుండా మెటాడేటా/టెక్నికల్ ప్రూవెన్స్ మార్కర్‌లను శాశ్వతంగా ముద్రించాలని పేర్కొంది. అప్పుడే అది ఎక్కడి నుంచి తొలుత షేర్ అయిందనేది తెలుస్తుంది. దాంతో అలాంటి ఏఐలో చట్టవ్యతిరేక సమాచారముంటే తొలిసారి షేర్‌చేసిన వ్యక్తి/సంస్థను గుర్తించడం అత్యంత సులభమవుతుంది.

యూజర్ డిక్లరేషన్ ఉండాల్సిందే

తొలిసారిగా అప్‌లోడ్ చేసిన వ్యక్తి/సంస్థ/యూజర్ సంబంధిత కంటెంట్‌పై డిక్లరేషన్ ఇవ్వాల్సిందే. సింథటిక్‌గా సృష్టించిందా లేదా ఏఐతో మార్పులు చేసిందా? అనేది పేర్కొనాలి. అయితే ఈ డిక్లరేషన్‌లు నిజమైనవా కావా ? అని సరిచూసుకునే టెక్నికల్/ఆటోమేటెడ్ టూల్స్‌ను సామాజికమాధ్యమ వేదికలు అందుబాటులోకి తేవాలి. లేబులింగ్ లేదా వెరిఫికేషన్ జరగని పక్షంలో సంబంధిత డేటాపై సామాజిక మాధ్యమ వేదికలదే బాధ్యత అవుతుందని ప్రభుత్వం హెచ్చరించింది.

చట్టవ్యతిరేకమైనదంతా నేరమే

చట్టవ్యతిరేక కార్యకలాపాల కోసం సృష్టించబడే ఏఐ కంటెంట్‌ను ఇకపై నేరమయ కంటెంట్‌గా పరిగణిస్తారు. చిన్నారులపై లైంగికవేధింపుల మెటీరియల్, అసభ్య కంటెంట్, గొప్ప వ్యక్తిని కించపరుస్తూ ఆయన ప్రతిరూపాలు తయారుచేయడం, తప్పుడు ఎలక్ట్రానిక్ రికార్డ్‌లు సృష్టించడం, ఆయుధాలు, పేలుడు పదార్థాల వంటి అక్రమ వస్తువులను ప్రోత్సహించే ఎలాంటి కంటెంట్‌ను అయినా నేరమయ కంటెంట్‌గా లెక్కించి కఠిన చర్యలు తీసుకుంటారు. అయితే కృత్రిమ కంటెంట్‌ను ఎప్పటికప్పుడు ఆటోమేటెడ్ టూల్స్‌తో తొలగించే బాధ్యతాయుత సంస్థలకు ఐటీ చట్టంలోని 79 సెక్షన్ ప్రకారం రక్షణ లభిస్తుందని కేంద్రం భరోసా ఇచ్చింది. కంప్యూటర్ ఆధారిత, చాట్‌జీపీటీ, గ్రోక్, జెమినిలతో కృత్రిమ, అల్గారిథంతో సృష్టించిన, ఎడిట్ చేసిన, మార్పులుచేసిన, అవాస్తవ ఫొటోలు, ఆడియో, విజువల్, ఆడియో–విజువల్ కంటెంట్ మొత్తాన్నీ ఏఐగా పరిగణస్తారు.

17న భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు

కీలక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం

న్యూఢిల్లీ: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ వచ్చే వారం మూడ్రోజులపాటు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలను ధృవీకరిస్తూ భారత విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటన విడుదలచేసింది. ''ఫిబ్రవరి 17వ తేదీన మేక్రాన్ తన భారత పర్యటనను ముంబైలో ఆరంభిస్తారు. మూడ్రోజులపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వాణిజ్యం, రక్షణ సహా పలు కీలక రంగాల్లో పరస్పర సహకారంపై మేక్రాన్, ప్రధాని మోదీ చర్చిస్తారు. ఈ మేరకు ముంబైలో ఇరునేతలు ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. 2023 జులైలో పారిస్ నగరంలో కుదుర్చుకున్న ప్రతిష్టాత్మక హారిజాన్ 2047 రోడ్‌మ్యాప్‌ను విస్తృతస్థాయిలో అమలుచేయడంపై ప్రధానంగా చర్చించే అవకాశముంది. ఇండో–పసిఫిక్‌లో సహకారంసహా మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, సమకాలీన అంశాలపై ఇరునేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ముంబైలో జరగబోయే ఇండో–ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్‌ను మోదీ, మేక్రాన్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం ఏడాది పొడవునా జరగనుంది. తర్వాత ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఫిబ్రవరి 19న మేక్రాన్ పాల్గొననున్నారు. ఫ్రాన్స్‌లో మోదీ పర్యటించిన సరిగ్గా ఏడాది తర్వాత మేక్రాన్ భారత్‌లో పర్యటనకు రావడం ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రస్ఫుటపరుస్తోంది''అని విదేశాంగ శాఖ పేర్కొంది.

ఆ రెండు పుస్తకాలు ఒక్కటి కావు

- జనరల్ నరవణె రాసిన పుస్తకాన్ని ఇంకా ప్రచురించలేదు
- ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: చైనా బలగాలతో భారత సైన్యం పోరాటానికి సంబంధించి పలు వివాదాస్పద అంశాలను ప్రస్తావిస్తూ భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'పుస్తకం చర్చనీయాంశం కావడంతో దాని ప్రచురణసంస్థ 'పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా'మంగళవారం స్పష్టతనిచ్చింది. ఆ పుస్తకాన్ని ఇప్పటిదాకా ముద్రించలేదని, ఆన్‌లైన్ వేదికలపై ప్రత్యక్షమైనదంతా అనధికార కాపీ అని పెంగ్విన్ ర్యాండమ్ వెల్లడించింది. ఈ మేరకు సంస్థ మంగళవారం ఒక ప్రకటన విడుదలచేసింది. ''ప్రీ–ఆర్డర్ అని పేర్కొన్నంత మాత్రాన అది ఇప్పటికే ముద్రితమై అమ్మకానికి సిద్ధంగా ఉందని కాదు. త్వరలో ప్రచురితంకావొచ్చు అని అర్థం. అంతేగానీ పుస్తకం ముద్రించామని మేం ఎక్కడా పేర్కొనలేదు''అంటూ పుస్తకాలకు సంబంధించి తాము అనుసరించే 4 విధానాలను పెంగ్విన్ ర్యాండమ్ వివరించింది. అవి..

1. కొత్త పుస్తకాన్ని ప్రకటించం: అంటే కొత్త రచన, నూతన పుస్తకాన్ని ముద్రించాలని నిర్ణయం జరిగిందని అర్థం. అంతేగానీ ఈ పుస్తకం ఇప్పటికే ముద్రితమైందని కాదు. అది ఇంకా ఆన్‌లైన్‌లోకి అందుబాటులోకికూడా రాదు.

2. ప్రీ–ఆర్డర్: ఇది ప్రచురణకు సంబంధించిన ప్రామాణిక అనుసరణీయ విధానం. నచ్చితే పాఠకులు లేదా రిటైల్ సంస్థలు త్వరలో ప్రచురితంకాబోయే ఈ పుస్తకం కోసం ఆర్డర్లు పెట్టుకోవచ్చు. ఈ దశలోనూ పుస్తకం ముద్రితంకాదు. అందుబాటులో ఉండదు.

3. రాబోయే తేదీ ఖరారు: ఫలానా తేదీన పుస్తకాన్ని ఆవిష్కరించాలని నిర్ణయం జరిగిదంతే. అంతమాత్రాన ఆరోజుకల్లా పుస్తకం ముద్రితమైపోతుందని అర్థంకాదు.

4.ముద్రిత పుస్తకం: విక్రయాల కోసం రిటైల్ దుకాణాల్లోకి వచ్చాకే ఆ పుస్తకం అధికారికంగా ముద్రితమైందని భావించాలి.



రాహుల్

నరవణె

పుస్తకమొచ్చిందని రెండేళ్ల క్రితమే చెప్పారు: రాహుల్

పుస్తకం ప్రచురితంకాలేదన్న పెంగ్విన్ వాదనల్లో నిజంలేదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. గతంలో నరవణే చేసిన ట్వీట్‌ను రాహుల్ అందరిఎదుట బయటకు చదివి వినిపించారు. ''హలో ఫ్రెండ్స్. నేను రాసిన పుస్తకం ఇప్పుడు అందుబాటులో ఉంది. ఇక్కడున్న లింక్‌ను క్లిక్‌చేసి చదవండి. ఆనందంగా పఠనం పూర్తిచేయండి. జైహింద్ అని నరవణె రాసుకొచ్చారు. ఇది డిసెంబర్ 2023లో నరవణె ఆయన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేశారు. పుస్తకం అసలు ప్రచురితంకాలేదని పెంగ్విన్ చెబుతోంది. కానీ ఇప్పటికే ఈ పుస్తకం అమెజాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది''అని రాహుల్ అన్నారు.

పుస్తకాన్ని ఏరకంగానూ విడుదల చేయలేదు: పెంగ్విన్

''నరవణె రాసిన ఈ పుస్తకాన్ని ప్రింట్ లేదా డిజిటల్ లేదా పీడీఎఫ్ ఇలా ఏ ఫార్మాట్‌లోనూ అందుబాటులోకి తేలేదు. ఒక్క పుస్తకాన్ని కూడా ముద్రించలేదు. ఎవరికీ విక్రయించలేదు. ఆన్‌లైన్ వేదికలపై ప్రత్యక్షమైనదంతా అనధికార వెర్షన్ మాత్రమే. దానితో మాకు సంబంధం లేదు. పుస్తకం ప్రచురణ హక్కులు మాకే ఉన్నాయి. పుస్తకాన్ని ఏ రూపంలోనూ మేం పంపిణీ చేయలేదు. బహిర్గతంచేయలేదు. ప్రస్తుతం ప్రింట్, డిజిటల్, పీడీఎఫ్ రూపాల్లో షేర్ అవుతుంటేగనక అది పూర్తిగా మా సంస్థ కాపీరైట్ హక్కులను ఉల్లంఘించినట్లే లెక్క. ఈ అంశంలో మేం చట్టపర చర్యలు తీసుకుంటున్నాం''అని సంస్థ స్పష్టం చేసింది.

మౌనం వీడిన నరవణె

పుస్తకం వివాదం కావడంతో ఎట్టకేలకు నరవణె మౌనం వీడారు. ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని ఆయన స్పష్టంచేశారు. ఈ మేరకు సోమవారం పెంగ్విన్ ఇండియా సంస్థ వెల్లడించిన ఒక ప్రకటనను నరవణే మంగళవారం తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేశారు. ''పుస్తకం తాజా స్థితి ఇదే''అని దానికి ఒక క్యాప్షన్ పెట్టారు.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 538.20 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్‌కి 20,641 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నిల్వ 36.0923 టీఎంసీలు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5000, గరిష్ట ధర రూ.6700, మోడల్ ధర రూ.6000 వరకు పలికింది.

న్యూస్‌రీల్

టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

తిరుమల:గుంటూరుకు చెందిన ఎన్.సుధారాణి టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు మంగళవారం రూ.10,01,116 విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

ఐదు, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వాణి రాణి మంగళవారం తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు http://apgpcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 19వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7569333798 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

గ్రంథాలయంలో తనిఖీలు

రేపల్లె: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని ఏపీ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యురాలు మగతాల పద్మజ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పత్రికా విభాగం, పుస్తక విభాగం, రిజిస్టర్‌లు, రికార్డులు, శిక్షణ ఫౌండేషన్ కంప్యూటర్ రిజిస్టర్‌లను పరిశీలించారు. పట్టణంలోని చంద్రమౌళి పార్కులో గ్రంథాలయానికి సంబంధించిన 15 సెంట్ల భూమిలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి జమీర్‌బాషాను అభినందించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట:జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించిన మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థి షేక్ జమీర్‌బాషాను జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌కు పిలిపించి అభినందనలు తెలియచేశారు. విద్యార్థి తల్లితండ్రులు, డీఈవో రామారావు, ప్రధానోపాధ్యాయులు టి.రవికాంత్‌ను సైతం అభినందించారు. జమీర్‌బాషా జిల్లాకే కాకుండా రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాడని ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 'పరీక్షలపై చర్చ' కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కో విద్యార్థిని మాత్రమే ఎంపిక చేయగా, ఏపీ నుంచి నరసరావుపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన జమీర్‌బాషా ఎంపికయ్యారు. ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడి తన ప్రతిభను చాటుకున్నారు. జమీర్‌బాషాకు ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజు శుభాకాంక్షలు తెలియచేశారు.

శ్రీ సీతారామ గానసభ సంగీత ఉత్సవాలు ఆరంభం

తెనాలి:పట్టణానికి చెందిన సంగీత సంస్థ శ్రీ సీతారామ గానసభ శాస్త్రీయ సంగీత ఉత్సవాలు మంగళవారం సాయంత్రం స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఆరంభించారు. తొలుత త్యాగరాజ స్వామి, గానసభ వ్యవస్థాపకులు నారుమంచి సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు పిరాట్ల నారాయణమూర్తి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంగీత ఉత్సవాన్ని ప్రారంభించారు. మొదట రోజు విజయవాడకు చెందిన కుమారి మల్లాది సింధు రాజేశ్వరి సంగీత కచేరి హృద్యంగా సాగింది. వాగ్దేవి కీర్తనలను ఆలపించారు. వయొలిన్‌పై మీద విజయవాడకు చెందిన అంబటిపూడి కామాక్షి, మృదంగంపై విజయవాడకు చెందిన మాస్టర్ మల్లాది శివానంద ఎస్.ఎస్.వి వాయిద్య సహకారం అందించారు. గానసభ అధ్యక్షులు పిరాట్ల రమణి పర్యవేక్షించారు.

సంభ్రమాశ్చర్యాలు

- మెడికల్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన
- భారీగా తరలివస్తున్న విద్యార్థులు
- ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటున్న మెడ్‌ఫ్యూజన్

వీక్షిస్తున్న విద్యార్థులు

గుంటూరు మెడికల్: వైద్య వృత్తిపై మక్కువ పెంచేలా, వైద్య రంగం, మానవ శరీరంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేలా గుంటూరు వైద్య కళాశాలలో మెడ్‌ఫ్యూజన్ పేరుతో ఈనెల 4వ తేదీ నుంచి జరుగుతున్న మెడికల్ ఎగ్జిబిషన్ విద్యార్థులను అమితంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఒక్కరోజే మొత్తం 2,209 మంది సందర్శించారు. ఇందులో ఒక్క ఇంటెల్ స్కూల్ నుంచి సుమారు 600 మంది విద్యార్థులు రావడం విశేషం. మెడికల్ కళాశాల ప్రాంగణం మొత్తం విద్యార్థుల విహారంతో కళకళలాడింది.

ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్....

➡ కేవలం విద్యార్థులనే కాకుండా పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిని మెడ్‌ఫ్యూజన్ మెడికల్ ఎగ్జిబిషన్ బాగా ఆకట్టుకుంటుంది. సందర్శకుల రాక రోజు రోజుకు పెరుగుతుండడంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ఆధ్వర్యంలో వైద్య బృందం ఎప్పటికప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీక్షకులకు ఎలాంటి అవాంతరాలు, అవరోధాలు లేకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థినుల సందడి

➡ అనస్థీషియా విభాగం నిర్వహించిన ఎగ్జిబిషన్ విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అనస్థీషియా విభాగంలో ఏర్పాటు చేసిన ఫొటో బూత్ వద్ద విద్యార్థులు ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపించారు. ఈ ఫొటో బూత్ ద్వారా అనస్థీషియాలజిస్టు చేసే వివిధ విధులు, ఆయన పాత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతి వైద్య విభాగం ప్రత్యేకమే....

➡ గుంటూరు వైద్య కళాశాలలో ఉన్న ప్రతి వైద్య విభాగం కూడా మెడికల్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంది. ఆయా వైద్య విభాగాల ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న విజ్ఞాన విషయాలు, ఆరోగ్యకరమైన అంశాలు, అందరిని ఆకట్టుకుంటున్నాయి.

➡ అనస్థీషియా వైద్య విభాగం ఆధ్వర్యంలో కాలక్రమంలో జరిగిన మార్పులు, అభివృద్ధిని బయోస్కోప్ ద్వారా ప్రదర్శించారు. విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు.

➡ వివిధ నరాలను ఉత్తేజితం చేసినప్పుడు శరీర అవయవాలు ఎలా స్పందిస్తాయో చూపించే ఎగ్జిబిట్‌కు విశేష ఆదరణ లభించింది. విద్యార్థుల చేతుల ద్వారానే ఇంట్యూబేషన్ ప్రక్రియను ప్రాక్టికల్‌గా చేయించి చూపించారు. దీంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

➡ అనాటమీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానవ అస్థి పంజరాలు, శరీర అవయవాలు, గుండె, ఊపిరితిత్తులు, లివర్, మెదడు వంటి అవయవాలు కళ్లతో చూసి ఆశ్చర్యానికి, ఆనందానికి లోనవుతున్నారు.

➡ తల్లి కడుపులో ఉండే పసి పిండాలను రసాయనాల్లో నిల్వచేసి చూపిస్తున్న తీరు అందరిని ఆకట్టుకుంటుంది.

➡ ఫార్మాకాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో మందుల తయారీ, ఏఏ జబ్బులకు ఏఏ మందులు పని చేస్తున్నాయో తెలిపే చార్ట్‌లు, పెథాలజీ వైద్య విభాగం, రేడియాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో వ్యాధులను ఏ విధంగా గుర్తిస్తారనే

విషయాలు ఆకట్టుకుంటున్నాయి.

➡ న్యూరాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో బ్రెయిన్ ఎలా పనిచేస్తుంది. మెదడుకు వచ్చే సమస్యలు, చికిత్సలు తెలిపేలా ఏర్పాటు చేసిన చార్ట్‌లు, చిత్రాలు పిల్లల చిట్టిమెదడులో ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి.

➡ పిల్లల వైద్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ చిన్నారులను, విద్యార్థులను బాగా ఆకట్టుకుంటున్నాయి.

➡ ప్రతి వైద్య విభాగం దేనికదే ప్రత్యేకతను సంతరించుకుంది.

వైద్య వృత్తిని తెలిపేలా....

మెడికల్ ఎగ్జిబిషన్‌ను వైద్య వృత్తిపై ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకునేలా, వైద్య రంగంపై అవగాహన ఏర్పడేలా ఏర్పాటు చేశాం. మానవులకు వచ్చే వ్యాధులు, వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలు సైతం అందరికి అర్థమయ్యేలా స్టాల్స్ ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరు ఆశ్చర్యానికి గురి కావడంతోపాటు, ఆనందంతో ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎగ్జిబిషన్‌ను సందర్శించి మంచి అనుభూతి పొందాలని మనవి.

– డాక్టర్ ఎన్‌వీ. సుందరాచారి, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల, గుంటూరు

ఆర్థిక అక్షరాస్యతతోనే సరైన ఆర్థిక నిర్ణయాలు

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా కోరారు. రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం పోస్టర్లను స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఎస్పీ వకుల్ జిందాల్, జీఎంసీ కమిషనర్ కె.మయూర్‌అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.

- ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సురక్షిత బ్యాంకింగ్ విధానాలు పాటించడం, డిజిటల్ లావాదేవీలు జాగ్రత్తగా నిర్వహించడం, పొదుపు అలవాట్లు పెంపొందించుకోవడం, ఆర్థిక మోసాల నుంచి రక్షణ పొందడం, రి కేవైసీ చేయించడం అలాగే సెంట్రలైజ్డ్ కేవైసీ రిజిస్ట్రీ క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్ల పైన ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

అక్షర ఆంధ్ర అభ్యాసకుల నమోదు వేగవంతం చేయాలి

గుంటూరు వెస్ట్: అక్షర ఆంధ్ర అభ్యాసకులను, వలంటీర్లు యాప్‌లో అప్ డేట్ చేసే పనిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంపై మంగళవారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాప్‌లో నమోదు రెండు రోజులలో పూర్తి కావాలని స్పష్టం చేశారు. జిల్లాను అక్షరాస్యతలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉల్లాస్–అక్షర ఆంధ్ర కార్యక్రమం నిర్దేశిత లక్ష్యాలను అందుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

అంబటి ఇంటిపై దాడిలో కర్రలతో స్వైర విహారం చేస్తున్న రాయపాటి అమృతరావు

కాంట్రాక్టర్లా...గూండాలా?

- మాజీ మంత్రి అంబటి ఇంటిపై దాడిలో కీలకంగా వ్యవహరించిన కాంట్రాక్టర్లు
- పలువురు కాంట్రాక్టర్లపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసులు
- క్రిమినల్ కేసుల్లో ఉన్న వారు కాంట్రాక్టర్‌గా అనర్హులు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో వర్కులు చేయాలంటే ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని కాంట్రాక్టర్లు డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారు కాంట్రాక్టులు దక్కించుకుని పనులు నిర్వహిస్తుండడం గమనార్హం. వీరంతా అధికార పార్టీ నేతలు కావడంతో నగర పాలక సంస్థ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడిలో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ రాయపాటి అమృతరావు(తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు)తోపాటు, మేయర్ పక్కనే తిరిగే మరో కాంట్రాక్టర్, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఉన్న పలువురు నేతలు కీలకంగా వ్యవహరించారు. పెద్ద పెద్ద కర్రలు తీసుకుని కార్ల అద్దాలు పగలగొట్టడంతోపాటు, రాంబాబు ఇంటిపైకి పెద్ద బండ రాళ్లు..పెట్రోలు పోసి నిప్పు అంటించారు. ఇలాంటి నేర ప్రవృత్తి ఉన్న వారు కాంట్రాక్టర్లుగా అనర్హులు. కానీనగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు వారికే కోట్లాది రూపాయల వర్కులు దక్కేలా పావులు కదుపుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

గతంలోనూ ఇదే చరిత్ర..

కాంట్రాక్టర్లు అని చెప్పుకునే టీడీపీ గూండాలు గతంలో నగర పాలక సంస్థ అధికారులపై కూడా దురుసుగా వ్యవహరించి వార్తల్లో కెక్కినప్పటికీ వారిపై ఇంత వరకు ఎటువంటి చర్యలు లేవనే చెప్పుకోవచ్చు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియ అంతా కూడా నిధి పోర్టల్ ద్వారా జరుగుతుంది. బిల్లులను నిధి పోర్టల్‌లో పెట్టే క్రమంలో టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లు ఇంజినీరింగ్ అధికారులపై దురుసుగా వ్యవహరించడంతోపాటు పరుష పదజాలంతో దూషించారు. దీంతోపాటు పలకలూరు రోడ్డు నుంచి తురకపాలెం వెళ్లే రోడ్డులో నగరపాలక సంస్థకు చెందిన స్థలానికి చెందిన చెరువులో వ్యర్థాలు, బిల్డింగ్ మెటీరియల్ వేయవద్దని చెప్పిన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై మేయర్ పక్కన తిరిగే ఓ కాంట్రాక్టర్ బూతు పురాణం లంకించుకున్నారు. తాజాగా అభివృద్ధి పనులను తనిఖీ చేసే థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోలర్‌పై ఇదే మేయర్ పక్కనే తిరిగే కాంట్రాక్టర్ దురుసుగా వ్యవహరించి ఆయన్ను భయపెట్టే ప్రయత్నం చేశారు. ఈ సంఘటన కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది. సదరు కాంట్రాక్టర్‌పై పలు కేసులు ఉన్నప్పటికీ దర్జాగా వర్కులు చేసుకుంటూ కాలం గడుపుతున్నాడు. టెండర్లలో పాల్గొనే వారు క్రిమినల్ కేసుల్లో ఉండకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ దొంగ డిక్లరేషన్ ఇచ్చి వర్కులు చేసుకుంటున్న టీడీపీ కాంట్రాక్టర్లపై కొత్త కమిషనర్ మయూర్ అశోక్ ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

హోటల్స్‌లో ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్లు తనిఖీలు

- పాడై నిల్వ ఉంచిన 101 కిలోల మాంసం సీజ్
- ఐదు రెస్టారెంట్స్‌కు నోటీసులు జారీ

ఓ హోటల్‌లో ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

గుంటూరు మెడికల్: రోజుల తరబడి వండకుండా నిల్వచేసిన మాంసం.. ఆహారం మిగిలిపోతే పడేయకుండా ఫ్రిజ్‌లో నిల్వ చేసిన దృశ్యాలు మంగళవారం గుంటూరు నగరంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు జరిపిన తనిఖీల్లో వెలుగు చూశాయి. వివరాల్లోకి వెళ్లితే....గుంటూరు నగరంలో మంగళవారం ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్స్, తూనికలు, కొలతల శాఖ అధికారుల బృందాలుగా ఏర్పడి విస్తృతంగా హోటల్స్, రెస్టారెంట్స్, స్వీట్స్‌షాపులు, బేకరీలలో తనిఖీలు చేశారు. తనిఖీలలో వాళ్లకు విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. చికెన్, మటన్, చేపలను వండకుండా ఫ్రిజ్‌లలో రోజుల తరబడి రెస్టారెంట్స్ నిర్వాహకులు నిల్వచేశారు. మాంసం ఐస్ గడ్డలాగా గట్టిగా మారిపోయి ఎంత పగులగొట్టినా ఐస్ ముక్కలు వస్తున్నాయే తప్ప మాంసం కనిపించ లేదు. ఫ్రిజ్ అంతా రక్తంతో గడ్డకట్టుకుపోయి ఉంది. ఆహార పదార్థాలు వండే కిచెన్ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతోపాటు అపరిశుభ్రంగా ఉంది. ఆహార పదార్థాల్లో సైతం నిషేధిత రంగులు కలిపి విక్రయిస్తున్నారు. పచ్చి మాంసమే కాకుండా వండిన అన్నం, బిర్యానీ, కూరలు కూడా ఫ్రిజ్‌లలో నిల్వ ఉన్నాయి. ఇలాంటి విస్తుపోయే నిజాలతో మైండ్ బ్లాక్ అయిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తక్షణమే ఆయా హోటల్స్, రెస్టారెంట్స్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

మాంసం సీజ్ చేసిన హోటల్స్, రెస్టారెంట్స్ ఇవే...

గుంటూరు లక్ష్మీపురం రోడ్డులోని బిస్మిల్లా రెస్టారెంట్‌లో 48 కేజీల మాంసం, బృందాన్‌గార్డెన్స్ సెంటర్‌లోని స్వాగత్ డిలైట్‌లో 25 కేజీల మాంసం, గోంగూర రెస్టారెంట్‌లో ఐదు కేజీల మాంసాన్ని సీజ్ చేశారు. బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లోని సాయిరాం ఫుడ్స్‌లో మూడు రకాల స్వీట్లు 25కేజీల వరకు సీజ్‌చేసి పరీక్షల నిమితం స్టేట్ ఫుడ్‌సేఫ్టీ కార్యాలయానికి తరలించారు. ఏ మేరకు కల్తీలు ఉన్నాయనే విషయాలు వెలుగులోకి వచ్చిన పిదప నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఫుడ్‌సేఫ్టీ స్టేట్‌జాయింట్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు మీడియాకు తెలిపారు.

తనిఖీలు చేసిన హోటల్స్, రెస్టారెంట్స్ ఇవే...

గుంటూరు నగరంలోని గోంగూర రెస్టారెంట్, మయూర్ ఫ్యామిలీ రెస్టారెంట్, స్వాగత్ డిలైట్, 99 బిర్యానీ, ఆల్ కబీర్ రెస్టారెంట్, నవాబ్ అరేబియన్ రెస్టారెంట్, బిర్యానీ ప్యాలెస్, మద్రాస్ బిలాల్ హోటల్, బాబు బిర్యానీ, నల్లపాడు సుభాని హోటల్, శుభం హోటల్. వీటితోపాటుగా సాయిరాం ఫుడ్స్, నగరాలు బాలాజీ స్వీట్స్, బ్రాడీపేట సుజనా బేకరీలలో తనిఖీలు చేశారు.

తనిఖీల్లో పాల్గొన్నవారు

ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ స్టేట్ ఇన్‌చార్జి జాయింట్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు, నెల్లూరు అసిస్టెంట్‌ఫుడ్ కంట్రోలర్ జి.వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, 10 మంది ఫుడ్ సేఫ్టీఆఫీసర్లు పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చింది వీరికే...

నిబంధనల ప్రకారం పరిమితికి మించిన రంగులు కలిపి ఆహారం, ఆహార పదార్థాలు తయారు చేయటం, వండిన పదార్థాలు రోజుల తరబడి నిల్వ చేయటం, పచ్చి మాంసాన్ని రోజుల తరబడి నిల్వ చేయటం, అపరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న స్వాగత్ డిలైట్, మద్రాస్ బిలాల్, బెంగళూరు అయ్యంగార్ బేకరీ, శుభం హోటల్ నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు నోటీసులు ఇచ్చారు. ఫుడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహిస్తున్న అరండల్‌పేట నాల్గోలైన్‌లోని ఆల్ కబీర్ రెస్టారెంట్ వారికి నోటీసులు ఇచ్చారు.

పులి వాహనంపై మల్లేశ్వరుడు

మంగళగిరి టౌన్ : మంగళగిరి పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామి వారు వ్యాఘ్ర వాహనంపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు భక్తులకు ఉత్సవ విశిష్టతను వివరించారు. ఉత్సవ కైంకర్య పరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన శిందె నారాయణ వ్యవహరించారు. దేవస్థాన ఈ.వో. గోపి ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు.

దూరవిద్యలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు నోటిఫికేషన్

మార్చి 8న ప్రవేశ పరీక్ష

ఏఎన్‌యూ(పెదకాకాని): ఏఎన్‌యూ–2026 క్యాలెండర్ సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా రెండేళ్ల కాలపరిమితితో ఉండే (ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. మార్చి 8న ఏఎన్‌యూ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఏపీ ఐసెట్ 2025లో ర్యాంక్ పొందిన అభ్యర్థులు నేరుగా కోర్సులలో ప్రవేశం పొందవచ్చని వెల్లడించారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. అలానే 2026 క్యాలెండర్ సంవత్సరానికి సెమిస్టర్ విధానంలో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) 23 పీజీ కోర్సులకు అనుమతి లభించిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు మార్చి 25వ తేదీతో ముగియనుందన్నారు. అన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్ సైట్ నుంచి లేదంటే ఫోన్ నంబర్లను 0863–2346222, 98484 77441 సంప్రదించవచ్చని తెలియజేశారు.

రేపటి నుంచి పెదకాకానిలో కల్యాణ బ్రహ్మోత్సవాలు

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి పండుగ శోభ సంతరించుకుంది. ఆలయంలో గురువారం నుంచి కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఇప్పటికే ఆలయంలో భారీ ఏర్పాట్లు చేశారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి ఆలయం ప్రాంగణం అంతటా పందిళ్లు ఏర్పాటుచేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యం లేకుండా స్వామివారిని దర్శించుకునే విధంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అలంకరణ పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈనెల 19వ తేదీ వరకూ ఏడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	102.248
అమ్మకాలు	98,826
నిల్వ	21,721

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–23,000
నంబరు–5	13,500–22,500
273	14000–22000
341	14,000–26,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–21,500
నంబరు–5	13,000–21,000
341	14,000–24,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 – 20,500
బాడిగ–355	14,000 – 25000
దేవనూరు డీలక్స్	15,000 – 27,000
ఆర్మూర్	13,000 – 18,000
తాలుకాయలు	8,000 – 12,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000–19,000
బాడిగ – 355	14,000–24,500
తాలు	8,500 – 11,500

–కొరిటెపాడు (గుంటూరు)

రాష్ట్రంలో జంగిల్ రాజ్ పాలన

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి రాంబాబు కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, మౌనిక, మనోజ్ఞలను మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిలు మంగళవారం పరామర్శించారు. అంబటి కార్యాలయంపై జరిగిన దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయం, నివాసాన్ని పరిశీలించారు.

■ మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో జంగిల్ రాజ్ పాలన కొనసాగుతుందని ధ్వజమెత్తారు. అంబటి కార్యాలయం, నివాసంపై దాడిచేయడం దారుణమన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్న అంబటిపై ఉద్దేశపూర్వకంగా దాడిచేశారని మండి పడ్డారు. ప్రభుత్వం చేతగానితనాన్ని ఎత్తి చూపుతున్నారనే ఆయనపై బలవంతపు అక్రమ కేసులు పెట్టారన్నారు. మహిళ అయి ఉండి దగ్గరుండి రౌడీయిజం చేయించడానికి ఎమ్మెల్యే గళ్లా మాధవికి సిగ్గులేదా అని ప్రశ్నించారు.

■ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇలాంటి దాడులు ఏనాడూ చూడలేదన్నారు. టీడీపీ నేతలు బరితెగించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, దానికి పోలీసులు దగ్గరుండి సహకరించడం బాధాకరమన్నారు. స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ సినిమా చూపిస్తామని అన్న గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త గుండాలతో దాడిచేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

■ వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ తప్పులను ఎండగడుతున్న అంబటి, మాజీ మంత్రి జోగి రమేష్ నివాసాలపై దాడులకు దిగటం సిగ్గుచేటన్నారు. కనీసం నివాసంలో మహిళలు ఉన్నారని కూడా చూడకుండా స్థానిక మహిళా ఎమ్మెల్యే దగ్గరుండి దాడులు చేయించటం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి రెండో సారి తాము వస్తే.. దారి ఖర్చులకు కూడా ఉండవని వ్యాఖ్యలు చేస్తున్నారని, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనుసైగ చేస్తే.. ఆమెకు ఇంటికి వెళ్లేందుకు కూడా ఖర్చులు ఉండవన్నారు. కోనసీమ అంబేడ్కర్ జిల్లా నుంచి అండగా ఉన్నామని చెప్పేందుకు వచ్చామని తెలిపారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

హోం మంత్రి అనిత పూర్తిస్థాయిలో డమ్మీ అని, చంద్రబాబు, లోకేష్ చెప్పిన విధంగా ఆమె ఆడటం తప్ప చేసేదేమీ లేదన్నారు.

పెదకాకాని శివాలయం పాలకమండలి నియామకం

పెదకాకాని: పెదకాకానిలోని శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల తర్వాత పాలకమండలి నియామకానికి శ్రీకారం చుట్టారు. పాలకవర్గంలో మొత్తం 13 మందిని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంది.

■ పాలకవర్గ సభ్యులుగా చేబ్రోలు వెంకట భాస్కర పున్నారావు, కంభంపాటి వెంకయ్య, క్రోసూరు పూర్ణచంద్రరావు, కొమ్మూరి మల్లికార్జునరావు, బైరపనేని ధనలక్ష్మి, కొండా లత, ధూపాటి శివశంకరరావు, వడ్లమూడి సువర్ణలక్ష్మి, ఉల్లం రాజేశ్వరి, బండారు మల్లేశ్వరి, వరికూటి వీరసుధాకర్, బాణావత్ మంగమ్మ, పాముదుర్తి నాగలక్ష్మి తదితరులను నియమించారు.

■ ఎక్స్‌అఫిషియో సభ్యుడుగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పేటేటి ధనమహేశ్వరప్రసాద్‌ను ఎంపిక చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముగిసిన భారత్ రంగ్ అంతర్జాతీయ నాటక సంబరాలు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, వేదిక (తెలుగు నాటక పరిషత్ సంఘం) సంయుక్తంగా మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న భారత రంగ్ మహోత్సవ్ ■ అంతర్జాతీయ నాటకోత్సవం మంగళవారంతో ముగిశాయి. ఈసందర్భంగా జరిగిన సభకు వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. అనంతరం గుంటూరు నగర వీధుల్లో భారీగా కళాకారుల ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, కళాకారులు హాజరయ్యారు.

■ దయా ప్రకాష్ సింహ రచనలో ఆయుష్ త్రిపాఠి దర్శకత్వంలో ఆఫ్ స్టేజ్ ఆర్ట్ గ్రూపు ప్రదర్శించిన ఓన్స్ ఇన్ ఇండియా నాటకం అలరించింది. 22 శతాబ్దాల నాటి మౌర్య సామ్రాజ్యం పతనాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. గ్రీకు సంస్కృతి మౌర్య వైభవాల కలయికగా ఈ కథ సాగింది. జాతీయ భద్రత విషయంలో హింసా, అహింసల మధ్య నైతిక సంఘర్షణను చర్చించింది.

హాకీ సెంట్రల్ ప్యానెల్ సభ్యుడిగా హర్షవర్ధన్

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : హాకీ ఆంధ్రప్రదేశ్ గౌరవ జనరల్ సెక్రటరీగా ఉన్న గంధం హర్షవర్ధన్‌ను ఎఫ్ఐహెచ్–ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ హాకీ సెంట్రల్ ప్యానెల్ సభ్యునిగా నియమించారని సీనియర్ హాకీ క్రీడాకారుడు కె.క్రాంతి కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌ను స్థానిక తమ కార్యాలయంలో ఘనంగా సత్కరించామన్నారు. జిల్లాలో తమతోపాటు హాకీని ప్రారంభించిన ఆయన జాతీయ జట్టుతోపాటు పలు టోర్నమెంట్లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారన్నారు. దీంతోపాటు అంతర్జాతీయ హాకీ రిఫరీగానూ కొనసాగుతున్నారన్నారు. జాతీయ క్రీడైన హాకీకి పట్టణంలో ఇప్పటి వరకు మైదానం లేకపోవడంతో హర్షవర్ధన్ దీనిని ఏర్పాటు చేయించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపు నివ్వడం సంతోషకరమన్నారు. ఈ నియామకం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. హర్షవర్ధన్ సతీమణి సత్తె గీత కూడా డబుల్ ఒలింపియన్ అని పేర్కొన్నారు. సీనియర్ హాకీ క్రీడాకారులు ఇఏ. రాజ శేఖర్, జి. మాణిక్యాలరావు, సుభాని, జి.ప్రసన్న కుమార్‌లు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారన్నారు.

నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించాలి

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన, వసతి సౌకర్యాలు కల్పించేలా సంక్షేమ శాఖ అధికారులు నిబద్ధతతో బాధ్యతగా విధులు నిర్వహించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశించారు. మంగళవారం గుంటూరు వైద్య కళాశాల ఎదుట ఉన్న ఏపీఎన్జీవో కల్యాణ మండపంలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ డైరెక్టర్ మల్లికార్జున, ఎక్స్ అఫీషియల్ సెక్రటరీ సత్యన్నారాయణ, ప్రాంతీయ జిల్లాల బీసీ సంక్షేమ అధికారులు, సహాయ బీసీ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వసతి గృహాల నిర్వహణ, రాబోయే టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనపై గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, వెస్ట్ గోదావరి, ప్రకాశం, మార్కాపురం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల వసతి గృహ సంక్షేమ అధికారులతో జిల్లాల వారీగా, వసతి గృహాల వారీగా మంత్రి సమీక్ష నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల్లో సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారు ఉత్తమమైన మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇద్దరు చిన్నారులతో మహిళ అదృశ్యం

మంగళగిరి టౌన్ : ఓ వివాహిత ఇద్దరు బిడ్డలతో అదృశ్యమైన ఘటన మంగళగిరి మండలం యర్రబాలెంలో మంగళవారం చోటు చేసుకుంది.తిరుపతికి చెందిన బోయ నానికి లక్ష్మి అనే మహిళతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా యర్రబాలెంలో నివాసముంటున్నారు. భర్త నాని డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. భార్య లక్ష్మి గత కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తన ఇద్దరు బిడ్డలతో అదృశ్యమైంది.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానది దిగువ ప్రాంతంలో మంగళవారం మృతదేహం ఉన్నట్లు మత్స్యకారులు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ వీరేంద్రబాబు సంఘటనా స్థలానికి వెళ్లి రైల్వే బ్రిడ్జి మూడవ పిల్లర్ కింద నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడి శరీరంపై బ్లాక్ కలర్ ప్యాంటు మాత్రమే ఉంది. మృతుడి చేతిపై పర్వీన్ అని రాసి ఉందని, మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉండవచ్చని, ఎవరైనా గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మైనార్టీల ఆస్తులకు రక్షణ లేకపోవడం దారుణం

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా

గుంటూరు వెస్ట్: ముస్లిం మైనారిటీలకు చెందిన అంజుమన్ ఆస్తులను ప్రభుత్వం ఇతరులకు కట్టబెట్టడం దారుణమని వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు.

■ నూరిఫాతిమా మాట్లాడుతూ అంజుమన్ ఆస్తులను కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు.

■ నగరంలో విలువైన భూమిని ముస్లింల అభ్యున్నతి కోసం ఉపయోగించాలని ఎన్నోసార్లు చంద్రబాబు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోకపోగా ఇప్పుడు తీవ్ర అన్యాయానికి పాల్పడుతుందన్నారు.

■ రానున్న ఎన్నికల్లో చంద్రబాబు సర్కార్ తప్పక అనుభవిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కటి కూడా తమ వర్గాలకు ఉపయోగపడే పనులు చేయలేదని తెలిపారు. అయితే తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని, దీనిని ఇంతటితో వదిలేది లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఫర్జానా, రాష్ట్ర మైనారిటీ విభాగం జాయింట్ సెక్రటరీ అఫ్సర్, తూర్పు నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు లియాఖత్, ముస్లిం సమైక్య వేదిక నాయకులు అబ్దుల్ కలాం, మౌలా బేగ్, జిల్లా యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ సూరజ్, జిల్లా యువజన విభాగం సెక్రటరీ ఉమర్ ఫరూక్, జిల్లా కార్మిక విభాగం సెక్రటరీ షౌకత్ అలీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న నూరిఫాతిమా

విద్యుత్ అదాలత్‌లతో సమస్యల పరిష్కారం

సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

కొరిటెపాడు(గుంటూరు): ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో ఉన్న ఏడు సర్కిల్స్‌లో అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) పనిచేస్తోందని సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. గుంటూరు–పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ సమావేశ మందిరంలో మంగళవారం విద్యుత్ అదాలత్ జరిగింది. అదాలత్‌లో 20 మంది విద్యుత్ వినియోగదారులు వివిధ రకాల సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వాటిలో 19 మంది సమస్యలను తక్షణమే పరిష్కరించారు. ఈ సందర్భంగా విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, ఒంగోలు, పల్నాడుతో పాటు సీఆర్‌డీఏ సర్కిళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సర్కిళ్ల పరిధిలో ఉన్న వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు సీజీఆర్ఎఫ్ పని చేస్తోందన్నారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు సుమారు వెయ్యికి పైగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఐదు సమస్యలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, మిగిలిన వాటిని పరిష్కరించామని వెల్లడించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు డి.కృష్ణనాయక్, ఆర్థిక సభ్యులు కె.కృష్ణ, స్వతంత్ర సభ్యులు ఏ.సునీత, గుంటూరు పర్యవేక్షక ఇంజనీర్ సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న విక్టర్ ఇమ్మానుయేల్, కృష్ణనాయక్, రమేష్ తదితరులు

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యునిగా డాక్టర్ జి. నందకిషోర్

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పాలక వర్గం సభ్యులకు సోమవారం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎన్నికలలో గుంటూరు ఐఎంఏ శాఖకు చెందిన డాక్టర్ జి.నందకిషోర్ సభ్యునిగా ఎన్నికయ్యారు. 13 మంది సభ్యుల ఎంపికకు మొత్తం 84 మంది వైద్యులు పోటీపడ్డారు. ఆన్‌లైన్‌లో ఎన్నికలు జరగగా అత్యధిక ఓట్లు సాధించి ఎన్నికైన 13 మందిలో డాక్టర్ నందకిషోర్ ఒకరు. 30 వేల మందికి పైగా వైద్యులు ఈ ఎన్నికలలో పాల్గొన్నారు. గతంలో డాక్టర్ నందకిషోర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ కార్యదర్శిగా, అధ్యక్షునిగా పనిచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ సభ్యునిగా వైద్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎన్నిక పట్ల ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్, కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ డి.అమర్, పలువురు సీనియర్ వైద్యులు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల కు రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర బాబు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

డాక్టర్ జి. నందకిషోర్‌కు ఎన్నిక పత్రం అందిస్తున్న కె.వి.ఎన్. చక్రధర బాబు

రేపు మిర్చి యార్డు కార్మికుల సమ్మె

కొరిటెపాడు(గుంటూరు): ఈ నెల 12వ తేదీన జాతీయ సమ్మెలో భాగంగా మిర్చి యార్డులోని అన్ని కార్మిక సంఘాలు సమ్మెకు దిగుతున్నట్లు నాయకులు తెలిపారు. దీనిలో భాగంగానే మిర్చి యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి చంద్రికకు మంగళవారం అన్ని సంఘాలు కలిపి సమ్మె నోటీస్ అందజేశాయి. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 'కార్మిక కోడ్'ల పేరుతో ఇప్పటివరకు ఉన్న చట్టాలను నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల సంక్షేమం కోసం ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వ నియంత్రణలో ఉండే వ్యవసాయం, మార్కెటింగ్ వ్యవస్థ స్థానంలో ప్రైవేట్ మార్కెటింగ్‌కు అవకాశం కల్పిస్తూ చట్టాలు మారుస్తున్నారని, దీంతో ప్రస్తుత మార్కెటింగ్ వ్యవస్థలో ఉన్న రైతులు, కార్మికులు, ఉద్యోగులకు చివరకు చిన్న వ్యాపారస్తులకు కూడా నష్టమేనని తెలిపారు. పై సమస్యల పరిష్కారానికై గురువారం మిర్చి యార్డులో పనిచేసే అన్ని రకాల ముఠా కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో భాగస్వాములు అవుతున్నట్లు తెలిపారు. 12వ తేదీన సమ్మె కారణంగా ఎలాంటి లావాదేవీలు జరగవు కాబట్టి రైతులు ఎవరూ మిర్చి బస్తాలు తీసుకురావద్దని తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో మిర్చి యార్డు ఎగుమతి, దిగుమతి, కాపలా ముఠా కార్మిక సంఘాల నాయకులు మర్రి శ్రీనివాస్, నాగ గౌడ్, వేమెన్స్ అసోసియేషన్ నాయకులు బాబు, కృష్ణారెడ్డి, గుంటూరు జిల్లా కోల్డ్ స్టోరేజ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గోవింద రావు తదితరులున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ.
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank.in

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్ / కార్పొరేషన్ బ్యాంక్ ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. ఇప్పుడు ఈ ఖాతాలు అసెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ కు ... [illegible] ... రూల్స్, 2002 నందలి రూల్ 8 & 9 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ... [illegible] ... అఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్, విజయవాడ వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా ది. 13-03-2026న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేదీ, రిజర్వు ధర, ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.

ఇ-వేలం తేది & సమయం : 13-03-2026, మ॥ 12.00గం. నుండి సా॥ 05.00 గం. వరకు
(10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపులతో)

1) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1) మెస్సర్స్ లీలామృత కాటన్స్, ప్రొప్రయిటర్ : శ్రీ మదన వెంకటప్పరెడ్డి, డి.నెం. 8-216-9/2 అనంతవరపాడు రోడ్, ఏటుకూరు, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ - 522017. 2) శ్రీ మదన వెంకటప్పరెడ్డి (ప్రొప్రయిటర్), హెచ్.నెం. 4-22-68, కొరిటెపాడు, చైతన్యపురి, 2వ లేన్, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ - 522007. 1. శ్రీ కంది సంజీవరెడ్డి, తండ్రి : సుబ్బారెడ్డి, డి.నెం. 21ఎ, రామాలయం దగ్గర, రెడ్డిపాలెం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ - 522509. 2. శ్రీమతి మదన మల్లేశ్వరి, డి.నెం. 4-22-68, కొరిటెపాడు, చైతన్యపురి 2వ లేన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522007
బకాయి మొత్తం : తేది. 31.12.2025 నాటికి రూ. 1,56,67,858.59 పై. (... [illegible] ...) మరియు కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : శ్రీ మదన వెంకటప్పరెడ్డి, తండ్రి : అంకిరెడ్డి గారి పేరిట గుంటూరు సిటీ, కొరిటెపాడు డోర్ నెం. 189/ఎ, డోర్ నెం. 4-2-68, 2వ లేన్ చైతన్యపురి వద్ద 187.00 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఆస్తి. సరిహద్దులు: తూర్పు : ... [illegible] ... దక్షిణం : కుర్ర సుబ్బారెడ్డి గారి స్థలం.
కాంటాక్ట్ : శ్రీ టి. ధీరజ్ (డీలింగ్ ఆఫీసర్) : +91 9025349714
రిజర్వు ధర : రూ. 87,38,000/- | ధరావత్తు : రూ. 8,73,800/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 87,380/-

2) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1) మెస్సర్స్ రావు ఎంటర్‌ప్రైజెస్, డి. నెం: 4-20-36/3, ఫ్లాట్ నెం: బి1, పయనీర్ ప్రెస్టీజ్ అపార్ట్‌మెంట్, సిద్ధార్థ నగర్, కొరిటెపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522007. 2. శ్రీ పెద్ది సాంబశివ రావు, డి. నెం: 4-20-36/3, ఫ్లాట్ నెం. బి1, పయనీర్ ప్రెస్టీజ్ అపార్ట్‌మెంట్, సిద్ధార్థ నగర్, కొరిటెపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522007. 3. మరణించిన శ్రీ పెద్ది మల్లికార్జునరావు గారికి గల చట్టపరమైన వారసులచే ప్రాతినిధ్యం వహిస్తుంది, డి.నెం. 3-28-18/81, 7వ లైన్, నాగార్జున నగర్, బృందావన గార్డెన్స్, పట్టాభిపురం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.
బకాయి మొత్తం : ది. 31-12-2025 నాటికి రూ. 3,22,13,337.00 (... [illegible] ...) మరియు కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ఎన్.హెచ్-5, బై-పాస్ రోడ్డు, హిందుస్తాన్ ... [illegible] ... డి. నెం. 1204, పట్టా నెం. 503 లో గల ఎకరా 5.00 సెంట్ల విస్తీర్ణంలో నుండి 6921.20 చ॥గ॥లు లేదా ఎకరా 1.43 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ పట్టణ నివాస స్థలానికి చెందిన యావదాస్తి. ... [illegible] ... గుంటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 12.10.1981 తేదీన ... [illegible] ... 10865/1981 ప్రకారం. గూగుల్ కోఆర్డినేట్లు: 17.080639, 80.623417
కాంటాక్ట్ : శ్రీ టి. ధీరజ్ (డీలింగ్ ఆఫీసర్) : +91 9025349714
రిజర్వు ధర : రూ. 2,21,66,000/- | ధరావత్తు : రూ. 22,16,600/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 2,21,660/-

3) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1) మెస్సర్స్ లక్ష్మీ గణేష్ కాటన్స్, ప్రొప్రయిటర్ : శ్రీ వంగా శ్రీనివాసరెడ్డి, డి.నెం. 24-38-56/3, ఆర్. అగ్రహారం, ఏటుకూరు మెయిన్ రోడ్, గుంటూరు - 522003, ఆంధ్రప్రదేశ్. 2) శ్రీ వంగా శ్రీనివాసరెడ్డి, తండ్రి : శ్రీ నాగరెడ్డి, డి.నెం. 4-23, వలంరెడ్డి పాలెం, కొప్పర్లగడ్డ, గుంటూరు - 522034, ఆంధ్రప్రదేశ్. 3) శ్రీమతి మదన మల్లేశ్వరి, భర్త : వెంకటప్పరెడ్డి, డి.నెం. 4-22-68, చైతన్యపురి, 2వ లేన్, కొరిటెపాడు, గుంటూరు - 522007, ఆంధ్రప్రదేశ్. 4) శ్రీ మదన వెంకటప్పరెడ్డి, తండ్రి : అంకి రెడ్డి, డి.నెం. 4-22-68, చైతన్యపురి, 2వ లేన్, కొరిటెపాడు, గుంటూరు - 522007, ఆంధ్రప్రదేశ్.
బకాయి మొత్తం : ది. 31-12-2025 నాటికి రూ. 95,89,015.45 (... [illegible] ...) మరియు కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : ... [illegible] ... డి.నెం. 137/1 వద్ద మొత్తం ఎకరా 6.48 సెంట్ల విస్తీర్ణంలోని భూమి నందు ప్లాట్ నెం. 45కి చెందిన 246 చ॥గ॥ల ఖాళీ స్థలం. సరిహద్దులు: తూర్పు: 30 అ॥ వెడల్పు రోడ్డు – 37 అ॥లు, దక్షిణం : ప్లాట్ నంబర్ 44 ఆస్తి – 60 అ॥లు, పడమర : ... [illegible] ... ప్లాట్ నంబర్ 30 – 37అ॥లు, ఉత్తరం: ప్లాట్ నంబర్ 46 ఆస్తి – 60 ఈ సరిహద్దుల మధ్య 246 చ॥గ॥ల విస్తీర్ణం లేదా 205.68 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలంలో ఉన్న ఆస్తి.
కాంటాక్ట్ : శ్రీ టి. ధీరజ్ (డీలింగ్ ఆఫీసర్) : +91 9025349714
రిజర్వు ధర : రూ. 83,64,000/- | ధరావత్తు : రూ. 8,36,400/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 83,640/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://baanknet.com మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ : https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx నందు చూడగలరు. అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం Mail ID: arb.vijayawada@unionbankofindia.bank.in ద్వారా సంప్రదించవచ్చు.
తేదీ : 09-02-2026 అధీకృత అధికారి,
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ ఎపి-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 04.03.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 04.03.2026, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేదీ: 04.03.2026, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 04.03.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరచి జమచేయాలి.

వ. నెం	ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయడమైనది)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	చంద్రమౌళీనగర్ బ్రాంచ్, గుంటూరు మెస్సర్స్ శ్రీ సాయి దివ్య కాటన్స్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ కె.శ్రీనివాసులు. తేది 07.01.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 6,55,08,914.12/- + వడ్డీ + ఇతర ఖర్చులు	గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, చిలకలూరిపేట సబ్-డిస్ట్రిక్ట్, చిలకలూరిపేట మున్సిపల్ ఏరియా, పురుషోత్తపట్నం గ్రామం, డి.నెం. 362/1ఎన్, డాక్యుమెంట్ నెం. 179/2013, తేది.11.01.2013 ప్రకారం శ్రీ కె శ్రీనివాసులుకి చెందిన 968.00 చ॥గ॥లు ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.	రూ. 20.47 లక్షలు	రూ. 2.047 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 25.02.2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com
తేది: 09.02.2026, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ITR/ Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి. 7406393937.

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం ✆ 83338 33368

WANTED

■ Technical Skills Nerchukoni Job Lo Set Avvali Anukone Vallaku Sadavakasam. Training Period 1 Month if you are Ready to Join Job After Course. No Iterview. More details Contact: 8712625322. in between 8 AM to 9 AM Limited Seats Only.

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665

■ గుంటూరు వాసవి కాంప్లెక్స్ ఎదురు ఆఫీసు నందు పనిచేయుటకు లేడీ వర్కర్స్ మరియు బాయ్స్ కావలెను. వ: 25 సం॥ ఆకర్షణీయమైన జీతం. Ph: 99899 29196

■ MNC కంపెనీల్లో రిసెప్షనిస్ట్, టెలికాలర్స్ కంప్యూటర్ ఆపరేటర్స్, సూపర్వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ బాయ్స్, హెల్పర్స్ Q: 10th-PG, జీ: 10-25 వేలు. ✆ 79939 76590

■ విజయవాడ, గుంటూరు ప్రాంతాలలో పేషంట్లని, పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కాంపౌండర్లు, నర్సులు (M/F) కేర్‌టేకర్స్ కావలెను. Sal: 24K. వాట్సప్ / కాల్. ✆ 98850 25559, 91608 35559

■ నరసరావుపేట దగ్గర ప్రముఖ ఆక్వా కంపెనీలో పనిచేయుటకు బాయిలర్ ఆపరేటర్ కావలెను. ITI / డిప్లొమా ఎలక్ట్రికల్ క్వాలిఫికేషన్ కలిగిన యువకులు కావలెను బయోడేటా పంపవలసిన mail.id admin@valvin.in సంప్రదించండి: ✆ 9618157339 /96639 09856 / 9441484802

■ ప్రముఖ స్కూల్స్ లో డేటా ఎంట్రీ & అటెండర్స్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను Contact ✆ 8143807128/ 9030928103

■ ప్రభుత్వ గుర్తింపు పొందిన సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.జీ. 10,000+ అడ్వాన్స్5,000+కమీషన్5,000(ప్రతి కనెక్షన్ కు) నెలకు కనీసం 5 కనెక్షన్లు టార్గెట్. ఆదాయం: 10,000 + 20,000 = 30,000 (సుమారు) నెలకు. డిగ్రీ/ITI/డిప్లొమా/ఇంటర్(P/F) విద్యార్థులు, LIC ఏజెంట్లు & ఆసక్తిగల వారు కూడ అర్హులు. ఇంటర్వ్యూ: 11.02.2026 to 12.02.2026వరకు, 9A.M-4P.Mవరకు,స్థలం:A/501, Prime Galaxy, Tadepalle, Dolas Nagar, Mangalagiri, Gutur Dist-522502.9618209171, 7842949608.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
[illegible]

క్లుప్తంగా

జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చేయాలి

మంగళగిరి టౌన్: ఈనెల 14, 15 తేదీల్లో జరుగనున్న 34వ జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చేయాలని నాస్తిక సమాజం సభ్యులు స్టాలిన్ పిలుపునిచ్చారు. మంగళగిరి మండలం నిడమర్రులోని చార్వాక ఆశ్రమంలో జాతీయ నాస్తికమేళా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని చీకటి యుగాలవైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోందని, అన్నివైపుల నుంచి శాస్త్ర విజ్ఞానంపైనే నేడు తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో శాస్త్ర విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ప్రగతిశీల శక్తులు తమ కార్యాచరణను పదునెక్కించాలని పేర్కొన్నారు. రెండు రోజులు జరిగే ఈ నాస్తిక మేళాలో భౌతిక వాదానికి సంబంధించిన ఉపన్యాసాలు, వివిధ రూపాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నాస్తిక సమాజం సభ్యులు షేక్ జిలాని బేగం, కోటేశ్వరరావు, జయబాబు, సుధాకర్, రవి, పార్థసారథి, ఫణికుమార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు క్యాలెండర్ అందజేత

తాడేపల్లి రూరల్: శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన నూతన క్యాలెండర్‌ను మంగళవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్‌కు ఉండవల్లిలోని ఆయన నివాసంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సేవా ట్రస్ట్ సభ్యులు అందజేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారి గ్రామోత్సవం మంగళగిరి మిద్దె సెంటర్ వరకు వస్తుందని, ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ప్రసాదాల పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాలని లోకేష్‌ను సభ్యులు కోరారు. ట్రస్ట్ సభ్యులు ఆరుద్ర భూలక్ష్మి, పణిదపు శ్రీనివాసరావు, భక్తబృందం ప్రతినిధులు గాలి ప్రతాపరెడ్డి, దినేష్, భానుప్రసాద్, వెంకట నరసింహారావు, అర్చకస్వామి దగ్గుపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

ఎన్నారై కళాశాలలో విద్యార్థులకు అనలిటిక్స్ శిక్షణ

మేడికొండూరు: పేరేచర్ల సమీపంలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డేటా అనలిటిక్స్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐసీటీ అకాడమీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.దినకర్ రెడ్డి, రాష్ట్ర ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డి.ప్రశాంత్‌లు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఐసీటీ అకాడమీ ద్వారా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో అందిస్తున్న డేటా అనలిటిక్స్ శిక్షణ ద్వారా విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని డాక్టర్ ఎస్.దినకర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనా, బోధనేతర సిబ్బంది, కళాశాల ఏఓ సీతారామయ్య పాల్గొన్నారు.

రికార్డు సాధించిన ఆక్వా డెవిల్స్ గౌరవ సభ్యురాలు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి గల ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సభ్యురాలు క్వీని విక్టోరియా గంధం, ఆమె కుమారుడు స్టీఫెన్‌కుమార్‌లు ఈతలో అరుదైన రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడారు. క్వీని విక్టోరియా, ఆమె కుమారుడు స్టీఫెన్ కుమార్‌లు న్యూజిలాండ్‌లోని కుక్స్ స్ట్రెయిట్ స్విమ్‌లో పాల్గొని 27.4 కిలో మీటర్లు ఈతను పూర్తిచేసి ప్రపంచంలోనే మొదటి ద్యూయోగా మరో రికార్డు నెలకొల్పారని తెలిపారు. స్విమ్ పైలెట్ ఎర్సిన్ గ్రాంట్ ఆర్చర్డ్ సూచనలతో క్రూ సభ్యుడు ఆరన్ బ్లాక్‌మోర్, ఎన్‌జెడ్ఓఎస్ఏ క్రిస్టన్ పర్యవేక్షణలో ఈనెల 9న దక్షిణ న్యూజిలాండ్‌లోని పెరానో హెడ్ నుంచి ఒవిరోబే (ఉత్తర న్యూజిలాండ్)వరకు ఈత కొట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ రమేష్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ వ్యవస్థ చట్టరీత్యానేరం

మేడికొండూరు: వెట్టిచాకిరీ వ్యవస్థ చట్టరీత్యా నేరమని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ డీబీఆర్సీ ప్రతినిధులు నిర్మల అన్నారు. వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్న జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పిలుపుమేరకు ప్రచార ఉద్యమం రెండో రోజు మంగళవారం పేరేచర్లలో నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు.

రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్న ప్రభుత్వం

- హిందువుల మనోభావాలను గాయపరచడం సరికాదు
- ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం అబద్ధాలు మానుకోవాలి
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త వేమారెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త వేమారెడ్డి

మంగళగిరి టౌన్: తిరుమల లడ్డూ వ్యవహారంతో చంద్రబాబు రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయని.. రాష్ట్రాన్ని రావణకాష్టం చేసేందుకు ప్రయతిస్తున్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావులు ధ్వజమెత్తారు. మంగళగిరి మండలం ఆత్మకూరు బైపాస్ రోడ్డులో గల పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం తిరుమల లడ్డూ వ్యవహారంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా కూటమి నాయకులు తిరుమల లడ్డూ కల్తీ పేరుతో భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా లేక వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల లడ్డూ తయారీలో జంతు కొవ్వు కలిసిందని వ్యాఖ్యలు చేసి ఆలయ ప్రతిష్టను దిగజార్చేలా చేశారని మండిపడ్డారు.

దేవుడితో బాబు రాజకీయాలు..!

సీబీఐ, సిట్ చార్జిషీట్‌లో తప్పని తేల్చినా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అబద్ధాన్ని నిజం చేయడమే లక్ష్యంగా మరిన్ని తప్పులు చేస్తున్నారని విమర్శించారు. దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయవద్దని సూచించారు. ఎవరైనా ప్రభుత్వంపై మాట్లాడితే వారిపై కేసులు పెట్టి జైల్లో పెట్టడం అలవాటైపోయిందని విమర్శించారు. సీబీఐ చార్జిషీటులో పొందుపరిచిన బోలేబాబా డైరీకి కూడా చంద్రబాబు సీఎంగా ఉండగానే టీటీడీకి అనుమతి లభించిందని గుర్తుచేశారు. విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వాన్ని కోరితే దానిని దాటవేస్తూ మరో స్టోరీ క్రియేట్ చేస్తున్నారని ఆరోపించారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లావద్దని.. సాక్షాత్తూ సుప్రీంకోర్టు చెప్పినా ఈ ప్రభుత్వం అలానే మాట్లాడడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు.

అబద్ధపు ప్రచారాలు..

ప్రజలకు ఇవ్వాల్సిన పథకాలను తప్పుదారి పట్టించేందుకు ఇలాంటి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని రోజుకో రకంగా ప్రచారం చేస్తూ ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. భక్తుల మనోభావాలను సంబంధించిన సున్నితమైన అంశంపై రాజకీయాలు చేస్తూ లబ్ధిపొందాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం అబద్ధాలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలు బుద్ధిచెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని పలువురు నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సెంటర్ వద్ద నుంచి గౌతమ బుద్ధ రోడ్, కొత్తపేట, గాలిగోపురం సెంటర్ మీదుగా సీఐటీయూ, ఏఐటీయూసీ, వైఎస్సార్‌టీయూసీ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఆర్.శ్రీనివాసరాజు, నక్కా నాగరాజు, వివిధ సంఘాల నాయకులు బాలాజీ, కమలాకర్, కోటేశ్వరరావు, ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, వీవీ జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: దేశవ్యాప్తంగా గురువారం జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు మంగళవారం సమ్మె పోస్టర్‌లను ఆవిష్కరించారు. ముస్లీం షాదీఖానాలో జరిగిన సమావేశంలో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, యోగేశ్వరరావు, శివయ్య, సుబ్బారావు, శివనాగేశ్వరమ్మ, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ

తాడేపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు తాడేపల్లిలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్ నగర్ నుంచి బయలుదేరిన ర్యాలీ ఎమ్మార్వో కార్యాలయం, సాయిబాబా ఆలయం మీదుగా ఉండవల్లి సెంటర్, కొత్తూరు, బైపాస్‌రోడ్ ప్రాంతాల్లో సాగింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామారావు, శబరి, వెంకన్న, బర్నబాస్, వైఎస్సార్‌టీయూ నాయకులు రత్నరాజు, వెంకటయ్య, ఏసీసీ కార్మికులు యెహోషువా, ఇశ్రాయేల్, సుభాని పాల్గొన్నారు.

కుంచనపల్లిలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లెకృష్ణ

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. వడ్డేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పల్లె కృష్ణ, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కే పున్న, మౌలాలి, నాగబాబు, శ్రీను, జమీర్, ఫణి, వెంకటేష్, రమేష్‌బాబు పాల్గొన్నారు. కుంచనపల్లిలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి మేకల డేవిడ్, సంఘం మండల నాయకురాలు కృష్ణతులసి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

మట్టి తవ్వకాలు చేసిన భూమి

ఫిరంగిపురం: తమకు 2005లో ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో అక్రమంగా మట్టి తవ్వుతున్నారని.. దానిని నిలిపివేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమీనాగ్రామ పంచాయతీ శివారులో 2008లో ప్రభుత్వం సర్వే నంబరు 545–46–5లో పి.సువార్తకు 50 సెంట్లు, కె.తామాసమ్మకు 50 సెంట్లు డీకే పట్టా, పాసు పుస్తకాలు ఇచ్చారు. నిరుపేద ఎస్సీలు కావడంతో సాగు చేసుకునేందుకు డబ్బులు లేక 2013లో వాటిని ఇద్దరు వ్యక్తుల వద్ద తాకట్టు పెట్టారు. పాసు పుస్తకాలు అడుగగా కనిపించడంలేదంటూ చెబుతుండటంతో వారు వేరొకరి వద్ద తాకట్టు పెట్టినట్లుగా తెలిసిందన్నారు. ఇటీవల గుంటూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సీహెచ్ రమేష్ అనే వ్యక్తి పాసు పుస్తకాలు కొనుగోలు చేశానని చెబుతూ.. అవి కావాలంటే రూ.15 లక్షలు చెల్లించాలని చెప్పారన్నారు. అదే భూమిలో గతనెల తమ సర్వే నంబరు సమీపంలో ఉన్న 545–25, 545–21 భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తుండటంతో ప్రజలు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ వారు కేసు నమోదు చేశారన్నారు. తరువాత రమేష్ అతడి భాగస్వాములు గతనెల 545–46–5లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు చెప్పారు. మట్టి తవ్వకాలు ఆపేందుకు వెళ్లిన వారిని వారి మనుషులు అడ్డగించారని.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని పేర్కొన్నారు. తమ భూమిలో అక్రమంగా చేస్తున్న మట్టి తవ్వకాలు నిలిపివేయాలని.. తమకు వారి నుంచి రక్షణ కల్పించాలంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితులు పి.లూర్దురాజు, కె.శ్రీనివాసులు తెలిపారు.

ఇంటిపన్ను వసూలులో సర్వర్ సమస్య

ఫిరంగిపురం: త్వరితగతిన పన్నుల వసూలు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణ పంచాయతీ యాప్‌లో సర్వర్ సమస్య తలెత్తుతుంది. పన్ను నమోదు చేసేందుకు సర్వర్ రాకపోవడంతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికి తిరిగి ఈ యేడు ఇంటి పన్నులు వసూలు చేసేందుకు ఫిరంగిపురం పంచాయతీ పరిధిలో మూడు టీంలుగా ఏర్పడి వసూలు చేస్తున్నారు. కాగా ప్రతిసారి సర్వర్ మొరాయిస్తుండటంతో ఒక్కో ఇంటివద్దనే ఎక్కువ సమయం పడుతోంది. దీంతో పన్నుల వసూలులో ఆలస్యం అవుతోంది. గతంలో రోజు సుమారు 100 ఇళ్ల వద్దకు వెళ్లి పన్ను వసూలు చేసే పరిస్థితి.. నేడు సర్వర్ రాక 40 నుంచి 50 ఇళ్లకే పరిమితం అయ్యే పరిస్థితి నెలకొందని సిబ్బంది చెబుతున్నారు. పన్ను చెల్లించినా రసీదు ఇవ్వాలంటే రెండు లేదా మూడు రోజులు సమయం పడుతుండటంతో పన్నుదారులు ఇక్కట్లు పడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి సర్వర్ మొరాయించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మంగళగిరి టౌన్: పట్టణ పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. నగర పరిధిలోని భార్గవపేట, తెనాలి రోడ్, వడ్లపూడి సెంటర్, షరాఫ్ బజార్, బాప్టిస్ట్‌పేట, కొప్పురావు కాలనీ, ఇస్లామ్‌పేట, మార్కెట్ సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం

దుగ్గిరాల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచికలపూడి గ్రామానికి చెందిన దున్నా వివేక్‌బాబు(28) గతంలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేసేవారు. ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో అప్పులు అధికమవ్వడం.. అప్పు ఇచ్చిన వాళ్లు ఒత్తిడి తీసుకురావడంతో వివేక్‌బాబు సోమవారం రాత్రి పురుగు మందు తాగారు. వైద్యం నిమిత్తం వివేక్‌ను తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో మృతిచెందారు. మృతుడి భార్య మాధురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెంకటరవి పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై నిరసన

సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు



సెల్ టవర్ పైకెక్కిన రాజు

మేడికొండూరు: అధికారుల నిర్లక్ష్యం ఓ సామాన్యుడిని ఆత్మహత్యాయత్నానికి పురిగొల్పింది. తమ సమస్యను పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో విసుగు చెందిన బాధితుడు న్యాయం కోసం సెల్ టవర్ ఎక్కి మంగళవారం నిరసన తెలిపాడు. బాధితుడి వివరాల ప్రకారం.. కొరప్రాడుకు చెందిన పుల్లగూర చిన్న రాజు తన ఇంటి ముందు ఉన్న స్థలం విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. తన స్థలాన్ని ఇతరులు ఆక్రమించుకున్నారని.. రెవెన్యూ అధికారులు వచ్చి కొలతలు వేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ గత నాలుగు రోజులుగా మేడికొండూరు తాహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు సెల్ టవర్ ఎక్కి ఆక్రమణల నుంచి కాపాడకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వాపోయాడు. తన మరణానికి తాహసీల్దార్ కారణమని వీడియో విడుదల చేశారు. సమాచారం తెలుసుకున్న తాహసీల్దార్, మేడికొండూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాజును కిందకు దించారు. సంబంధించిన పత్రాలను తీసుకొని వస్తే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

కేఎల్‌యూలో ఒత్తిడి నియంత్రణపై అవగాహన

డాక్టర్ శివప్రసాద్ రెడ్డిని సత్కరిస్తున్న హెచ్ఓడీ డాక్టర్ ప్రవీణ్ కృష్ణ

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సీఎస్ఐటీ, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆధునిక జీవనంలో ఒత్తిడి నియంత్రణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సెంధిని సిటీ హాస్పిటల్ నిద్ర, అలర్జీ, శ్వాసకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, కన్సల్టెంట్ క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు డాక్టర్ కె.రామకుమార్‌లు విచ్చేసి మాట్లాడారు. నేటి ఆధునిక జీవనంలో ఒత్తిడి ప్రతి వ్యక్తి జీవితంలో విడదీయలేని అంశంగా మారిందని అన్నారు. అధిక ఒత్తిడి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ధ్యానం, యోగా, ప్రాణాయామం, నిత్య వ్యాయామం వంటివి ఒత్తిడికి వైద్యం వంటివి అని అన్నారు. అనంతరం డాక్టర్ శివప్రసాద్ రెడ్డిని డాక్టర్ ప్రవీణ్ కృష్ణ, డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.ప్రవీణ, విభాగాధిపతి డాక్టర్ ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మెడల్స్ సాధించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రస్థాయి అండర్–15, 17 బాలబాలికల రెజ్లింగ్ పోటీల్లో తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మంగళవారం తెలిపారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో చిత్తూరు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–15, 17 బాలబాలిక విభాగంలో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులు శృంగారపాటి గోపిచంద్ 73 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, అండర్–15, 17 విభాగంలో ఆర్.పవన్ నాయక్ (57 కేజీలు) సిల్వర్ మెడల్‌ను సాధించారని తెలిపారు. బాలికల విభాగంలో ఎ.లిఖిత (58 కేజీలు) సిల్వర్ మెడల్, కె.ప్రియదుర్గ (48 కేజీలు) సిల్వర్ మెడల్, అండర్–15 విభాగంలో ఎం.భువనేశ్వరిబాబు బ్రాంజ్ మెడల్ (45 కేజీలు), అండర్–17 విభాగంలో యు.శశిచరణ్ (66 కేజీలు) బ్రాంజ్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, పి.సతీష్‌కుమార్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ చినరంగా షరీఫ్, ఈపూరి కోటయ్య, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ బషీరూన్, గ్రామస్తులు అభినందించారు.

చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరంలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు విషయమై కేసు నమోదు చేసిన 24 గంటల్లో తాడేపల్లి పోలీసులు కేసును ఛేదించారు. మంగళవారం చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఘటనపై నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు వివరాలు వెల్లడించారు. వడ్డేశ్వరానికి చెందిన చిరుతోటి సుభాష్ ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు అలవాటుపడి అప్పులపాలు కావడంతో చైన్‌స్నాచింగ్ పద్ధతిని ఎంచుకున్నారని అన్నారు. దీంతో ఒంటరిగా వెళుతున్న మంగతాయారు మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కువెళ్లారని వివరించారు. కాగా సుభాష్ విజయవాడలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. కేసు ఛేదించడంలో కష్టపడిన సీఐ వీరేంద్ర, ఎస్ఐ షేక్ ఖాజావలి, ఎస్ఐ ప్రదీప్, హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, ప్రసాద్‌లను డీఎస్పీ మురళీకృష్ణ అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

విద్యార్థి విభాగ కమిటీలే కీలకం

నియామక పత్రాలు అందుకున్న విద్యా కమిటీ సభ్యులు

మేడికొండూరు: విద్యార్థి విభాగం కమిటీలు కీలకమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు సంపతి నాగరాజు అన్నారు. తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆదేశాల మేరకు మేడికొండూరు మండల పరిధిలోని గుళ్లపాలెం, విశదల, మందపాడు, మేడికొండూరు, తురకపాలెం గ్రామాలను సందర్శించి కమిటీ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా సంపతి నాగరాజు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి విద్యార్థి విభాగ గ్రామ కమిటీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో టీడీపీ దౌర్జన్యాల అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకునేందుకు అందరూ కంకణబద్ధులుగా కావాలన్నారు. రానున్న రోజులు వైఎస్సార్ సీపీదేనని స్పష్టం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ విద్యార్థి విభాగ కమిటీలే పార్టీకి పునాదులని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు కొరివి అజయ్, మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు షేక్ సైదా, అప్పికట్ల సుమంత్, పిల్లి బాలస్వామి, తలతోటి కిరణ్, సురేష్, పృథ్వీ, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, విద్యావిభాగ కమిటీలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల మంజూరుకు ఆధార్ తప్పనిసరి

గండాలయపేటలో ఆధార్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుగుణమ్మ

మంగళగిరి టౌన్: అర్హులైన వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి అని మంగళగిరి ఎంపీడీవో సుగుణమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని గండాలయపేటలో మంగళవారం జరిగిన ఆధార్ అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ.. గండాలయపేటలోని నిరుపేదలు బతుకుదెరువు నిమిత్తం వలసలు వెళ్లడం కారణంగా ఆధార్ కార్డులు మంజూరు కాలేదేమోనని భావిస్తున్నామన్నారు. మహిళలు గర్భిణిలుగా ఉన్నప్పుడే ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు అవసరం తెలిసి ఉండాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు లేని వారికి కొత్త ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు తమవంతు కృషిచేస్తామన్నారు. జనన ధృవీకరణ పత్రాలు లేనివారికి వాటిని వెంటనే మంజూరు చేయడంతో పాటు ప్రత్యేక ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భారత్ కేర్ లైఫ్‌లైన్ ఫౌండేషన్ డైరెక్టర్ వంశీరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషోర్, ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ ఆదాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానానికి పచ్చళ్లు అందజేత

వాహనానికి పూజలు నిర్వహిస్తున్న విజయ పికిల్స్ యజమాని రాము

తాడేపల్లి రూరల్: చిర్రావూరులోని విజయ పికిల్స్ నుంచి శ్రీశైలం అన్నదాన సత్రానికి మంగళవారం పచ్చళ్లు పంపిచారు. ఈ సందర్భంగా విజయ పికిల్స్ యజమాని కాటూరి రాము మాట్లాడుతూ.. శ్రీశైలంలో మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారని, వారికి దేవస్థానం తరుపున అన్నపూర్ణ భవన్‌లో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి ఏడాదిలో భాగంగా ఈ ఏడాది కూడా తమవంతు సహకారంగా తమ సంస్థ నుంచి సుమారు రూ.11.76 లక్షలు విలువచేసే మూడున్నర టన్నులు ఊరగాయ పచ్చళ్లను పంపినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పచ్చళ్ల వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీశైలంకు పంపించారు. కార్యక్రమంలో విజయ పికిల్స్ ఎగ్జిక్యూటివ్ వెంకటరెడ్డి, ప్రతినిధులు ప్రసాద్ ఖాదర్ బాబు, సూపర్‌వైజర్ అశోక్ కుమార్, మాన్యుఫ్యాక్చర్ ఇన్‌చార్జి శాంతి, ప్యాకింగ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజధానిలో నాబార్డ్ బృందం పర్యటన

రాజధానిలో పనుల పురోగతిపై చర్చిస్తున్న నాబార్డ్ బృందం

తాడికొండ: రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించేందుకు నాబార్డ్ ప్రతినిధుల బృందం మంగళవారం రాయపూడిలోని సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయానికి చేరుకుంది. బృందంలోని సభ్యులు కమిషనర్ కె.కన్నబాబును కమిషనర్ చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని కమిషనర్ నాబార్డ్ బృందంలోని సభ్యులతో చర్చించారు. అనంతరం బృందం అమరావతి పర్యటనలో భాగంగా ఎల్‌పీఎస్ జోన్–7, ఎన్–10 రోడ్డు పనులను పరిశీలించింది. రాజధానికి భూములిచ్చిన రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు ఉన్న ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లే అవుట్లలో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు, రహదారి నిర్మాణ పనుల పురోగతిని సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు నాబార్డ్ బృందానికి వివరించారు. ఈ పర్యటనలో నాబార్డ్ బృందం ముంబయి ప్రధాన కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ కె.ఇంకార్సల్, విజయవాడ ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్ సీఆర్ అబువరాజన్, ముంబయి ప్రధాన కార్యాలయం అసిస్టెంట్ మేనేజర్ కార్తిక్, విజయవాడ ప్రాంతీయ కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్ కె.గణేశ్‌కుమార్, ఏపీ సీఆర్డీఏ ఫైనాన్స్–అకౌంట్స్ విభాగ గ్రూప్ డైరెక్టర్ కె.పాలేశ్వరరావు, ఎకనోమెట్రీషియన్ పి.నరేష్‌కుమార్, సీఆర్డీఏ ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సంబంధిత ప్రాజెక్టుల ఇంజినీరింగ్ బృందాలు, అలానే అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏడీసీఎల్) ఇంజినీరింగ్ బృందాలు పాల్గొన్నాయి.

నోటీసు

[illegible] గుంటూరు 4వ [illegible] కోర్టులో
ఐ.ఏ.నెం.682/2023 ఇన్ ఓ.యస్.నెం.173/2022
[illegible]:
కొడవళ్ళ నవీన్ కుమార్. ...పిటీషనరు/ వాది
[illegible]
పుట్టా వెంకటేశ్వర రావు. ...రెస్పాండెంటు/ ప్రతివాది
కు,
పుట్టా వెంకటేశ్వర రావు, తండ్రి.రామకోటయ్య, [illegible] 4–24, [illegible] గ్రామము, మంగళగిరి మండలం. గుంటూరు జిల్లా.
పై నంబరు దావాలోని ఐ.ఏ. పిటీషనులో [illegible] ది.19–02–2026కు వాయిదా వేసినారు. [illegible] ఉ.గం.10–30ని.లకు పై కోర్టు వారియెదుట [illegible] తెలుపు కొనగలరు. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 19–02–2026
కేసానుపల్లి వెంకట శ్రీరామ్ సుబ్బారావు,
పిటీషనరు/ వాది తరపు అడ్వకేట్, గుంటూరు, సెల్:98491 87315

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

పోలీసుల బిల్లులనే వెనక్కి కొడతావా!

- మరోసారి ఇలా చేస్తే ఏదో కేసులో ఇరికిస్తాం
- కర్నూలు ట్రెజరీ ఉద్యోగిని బెదిరించిన త్రీటౌన్ సీఐ శేషయ్య

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'మా బిల్లులు అసంపూర్తిగా ఉన్నా సరే ఆమోదించాల్సిందే. వెనక్కి ఎలా కొడతావు? మరోసారి ఇలా చేస్తే ఏదో కేసులో ఇరికిస్తా' అంటూ ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కర్నూలు ట్రెజరీ ఉద్యోగిని బెదిరించిన వ్యవహారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. 2024లో జరిగిన వినాయక నిమజ్జనం, వివిధ సందర్భాల్లో 1,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఒక్కొక్కరికి రూ.150తో బిర్యానీ పంపిణీ చేసినట్లు కర్నూలు ట్రెజరీ కార్యాలయానికి బిల్లు సమర్పించారు. బిల్లు వెంట జిల్లా ఎస్పీ ఇచ్చిన ప్రొసీడింగ్స్ తప్ప ఇతరత్రా వివరాలు లేవు. బందోబస్తు నిర్వహించిన పోలీసుల పేర్లు కూడా జత చేయలేదు. వివరాలు లేకపోవడంతో బిల్లులను పరిశీలించిన సీనియర్ అకౌంటెంట్ వెనక్కి పంపారు. ఈ విషయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది త్రీటౌన్ సీఐ శేషయ్య దృష్టికి తీసుకెళ్లారు. సీఐ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం పోలీసులు ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్‌కు ఫోన్ చేసి సీఐ గారు వెంటనే స్టేషన్‌కు రమ్మన్నారని చెప్పారు. అందుకు ఆయన నేను రాను, మీరు మా పై అధికారులతో మాట్లాడండని సమాధానమిచ్చారు. దీంతో సీఐ అహం మరింత దెబ్బతినగా.. మంగళవారం ఉదయమే ఇద్దరు పోలీసులను సీనియర్ అకౌంటెంట్ ఇంటికి పంపి 'సార్ రమ్మన్నారు.. పదండి స్టేషన్‌కు వెళ్దాం' అంటూ ఒత్తిడి చేశారు. తాను నిబంధనల ప్రకారమే నడుచుకున్నానని, తనకు కోర్టు పని ఉంది రాలేనని ట్రెజరీ ఉద్యోగి సమాధానం చెప్పారు. అయినా పోలీసులు వినకపోవడంతో కోర్టు నుంచి 11.30 గంటల సమయంలో అకౌంటెంట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్‌లో గంటన్నర నిలబెట్టిన సీఐ.. ఆ తర్వాత 'పోలీసు బిల్లులనే వెనక్కి కొడతావా.. పోలీసులంటే ఏమనుకుంటున్నావు. మరోసారి ఇలా చేస్తే ఏదో కేసులో ఇరికిస్తా. మా బిల్లులు ఎలా ఉన్నా ఆమోదించాల్సిందే. లేకపోతే పోలీసులంటే ఏమిటో చూపిస్తా' అని చిర్రుబుర్రులాడారు. అనంతరం అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ద్వారా సోమవారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసుల బిర్యానీ బిల్లులను ఆమోదింపజేసుకోవడం గమనార్హం.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు అనుయాయులకు కట్టబెట్టే కుట్ర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను టీడీపీ అనుయాయులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో–12 ద్వారా మళ్లీ దళారీ వ్యవస్థను ప్రోత్సహించే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. గతంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల శ్రమ దోపిడీని అరికట్టేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థను తీసుకొచ్చి లక్ష మందికి పైగా చిరుద్యోగులకు రక్షణ కల్పించారని గుర్తుచేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థను బలహీనం చేస్తూ మళ్లీ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలకు ఉద్యోగ నియామకాలను అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇటీవల సమగ్ర శిక్ష విభాగంలో ప్రకటించిన పోస్టులను ఆప్కాస్ ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా.. సగభాగాన్ని ప్రైవేట్ అవుట్ సోర్సింగ్ సంస్థలకు అప్పగించే చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సంక్షేమ శాఖలోని పలు విభాగాల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందన్నారు. ఈ విధానంతో ఉద్యోగులకు ఏడాదిలో 12 నెలలకు బదులుగా 10.5 నెలలకే వేతనాలు చెల్లించే పరిస్థితి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేసి ఆప్కాస్ వ్యవస్థను కొనసాగిస్తూ ఉద్యోగ నియామకాలు ప్రభుత్వం ద్వారానే చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అకాల మరణాల పాలవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉల్లిపాయల మాటున గంజాయి స్మగ్లింగ్

మదనపల్లె టౌన్: ఉల్లిపాయల మాటున గంజాయి తరలిస్తున్న ముఠాను మదనపల్లె తాలూక పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియాకు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో తాలూక సీఐ కళావెంకటరమణ సిబ్బందితో సీటీఎం రోడ్డు, ఎరగానిమిట్టలో సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా, నంబరు లేని లగేజీ ఆటో వచ్చిందన్నారు. అందులో ఉల్లిపాయల బస్తాలు ఉన్నాయని.. వాటి కింద తొమ్మిది బస్తాల్లో గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. మొత్తం 179 కేజీల గంజాయి పట్టుబడగా.. దాని విలువ రూ.44.65 లక్షలు ఉంటుందన్నారు. వెంటనే ఆటో సహా గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని తెలిపారు. పట్టుబడిన నిందితులు స్థానిక చంద్రాకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఆవుల నాగరాజు(23), అతని వదిన ఆవుల సుగుణ(29)తోపాటు గంజాయి సరఫరా చేసిన నిందితులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నలుగురు పరారీలో ఉన్నారని.. వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- తొలిరోజు గవర్నర్ ప్రసంగం
- 14న బడ్జెట్ పెట్టే అవకాశం
- మార్చి 12 వరకూ సమావేశాలు

సాక్షి, అమరావతి: శాసనసభ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. వెలగపూడిలోని అసెంబ్లీ హాలులో ఉదయం 10 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత సభను వాయిదా వేసి బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) సమావేశం నిర్వహించి సభ ఎన్ని రోజులు జరపాలి, ఏ అంశాలపై చర్చించాలనే విషయాలు ఖరారు చేయనున్నారు. 14న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. మార్చి 12 వరకూ సమావేశాలు జరుగుతాయని ఇప్పటికే స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మొత్తం 19 పని దినాల్లో సమావేశాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. బీఏసీ సమావేశంలో చర్చించి దీనికి ఆమోదం తెలపనున్నారు.

కార్యదర్శులతో స్పీకర్ సమావేశం

బడ్జెట్ సమావేశాల సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు పంపాలని ఆదేశించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు నెల రోజులైనా సమాధానాలు రాకపోవడం చూస్తున్నామని ఇకపై అలా జరగకుండా సకాలంలో సమాధానాలు పంపేలా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాల సమావేశాలను నేషనల్ ఈ–విధాన్ కింద డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

మార్చి 5 నుంచి 7 వరకు క్రీడా పోటీలు

అసెంబ్లీ సమావేశాల్లో ఆటవిడుపుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్‌లు, విప్‌లు, మంత్రులు, వివిధ శాఖల అధికారులతో ఈ పోటీల నిర్వహణ సన్నద్ధతపై చర్చించారు. ఇందుకోసం శాసనసభ, శాసన మండలి చీఫ్ విప్‌లు, విప్‌లతో ఒక కమిటీ వేయాలన్నారు. క్రీడా పోటీలను మధ్యాహ్నం నుంచి జరపాలని, సాంస్కృతిక కార్యక్రమాలను చివరి రోజు సాయంత్రం జరపాలని సూచించారు.

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజీ మేడమల్లి

- రాష్ట్రపతి ఆమోద ముద్ర
- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- రెండు మూడు రోజుల్లో ప్రమాణం

సాక్షి, అమరావతి: హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజీ మేడమల్లి నియమితులయ్యారు. ఈ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో అదనపు న్యాయమూర్తిగా బాలాజీ నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి జగన్నాథ్ శ్రీనివాసన్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అదనపు న్యాయమూర్తిగా బాలాజీ రెండు మూడు రోజుల్లో ప్రమాణం చేసే అవకాశం ఉంది. హైకోర్టు న్యాయమూర్తి పోస్టుకు బాలాజీ పేరును సిఫారసు చేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం గత నెలలో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్మానం కేంద్ర న్యాయశాఖ, ప్రధాన మంత్రి కార్యాలయం ద్వారా రాష్ట్రపతికి చేరింది. దీంతో బాలాజీ నియామకానికి రాష్ట్రపతి తాజాగా ఆమోద ముద్ర వేశారు. ఈ నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33కి చేరింది. ప్రస్తుతం హైకోర్టులో 32 మంది న్యాయమూర్తులుండగా, ఇందులో ఆరుగురు అదనపు న్యాయమూర్తులున్నారు.

ఇదీ నేపథ్యం...

బాలాజీ మేడమల్లి వైఎస్సార్ కడప జిల్లా, శేషన్నగారిపల్లికి చెందిన వ్యక్తి. లక్ష్మీనరసమ్మ, సుబ్బయ్య నాయుడు దంపతులకు 1972 మే 29న జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. కుటుంబంలో బాలాజీనే మొదటితరం న్యాయవాది. రాజంపేటలో ప్రాథమిక విద్యను, తిరుపతి శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్ పడాల రామిరెడ్డి లా కాలేజీలో న్యాయ విద్యను అభ్యసించారు. 1998లో హైకోర్టు న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వద్ద వృత్తి జీవితాన్ని ఆరంభించారు. గతంలో ఆయన ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా వ్యవహరించారు. 2018–19 మధ్య కాలంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్నారు. పలు సంస్థలకు, బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరిస్తున్నారు. బాలాజీకి భార్య కళ్యాణి, కుమారుడు సుచంద్రహాస్, కుమార్తె లక్ష్మీశ్వేత ఉన్నారు.

రైతుల ఉసురు తీస్తున్న బాబు సర్కార్

రాష్ట్రంలో రికార్డు స్థాయికి రైతులు, రైతు కూలీల ఆత్మహత్యలు

- గతేడాది 2,865 మంది రైతులు, రైతు కూలీల మరణాలు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కారణంగా రైతులు, రైతు కూలీల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 2024తో పోలిస్తే గతేడాది రాష్ట్రంలో రైతులు, రైతు కూలీల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రైతులకు వ్యవసాయాన్ని పండుగలా మారిస్తే.. దానికి భిన్నంగా కూటమి సర్కారు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఇందుకు నిదర్శనమే పెరుగుతున్న అన్నదాతల బలవన్మరణాలని విచారం వ్యక్తం చేశారు. 'టీడీపీ కూటమి ప్రభుత్వం రైతుల ఆత్మహత్యల్లో రికార్డులు సృష్టిస్తోంది. 2025లో ఏపీలో జరిగిన రైతులు, రైతు కూలీల ఆత్మహత్యలపై పోలీసులు ఓ నివేదిక ఇచ్చారు. ఆ ఏడాదిలో మొత్తం 2,865 మంది రైతులు, రైతు కూలీలు ఆత్యహత్య చేసుకున్నారని లెక్క తేల్చారు. ప్రజలకు పట్టెడన్నం పెట్టే రైతు చనిపోతున్నాడని ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదు. పెట్టుబడి సాయం ఇవ్వపోవడం, కనీసం యూరియా అందించలేకపోవడం, నకిలీ ఎరువులు, విత్తనాల బెడద, ఉచిత పంటల బీమా తొలగించడంతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా వేదనకు గురి చేస్తున్నారు. పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు చనిపోతున్నారు. ఏ రోజూ రైతు విధానాలపైన, రైతులు ఎందుకిలా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సమీక్షించారా?' అని కాకాణి ప్రశ్నించారు.

వ్యవసాయం అంటేనే చంద్రబాబుకు గిట్టదు

'చంద్రబాబుకు వ్యవసాయం అంటే గిట్టదు. ఆయనకు వ్యవసాయంపై అవగాహన లేదు. అందుకే కనీస సమీక్షలు కూడా చేయడం లేదు. రాష్ట్రానికి వ్యవసాయ మంత్రి ఉన్నాడో లేడో కూడా ప్రజలకు తెలియదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాల్ని ఆదుకోవడంతోపాటు వారికి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని అయినా నిలబెట్టుకోవాలి' అని కాకాణి డిమాండ్ చేశారు.

నాడు రైతు పక్షపాతిగా వైఎస్ జగన్

'గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా రైతుల్ని చేయి పట్టుకుని నడిపించారనే విషయాన్ని గర్వంగా చెప్పుకోగలుగుతున్నాం. అప్పట్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి సంబంధించి ఎన్ని సమీక్షలు పెట్టారో, రైతుల విషయాలపై వేగంగా నిర్ణయాలు తీసుకున్నారో చూశాం. ఏనాడూ ప్రకటనలకు పరిమితం కాలేదు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో చూపారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారు. రైతులు ఎక్కువగా సాగు చేసే పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించారు. వ్యవసాయ రంగంలో రూ.8,845 కోట్లు విద్యుత్ బకాయిలు పెట్టి చంద్రబాబు వెళ్లిపోతే వాటిని చెల్లించి, రైతులకు ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరించాం. ఇంకా ఆ ఐదేళ్లలో వ్యవసాయానికి విద్యుత్ సబ్సిడీ కింద ఏకంగా రూ.43,744 కోట్లు ఖర్చు చేశాం. రైతుల కోసం వ్యవసాయ విద్యుత్ ఫీడర్ల సామర్థ్యం పెంచడం, విద్యుత్ సబ్సిడీ ఇవ్వడం, సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధికి ఇతోధికంగా సాయం చేశాం. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.384 కోట్ల విత్తన బకాయిలు కూడా చెల్లించాం. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు చంద్రబాబు ఎగనామం పెట్టిన సాయాన్ని ఇవ్వడంతోపాటు ఆ పరిహారాన్ని రూ.7 లక్షలకు పెంచాం' అని కాకాణి గుర్తు చేశారు.

పెద్దజీయర్ స్వామిపైనా రెడ్‌బుక్ వేధింపులు

- టీటీడీ చైర్మన్, ఈవో కలిసి పెద్దజీయర్ స్వామిపై ఒత్తిడి తెచ్చి లేఖ రాయించారు
- వైఎస్ జగన్‌ను హిందూ ద్వేషిగా చిత్రీకరించే పన్నాగం
- చంద్రబాబు క్షుద్ర రాజకీయాలకు స్వామీజీలు సమిధలవుతున్నారు
- మఠాధిపతులను భయపెట్టి ధర్నాలు చేయిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీని లేకుండా చేయాలన్న కుట్రలను సహించేది లేదు
- వైఎస్సార్‌సీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పెద్దజీయర్ స్వామి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం వేధింపులకు బలైపోయారని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. టీటీడీ చైర్మన్, ఈవో, మరో అధికారి కలిసి మూడు గంటలపాటు ఆయనను వేధించి, ఒత్తిడి తెచ్చి లేఖ రాయించారని మండిపడ్డారు. మంగళవారం తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... 'శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సంస్కృతి. సంప్రదాయాలకు భిన్నంగా తొలిసారి పెద్దజీయర్ స్వామీజీతోనే బహిరంగ లేఖ రాయించారు. క్షుద్ర రాజకీయ హోమంలో పెద్దజీయర్ మఠాన్ని సమిధగా వాడుకోవడానికి చంద్రబాబే బలవంతంగా ఆ లేఖను రాయించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, కొత్తగా వచ్చిన ఈవో ముద్దాడ రవిచంద్ర, అవినీతిపరుడైన బొక్కసం ఇన్‌చార్జి గురురాజ్ తదితరులు పెద్దజీయర్ స్వామి వద్దకు వెళ్లి ఆయనపై ఒత్తిడితెచ్చి లేఖ ఇప్పించారని నా దగ్గర సమాచారం ఉంది' అని చెప్పారు. భూమన ఇంకా ఏం మాట్లాడారంటే...

సీబీఐ–సిట్ నివేదికతో వారి మొహంలో నవ్వు మాయమైంది

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆరోపించినట్టుగా తిరుమల లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో గొడ్డు మాంసం, పంది కొవ్వు, చేపల నూనె కలవలేదని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సీబీఐ–సిట్ నివేదిక ఇచ్చిన తర్వాత వారి మొహంలో నవ్వు మాయమైపోయింది. వైఎస్ జగన్‌ను హిందూ మత వ్యతిరేకిగా ప్రజల్లో ముద్ర వేయాలనే దురుద్దేశంతో రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేసి అడ్డంగా దొరికిపోయారు. రాష్ట్ర ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహంతో జవాబు చెప్పుకోలేక తాము చెప్పిన అబద్ధాన్ని నిజం చేసేందుకు మరిన్ని నిందలు మోపడం మొదలుపెట్టారు. అయినా కూటమిపై ప్రజల్లో వచ్చిన ఆగ్రహం చల్లారకపోవడంతో రెండు రోజులుగా స్వయం ప్రకటిత స్వాములతోపాటు పెద్దజీయర్ స్వామి మఠాన్ని రంగంలోకి దించారు. క్షుద్ర రాజకీయాలు చేసే చంద్రబాబు లాంటి వ్యక్తుల చేతుల్లో నైతిక విలువలున్న పెద్దజీయర్ స్వామి నలిగిపోవడం బాధాకరం. టీటీడీలో పని చేసే ఉన్నతాధికారులంతా చంద్రబాబు ప్రయోజనాల కోసం పనిచేసే వారే తప్ప ఆలయ ప్రతిష్టను కాపాడేవారు ఎంతమాత్రం కాదు. కూటమి ప్రభుత్వం వచ్చిన 20 నెలల్లో తిరుమల కొండపై జరిగిన అపచారాలే ఇందుకు నిదర్శనం' అని భూమన చెప్పారు.

మీరెందుకు స్పందించారు స్వామీ

'లడ్డూలో కల్తీ జరిగిందని ఈవో శ్యామలారావు, సీఎం చంద్రబాబు ప్రచారం చేసినప్పుడు మీరెందుకు లేఖ రాయలేదని పెద్ద జీయర్ స్వామిని నేరుగా ప్రశ్నిస్తున్నా. సీబీఐ–సిట్ దర్యాప్తు చేసి జంతువుల కొవ్వు కలవలేదని చెప్పిన తర్వాత ఎందుకు స్పందించారు? నెయ్యి కల్తీలో రాజకీయ నాయకుల ప్రమేయం లేదని కొంతమంది అధికారులు, నెయ్యి సరఫరాదారులు నెపుణ్యం కలిగిన కొంతమంది కలిసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని తేల్చిన తర్వాత ఎందుకు స్పందించారు? చంద్రబాబు ఆరోపించినట్టు వైఎస్ జగన్‌కు గానీ ఆయన ఆధ్వర్యంలో టీటీడీ పాలకమండలికి గానీ ఎలాంటి సంబంధం లేదని సిట్ రిపోర్టు తేటతెల్లం చేయడంతో కూటమి ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిపోయింది. వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలన్న కోణంలో సృష్టించిన ఈ కల్తీ నెయ్యి వ్యవహారం చివరకు చంద్రబాబు మెడకే చుట్టుకుంది. తనను సమర్థించే వారు ఎవరూ లేక ప్రతిష్ట దిగజారిపోయి పలచనైపోయిన చంద్రబాబు.. కొత్తగా మఠాధిపతులు, స్వామీజీలతో ఈ కొత్త అంకానికి తెరతీశారు. కొంతమంది స్వామీజీలను భయపెట్టి, బెదిరించి, ప్రలోభపెట్టి, లోబర్చుకుని కొత్త ప్రచారానికి తెరలేపారు. చివరకు పెద్దజీయర్ స్వామితో లేఖ రాయించారు. వాస్తవానికి ఆయనకు తెలుగు రాయడం తెలియదు. అలాంటిది ఆయనతో తెలుగులో లేఖ రాయించి సంతకం పెట్టించారు' అని భూమన స్పష్టం చేశారు.

చంద్రబాబు క్షుద్ర రాజకీయాలకు సమిధలు కావొద్దు

'వైఎస్సార్‌సీపీ హయాంలో ధనుర్మాసంలో పెద్ద జీయర్ మఠంలో 30 రోజులపాటు తిరుప్పావై ప్రవచనాలను పఠింపజేసి దాన్ని ఎస్వీబీసీ భక్తి చానల్ ద్వారా ప్రపంచానికి చూపించాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రెండేళ్లలో దాన్ని పూర్తిగా అటకెక్కించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోను, వైఎస్ జగన్ పాలనలోను చిన్నజీయర్, పెద్దజీయర్ మఠాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండకూడదని టీటీడీ తరఫున పెద్దఎత్తున ధన సహాయం పెంచిన విషయాన్ని ఎలా మరిచారు?, వైకుంఠ ఏకాదశి పర్వదినానికి సంబంధించి 108 శ్రీ వైష్ణవ దివ్యక్షేత్రాల్లో అనుసరించిన విధానాలనే తిరుమలలో అనుసరించాలని పెద్దజీయర్ స్వామిని సంప్రదించిన తర్వాతనే అమలు చేశాం. 36 మంది పీఠాధిపతుల అనుమతి పొందిన తర్వాతే వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని తిరుమల కొండపై నిర్వహించాలని నిర్ణయించాం. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రెండు రోజులు మాత్రమే జరపాలని నిర్ణయించారు. పెద్ద జీయర్ స్వామిని పూర్తిగా విస్మరించారు. పెద్దజీయర్ స్వామికి వారిచ్చే గౌరవం ఏపాటిదో చెప్పడానికి ఈ ఒక్క ఘటనే సాక్ష్యం. పెద్దజీయర్ స్వామి అంగీకరిస్తే ఆయనతో చర్చలకు సిద్ధమే. ఏదేమైనా చంద్రబాబు క్షుద్ర రాజకీయాల్లో సమిధలు కావొద్దని ఆయనకు విజ్ఞప్తి చేస్తున్నా' అని భూమన విజ్ఞప్తి చేశారు.

భయానక దాడులు చేస్తే స్టేషన్ బెయిలా?

- కేవలం మాట తూలినందుకు కారాగారమా?
- రాష్ట్రంలో విష సంస్కృతికి చంద్రబాబు బీజం
- మాజీ ఎంపీ ఉండవల్లి విమర్శలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పెట్రోలు బాంబులు విసిరి, భయానక దాడులు చేసిన వారికి సాధారణ స్టేషన్ బెయిల్ ఇచ్చి.. కేవలం మాట తూలినందుకు సెంట్రల్ జైలుకు పంపుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో విష సంస్కృతికి శ్రీకారం చుట్టారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ విమర్శించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబుతో ఉండవల్లితోపాటు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మంగళవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా జైలు బయట ఉండవల్లి మాట్లాడుతూ చంద్రబాబు అవలంబిస్తున్న విధానం ఆరోగ్యకరమైనది కాదని, అంబటి విషయంలో చాలా టూమచ్‌గా వ్యవహరించారన్నారు. ఇది కక్ష సాధింపు ధోరణితో చేసిన వ్యవహారమని పేర్కొన్నారు. అంబటి ఇంటిపై ఆరు గంటలపాటు టీడీపీ నేతలు దాడులు చేస్తే ఎటువంటి చర్యలూ లేవని, కేవలం స్టేషన్ బెయిల్ ఇచ్చి నిందితుల్ని ఇంటికి పంపేశారని ఉండవల్లి విమర్శించారు.

చంద్రబాబు పాలన దుర్మార్గం

మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ, అంబటి రాంబాబు తప్పు చేయలేదని, ఆయన చాలా ప్రశాంతంగా ఉన్నారన్నారు. ఒకే విషయంలో 36 కేసులు నమోదు చేశారని, ఇంకా వేరే కేసులు న్నాయని చెబుతున్నారని విమర్శించారు. గతంలో ఇదే జైలు ఎదురుగా ఉన్న ప్రభుత్వాస్పత్రిలో కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభాన్ని ఉంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు వ్యవహారంతో ఆ పార్టీకి ఎమ్మెల్యేనే 'పల్లె కన్నీరు పెడుతోంది' అని వ్యాఖ్యానించారంటే అంతకన్నా అవమానం ఏముంటుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి శైలితో రాష్ట్రం కన్నీరు పెడుతోందని కన్నబాబు ధ్వజమెత్తారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, ఒక అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేసి నిజం చేయాలనుకుంటున్నారన్నారు. లడ్డూలో కల్తీ జరగలేదని తిరుపతి ఎమ్మెల్యేనే స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ ముందు ఒక విధంగా, తర్వాత మరో విధంగా డైవర్షన్ తీసుకుని మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉండవల్లి అరుణ్ కుమార్

వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం చేస్తే సహించం

నిరసన తెలియజేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, నూరి ఫాతిమా, మైనార్టీ నేతలు

వక్ఫ్‌బోర్డు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతల ధర్నా

సాక్షి, అమరావతి: వక్ఫ్ స్థలాలను అన్యాక్రాంతం చేస్తే సహించేదిలేదని చంద్రబాబు ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు హెచ్చరించారు. గుంటూరులోని అంజుమన్–ఇ–ఇస్లామియా సంస్థకు చెందిన వక్ఫ్ భూములను అన్యాక్రాంతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ విజయవాడలో వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయం వద్ద మంగళవారం వారు ధర్నా నిర్వహించారు. అంజుమన్ హమారా.. ప్రాపర్టీ హమారా.. అనే ప్లకార్డులను ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, వక్ఫ్‌బోర్డు సభ్యుడు ఎండీ రుహుల్లా మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు స్థలాలు, ఆస్తులు మైనార్టీలకే చెందేవిధంగా భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలను చంద్రబాబు ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని చెప్పారు. అంజుమన్ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలంతా పోరాడుతున్నా చంద్రబాబు ప్రభుత్వం కనీసం స్పందించడంలేదని విమర్శించారు. వక్ఫ్‌బోర్డు ద్వారా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను, అన్యాయాలను ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల ఆత్మగౌరవం, హక్కుల రక్షణ, భవిష్యత్ తరాల కోసం తాము పోరాడుతున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం గుంటూరు నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా మాట్లాడుతూ అంజుమన్–ఇ–ఇస్లామియా, గుంటూరు మసీదు భూములను అన్యాక్రాంతం చేసే ప్రక్రియను ప్రభుత్వం విరమించుకునేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో వైఎస్సార్‌సీపీ నేతలు గులాం రసూల్, సలాం, సయ్యద్ అలీమ్, బాజీబాబా, అవాజ్ చిష్టి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు కొత్త ఎత్తుగడ

అంజుమన్–ఇ–ఇస్లామియా, పెద్ద మసీదులకు చెందిన వక్ఫ్ భూములను అన్యాక్రాంతం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు మండిపడుతున్నారు. ఇప్పటికే భూ సేకరణ కోసం నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వ ఎత్తుగడ పారకపోవడంతో వక్ఫ్‌బోర్డు ద్వారా దీర్ఘకాలిక లీజు, పీపీపీ పద్ధతి ద్వారా ఏపీఐఐసీకి వక్ఫ్‌భూములు కట్టబెట్టే ఎత్తుగడ వేసింది. ఆ ప్రయత్నాలను కూడా వ్యతిరేకిస్తూ గత వక్ఫ్‌బోర్డు సమావేశానికి సభ్యులు మూకుమ్మడిగా గైర్హాజరయ్యారు. దీంతో ఆ సమావేశాన్ని వాయిదా వేసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మంగళవారం మరోమారు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు తమ అభ్యంతరాలు తెలిపారు. చివరకు ఈ విషయమై అంజుమన్–ఇ–ఇస్లామియా సంస్థ కమిటీతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. అంజుమన్–ఇ–ఇస్లామియా సంస్థకు చెందిన చినకాకానిలోని 71.59 ఎకరాలను ఏపీఐఐసీకి భూసేకరణ ద్వారా ఇచ్చే విషయంలో అంజుమన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. వక్ఫ్‌బోర్డు సమావేశంలో సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, బేపారి జాకీర్ అహమ్మద్, దావూద్ బాషా, వక్ఫ్‌బోర్డు సీఈవో యాకూబ్ ఖాజీ పాల్గొన్నారు. అంజుమన్–ఇ–ఇస్లామియా కమిటీ చైర్మన్‌గా టీడీపీ ఎమ్మెల్యే నసీర్ ఉండటంతో ఆ కమిటీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామంటూ వక్ఫ్‌బోర్డు కొత్త ఎత్తుగడ పన్నడంపై ముస్లిం మైనార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కార్యక్రమంలో నటి తమన్నా, తదితరులు

సావనీర్ ఆవిష్కరణలో తమన్నా, మంత్రి ఎంబీ పాటిల్ తదితరులు

మైసూరు శాండల్.. ఒక ఎమోషన్

మైసూరు శాండల్ సోప్ అంబాసిడర్, బహు భాషానటి తమన్నా భాటియా

సాక్షి బెంగళూరు: మైసూరు శాండల్ సోప్ ఒక ఎమోషన్ అని, చిన్నతనం నుంచి ఎంతోమందికి దగ్గరైన ఒక సెంటిమెంట్ అని ప్రముఖ బహుభాషానటి తమన్నా భాటియా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కేఎస్‌డీఎల్) ఆధ్వర్యంలోని మైసూర్ శాండల్ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రపంచంలో ఎన్నో విషయాలు మారాయి కానీ చిన్నతనం నుంచి మైసూరు శాండల్‌పై ఉన్న ప్రేమ, నమ్మకం, ఎమోషన్ మనందరిలో అలాగే నిలిచి ఉన్నాయని చెప్పారు. తనను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసినందుకు కర్ణాటక భారీ, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ఎంబీ పాటిల్ మాట్లాడుతూ నటి తమన్నా భాటియా రెండేళ్లపాటు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటారని చెప్పారు. మైసూరు శాండల్ సోప్ ఉత్పత్తిని పెంచేందుకు విజయపుర, దాబస్‌పేట పారిశ్రామిక ప్రాంతాల్లో కొత్త తయారీ విభాగాలను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కేఎస్‌డీఎల్ మొత్తం 57 రకాల ఉత్పత్తులను తయారు చేస్తోందని, 2030 నాటికి టర్నోవర్‌ను రూ.5 వేల కోట్లకు పెంచే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నూతన ప్యాక్‌తో తయారు చేసిన మైసూరు శాండల్ సోప్‌ను ఎంబీ పాటిల్ ఆవిష్కరించారు. 108 ఏళ్ల మైసూరు శాండల్ సోప్ చరిత్ర తెలిపే 'అరోమేటిక్ జర్నీ' పుస్తకాన్ని నటి తమన్నా విడుదల చేశారు. ఈ పుస్తకం కన్నడ సంకలనం 'సుగంధ సిరి'ని కూడా ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌డీఎల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సీఎస్ అప్పాజీ నాడగౌడ, ఎండీలు డాక్టర్ ప్రశాంత్ పీకేఎం, మనోజ్‌కుమార్, పరిశ్రమలశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సెల్వకుమార్ తదితరులు పాల్గొన్నారు.

How was Richard's competitiveness described?

MODEL PAPER -II FOR SSC PUBLIC EXAMINATIONS - MARCH 2026
THIRD LANGUAGE - ENGLISH

Class: X **Max. Marks : 100** **Time: 3 hrs 15 min**

Instructions:

1. The question paper has 34 questions in three sections (A, B & C)
2. Answer all the questions on a separate answer book supplied to you.
3. 15 minutes is allotted exclusively for reading the question paper and 3.00 hours for writing the answers.
4. Answer all the questions of SECTION - B (Grammar & Vocabulary) in the same order at one place in your answer book.

SECTION - A
(READING COMPREHENSION)

Questions (1 - 5):

Read the following passage carefully.

The voice from the radio answered me immediately: "DS 088, I can hear you. You ought to turn twelve degrees west now, DS 088. Over." I checked the map and the compass, switched over to my second and last fuel tank, and turned the Dakota twelve degrees west towards England. 'I'll be in time for breakfast,' I thought. A good big English breakfast! Everything was going well - it was an easy flight. Paris was about 150 kilometres behind me when I saw the clouds. Storm clouds. They were huge. They looked like black mountains standing in front of me across the sky. I knew I could not fly up and over them, and I did not have enough fuel to fly around them to the north or south. "I ought to go back to Paris," I thought, but I wanted to get home. I wanted that breakfast. 'I'll take the risk,' I thought, and flew that old Dakota straight into the storm. (BlackAeroplane)

Now, answer the following questions **5×2 = 10M**

1. **Why did Bodhidharma cut off his eyelids according to the Indian legend?**
2. **Where were Pranjol's parents waiting for the boys?**
3. **According to Rajvir, when was tea first drunk in China?**
   a) Around 1500 B.C.
   b) Around 2700 B.C.
   c) Around 1600 A.D.
4. **What were the tea-pluckers carrying on their backs?**
   a) Cloth bags
   b) Bamboo baskets
   c) Metal containers
5. **Tea was first drunk in Europe as a _____.**
   a) Beverage
   b) Medicine
   c) Soft drink

Questions (6-10):

Read the following stanza carefully.

All night the roots work
to disengage themselves from the cracks
in the veranda floor.
The leaves strain toward the glass
small twigs stiff with exertion
long-cramped boughs shuffling under the roof
like newly discharged patients
half-dazed, moving
to the clinic doors.
(The Trees)

Now, answer the following questions **5×1 = 5M**

1. **What are the roots of the plant trying to do all night?**
2. **What are the leaves of the plant straining towards?**
3. **What is the condition of the small twigs of the plant?**
   A) They are limp and lifeless
   B) They are stiff with exertion
   C) They are bent and broken
4. **What is the movement of the long-cramped boughs of the plant likened to?**
   A) A dance performance
   B) A military parade
   C) Newly discharged patients moving to the clinic doors
5. **What is the overall atmosphere of the passage?**
   A) Peaceful and serene
   B) Dark and ominous
   C) Vivid and dynamic

Questions (11 - 15):

Read the following passage carefully.

"Richard was competitive," Mr. Weiherer continued, "but not in a bad sense." He explained, "Richard wasn't interested in winning for winning's sake or winning to get a prize. Rather, he was winning because he wanted to do the best job he could. For the right reasons, he wants to be the best." And that is one of the ingredients in the making of a scientist. Start with a first-rate mind, add curiosity, and mix in the will to win for the right reasons. Ebright has these qualities. From the time the book, The Travels of Monarch X, opened the world of science to him, Richard Ebright has never lost his scientific curiosity (The Making of a Scientist)

Now choose the right answer **5×1 = 5M**

11. **How was Richard's competitiveness described?**
    a) Aggressive and harmful
    b) Not in a bad sense
    c) Only for winning prizes
12. **Why did Richard want to win?**
    a) To get attention
    b) To receive rewards
    c) To do the best job he could
13. **According to the passage, which quality is not listed as an ingredient in the making of a scientist?**
    a) Curiosity
    b) A first-rate mind
    c) A desire for fame
14. **What book opened the world of science to Richard Ebright?**
    a) The Story of Science
    b) The Travels of Monarch X
    c) The Life of Butterflies
15. **What has Richard Ebright never lost?**
    a) His interest in sports
    b) His scientific curiosity
    c) His competitive spirit
16. **Study the following bar graph carefully.**

Name	Telugu	English	Hindi
Manoj	85	78	90
Joshith	80	70	85
Deepika	79	71	88
Teja	83	65	81
Venkat	77	86	84
Madiha	81	90	79

Now answer the following **5×1 = 5 M**

I) Who scored the highest marks in English?
II) Who scored the lowest marks in Telugu?
III) ……….scored 90 marks in Hindi?
  A) Joshith
  B) Manoj
  C) Deepika
IV) Who scored the highest total marks overall?
  A) Teja
  B) Venkat
  C) Madiha
V) Choose the true statement
  A) Venkat scored least marks in Hindi
  B) Teja scored least marks in Telugu
  C) Deepika scored highest marks in English

(Question :17)

Read the following passage carefully.

Mohan was once a quiet boy who struggled to learn and often sat at the back of the classroom, afraid to participate. His English teacher, Mrs. Lakshmi, noticed his hesitation and gently encouraged him every day. One morning, she shared an inspiring story about how hard work and commitment can change anyone's life. The words touched Mohan deeply. Something awakened in him that day.

From then on, Mohan began arriving early to school. He practiced reading aloud, completed every assignment carefully, and asked doubts without fear. His classmates were surprised to see his dedication. Mrs. Lakshmi guided him patiently, correcting his mistakes and praising his improvements.

A month later, during the English test, Mohan scored one of the highest marks in the class. When the teacher announced his name, the whole class clapped proudly. Mohan's eyes shone with confidence. His transformation proved that effort brings success.

Now, arrange the following jumbled sentences into a meaningful order. **5×1 = 5M**

a. Mohan began arriving early to school and practicing reading aloud
b. One morning Mrs. Lakshmi shared an inspiring story.
c. Mohan was once a quiet boy who struggled.
d. He scored one of the highest marks in the test in the class.
e. He asked his doubts and the teacher guided him patiently.

Continued on next page..

SECTION - B : GRAMMAR & VOCABULARY

18. Combine the sentences using the relative pronouns in the brackets. 2M
This is the bag. I bought it yesterday. (which)

19. Change the following sentence into 'passive voice' 2M
Padma is reading an interesting book.

20. Change the following into Reported Speech 2M
Neha said, "Please give me some water."

21. Fill in the blanks with suitable prepositions given in brackets 2×1 = 2M
(i) The bus arrives ___ the station at 6 PM. (at / on / in)
(ii) Bhanu is afraid ___ spiders. (of / from / with)

22. Edit the following passage. 4 ×1 = 4M
Shahina dreams off (a) …………… becoming a doctor and helping sick people. Her (b) ………….. plans to study hard and achieve good grades in school. She wants to learn new skills but (c) ……… explore different career opportunities. With determination and focus, she hopes to build a successful futures (d) ………

23. Fill in the blanks with suitable articles. 2 × 1 =2M
i) He gave me ___ useful piece of advice that changed my life.
ii) They visited ___ European museum during their tour.

24. Change the following into Reported action in the past using 'would/used to' 2 × 1 =2M
i) Neelu drank a glass of milk every night when he was a boy.
ii) Our grandma told us stories on Sundays.

25. Rewrite the sentences into a single sentence using Noun-modifiers. 2 × 1 =2M
i) I opened a box. The box was wooden and heavy.
ii) Sarayu wore a dress. The dress was silk and elegant.

26. Give a suitable advice her the situation given below. 2 × 1 = 2M
Your younger sister is selected for the school debate competition. Advise her to prepare her points confidently.

27. Read the following paragraph and write the synonyms of the underlined words, choosing the words given in the box. 4×1 = 4M

small, Anciently, finally, Appeared, Looked like, Wide

The creature that **emerged** (a) from this sack on to the **spacious** (b) tiled floor of the Consulate bedroom **resembled** (d) most of all a very small, **medievally** (c) conceived, dragon.

28. Read the following paragraph and write the antonyms of the underlined words. 4×1 = 4M
When I **casually** (a) mentioned this to a **friend** (b), he as casually **replied** (c) that I had better get one in the Tigris marshes, for there they were as **common** (d) as mosquitoes,

29. Fill in the blanks with the right form of words given in the brackets. 2×1= 2M
The sun was now …………..(a) (ascending, ascend, ascended) the sky, blazing on his ledge that faced the south. He felt the heat because he had not eaten since the ……… (b) (previously, previous, previousness) nightfall.

30. Complete the words with correct prefixes and suffixes given in the brackets. 2×1 = 2M
i) I can still ……. call the typical fragrance of those loaves. (re / mis)
ii) We have, at last, achieved our political emancipa ……. (tion/ sion)

31. Find the wrongly spelt word and write the correct spelling 2×1 = 2M
i) Acetic legend emperer veered …………
ii) Disapproval discreet passengers windsheild ………

32. Read the following dictionary entry of the word given below.
Conscience noun. /ˈkɑnʃəns/ 1[countable, uncountable] the part of your mind that tells you whether your actions are right or wrong to have a clear/guilty conscience (= to feel that you have done right/wrong) This is a matter of individual conscience (= everyone must make their own judgment about it).

Answer the following questions **2×1 = 2M**
(i) What is the part of speech of the word 'conscience'?
(ii) What is the meaning of the word 'conscience'?

33. Use the following expressions in sentences of your own. 2×1 = 2M
i) Phrasal Verb : Stay indoors
ii) Idiomatic expression : not to lose heart

34. Match the following. 4 × ½ = 2 M

Part - A	Part - B
1. fly coop	( ) a. imaginary thoughts while awake
2. day dream	( ) b. very severely
3. move along with	( ) c. to escape or run away suddenly
4. In black and blue	( ) d. adjust

ANSWERS

1. He cut off his eyelids because he felt sleepy during meditations.
2. They were waiting for them at Mariani Junction.
3. b) Around 2700 B.C.
4. b) Bamboo baskets **5.** b) Medicine
6. As soon as the leopard leaps on you, you will realize that it is a leopard.
7. Roaring with pain will do no good because the leopard will only leap again and again.

8. B **9.** B **10.** A **11.** b) Not in a bad sense
12. c) To do the best job he could
13. c) A desire for fame
14. b) The Travels of Monarch X
15. b) His scientific curiosity
16. (i) Madiha (ii) Venkat (iii) B) (iv) C) (v) A
17.

1	2	3	4	5
c	b	a	e	d

18. This is the bag which I bought yesterday.
19. An interesting book is being read by Padma.
20. Neha requested to give her some water.
21. (i) at (ii) of
22. a. of b. She c. and d. future
23. (i) a (ii) a
24. i) Neelu used to a glass of milk every night when he was a boy.
ii) Our grandma would tell us stories on Sundays
25. i) I opened a heavy wooden box.
ii) Sarayu wore a silk and elegant dress.
26. My dear sister, you should prepare your debate points confidently for the school competition.
27. a) emerged → appeared
b) spacious → wide
c) resembled → looked like
d) medievally → anciently
28. a) casually X Seriously / intentionally
b) friend X enemy
c) replied Xenquired / questioned
d) common X rare
29. a) ascending b) previous
30. i) re- ii) -tion
31. i) emperor ii) windshield
32. i) noun ii) to feel that you have done right or wrong
33. i) I was feeling tired yesterday. So I stayed indoors
ii) Please don't lose your heart, I am there to support you.
34. 1. c 2. a 3. d 4. b

B.S.Padmavathy,
SA- English
ZPHS Motakatla,
Annamayya District

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. Gitanjali is one of the books that ___ interesting.
a) is b) are
c) was d) is being

2. Which of the following is spelled INCORRECTLY?
a) Accommodate
b) Acknowledge
c) Vaccum
d) Conscientious

3. She kept her classroom immaculate.The word "immaculate" in the above sentence is a:
A) Noun
B) Verb
C) Adjective
D) Adverb

4. Choose the correct question tag: You never think that I can do it, __ ?
A) do you B) don't you
C) can I D) can't

5. Which word is closest in meaning to "fervent"?
A) Casual B) Passionate
C) Indifferent
D) Mild

● సందర్భం

విన్స్‌మోర్

'నీ దగ్గర సైన్యం లేదు... మరచి పో...
నీ దగ్గర ఆయుధం లేదు... మరచి పో...
అయితే ఆశ... అనే అద్భుతాన్ని మాత్రం
ఎప్పుడూ మరచిపోవద్దు.
ఆ ఆశే నీ ఆయుధం అవుతుంది...
సైన్యం అవుతుంది'... అనేది
జపాన్ ప్రఖ్యాత నాయకుడు
షింజో అబే మాట. ఆ మాటే
సనై తకాయిచికి ధైర్యాన్నిచ్చింది.
'జపాన్ ఐరన్ లేడీ'ని చేసింది.
గత సంవత్సరం జపాన్
తొలి మహిళా ప్రధానిగా
చరిత్ర సృష్టించిన తకాయిచి...
తాజాగా జపాన్ పార్లమెంట్‌కు
జరిగిన ఎన్నికల్లో (ముందస్తు)
ఘన విజయం సాధించారు...

మూడు నెలల్లోనే పార్లమెంట్‌ను రద్దుచేసి, ఎన్నికల బరిలోకి దిగడం ఆషామాషీ విషయం కాదు. తమ మీద తమకు గట్టి నమ్మకం ఉన్నప్పుడే ఇది సాధ్యపడుతుంది. ఆ నమ్మకం ఎప్పుడూ తకాయిచితోనే ఉంది. అందుకే ఆమె సనై తకాయిచి అయ్యారు!

తాజా ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మరోసారి తానేమిటో నిరూపించుకున్నారు.

టకాయిచి టాక్ చాతుర్యం... అమోఘం!

తకైచి గురువు షింజో అబే. ఆయన వాక్చాతుర్యం అంటే తకైచికి బాగా ఇష్టం.

షింజో జపాన్‌లోని ప్రముఖ ప్రజానాయకుడు. లిబరల్ డెమోక్రటిక్ పార్టీ(ఎల్‌డీపీ) అధ్యక్షుడు అయిన షింజో అబే జపాన్ చరిత్రలో అత్యధిక కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించారు.

'ప్రజలతో కలిసి పనిచేస్తున్నంత కాలం నాకు వేరే శక్తి అవసరం లేదు. ప్రజలే నా శక్తి. ఆ శక్తితో ఎన్ని రకాల సవాళ్లనైనా ఎదుర్కోగలను'

'మనిషికి ఆశ ఎప్పుడూ ఉండాలి. ఆ ఆశే అయుధం. కలను సాకారం చేసుకునే సాధనం'... గురువు నోట వినిపించే ఇలాంటి మాటలు అంటే తకాయిచికి చాలా ఇష్టం. 'ప్రజలను ఉద్దేశించి ఉపన్యాసం ఇస్తుంటే ఎవరో పరాయి వ్యక్తి వచ్చి మాట్లాడినట్లు ఉండకూడదు. మన ఊరి వ్యక్తో, కుటుంబ సభ్యులో మాట్లాడుతున్నట్లు సహజంగా ఉండాలి.'.. అని చెప్పకనే చెప్పినట్లుగా ఉంటుంది షింజో అబే వాక్చాతుర్యం. అలాంటి సహజ వాక్చాతుర్యాన్ని సొంతం చేసుకున్నారు తకాయిచి.

యస్... ఇప్పటికీ డ్రమ్స్ మోగాల్సిందే!

యూనివర్శిటీ రోజుల్లో సరదాగా డ్రమ్స్ వాయించడమే కాదు ఒక మ్యూజిక్ బ్యాండ్‌లో కూడా చేరారు సనై తకాయిచి. పాకెట్‌మనీకి సరిపడ డబ్బులు వచ్చేవి! మరి ఆమె రాజకీయాల్లోకి వచ్చిన తరువాత ఆ డ్రమ్స్ మూలన పడ్డాయా? గత జ్ఞాపకాలుగానే మిగిలిపోయాయా?

అదేమీ కాదు. ఆమె ఇప్పటికీ డ్రమ్స్ వాయిస్తారు. వేదికలపై కాదు... ఇంట్లోనే! రాజకీయ రణరంగంలో బోలెడు ఒత్తిడి ఉంటుంది. ఆ ఒత్తిడి నుంచి బయట పడడానికి, తనను తాను రీఛార్జ్ చేసుకోవడానికి ఇప్పటికీ డ్రమ్స్ వాయిస్తుంటారు.

గత నెల జపాన్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో చర్చలు జరిపారు తకాయిచి. చర్చలు పూర్తయిన తరువాత ఇద్దరూ సరదాగా కె-పాప్ పాటలు పాడుకున్నారు. డ్రమ్స్ ప్లే చేశారు.

వర్క్ వర్క్ వర్క్ అండ్ వర్క్!

➡ 'వృత్తి జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలి' అనే మాట ఎప్పుడూ వినబడుతూ ఉంటుంది. అయితే ఈ సమన్వయ ధోరణికి తకాయిచి వ్యతిరేకం.

➡ 'దేశం కోసం ఎప్పుడూ పనిచేస్తూ ఉండాలి. వర్క్ వర్క్ వర్క్ అండ్ వర్క్. అందరూ గుర్రంలా పనిచేయాలి' అంటారు తకాయిచి.

➡ 'వర్క్ వర్క్ వర్క్ అండ్ వర్క్' అనే మాట జపాన్‌లో బాగా పాపులర్ అయింది. ప్రతి సంవత్సరం జపాన్‌లో విడుదల చేసే పాపులర్ మాటల పుస్తకంలో ఈ మాట చేరింది!

ఆ దూకుడు... ఇప్పటికీ!

చిన్నప్పుడు సనై తకాయిచికి 'బైకర్ అమ్మాయి' అని పేరు. జపాన్ రోడ్లపై స్పీడ్‌గా దూసుకెళ్లేది. రాజకీయాల్లోకి వచ్చిన తరువాత బైక్ డ్రైవింగ్‌కు దూరమైనా ఆ దూకుడు, స్పీడ్ మాత్రం తగ్గలేదు. అదే ఆమె ఎనర్జీ! కరుడు కట్టిన సంప్ర

దాయవాది, జాతీయవాదిగా ముద్ర పడినప్పటికీ ఆమె గిరి గీసుకొని కూర్చోలేదు. కొరియన్ సంగీతం, నాటకాలను బాగా ఇష్టపడతారు.

ధైర్యమే దారి చూపింది

అమెరికాలో యూనివర్శిటీ విద్య పూర్తయిన తరువాత స్వదేశానికి తిరిగి వచ్చిన తకాయిచి కొంత కాలం టీవీ యాంకర్‌గా పనిచేశారు. 1996లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీలో చేరారు. ఆ పార్టీ అగ్రనేత షింజో అబేకు ప్రియ శిష్యురాలు అయ్యారు. అంతర్గత వ్యవహారాలు, సమాచార శాఖ మంత్రిగా పనిచేశారు.

లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) 2024లో ఉభయ సభలలో మెజారిటీ కోల్పోయింది. కొమైటో పార్టీతో దశాబ్దాల పొత్తు కూలిపోయింది. ఎటు చూసినా నిరాశే అన్నట్లుగా ఉంది పరిస్థితి. అలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ధైర్యం, ఆశ కోల్పోలేదు తకాయిచి.

ఆమెకు ప్రజలలో ఉన్న ఆదరణే పార్టీని నిలబెట్టింది.

గత ఏడాది ఆమె ప్రధానిగా ఎన్నికైనప్పుడు...

'ప్రధానిగా తకాయిచి ఎన్నిక పార్టీకి అదృష్టాన్ని తెస్తుందా?

పార్టీని పునర్జీవింపజేస్తుందా?' అనే ప్రశ్న వేశారు రాజకీయ విశ్లేకులు. ఆ ప్రశ్నకు తాజా విజయం జవాబు చెప్పింది. తకాయిచి పాలనకు జనం ఆమోద ముద్ర వేశారు. ఇక ఆమె వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు. తకాయిచి దారి... రహదారి!

● నేడు ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్

శాస్త్రరంగంలో సగర్వంగా...

'సైన్స్ విద్యలు మహిళల కోసం కాదు' అన్నట్లుగా ఉండేది ఒకప్పటి పరిస్థితి. అయితే ఆ పరిస్థితి మెల్లగా మారిపోయింది. గతంతో పోల్చితే సైన్స్‌లో మహిళల సంఖ్య పెరిగింది. అయినప్పటికీ పురుషులతో పోల్చితే సైన్స్‌లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగానే ఉంది...

30% సైన్సులో ప్రపంచ వ్యాప్తంగా మహిళా పరిశోధకులు 30 శాతం కంటే తక్కువగా ఉన్నారు

సైన్స్‌లో బాలికలు, మహిళలను ప్రోత్సహించడానికి, కెరీర్‌లో సమాన అవకాశాలు కలిగించడానికి తొమ్మిది అంతర్జాతీయ సంస్థలు ఉమ్మడిగా ప్రాజెక్ట్ చేపట్టాయి.

9

అంతరాన్ని కొలవాలి... పరిష్కారాలు ఆలోచించాలి

● మన దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సైన్స్‌లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది.

● ప్రపంచ వ్యాప్తంగా సైన్స్‌లో లింగ అంతరం లేకుండా చేయడానికి రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ జెండర్‌గ్యాప్‌ను కొలిచి, దాన్ని ఎలా తగ్గించాలనేది ఆ ప్రయత్నాలలో ఒకటి.

● రాచెల్ ఐవీ, సుసాన్ వైట్ అనే శాస్త్రవేత్తలు సైన్స్‌లో జెండర్ గ్యాప్‌నకు సంబంధించి లోతైన విశ్లేషణ చేశారు. పరిష్కార మార్గాలను సూచించారు

● 'సైన్స్‌లో లింగ సమానత్వం' (జెండర్ ఈక్వాలిటీ) అంశంపై ప్రపంచవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట వర్చువల్ మీటింగ్స్ జరుగుతున్నాయి.

చాలా తక్కువ... శాస్త్రీయ సంస్థలలో కీలక నిర్ణయాలు తీసుకునే స్థానాలలో మహిళలు చాలా తక్కువగా ఉన్నారు.

ప్రభావం... పాతుకుపోయిన కొన్ని సామాజిక విశ్వాసాలు 'సైన్స్ అనేది పురుషుల రంగం' అనుకునేలా చేశాయి.

పక్షపాతం... సైన్స్ ఫీల్డ్‌లో ఉద్యోగ నియామకాలు, నిధులు, కెరీర్ పురోగతికి సంబంధించి మహిళల పట్ల వివక్ష కనిపిస్తుంది.

కాల్ టు యాక్షన్
సైన్స్‌లో మహిళకు సమాన అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో యూనెస్కో 'కాల్ టు యాక్షన్' ప్రోగ్రామ్ రూపొందించింది.

రోల్ మోడల్
సైన్స్‌లో మహిళా రోల్‌మోడల్స్ సంఖ్య పెరగడంతో వారిని స్ఫూర్తిగా తీసుకునే ధోరణి బాలికలలో పెరుగుతోంది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఫిబ్రవరి 10న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,59,920	1,60,500	1,57,91	1,60,500	1,59,500	1,59,050
బంగారం (22 క్యారెట్లు)	1,47,128	1,44,750	1,44,750	1,49,909	1,46,740	1,45,800
వెండి	2,70,000	2,72,000	3,00,000	2,72,000	2,67,000	3,00,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

ప్రేక్షకులందరికీ కనెక్ట్ అయ్యే చిత్రం ఇది
- శివ కందుకూరి

● తేజు అశ్విని, శివ కందుకూరి

శివ కందుకూరి, తేజు అశ్విని హీరో హీరోయిన్లుగా, రాజీవ్ కనకాల ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'నవాబ్ కేఫ్'. ప్రమోద్ హర్ష దర్శకత్వంలో రాధా వి. పపుడిప్పు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న రిలీజ్ కానుంది. తొలుత ఈ సినిమాకు ఉన్న 'చాయ్ వాలా' టైటిల్‌ను 'నవాబ్ కేఫ్'గా మార్చామని యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా మీట్‌లో హీరో శివ కందుకూరి మాట్లాడుతూ– ''సెన్సార్ రూల్స్, గైడ్ లైన్స్‌ని గౌరవిస్తూ, మేం మా టైటిల్‌ను 'నవాబ్ కేఫ్'గా మార్చాం. ప్రమోద్ ఈ సినిమా కథను నాకు చెప్పినప్పుడు, ఈ చిత్రానికి 'నవాబ్ కేఫ్' అనే టైటిల్ అనుకున్నాం. విధి చివరకు ఈ టైటిలే ఫైనల్ అయ్యేలా చేసింది. 'నవాబ్ కేఫ్' టైటిల్ మా సినిమా సోల్‌ని, స్టోరీని తెలియజేస్తుంది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ బయటకు వచ్చి, వాళ్ల నాన్నకి ఫోన్ చేసి మాట్లాడతారు. మంచి ఫాదర్ అండ్ సన్ ఎమోషన్స్ ఈ చిత్రంలో ఉన్నాయి'' అన్నారు. ''మా సినిమా టైటిల్ మార్చమని అధికారికంగా ఎక్కడా చెప్పలేదు. నేను ముంబై వెళ్లాను. సెన్సార్ టీమ్‌తో మాట్లాడాను. 'చాయ్ వాలా' టైటిల్ వద్దని చెప్పారు. దీంతో మేం మా వర్కింగ్ టైటిల్ 'నవాబ్ కేఫ్'నే ఫైనల్ చేశాం'' అని చెప్పారు నిర్మాత వెంకట్. ''నా జీవితంలో నేను చూసిన, అనుభవించిన సంఘటనల ఆధారంగా ఈ 'నవాబ్ కేఫ్' సినిమా కథనం సాగుతుంది'' అని తెలిపారు ప్రమోద్ హర్ష. ''ఇది నా మొదటి చిత్రం'' అని పేర్కొన్నారు తేజు అశ్విని.

వారణాసి అతి పెద్ద సినిమా
- నిక్ జోనస్

● మహేశ్‌బాబు, ప్రియాంకా చోప్రా

నిక్ జోనస్

''ప్రియాంకా చోప్రా కెరీర్‌లోనే 'వారణాసి' అతి పెద్ద సినిమా'' అని ఆమె భర్త, హాలీవుడ్ సింగర్ నిక్ జోనస్ పేర్కొన్నారు. మహేశ్‌బాబు హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'వారణాసి'. ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ సినిమా 2027 ఏప్రిల్ 9న విడుదల కానుంది. ఈ మూవీలో మందాకిని అనే పాత్రను పోషిస్తున్నారు ప్రియాంకా చోప్రా. ఈ చిత్రంలో ప్రియాంక భాగం కావడంపై ఆమె భర్త నిక్ జోనస్ తొలిసారి ఓ హాలీవుడ్ మీడియా ఇంటర్వ్యూలో స్పందించారు. ''ప్రియాంక గత పద్నాలుగు నెలలుగా ఓ మూవీ (వారణాసి) షూటింగ్‌లో ఉంది. ఈ దక్షిణాది మూవీని 'ఆర్ఆర్ఆర్' వంటి గొప్ప చిత్రాన్ని రూపొందించిన రాజమౌళిగారు తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ అద్భుతంగా ఉండనుంది. ప్రియాంక కెరీర్‌లోనే 'వారణాసి' అతి పెద్ద సినిమా. భారతీయ సినిమాలన్నా, సంగీతమన్నా నాకు ఎంతో ఇష్టం. ముఖ్యంగా భారత్‌లోని ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంటే నాకు మరింత ఇష్టం. ఏదైనా ఫంక్షన్ జరిగినప్పుడు అందరూ కలిసి సంతోషంగా ఉంటారు'' అని ఆ ఇంటర్వ్యూలో నిక్ జోనస్ పేర్కొన్నారు.

మళ్లీ 'అతడు': మహేశ్‌బాబు, త్రిష జంటగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ మూవీ 'అతడు' ఈ నెల 28న మళ్లీ విడుదల కానుంది.

● అల్లు అర్జున్‌పై బ్రాండ్ స్ట్రాటజర్ కావేరి ఆరోపణలు

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

● స్పందించిన అల్లు అర్జున్ టీమ్

ప్రముఖ నటుడు అల్లు అర్జున్‌తో షూటింగ్ చేయాలంటే ఇవి చేయాలి, ఇవి చేయకూడదు అంటూ చాలా నిబంధనలు ఉంటాయని, ఈ పరిస్థితి తనకు ఎదురైందని బ్రాండ్ స్ట్రాటజర్ కావేరీ బారువా ఆరోపించారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ– ''ఒక్కొక్కరికీ ఒక్కో వ్యక్తిత్వం ఉంటుంది. అల్లు అర్జున్‌తో ఓ యాడ్ షూట్ చేస్తున్నప్పుడు నాకు ఓ డిఫరెంట్ అనుభవం ఎదురైంది. అల్లు అర్జున్‌ను కలిసినప్పుడు ఏం చేయాలి? ఏం చేయకూడదు? అంటూ 42 నిబంధనలను ఆయన సిబ్బంది నాకు సూచించారు. 'హీరోకు షేక్ హ్యాండ్ ఇవ్వొద్దు, తగిన దూరం పాటించాలి, హీరోగారు ఉండగా సెట్‌లో ఫోన్ వినియోగించకూడదు..' అంటూ ఆయన సిబ్బంది చెబుతారు. యాడ్ షూట్ కోసం అల్లు అర్జున్ వస్తుండగా, సెట్స్‌లో నేను ఎక్కడో ఫోన్ బ్రౌజ్ చేస్తూ కూర్చున్నాను. ఆయన బాడీగార్డు ఒకరు నా దగ్గరకు వచ్చి, 'ఫోన్‌కు అనుమతి లేదు' అంటూ నా మొబైల్ ఫోన్‌ను లాగేసుకున్నాడు. బహుశా హీరో ప్రైవసీకి భంగం కలగకూడదని ఆ బాడీగార్డు అలా చేసి ఉండొచ్చు'' అని మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో అల్లు అర్జున్ సిబ్బంది స్పందించి.. ఓ నోట్‌ను విడుదల చేశారు. ''అల్లు అర్జున్ గురించి ప్రచారమౌతున్న వ్యాఖ్యల్లో వాస్తవం లేదు. అవి పూర్తిగా నిరాధారమైనవి. అల్లు అర్జున్ ఎప్పుడూ హుందాగా, గౌరవప్రదంగా ప్రవర్తిస్తుంటారు. ఆయన గురించి తప్పుడు ఆరోపణలు చేయడాన్ని మేం చాలా సీరియస్‌గా పరిగణిస్తున్నాం. ఇందుకు బాధ్యులైన వారిపై మా లీగల్ టీమ్ దావా వేసేలా చట్టపరమైన చర్యలకు కార్యాచరణ ప్రారంభించాం. అలాగే వెరిఫై చేయబడని సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని మేం అందర్నీ కోరుతున్నాం'' అంటూ అల్లు అర్జున్ సిబ్బంది ఆ నోట్‌లో పేర్కొంది. కావేరి చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి అల్లు అర్జున్ టీమ్ ఈ నోట్‌ను రిలీజ్ చేసినట్లుగా తెలుస్తోంది. ఇక ప్రస్తుతం అట్లీ డైరెక్షన్ చేస్తున్న సినిమాతో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు. అలాగే లోకేశ్ కనగరాజ్‌తో అల్లు అర్జున్ చేయాల్సిన సినిమా చిత్రీకరణ ఈ ఏడాదే ప్రారంభం అవుతుంది.

యాక్షన్... థ్రిల్

● రవిబాబు

రవిబాబు హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రేజర్'. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డి. సురేష్‌బాబు సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించి, ఒక పోస్టర్‌తో పాటు స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''డార్క్ అండ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రం 'రేజర్'. తెలుగు సినిమాల్లో ఇప్పటివరకు చూడని సరికొత్త కథాంశంతో మా మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. ఈ వేసవిలో మా సినిమాని రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: చరణ్ మాధవనేని, సంగీతం: ఎస్ఎస్ రాజేశ్.

చెప్పాల్సిన కథలు చాలా ఉన్నాయి
- దర్శకుడు కేవీ అనుదీప్

''నా దర్శకత్వంలో వచ్చిన సినిమాల్లో ఎక్కువగా కామెడీ ఉంటుంది. దీంతో నా సినిమాల్లో కథ, లాజిక్‌లు ఉండవని ఆడియన్స్‌కు అనిపించవచ్చు. కానీ నా అన్ని సినిమాల్లో కథ, లాజిక్ ఉంటాయి. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్లుగానే 'ఫంకీ' ట్రైలర్‌ను కట్ చేశాం. ట్రైలర్‌లో ఎక్కువగా కామెడీ సీన్స్ కనిపిస్తాయి. కానీ ఈ చిత్రంలో మంచి లవ్‌స్టోరీ, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి'' అని చెప్పారు కేవీ అనుదీప్. విశ్వక్ సేన్, కయాదు లోహర్ హీరో హీరోయిన్లుగా కేవీ అనుదీప్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరల సమావేశంలో కేవీ అనుదీప్ పంచుకున్న సంగతులు.

● 'ఫంకీ' చిత్రంలో విశ్వక్ సేన్ ఓ సినిమా దర్శకుడి పాత్ర చేశారు. 'ఈ నగరానికి ఏమైంది?' సినిమాలో ఆయన కామెడీ టైమింగ్ బాగుంటుంది. 'ఫంకీ'లోని హీరో క్యారెక్టరైజేషన్‌కు విశ్వక్ అయితే బాగుంటుందనిపించింది. కథ నచ్చి, ఆయన ఒప్పుకున్నారు. ● 'జాతి రత్నాలు'తో పోలిస్తే 'ఫంకీ' కొత్తగా ఉంటుంది. దర్శకుల జీవితాల్లో జరిగే కొన్ని సంఘటనలను సాధారణ ప్రేక్షకులకు అర్థమయ్యేలా, సరదాగా ఈ సినిమాలో చూపించడం జరిగింది. కొన్ని ఊహించని సన్నివేశాలను కూడా చూస్తారు. నిర్మాతలు నాగవంశీ, 'దిల్' రాజులతో పాటు దర్శకులు హరీష్ శంకర్, కల్యాణ్ శంకర్ గెస్ట్ రోల్స్ చేశారు. నేను కూడా నటించాను. కానీ హీరోగా యాక్ట్ చేయడం నాకు ఇష్టం లేదు. దర్శకత్వంపైనే ఆసక్తి ఎక్కువ. దర్శకుడిగా నేను చెప్పాల్సిన కథలు చాలానే ఉన్నాయి.

● విశ్వక్ మంచి పెర్ఫార్మెన్స్ చేశారు. హీరోకు సమానమైన పాత్రలో కయాదు యాక్ట్ చేసింది. ఈ చిత్రం విషయంలో నాగవంశీగారితో కంటే కూడా నేను చినబాబుగారితో ఎక్కువగా ట్రావెల్ చేశాను. త్రివిక్రమ్‌గారు సినిమా చూసి, మంచి సలహాలు ఇచ్చారు. ● ప్రతి సినిమా హిట్ కావాలనే ఆకాంక్షతోనే చేస్తాం. కానీ నా గత చిత్రం 'ప్రిన్స్'కు సరైన రిజల్ట్ రాలేదు. స్క్రిప్ట్ వర్క్‌కు సరైన సమయం దొరకలేదు. 'ఫంకీ' స్క్రిప్ట్‌కు మంచి టైమ్ దొరికింది... మంచి కథ కుదిరింది. హాస్య సన్నివేశాల్లో సహజత్వం ఉంటే ఆ సినిమా ఆడియన్స్‌కు చేరువ అవుతుంది. అలా 'జాతి రత్నాలు' విజయం సాధించిందని నేను అనుకుంటున్నాను. ఇక 'జాతిరత్నాలు 2' ఇప్పట్లో ఉండదు. కథ పరంగా సంతృప్తిగా ఫీలైనప్పుడే 'జాతిరత్నాలు 2' చేస్తాం. ● మైత్రీ మూవీ మేకర్స్, 14 రీల్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థల్లో నేను సినిమాలు చేయాల్సి ఉంది. వెంకటేశ్ గారితో ఓ సినిమాకు చర్చలు జరుగుతున్నాయి. స్క్రిప్ట్ రెడీ చేస్తున్నాను. రవితేజగారితో సినిమా కోసం చర్చలు జరిగాయి కానీ ఈ సినిమా ఉండదు. ఓ లేడీ ఓరియంటెడ్ స్క్రిప్ట్ ఉంది.

శివ... మిత్ర... ఓ ప్రేమ ప్రయాణం

● సంతోష్ శోభన్, మానస

సంతోష్ శోభన్, మానసా వారణాసి హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 14న థియేటర్స్‌లో విడుదల కానుంది. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నేను శివ పాత్రలో, మిత్రగా మానస నటించారు. శివకు మిత్ర పరిచయం అయ్యాక అతని జీవితం ఎలా మారిందన్నది సినిమాలో చూడాలి. శివ, మిత్రల జర్నీ ఆసక్తికరంగా ఉంటుంది. చెన్నై నేపథ్యంలో సాగే లవ్ స్టోరీ ఇది. 'కపుల్‌ఫ్రెండ్లీ' ఆడియన్స్‌ను నవ్విస్తుంది... కదిలిస్తుంది. మాపై ఉన్న ప్రేమతోనే మేం అడగకుండానే ప్రభాస్ అన్న మా సినిమా ట్రైలర్‌ని తన ఇన్‌స్టాలో షేర్ చేశారు'' అని అన్నారు. ''మా 'కపుల్ ఫ్రెండ్లీ' టైటిల్‌ను 'ఫ్రెండ్లీ కపుల్'గా మారిస్తే, యూ/ఎ సర్టిఫికెట్ ఇస్తామని, లేకపోతే 'ఎ' సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ వారు పేర్కొన్నారు. రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో టైటిల్‌ను మార్చదలచుకోలేదు. దీంతో మాకు 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. అంతే తప్ప మా సినిమాలో అభ్యంతరకరమైన కంటెంట్ లేదు. తమిళంలో మాత్రం ఇదే టైటిల్ తో యూ/ఎ సర్టిఫికేషన్ దక్కింది. 'కపుల్ ఫ్రెండ్లీ' ప్యూర్ లవ్‌స్టోరీ ఫిల్మ్'' అని చెప్పారు ధీరజ్ మొగిలినేని.

సాక్షి బిజినెస్
బుధవారం
11-2-2026

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
208	68
84,274	25,935

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,272	▲	33
డోజోన్స్	50,389	▲	253
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,360	▼	26
డాక్స్	25,042	▲	27
షాంఘై	4,128	▲	5
నికాయ్	57,651	▲	1,287

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.25	91.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	122.75	125.79
€	యూరో	ఎస్‌బీఐ	106.72	109.57
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.09	58.49
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	62.36	64.71
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	68.82	72.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.22	24.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.73	24.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.15	13.97

సెన్సెక్స్..అదే జోష్

మరో 208 పాయింట్లు అప్

ముంబై: అమెరికా–భారత్‌ల మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ఉత్సాహంతో దేశీయ స్టాక్ మార్కెట్ మూడోరోజూ ముందడుగేసింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి రికవరీ కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 208 పాయింట్లు పెరిగి 84,274 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 68 పాయింట్లు లాభపడి 25,935 వద్ద నిలిచింది. సూచీలు ఉదయం లాభాల్లో మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు కలిసిరావడంతో ఒక దశలో సెన్సెక్స్ 417 పాయింట్లు పెరిగి 84,483 వద్ద, నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 25,989 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. అయితే ఎగువ స్థాయిల్లో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీల లాభాలు సగానికి పైగా హరించుకుపోయాయి.

తడబడిన వెండి ఎగసిన పసిడి

రూ.7500 డౌన్ | రూ.2,200 ప్లస్

న్యూఢిల్లీ: అమ్మకాల ఒత్తిడికి వెండి నష్టపోగా.. కొనుగోళ్ల మద్దతుతో పసిడి ధరలు పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో మంగళవారం వెండి కిలోకి రూ.7,500 నష్టపోయి రూ.2,64,500 లక్షలకు (పన్నులు కలుపుకుని) పరిమితమైంది. బంగారం 10 గ్రాములకు రూ.2,200 పెరిగి రూ.1,60,700 వద్ద (పన్నులు సహా) స్థిరపడింది. జ్యుయలర్లు, ఇన్వెస్టర్ల నుంచి స్థిరమైన కొనుగోళ్లు వరుసగా రెండో రోజు పసిడి ధరలు పెరగడానికి కారణమని ట్రేడర్లు తెలిపారు. బంగారం, వెండి ధరలు ఒక శ్రేణి పరిధిలో చలించొచ్చని.. ఈ మార్కెట్లు సమీప కాలానికి స్థిరీకరణ దశలోకి ప్రవేశించినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ఔన్స్‌కు ఒక డాలర్‌కు పైగా నష్టపోయి రూ.82.16 డాలర్ల స్థాయిలో ట్రేడ్ అయింది. బంగారం స్వల్ప నష్టంతో ఔన్స్ 5,052 డాలర్ల స్థాయిలో కదలాడింది. అమెరికాలో రిటైల్ విక్రయాలు, నిరుద్యోగ డేటా కోసం ఇన్వెస్టర్లు వేచి చూస్తున్నట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు.

బంగారమే బిగ్ బాస్

- దారి మళ్లిన పెట్టుబడులు
- ఈక్విటీల నుంచి గోల్డ్ ఫండ్స్‌లోకి
- చరిత్రలో తొలిసారి
- జనవరిలో రూ.24,040 కోట్లు

న్యూఢిల్లీ: గోల్డ్, **వెండి ఈటీఎఫ్‌లోకి రికార్డు** స్థాయిలో పెట్టుబడులు వచ్చాయి. **జనవరిలో** రూ.24,040 కోట్లు **గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి** రాగా, వెండి ఈటీఎఫ్‌లు రూ.**9,463**కోట్లను **ఆకర్షించాయి. గత** డిసెంబర్‌లో **గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి** వచ్చిన రూ.11,647 కోట్ల**తో పోల్చితే రెట్టింపునకు పైగా** పెరిగాయి. అంతే**కాదు ఒక నెలలో ఈక్విటీ** ఫండ్స్‌కు మించి బంగారం **ఈటీఎఫ్‌లు** పెట్టుబడులను ఆకర్షించడం కూడా **చరిత్రలో ఇదే మొదటిసారి.** మరోవైపు **ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్** పెట్టుబడుల పట్ల ఇన్వెస్టర్ల**లో ఆసక్తి సన్నగిల్లుతూ..** బంగారం, వెండిపైకి **మనసు మళ్లుతోంది. జనవరిలో** ఈక్విటీ ఫండ్స్ నికరంగా రూ.24,028 కోట్లను ఆకర్షించాయి. డిసెంబర్‌లో వచ్చిన పెట్టుబడులు రూ.28,054 కోట్లతో పోల్చి చూస్తే 14 శాతం తగ్గినట్టు తెలుస్తోంది. ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక తగ్గడం వరుసగా ఇది రెండో నెల. గతేడాది నవంబర్‌లో ఈక్విటీ ఫండ్స్ రూ.29,911 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం. దీంతో పోల్చితే డిసెంబర్‌లో 6 శాతం తగ్గాయి. ఇక **గతేడాది అక్టోబర్‌లో వచ్చిన పెట్టుబడులు రూ.24,690 కోట్లుగా ఉన్నాయి. మొత్తం మీద ఈక్విటీ పెట్టుబడుల రాక మూడు నెలల కనిష్టానికి చేరింది.**

కమోడిటీల వైపు అడుగులు..

గత కొన్ని నెలలుగా ఈక్విటీ మార్కెట్లు ఎలాంటి రాబడులు ఇవ్వకపోగా.. బంగారం, వెండి మంచి ర్యాలీ చేస్తున్నాయని.. దీంతో కొంత మేర పెట్టుబడులు కమోడిటీల్లోకి మళ్లినట్టు వీఎస్‌ఆర్‌కే క్యాపిటల్ డైరెక్టర్ స్వప్నిల్ అగర్వాల్ తెలిపారు. ఇక నుంచి ఈక్విటీ పథకాల్లోకి పెట్టుబడుల రాక క్రమంగా మెరుగుపడొచ్చని అభిప్రాయపడ్డారు. స్టాక్స్ విలువలు ఆకర్షణీయంగా ఉండడం, స్థిరీకరణ ముగియడంతో ఈ ఏడాది ఈక్విటీలు బలమైన **పనితీరు చూపించొచ్చని, దీంతో ఇన్వెస్టర్ల** నుంచి **పెట్టుబడులు పుంజుకోవచ్చని అంచనా** వేశారు.

- **ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్/పన్ను ఆదా ఫండ్స్) పథకాల నుంచి** రూ.594 **కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు.**
- **మరోవైపు డెట్ మ్యూచువల్ ఫండ్స్‌**లోకి నికరంగా **రూ.74,827 కోట్ల పెట్టుబడులు** వచ్చాయి. **డిసెంబర్‌లో ఇదే విభాగం రూ.1.32** లక్షల కోట్లను **కోల్పోవడం గమనార్హం.**
- హైబ్రిడ్ ఫండ్స్‌లోకి (ఈక్విటీ, డెట్ కలసిన) రూ.17,356 కోట్లు.. మల్టీ అసెట్ ఫండ్స్‌లోకి (ఈక్విటీ, డెట్, బంగారం, వెండి కలసిన) రూ.10,485 కోట్లు చొప్పున వచ్చాయి.
- మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని అన్ని రకాల పెట్టుబడుల విలువ (ఏయూఎం) జనవరి చివరికి రూ.81.01 లక్షల కోట్లకు పెరిగింది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి జనవరిలోనూ రికార్డు స్థాయిలో రూ.31,000 పెట్టుబడులు వచ్చాయి.

గోల్డ్, వెండికి డిమాండ్..

గోల్డ్ ఈటీఎఫ్‌లోకి రూ.24,040 కోట్లు రావడంతో.. ఫండ్స్ నిర్వహణలోని మొత్తం గోల్డ్ ఈటీఎఫ్ ఆస్తుల విలువ రూ.1.84 లక్షల కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.61,000 కోట్లు రావడం గమనార్హం. మరోవైపు వెండి ఈటీఎఫ్‌ల్లోకి డిసెంబర్‌లో రూ.9,463 కోట్లు రావడంతో.. వెండి ఈటీఎఫ్‌ల నిర్వహణ ఆస్తుల విలువ రూ. 1.16 లక్షల కోట్లకు పెరిగింది. డిసెంబర్‌లో వచ్చిన 3,962 కోట్లతో పోల్చి చూస్తే ఒక్క నెలలోనే 139 శాతం పెరిగాయి.

బిలియన్ డాలర్ల...
భావోద్వేగాల బిజినెస్

సాక్షి, బిజినెస్ డెస్క్

భారత్‌లో ఇప్పుడు కొత్త తరహా డిజిటల్ స్నేహితులు అడుగుపెడుతున్నారు. ఏఐ ఆధారిత వర్చువల్ పెట్స్ (ఏఐ పెట్స్) యువతలో వేగంగా ఆదరణ పొందుతున్నాయి. నగర జీవనంలో పెరుగుతున్న ఒంటరితనం, నిజమైన పెంపుడు జంతువుల బాధ్యతలు తీసుకోలేని పరిస్థితుల్లో ఏఐ పెట్స్ ఒక ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. భావోద్వేగంగా స్పందించడం, మాటలతో ఆదుకోవడం వంటి లక్షణాల వల్ల ఇవి యువతను ఆకర్షిస్తున్నాయి. వీటితో యూజర్లు నిజమైన జంతువును పెంచుకుంటున్న అనుభూతి పొందుతారు. వీటితో కూడా రోజువారీ రొటీన్‌ను ఫాలో అవచ్చు. ఆహారం పెట్టడం, స్నానం చేయించడం, ఆడించడం, నిద్ర షెడ్యూల్ చూసుకోవడం వంటి పనులు చేస్తూ నిజమైన పెంపుడు జంతువును ఆడించినట్లే ఆనందిస్తారు. ఈ పెట్ అప్లికేషన్లలో వినియోగదారులు తమ పెంపుడు జంతువుకు దుస్తులు, ఆభరణాలు కొనుగోలు చేయవచ్చు. నెలకు సగటున రూ. 30 నుంచి రూ. 60 వరకు ఖర్చు చేస్తూ, ఆ ఏఐ పెట్‌ను సంరక్షించడం, శిక్షణ ఇవ్వడం, భావోద్వేగంగా స్పందించేలా నేర్పించడం చేస్తున్నారు.

పెరుగుతున్న మార్కెట్

వర్చువల్ పెట్స్ మార్కెట్ విలువ ప్రస్తుతం సుమారు 150 మిలియన్ డాలర్లని అంచనా. వెంచర్ క్యాపిటలిస్టులు ఈ రంగం 35–40 శాతం వార్షిక వృద్ధితో బిలియన్ డాలర్లకు చేరుతుందని ఊహిస్తూ అందుకు అనుగుణంగా పెట్టుబడులు పెడుతున్నారు.

పెట్ ఫ్రెండ్‌షిప్

- ఒంటరి తనానికి డిజిటల్ స్నేహం
- ఏఐ జంతువుల పెంపకంపై పెరుగుతున్న క్రేజ్
- కేర్, కనెక్షన్, కంపానియన్‌షిప్ అన్నీ ఒకే యాప్‌లో
- లాభాలు అందిస్తున్న ఎమోషనల్ ఎకానమీ
- టెక్ స్టార్టప్‌లకు నెక్ట్స్ యూనికార్న్ సెగ్మెంట్

ఈ యాప్‌లు ప్రధానంగా సబ్‌స్క్రిప్షన్లు,ఇన్–యాప్ కొనుగోళ్లు, పెట్ యాక్సెసరీస్ ద్వారా ఆదాయం పొందుతున్నాయి.

భవిష్యత్తు ఎలా ఉంటుంది?

వాయిస్ ఆధారిత ఇంటరాక్షన్, మల్టీప్లేయర్ ఫీచర్లు, వివిధ లొకేషన్లలో పెట్స్‌ను కలుసుకునే అవకాశాలతో ఈ రంగం మరింత విస్తరిస్తోంది. అయితే ఏఐ పెట్స్ టెక్నాలజీ నిజమైన మానవ సంబంధాల నుంచి మనుషులను దూరం చేస్తుందని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు.

టమాగోచ్చి నుంచి ఏఐ వరకు

వాస్తవానికి డిజిటల్ పెట్స్ కాన్సెప్ట్ కొత్తది కాదు. జపాన్‌లో 1990లలో వచ్చిన టమాగోచ్చి వీడియో గేమ్ వర్చువల్ పెట్స్‌కు బాట వేసింది. ఆ తర్వాత 2000లలో టాకింగ్ టామ్, ఫ్రెండ్స్ యాప్స్, విడ్జెట్స్ వంటి అప్లికేషన్లు పాపులర్ అయ్యాయి. ఇప్పుడు ఏఐ టెక్నాలజీతో ఈ వర్చువల్ పెట్స్ మరింత అడ్వాన్స్‌డ్‌గా మారాయి. పాకెట్ పెట్, క్రిప్టో కిట్టీస్, జూమీ వంటి యాప్‌లు యూజర్లు తమ ఊహలకు అనుగుణంగా పెంపుడు జంతువులను సృష్టించుకునే అవకాశం ఇస్తున్నాయి.

టైటాన్ లాభం హైజంప్

- క్యూ3లో రూ. 1,684 కోట్లు
- జ్యువెలరీ బిజినెస్ జూమ్

న్యూఢిల్లీ: జ్యువెలరీ, వాచీల తయారీ టాటా గ్రూప్ దిగ్గజం టైటాన్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 61 శాతం జంప్‌చేసి రూ. 1,684 కోట్లను తాకింది. దేశీయంగా జ్యువెలరీ అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 1,047 కోట్లు ఆర్జించింది. అమ్మకాలు సైతం 42 శాతం ఎగసి రూ. 24,915 కోట్లను తాకాయి. అయితే మొత్తం వ్యయాలు 41 శాతం పెరిగి రూ. 23,192 కోట్లకు చేరాయి. కాగా.. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 43 శాతం బలపడి రూ. 25,567 కోట్లకు చేరింది. తనిష్క్, మియా, జోయా, కేరట్‌లేన్ బ్రాండ్ల జ్యువెలరీ బిజినెస్ ఆదాయం 46 శాతం జంప్‌చేసి రూ. 23,492 కోట్లయ్యింది. వీటిపై 11 శాతం మార్జిన్లు సాధించింది. అంతర్జాతీయ అమ్మకాలు 83 శాతం దూసుకెళ్లి రూ. 1,058 కోట్లను తాకాయి. జ్యువెలరీ బిజినెస్‌లో 49 స్టోర్లను కొత్తగా జత కలుపుకోగా.. వీటిలో 24 కేరట్‌లేన్ విభాగానివే. 22 కొత్త స్టోర్లను జత చేసుకున్న వాచీలు తదితరాల విభాగం 14 శాతం అధికంగా రూ. 1,295 కోట్ల ఆదాయం అందుకుంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.25 శాతం బలపడి రూ. 4,267 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఏఐ వినియోగంలో భారత్ జోరు | బీహెచ్ఈఎల్ షేర్ల విక్రయం

ఆకృతికి రజతం... అంజుమ్‌కు కాంస్యం

న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు తమ జోరు ప్రదర్శిస్తున్నారు. పోటీల ఏడో రోజు సీనియర్ విభాగంలో భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరాయి. సీనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో ఆకృతి దహియా రజత పతకం నెగ్గగా... అంజుమ్ మౌద్గిల్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో ఆకృతి 354.2 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. అంజుమ్ 340.4 పాయింట్లు సాధించి మూడో స్థానాన్ని దక్కించుకుంది. టీమ్ విభాగంలో ఆకృతి, అంజుమ్, అషిలతో కూడిన భారత జట్టు 1756 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెల్చుకుంది. జూనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లోనూ భారత్‌కు రెండు పతకాలు లభించాయి. ప్రాచి (353.3 పాయింట్లు) బంగారు పతకాన్ని... అనుష్క (341.1 పాయింట్లు) కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. టీమ్ విభాగంలో ప్రాచి, అన్ను, హేజెల్‌లతో కూడిన భారత జట్టు పసిడి పతకం నెగ్గింది.



లీడె మెరుపులు

- 48 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 72 నాటౌట్
- నమీబియాపై నెదర్లాండ్స్ గెలుపు

న్యూఢిల్లీ: ఐసీసీ టి20 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ రెండో మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టింది. మెగా ఈవెంట్ ప్రారంభ మ్యాచ్‌లో పాకిస్తాన్ చేతిలో ఓడిన నెదర్లాండ్స్... మంగళవారం గ్రూప్ 'ఎ'లో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో నమీబియాపై ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన డచ్ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జాన్ లోఫ్టి ఈటన్ (38 బంతుల్లో 42; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించగా, జాన్ ఫ్రైలింక్ (30; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. లోగాన్ వాన్ బీక్, బాస్ డి లీడె చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన నెదర్లాండ్స్ 18 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లలో మ్యాక్స్ ఓ డౌడ్ (7) విఫలమవగా, మైకేల్ లెవిట్ (15 బంతుల్లో 28; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడే క్రమంలో అవుటయ్యాడు. ఈ దశలో వన్‌డౌన్ బ్యాటర్ బాస్ డి లీడె (48 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. అకెర్మన్ (28 బంతుల్లో 32; 1 సిక్స్)తో కలిసి మూడో వికెట్‌కు 70 పరుగులు జోడించాడు. 116 స్కోరు వద్ద అకెర్మన్ అవుటయ్యాక... కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి అజేయంగా మ్యాచ్ గెలిపించి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కూడా అందుకున్నాడు.

10 వికెట్ల తేడాతో...

యూఏఈపై కివీస్ జయభేరి

- చెలరేగిన సీఫెర్ట్, అలెన్

చెన్నై: టి20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ రికార్డు విజయంతో 'సూపర్ ఎయిట్స్'కు చేరువైంది. మంగళవారం చిదంబరం స్టేడియంలో జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో ఓపెనర్లు సత్తా చాటడంతో కివీస్ 10 వికెట్ల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ని చిత్తుగా ఓడించింది. తొలి పోరులో అఫ్గానిస్తాన్‌ను ఓడించిన న్యూజిలాండ్‌కు ఇది వరుసగా రెండో విజయం. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. కెప్టెన్ ముహమ్మద్ వసీమ్ (45 బంతుల్లో 66 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), అలీషాన్ షరఫు (47 బంతుల్లో 55; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 77 బంతుల్లోనే 107 పరుగులు జోడించారు. మాట్ హెన్రీకి 2 వికెట్లు దక్కాయి. అనంతరం న్యూజిలాండ్ 15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 175 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిమ్ సీఫెర్ట్ (42 బంతుల్లో 89 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఫిన్ అలెన్ (50 బంతుల్లో 84 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ప్రత్యర్థి బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయారు. తొలి వికెట్‌కు 92 బంతుల్లోనే 175 పరుగులు జత చేసి కొత్త రికార్డుతో మరో 27 బంతులు మిగిలి ఉండగానే జట్టును గెలిపించారు.

175 టి20 ప్రపంచకప్‌లో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. 2022 ప్రపంచకప్‌లో భాగంగా భారత్‌తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో జోస్ బట్లర్, అలెక్స్ హేల్స్ తొలి వికెట్‌కు జత చేసిన 170 పరుగుల రికార్డును ఇప్పుడు సీఫెర్ట్, అలెన్ సవరించారు.

ప్రపంచకప్ నుంచి హసరంగ, బ్రేస్‌వెల్ అవుట్

న్యూఢిల్లీ: తాజా టి20 ప్రపంచకప్‌లో దాదాపు అన్ని జట్లను గాయాల బెడద వేధిస్తోంది. తాజాగా శ్రీలంక, న్యూజిలాండ్‌లకు చెందిన హసరంగ, మైకేల్ బ్రేస్‌వెల్ మెగా ఈవెంట్‌కు దూరమయ్యారు. ఆదివారం ఐర్లాండ్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో శ్రీలంక ఆల్‌రౌండర్ హసరంగ తొడ కండరాల గాయానికి గురయ్యాడు. దీంతో వరల్డ్‌కప్‌లో కొనసాగే అవకాశం లేకపోవడంతో అతని స్థానాన్ని లెగ్ స్పిన్నర్ హేమంతతో భర్తీ చేసుకునేందుకు ఐసీసీ ఆమోదం తెలిపింది. బ్రేస్‌వెల్ భారత పర్యటనకు వచ్చినపుడే గాయపడ్డాడు. అయితే వార్మప్ మ్యాచ్ సమయంలో అతని గాయం తిరగబెట్టింది. దీంతో అతని స్థానంలో ఆల్‌రౌండర్ కోల్ మెక్‌కొంచిని తీసుకున్నారు.

వనీషాకు మూడు స్వర్ణాలు

న్యూఢిల్లీ: జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన సూరినేని వనీషా రావు మూడు స్వర్ణ పతకాలతో మెరిసింది. 52 కేజీల విభాగంలో పోటీపడ్డ వనీషా రావు స్క్వాట్‌లో 100 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 40 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 110 కేజీలు బరువెత్తి మూడు పసిడి పతకాలు సొంతం చేసుకుంది. ఐఎస్‌టీఏ కాలేజీలో ఇంటర్మీడియట్ తొలి సంవత్సరం విద్యార్థి అయిన వనీషా ఓవరాల్‌గా 250 కేజీలు బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది.

పాకిస్తాన్‌దే పైచేయి

- అమెరికాపై 32 పరుగులతో గెలుపు
- రాణించిన ఫర్హాన్, తారిఖ్

కొలంబో: గత టి20 ప్రపంచకప్‌లో అమెరికా **చేతిలో** ఎదురైన అనూహ్య పరాజయానికి **ఈ** ప్రపంచకప్‌లో పాకిస్తాన్ ప్రతీకారం తీర్చుకుంది. టోర్నీలో శనివారం నెదర్లాండ్స్‌తో జరిగిన తొలి పోరులో కష్ట మీద గట్టెక్కిన పాక్... అమెరికాపై మాత్రం ఎలాంటి తడబాటు లేకుండా మ్యాచ్‌ను ముగించింది. మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో పాక్ 32 పరుగుల తేడాతో అమెరికాపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాహిబ్‌జాదా ఫర్హాన్ (41 బంతుల్లో 73; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో చెలరేగగా... బాబర్ ఆజమ్ (32 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్), షాదాబ్ ఖాన్ (12 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సయీమ్ అయూబ్ (19)తో తొలి వికెట్‌కు 54 పరుగులు (31 బంతుల్లో) జోడించిన ఫర్హాన్... మూడో వికెట్‌కు బాబర్ ఆజమ్‌తో 53 బంతుల్లో 81 పరుగులు జత చేశాడు. అమెరికా బౌలర్ షాల్విక్ 25 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 191 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 158 పరుగులే చేయగలిగింది. శుభమ్ రంజనే (51; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో పాటు జహంగీర్ (49; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిలింద్ కుమార్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) ప్రదర్శన జట్టును గెలిపించేందుకు సరిపోలేదు. ఆఫ్ స్పిన్నర్ తారిఖ్ 27 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, షాదాబ్ ఖాన్‌కు 2 వికెట్లు దక్కాయి. 1982లో తొలి అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చిన సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఫ్లడ్‌లైట్లతో ఇదే తొలి డే అండ్ నైట్ మ్యాచ్ కావడం విశేషం.

ఫర్హాన్

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X అఫ్గానిస్తాన్
వేదిక: అహ్మదాబాద్; ఉదయం 11 గం॥ నుంచి
ఆస్ట్రేలియా X ఐర్లాండ్
వేదిక: కొలంబో; మధ్యాహ్నం 3 గం॥ నుంచి
ఇంగ్లండ్ X వెస్టిండీస్
వేదిక: ముంబై ; రాత్రి 7 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఎహ్సాన్ ఆదిల్ అరుదైన ఘనత

అంతర్జాతీయ క్రికెట్‌లో సీనియర్ స్థాయిలో రెండు దేశాలకు ప్రాతినిధ్యం వహించిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో పేస్ బౌలర్ ఎహ్సాన్ ఆదిల్ కూడా చేరాడు. 32 ఏళ్ల ఆదిల్ 2013లో అరంగేట్రం చేసి పాకిస్తాన్ తరఫున 3 టెస్టులు, 6 వన్డేలు ఆడాడు. 2015 వన్డే వరల్డ్ కప్‌లో కూడా అతను రెండు మ్యాచ్‌లలో బరిలోకి దిగాడు. అయితే ఆ తర్వాత అమెరికాకు వలస వెళ్లిన అతను అక్కడ తన క్రికెట్‌ను కొనసాగించి జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అమెరికా టి20 వరల్డ్ కప్‌లో చోటు దక్కించుకున్న ఆదిల్‌కు ఇదే తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ కాగా... తన సొంత దేశం పాకిస్తాన్‌తోనే తలపడే అవకాశం రావడం విశేషం. ఈ మ్యాచ్‌లో అతను 3 ఓవర్లలో 39 పరుగులిచ్చాడు.

డిజిటలైజేషన్.. ఆటోమేషన్.. ప్రస్తుతం అన్ని రంగాల్లోకి దూసుకొస్తోంది. మానవ ప్రమేయం తగ్గించి.. ఆటోమేషన్ విధానంలో కార్యకలాపాలు నిర్వహించే దిశగా సంస్థలు చర్యలు చేపడుతున్నాయి. అందుకోసం రోబోటిక్ టెక్నాలజీ వైపు మొగ్గు చూపుతున్నాయి. దీంతో ఈ టెక్నాలజీ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా.. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే రోబోటిక్స్ కొలువు సొంతం చేసుకోవాలంటే.. ప్రత్యేక నైపుణ్యాలు తప్పనిసరి. ఈ నేపథ్యంలో.. రోబోటిక్స్ కొలువులు, తాజా ట్రెండ్స్, అవసరమయ్యే నైపుణ్యాలు, నేర్చుకునేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

సంస్థల్లో అధిక శాతం పనులు మానవ ప్రమేయంతో జరుగుతున్న సంగతి తెలిసిందే. మానవ ప్రమేయం తగ్గించడంతోపాటు కార్యకలాపాలను వేగవంతం చేయాలనే ఆలోచన నుంచి ఆవిష్కృతమైన టెక్నాలజీనే.. రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ (ఆర్‌పీఏ)! దీనిద్వారా సంస్థల కార్యకలాపాలను రోబోల ఆధారంగా వేగవంతంగా నిర్వహిస్తారు. నాస్కామ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి సంస్థలు తాజాగా పేర్కొన్న నివేదికల ప్రకారం– పది మంది చేసే పనిని ఒక్క రోబో పూర్తి చేస్తుంది. అందుకే సంస్థలన్నీ రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ కార్యకలాపాల వైపు దృష్టి పెడుతున్నాయి.

నైపుణ్యాలు అందుకునే మార్గాలు

- రోబోటిక్స్ నైపుణ్యాలు సొంతం చేసుకునేందుకు అకడమిక్ స్థాయి నుంచే అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి.
- ఎంటెక్‌లో మెడికల్ రోబోటిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, రోబోట్ మోషన్ ప్లానింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ స్పెషలైజేషన్లు అభ్యసించడం ద్వారా ఆర్‌పీఏ నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చు.
- వీటితోపాటు సీమెన్స్, రోబోటిక్స్ ఆన్‌లైన్, సర్టిఫైడ్ ఆటోమేషన్ ప్రొఫెషనల్, రోబోటిక్స్ టెక్నీషియన్ అండ్ ఆటోమేషన్ ట్రైనింగ్ వంటి సర్టిఫికేషన్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.
- ఐఐటీలు, ఎన్‌ఐటీలు ఇతర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో బీటెక్ స్థాయిలో రోబోటిక్స్‌ను మైనర్ సబ్జెక్ట్‌గా అందిస్తున్నాయి.
- ఎంటెక్ స్థాయిలో రోబోటిక్స్ స్పెషలైజేషన్‌తో పూర్తి స్థాయి ప్రోగ్రామ్‌లను పలు ఇన్‌స్టిట్యూట్‌లు ప్రవేశపెడుతున్నాయి.
- ఏఐసీటీఈ సైతం రోబోటిక్స్, ఏఐ విభాగాలకు సంబంధించిన స్కిల్స్ అందించేలా కరిక్యులం రూపొందించాలని అనుబంధ కళాశాలలకు మార్గనిర్దేశం జారీ చేసింది.



రోబోల రాజ్యం.. ఆఫర్లు అపారం!

బీటెక్ నుంచే రోబోటిక్స్ దిశగా...

- రోబోటిక్స్ నైపుణ్యాలు పొందేందుకు బీటెక్‌లోనే ఈ కోర్సును అందించే ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం కోసం ప్రయత్నించొచ్చు. లేదా రోబోటిక్స్‌కు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులనైనా పూర్తి చేసుకోవచ్చు. తద్వారా బ్రాంచ్‌తో సంబంధం లేకుండా రోబోటిక్స్ దిశగా అడుగులు వేయొచ్చు.
- ఎంటెక్/ఎంఈ స్థాయిలో రోబోటిక్స్‌కు సంబంధించి పలు స్పెషలైజేషన్స్ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా మెడికల్ రోబోటిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, రోబోట్ మోషన్ ప్లానింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఉన్నాయి.

జాబ్ ప్రొఫైల్స్

- రోబోటిక్స్ ఇంజనీరింగ్ లేదా రోబోటిక్స్ స్పెషలైజేషన్ పూర్తి చేసిన అభ్యర్థులకు పలు జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. వీటిల్లో రోబోటిక్స్ టెక్నీషియన్స్, రోబోట్ డిజైన్ ఇంజనీర్, రోబోటిక్స్ టెస్ట్ ఇంజనీర్స్, సీనియర్ రోబోటిక్స్ ఇంజనీర్స్, ఆటోమేటెడ్ ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీర్, అగ్రికల్చర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్, రోబోటిక్ సిస్టమ్ ఇంజనీర్ వంటి హోదాలు దక్కుతున్నాయి.
- రోబోటిక్స్ వినియోగం పరంగా ఇండస్ట్రియల్ రోబోట్స్, మెడికల్ రోబోట్స్, హెల్త్‌కేర్ రోబోటిక్స్, హాస్పిటాలిటీ రోబోటిక్స్, లాజిస్టిక్స్ రోబోటిక్స్ ప్రధానంగా ఉన్నాయని చెప్పొచ్చు. వీటిలోనూ సిగ్నల్ ప్రాసెసింగ్, రోబోటిక్ మోషన్ ప్లానింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్, ఏఐ అండ్ రోబోటిక్స్‌కు డిమాండ్ నెలకొంది.

ఎలాంటి నైపుణ్యాలు కావాలి?

రోబోటిక్స్ విభాగంలో కొలువులు సొంతం చేసుకోవాలంటే.. నిర్దిష్టంగా కొన్ని నైపుణ్యాలు సొంతం చేసుకోవాల్సి ఉంటుంది. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్, కోడింగ్ స్కిల్స్, నానో టెక్నాలజీ, డిజైన్ అండ్ టెక్నాలజీ సంబంధిత రంగాల్లో కోర్ నైపుణ్యాలు అవసరమవుతాయి. ఉదాహరణకు.. సాఫ్ట్‌వేర్ రంగంలో రోబోటిక్స్ విభాగంలో రాణించాలంటే.. రోబోల రూపకల్పనకు అవసరమైన స్పీచ్ రికగ్నిషన్, వాయిస్ రికగ్నిషన్ వంటి కోడింగ్ స్కిల్స్ తప్పనిసరి. అదే విధంగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషీన్ లెర్నింగ్‌పై పట్టు ఉండాలి. కారణం.. రోబోల రూపకల్పన, నిర్వహణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారితంగా ఉండటమే.

సర్టిఫికేషన్ కోర్సులు

రోబోటిక్స్‌లో పూర్తి స్థాయి కోర్సులు అభ్యసించే అవకాశంలేని విద్యార్థులు మూక్స్, ఆన్‌లైన్ విధానంలో సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేసుకోవచ్చు. తద్వారా జాబ్ మార్కెట్‌లో పోటీ పడే అవకాశం లభిస్తుంది.

కంపెనీల్లో విస్తరిస్తున్న రోబో ఆధారిత కార్యకలాపాలు

సేవా రంగం మొదలు ఉత్పత్తి రంగం వరకు కొలువులు

ఐటీ రంగంలో భారీ సంఖ్యలో ఆఫర్లు

జాబ్ స్కిల్స్



ప్రొడక్షన్ టు హెల్త్‌కేర్

వాస్తవానికి రోబోటిక్ సేవలు గత దశాబ్ద కాలం క్రితమే అందుబాటులోకి వచ్చినా.. కోవిడ్ అనంతరం కాలంలో సంస్థలు ఆటోమేషన్ దిశగా అడుగులు వేశాయి. ప్రస్తుతం ఉత్పత్తి రంగం మొదలు హెల్త్ కేర్, సర్వీస్ సెక్టార్ వరకూ..దాదాపు అన్ని రంగాలు రోబో ఆధారిత కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో ఐటీ రంగంలో రోబో ఆధారిత సేవలు విస్తరిస్తున్నాయి. ఐటీ అనుబంధ విభాగంగా పేర్కొనే బీపీఓ సెక్టార్‌లో చాట్‌బోట్స్, వర్చువల్ అసిస్టెంట్స్ పేరుతో రోబో ఆధారిత సేవలు అందించాలని ఐటీ సంస్థలు భావిస్తున్నాయి. దీంతో ఐటీ సహా అన్ని రంగాల్లో రోబోల వినియోగం పెరుగుతోంది. రెండేళ్ల క్రితం వరకు తయారీ రంగంలోని ఆటోమొబైల్ పరిశ్రమల్లోనే ఇండస్ట్రియల్ రోబోల వినియోగం ఉండేది. అయితే క్రమేణా ఇది ఇతర రంగాల్లోకి దూసుకొస్తోంది. ప్రధానంగా హెల్త్‌కేర్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, అగ్రికల్చర్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ తదితర విభాగాల్లో రోబో ఆధారిత కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.

మానవ ప్రమేయం తప్పనిసరి

రోబోటిక్స్ వల్ల ఉద్యోగాల్లో కోత పడుతుందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. అదేసమయంలో రోబోటిక్స్ వల్ల లక్షల సంఖ్యలో కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని చెబుతున్నాయి. దీనికి కారణం.. రోబోల తయారీ, నిర్వహణ, నియంత్రణకు మానవ ప్రమేయం తప్పనిసరి. రోబో ఆధారిత సేవలను అందుబాటులోకి తెచ్చే క్రమంలో.. సంస్థలు తమ వినియోగదారుల అవసరాలు, కార్యకలాపాలకు అనుగుణంగా స్పందించేలా రోబోలను తీర్చిదిద్దాల్సి ఉంటుంది. అందుకోసం ముందుగానే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్, కోడింగ్ వంటివి తప్పనిసరి. దీంతో రోబోలకు పెరుగుతున్న ప్రాధాన్యానికి అనుగుణంగా వాటిని సమర్థంగా పర్యవేక్షించేందుకు నిపుణుల అవసరం ఏర్పడుతోంది. కాబట్టి.. నైపుణ్యాలు పెంచుకుంటే చక్కటి కొలువులు సొంతం చేసుకోవచ్చు.

లక్షల కొలువులు

నాస్కామ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, పీడబ్ల్యూసీ తదితర సంస్థల ప్రకారం– ఒక్క రోబోతో పది మంది చేసే పనిని పూర్తి చేయొచ్చని అంచనా. రోబోల ప్రవేశంతో పనిలో మానవ ప్రమేయం తగ్గినా.. సదరు రోబోలు సమర్థవంతంగా పనిచేసేలా చూసే నిపుణుల అవసరం మాత్రం పెరిగింది. అంటే నిర్దిష్టంగా ఒక విభాగంలో రోబో సేవలు అందించాలని భావిస్తే.. దానికి సరితూగే విధంగా సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్, కోడింగ్ వంటివి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం తెర వెనుక మానవ ప్రమేయం తప్పనిసరి. దీంతో.. ఆర్‌పీఏ నైపుణ్యాలుంటే లక్షల కొలువులు ఖాయమని ఇండస్ట్రీ వర్గాలు, సర్వేల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. నాస్కామ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి సంస్థల నివేదికల ప్రకారం–2030 నాటికి దాదాపు పది లక్షల ఉద్యోగాలు రోబోటిక్స్ విభాగంలో అందుబాటులోకి రానున్నాయి. ఐటీ బీపీఓ రంగంలో 2026లో ఆర్‌పీఏ ఆధారిత సర్వీసులు 70 శాతం మేరకు పెరగనున్నాయి.

ఇంటర్ డిసిప్లినరీ స్కిల్స్..: రోబోటిక్స్ ఇంజనీరింగ్‌లో రాణించాలంటే.. అభ్యర్థులకు ఇంటర్ డిసిప్లినరీ స్కిల్స్ తప్పనిసరి. కారణం.. రోబోను రూపొందించేందుకు సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, మెకానికల్.. ఇలా పలు విభాగాలను సమ్మిళితం చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు.. రోబో కార్లనే పరిగణనలోకి తీసుకుంటే.. సదరు రోబో కారును నడిపేందుకు అవసరమైన ప్రోగ్రామ్‌ను రూపొందించాలంటే సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలు కావాలి. అదే విధంగా కోర్ ఏరియా పరంగా కారు రూపకల్పనకు సంబంధించి మెకానికల్ నైపుణ్యాలు అవసరమవుతాయి. కారు నడిచేందుకు ఎలక్ట్రానిక్స్ నైపుణ్యాలతో జీపీఎస్, నేవిగేషన్‌ను రూపొందించాల్సి ఉంటుంది.

రోబోటిక్స్ కోర్సులు అందించే పలు ఇన్‌స్టిట్యూట్స్ వివరాలు..

- రోబోటిక్స్ టెక్నీషియన్ అండ్ ఆటోమేషన్ ట్రైనింగ్
- వెబ్‌సైట్: www.onlinerobotics.com&
- రోబో జీనియస్ అకాడమీ: వెబ్‌సైట్: www.robogenious.in
- రోబోటిక్స్ ఆన్‌లైన్: వెబ్‌సైట్: www. robotics.org
- సర్టిఫైడ్ ఆటోమేషన్ ప్రొఫెషనల్: వెబ్‌సైట్: www.isa.org

ముఖ్యాంశాలు

- పీడబ్ల్యూసీ, నాస్కామ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా నివేదికల ప్రకారం–2026 చివరికి ఆటోమేషన్, రోబోటిక్స్ రంగంలో పది లక్షల ఉద్యోగాలు.
- రోబోటిక్ ఉద్యోగాలు అందించడంలో మూడో స్థానంలో భారత్.
- సాఫ్ట్‌వేర్, ప్రొడక్షన్, మెకానికల్, హెల్త్‌కేర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో అధిక శాతం నియామకాలు.
- కనిష్టంగా రూ.3లక్షలు, గరిష్టంగా రూ.10–12 లక్షల వార్షిక వేతనం.

డాక్టర్ రాధిక గోవింద

'స్టెమ్'లో మహిళల భాగస్వామ్యం పెరగాలి

ఎక్స్‌పర్ట్ స్పీక్స్

అమ్మాయిలు అన్ని రంగాల్లో సత్తా చూపుతున్నారు

పెరుగుతున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ రాధిక గోవింద

'ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ మహిళలు ఉన్నత స్థానాల్లో, కీలక హోదాల్లో ఉంటున్నారు. అయినా నేటికీ మహిళా విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగా(స్టెమ్)ల్లో ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలంటే వెనుకంజవేస్తున్నారు. దీనికి మన కుటుంబ, సామాజిక పరిస్థితులు కూడా కారణం. అమ్మాయిలు ఈ దృక్పథం వీడి ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందడుగువేయాలి' అని సూచిస్తున్నారు.. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్‌లో స్కూల్ ఆఫ్ సోషల్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రాధిక గోవింద. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి సౌత్ ఏసియన్ స్టడీస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి జండర్ స్టడీస్, జండర్ ఈక్వాలిటీపై పలు రీసెర్చ్ పేపర్స్ ప్రచురించిన డాక్టర్ రాధిక గోవిందతో ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రస్తుతం ఉన్నత విద్యలో మహిళల ఎన్‌రోల్‌మెంట్‌పై మీ అభిప్రాయం?

ఇటీవల కాలంలో ఉన్నత విద్యలో మహిళల ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతోంది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే.. ఇది ఇంకా పెరగాలి. ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించి స్టెమ్ విభాగాల్లో నేటికీ మహిళల సంఖ్య తక్కువగానే ఉంది. యునెస్కో నివేదిక ప్రకారం–అంతర్జాతీయంగా స్టెమ్ గ్రాడ్యుయేట్స్ 35 శాతం మాత్రమే ఉన్నారు. ఇక ఇంజనీరింగ్‌లో 15 శాతం వరకు మాత్రమే మహిళలు ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆధునిక సాంకేతికత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో 26 శాతం మంది మహిళలు ఉండడం విశేషం. అంటే.. మహిళలకు అపారమైన జ్ఞాన సంపద ఉంటోంది. వారిని ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణించగలరని నిరూపితం అవుతోంది.

ఐఐఎంల్లో జండర్ డైవర్సిటీకి వెయిటేజీతో ప్రయోజనం ఉంటుందా?

ఐఐఎంలు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో మహిళా విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా జండర్ డైవర్సిటీ విధానాలను అమల్లోకి తెచ్చారు. అయితే వాటిని అందిపుచ్చుకోవడంలో మహిళా విద్యార్థులు ముందుండాలి. వీరికి తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. అప్పుడే జండర్ డైవర్సిటీ వెయిటేజీ విధానాలు సత్ఫలితాన్నిస్తాయి.

అమెరికా ఆంక్షల నేపథ్యంలో.. యూకేలో భారతీయులకు అవకాశాలు ఎలా ఉంటాయని భావిస్తున్నారు?

వాస్తవానికి యూకేలో విధానాలు భారతీయులకు ఎప్పటి నుంచో అనుకూలంగా ఉంటున్నాయి. అందుకే యూఎస్ తర్వాత మన వాళ్లకు యూకే బెస్ట్ డెస్టినేషన్‌గా నిలుస్తోంది. అయితే ఏ దేశమైనా ఉద్యోగ అవకాశాల్లో స్థానికులకు ప్రాధాన్యం కల్పిస్తారు. ఇది సామాజిక, రాజకీయ, దేశ ఆర్థిక పరిస్థితుల ప్రభావం అని గుర్తించాలి. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీయులకు అవకాశాలు కల్పించే విషయంలో కొన్ని నిబంధనలు ఉండడం సహజం. ఆయా దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాల మేరకు ఇవి అమలవుతాయి. స్నేహపూరిత దేశాల విషయంలో ఈ నిబంధనల్లో కొంత సడలింపు ఉంటుంది. భారతీయులకు యూకేలో మంచి అవకాశాలు కల్పించేలా అక్కడి ప్రభుత్వ చర్యలు తీసుకుంటోంది. ఇటీవల కుదిరిన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం కూడా కొంత మేలు చేయనుంది.

పరిశోధనల పరంగా మహిళలకు ప్రస్తుతం ఎలాంటి అవకాశాలు ఉన్నాయి?

మహిళలను పరిశోధనలు ముఖ్యంగా సైన్స్, ఇంజనీరింగ్ విభాగాలవైపు ఆకర్షించే విధంగా ఇప్పుడు ఎన్నో అవకాశాలు, ప్రోత్సాహకాలు అందుబాటులోకి వచ్చాయి. ఇదే సమయంలో ఇటీవల కాలంలో మహిళా విద్యార్థుల దృక్పథమూ మారుతోంది. దీంతో ఈ రంగాల్లో వారి భాగస్వామ్యం కూడా క్రమేణా పెరుగుతోంది. భారత ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల్లో.. దాదాపు సగం శాతం మహిళలు ఉండటమే ఇందుకు నిదర్శనం.

ఉన్నత విద్యకు సంబంధించి యూకే, భారత్ మధ్య వ్యత్యాసాలు?

మన విద్యా విధానం దాదాపు యూకేను అనుసరించే రూపొందించిన సంగతి తెలిసిందే. అయితే.. బోధన, అభ్యసన కోణంలో యూకేలో ప్రాక్టికల్ అప్రోచ్‌కు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. మన దేశంలో ఇది యూనివర్సిటీ స్థాయిలో.. అందులోనూ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విభాగాల్లోనే అమలవుతోంది. ప్రాక్టికల్ లెర్నింగ్ అంటే రీసెర్చ్ స్టడీస్ అనే అభిప్రాయమే ఇంకా కొనసాగుతోంది. దీనికి భిన్నంగా హైస్కూల్ స్థాయి నుంచే ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యమిచ్చేలా కరిక్యులం రూపొందించాలి. అప్పుడే విద్యార్థులకు రియల్‌టైమ్ నైపుణ్యాలు అబ్బుతాయి. ఫలితంగా భవిష్యత్తులో తాము ఎంచుకున్న రంగాల్లో పోటీలో నిలదొక్కుకునే సామర్థ్యం లభిస్తుంది.

ఉద్యోగ సమాచారం

యూసీఎస్‌ఎల్, కర్ణాటకలో 13 మేనేజర్ పోస్టులు

కర్ణాటకలోని ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్‌ఎల్) శాశ్వత ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్–02, సీనియర్ మేనేజర్–01, మేనేజర్–05, డిప్యూటీ మేనేజర్–05.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో డిగ్రీ(ఇంజనీరింగ్) ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 27.01.2026 నాటికి అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు, సీనియర్ మేనేజర్, మేనేజర్‌కు 40 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.02.2026.
- **వెబ్‌సైట్:** https://udupicsl.com/

ఏబీవీ-ఐఐఐటీఎంలో 22 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

గ్వాలియర్(మధ్యప్రదేశ్)లోని అటల్ బిహారీ వాజ్‌పేయి-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఐఐఐటీఎం).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
- **విభాగాలు:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ స్టడీస్.
- **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జాయింట్ రిజిస్ట్రార్(ఎ-ఎ), ఏబీవీ-ఐఐఐటీఎం గ్వాలియర్, మోరెనా లింక్ రోడ్, గ్వాలియర్, మధ్యప్రదేశ్–474015 చిరునామకు పంపించాలి.
- **చివరితేది:** 25.02.2026.
- **వెబ్‌సైట్:** https://www.iiitm.ac.in/

ఎస్‌ఏఐ, న్యూఢిల్లీలో 48 పర్ఫార్మెన్స్ అనలిస్ట్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్‌ఏఐ) రెగ్యులర్ ప్రాతిపదికన సంబంధిత విభాగాల్లో పర్ఫార్మెన్స్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 48.
- **విభాగాల వారీగా ఖాళీలు:** ఆంత్రోపోమెట్రీ–01, బయోమెకానిక్స్–01, న్యూట్రిషియన్–04, ఫిజియోథెరపీ–24, సైకాలజీ–04, ఫిజియాలజీ–04, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్–10.
- **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.03.2026.
- **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.nic.in/

సీఎస్‌ఐఆర్-సీఎల్‌ఆర్‌ఐ, చెన్నైలో 13 పోస్టులు

చెన్నైలోని సీఎస్‌ఐఆర్–సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎల్‌ఆర్‌ఐ).. జూనియర్ స్టెనోగ్రాఫర్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
- **పోస్టుల వివరాలు:** జూనియర్ స్టెనోగ్రాఫర్–01, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్–06, మల్టీ టాస్కింగ్ స్టాఫ్–06.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2/ఇంటర్మీడియట్ లేదా తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 27 ఏళ్లు, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు, ఎంటీఎస్‌కు 25 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.53,628, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు రూ.39,545, ఎంటీఎస్‌కు రూ.35,973.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.03.2026.
- **వెబ్‌సైట్:** https://www.clri.org/

ఏపీపీఎస్సీ గ్రూప్-1 ర్యాంకర్ల సక్సెస్ స్టోరీలు..

ఇటీవల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 తుది ఫలితాలను విడుదల చేసిన విషయం తెల్సిందే. ఈ ఫలితాల్లో సాధారణ పేద కుటుంబాల నుంచి వచ్చిన అభ్యర్థులు గ్రూప్స్ 1లో విజయం సాధించి ఉన్నత ఉద్యోగాలను సాధించారు. ఈ నేపథ్యంలో ఈ గ్రూప్–1 ర్యాంకర్లను సాక్షి ఎడ్యుకేషన్.కామ్ పత్యేకంగా ఇంటర్వ్యూలను చేసింది. అయితే ఈ ర్యాంకర్ల సక్సెస్ స్టోరీలను తెలుసుకోవాలని ఉందా...? ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన స్ఫూర్తి కథనాలు గురించి తెలుసుకోండి.

అనుమానాస్పద స్థితిలో డిజిటల్ అసిస్టెంట్ మృతి

అశోక్ (ఫైల్)

భీమవరం (వత్సవాయి): ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలో మంగళవారం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన గ్రామ సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన గువ్వల అశోక్ (33) జగ్గయ్యపేట మండలం జయంతిపురం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వాకింగ్‌కి వెళ్లిన అశోక్ తిరిగి రాలేదు. గ్రామ సమీపంలో పెద్ద కాలువకట్టపై యువకుడు మృతి చెంది పడి ఉన్నాడనే సమాచారంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు వెళ్లి చూశారు. వాకింగ్‌కి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు వత్సవాయి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

గ్రామ సచివాలయ మహిళా పోలీస్ ఆత్మహత్య

పని ఒత్తిడే కారణమని అనుమానం

లలిత (ఫైల్)

రామవరప్పాడు(విజయవాడ): గ్రామ సచివాలయ మహిళా పోలీస్ ఉరేసుకుని బలవన్మరణం చెందిన ఘటన విజయవాడరూరల్ మండలం నిడమానూరులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నిడమానూరుకు చెందిన నారుమంచి విశ్వనాథ్, లలిత (43) దంపతులు పోరంకి రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. భర్త విశ్వనాథ్ గ్రామంలోని మోడల్ డెయిరీలో అకౌంటెంట్. లలిత సచివాలయ మహిళాపోలీస్. ఇటీవల నిడమానూరు నుంచి గన్నవరం మండలం కొండపావులూరుకు బదిలీపై వెళ్లారు. మంగళవారం విశ్వనాథ్ విధులకు వెళ్తుండగా..తాను కూడా వెళ్తున్నట్టు చెప్పింది. ఉదయం 11 గంటల సమయంలో ఫ్లాట్‌కు చేరుకున్న విశ్వనాథ్ బెడ్‌రూమ్ తలుపులు లాక్ వేసి ఉండడాన్ని గమనించాడు. ఎంతకీ తీయకపోవడంతో తోటి నివాసితులతో కలిసి పగులగొట్టి చూడగా లలిత ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. పటమట ఎస్ఐ భరత్ ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి ఫోన్ స్వాధీనం చేసుకుని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పని ఒత్తిడే కారణమా..?

కొండపావులూరులో మొత్తం 8 మంది సిబ్బందిలో ఐదుగురు బదిలీపై వెళ్లారని.. దీంతో ఉన్న ముగ్గురిపై పని ఒత్తిడి ఎక్కువైందని చెబుతుండేదని లలిత సన్నిహితులు తెలిపారు. దీంతో పని ఒత్తిడి కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. సోమవారం రాత్రి లలిత తన తల్లితో ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు.

‘అనంత’జిల్లాలో దాహం కేకలు

- ఆర్థిక మంత్రి పయ్యావుల ఇలాకాలో రోడ్డెక్కిన మహిళలు
- ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా
- బండమీదపల్లిలో ఖాళీ బిందెలతో నిరసన

వజ్రకరూరు మండలం కొనకొండ్ల సచివాలయానికి ఎదురుగా ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న మహిళలు, కాలనీవాసులు

వజ్రకరూరు/కుందుర్పి: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న అనంతపురం జిల్లాలో గుక్కెడు తాగునీటికీ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎన్నికల హామీలన్నీ నీటి మూటలుగా మారగా.. గొంతు తడిపే నీటిచుక్క కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్న ప్రజలు పలుచోట్ల రోడ్లెక్కి ఆందోళనలకు దిగారు. మంగళవారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో మహిళలు తాగునీటి కోసం మంగళవారం ఆందోళన చేపట్టారు. ఆ గ్రామంలోని 7, 8 కాలనీలకు కొన్ని రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో వారంతా సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ సమస్య గురించి అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో మంగళవారం సాయంత్రం వివిధ కాలనీల వారు మహిళలతో కలిసి గ్రామ సచివాలయానికి చేరుకున్నారు. ఎదురుగా ఉన్న ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఖాళీ బిందెలతో గంటకుపైగా ధర్నా నిర్వహించడంతో వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వాల్మీకి గోవిందు, కాలనీవాసులు దేవేంద్రప్ప, శంకరయ్య, రాజేష్‌కుమార్, మరికొందరు మహిళలు మాట్లాడుతూ... కాలనీకి సక్రమంగా మంచినీరు రావడం లేదని, రెండు రోజులకు ఒకసారి నీరు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మంత్రి పయ్యావుల కేశవ్ వంద రోజుల్లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుందుర్పి మండలం బండ మీదపల్లెలో ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

ముళ్లకంచె అడ్డంగా పెట్టి ఖాళీ బిందెలతో నిరసన

కుందుర్పి మండలం బండమీదపల్లి గ్రామంలో మంగళవారం కుందుర్పి-కళ్యాణదుర్గం ప్రధాన రహదారికి ముళ్ల కంచె అడ్డంగా పెట్టి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాహన రాకపోకలను అడ్డుకున్నారు. గ్రామంలో 20 రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే స్పందించేవారు కరువయ్యారన్నారు. ఎంపీడీవో లక్ష్మీశంకర్ బండమీదపల్లిలోనే నివాసముంటూ సమస్యను కళ్లారా చూస్తున్నా.. పరిష్కరించడంలో విఫలమయ్యారని మహిళలు వాపోయారు. 20 రోజుల్లో రెండుసార్లు కుందుర్పి మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నాలు, నిరసనలు చేపట్టినా... అధికారుల్లో చలనం లేదన్నారు.

మడకశిర మండలం పత్తికుంటలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

గొంతెండుతోంది.. నీళ్లివ్వండి మహాప్రభో!

నీటి కోసం రోడ్డెక్కిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

నాగిరెడ్డిపల్లిలో టీడీపీ సర్పంచ్ ఇంటి ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బ్రహ్మసముద్రం/మడకశిర రూరల్: నీటి సమస్యను తీర్చాలంటూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రోడ్డెక్కారు. వివరాలు.. అనంతపురం జిల్లా నాగిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సుమారు 15 రోజులుగా ఈ పాఠశాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటికి, కాలకృత్యాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను టీడీపీ గ్రామ సర్పంచ్, టీడీపీ నేత సందీప్‌కు తెలిపినా ఆయన ఏ చర్యలూ తీసుకోలేదు. దీంతో విద్యార్థులంతా మంగళవారం రోడ్డెక్కారు. పాఠశాల ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. అనంతరం సర్పంచ్ ఇంటికి వెళ్లి తమ ఆందోళన తెలియజేశారు. ఇంట్లో సర్పంచ్ లేకపోవడంతో.. విద్యార్థులు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఇంటికి వెళ్లి నిరసన తెలిపారు.

మంత్రి సవిత ఇలాకాలో ఇదే పరిస్థితి..

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం పత్తికుంటలోనూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మంగళవారం రోడ్డెక్కారు. మధ్యాహ్న భోజన సమయంలో తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నట్లు విద్యార్థులు వాపోయారు. అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. వెంటనే తమ సమస్య తీర్చాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఉసురు తీస్తున్న చంద్రబాబు

- పనిఒత్తిడి పెట్టి చనిపోయేలా బాబు సర్కారు చేస్తోంది
- సచివాలయ ఉద్యోగులూ అధైర్యపడొద్దు... ఓపిక పట్టండి.. కష్టాలు ఎల్లకాలం ఉండవు
- ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి

సాక్షి,అమరావతి: ''గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం పనిభారం పెంచి వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోంది. వరుసగా ఉద్యోగుల అకాల మరణాలు పెరుగుతున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదు. ఈ ముఖ్యమంత్రి చంద్రబాబుకు చీమ్మకుట్టినట్లుగా కూడా లేదు.'' అని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామి రెడ్డి ధ్వజమెత్తారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిన్న (10వతేదీ) ఒక్కరోజే ముగ్గురు సచివాలయ ఉద్యోగులు పని ఒత్తిడి వల్ల చనిపోయారు. చంద్రబాబు సర్కారు పగ్గాలు చేపట్టాక 80 మంది ఉద్యోగులు మరణించారు. ఉద్యోగుల ప్రాణాలంటే సీఎం చంద్రబాబుకు లెక్కేలేకుండా పోయింది. 2019లో సచివాలయాల వ్యవస్థ పురుడుపోసుకుంది. వాటిల్లో పనిచేసేవారంతా 30 నుంచి 35ఏళ్ల వయసు వారే. ఇంత చిన్న వయస్సులో వారు పనిఒత్తిడి తాళలేక గుండెపోటుతో చనిపోతున్నారు. ఎందుకు వారు ఒత్తిడికి గురవుతున్నారు అనే విషయం ప్రభుత్వం ఆలోచించడం లేదు. వారిని ఉద్యోగాల్లోకి తీసుకునేటప్పుడు వారికి పనేలేదని చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఎందుకు వారికి సెలవులు, పండుగలు, పగలు, రాత్రి అనే తేడా లేకుండా చంద్రబాబు ప్రభుత్వం పని చేయిస్తుంది. వారిని టార్చర్ పెట్టటంతోనే వారు చనిపోతున్నారు. ఈ విధంగా వారు చనిపోతున్నా ప్రభుత్వం స్పందించటం లేదు. కనీసం అధికారులతో మాట్లాడటం కానీ.. అలా ఎందుకు వారు చనిపోతున్నారు అనే విషయం గురించి గానీ చంద్రబాబు ప్రభుత్వం ఆలోచించడం లేదు. సచివాలయ ఉద్యోగులు అంటే విలువ లేదా?'' అని వెంకట్రామిరెడ్డి ధ్వజమెత్తారు.

ఉద్యోగుల సమస్యలు పట్టవా!

''ఉద్యోగులకు నోషన్ ఇంక్రిమెంట్స్, ప్రమోషన్లు లేవు. వారి సమస్యలు ఒక్కటి కూడా పరిష్కరించలేదు. ఐఆర్, పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బకాయిలు కానీ ఒక్క హామీ అంటే ఒక్క హామీ గానీ అమలు చేయటం లేదు. ఎన్నికల ముందు చంద్రబాబు సర్కారు ఇచ్చిన తొలి హామీ ఉద్యోగులకు పనిభారం తగ్గించి గౌరవం పెంచుతామన్నారు. గౌరవం పెంచటం అంటే ప్రాణాలు తీయటమేనా? చంద్రబాబు సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఉద్యోగుల మరణాలపై సమీక్షించాలి. ఉద్యోగులకు ఎక్కడా? ఎందువల్ల పని భారం పెరుగుతుందో చంద్రబాబు దృష్టి పెట్టాలి. ఉద్యోగుల ప్రాణాలు కాపాడాలి'' అని కాకర్ల వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులు ఎంత పని ఒత్తిడి ఉన్నా అధైర్యపడొద్దు. కొద్దిగా ఓపిక పట్టాలి. కష్టాలు ఎప్పుడూ ఉండవు. చీకటి తర్వాత వెలుగు వస్తుంది. ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరఫున పోరాడతాం.'' అని వెంకట్రామి రెడ్డి స్పష్టం చేశారు.

ఒక్క ఉద్యోగికి 13 క్లస్టర్లా?

''మంగళవారం (ఈరోజు) అన్నమయ్య జిల్లాలో చనిపోయిన సచివాలయ ఉద్యోగికి 13 క్లస్టర్లు ఇచ్చారు. దాదాపు 800 నుంచి 900 ఇళ్లు ఒక్కొక్క ఉద్యోగి సర్వే చేయాలి. ఒక్కొక్క కుటుంబం సర్వేకి గంట పడుతుంది. దాదాపు 50 ప్రశ్నలు అడగాలి. తంబ్ వేయాలి.. ఓటీపీ చెప్పాలి. ఒక్కొక్క రోజుకు 3 ఇళ్లకి మించి సర్వే చేయలేరు. ఒక్కొక్క సచివాలయ ఉద్యోగి ఇచ్చిన సర్వే పని పూర్తి చేయాలంటే ఏడాదిపైనే పడుతుంది. అలాంటి పరిస్థితి ఉంటే ఉన్నతాధికారులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఫోన్ చేసి ఒత్తిడి పెడితే సచివాలయ ఉద్యోగులు ఎలా తట్టుకోగలరు'' అని కాకర్ల ప్రశ్నించారు. వలంటీర్లను తీసేసి ఆ పనినంతటిని సచివాలయ ఉద్యోగికి అప్పగిస్తే ఎలా అని నిలదీశారు. వలంటీర్లకు ఒక్కొక్కరికి 50 గృహాలు కేటాయించేవారు. ఒక్కొక్క సచివాలయం పరిధిలో 30 నుంచి 40 మంది వలంటీర్లు ఉంటే, వారిని తొలగించి.. పది మంది వలంటీర్ల పని అంతా ఒక సచివాలయ ఉద్యోగిపై పెడితే ఎలా చేయగలుగుతారని ప్రశ్నించారు. చంద్రబాబు సర్కారు ఆలోచించాలి కదా అని నిలదీశారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి సినిమా

టాలీవుడ్... కోలీవుడ్.... మాలీవుడ్... శాండల్‌వుడ్.. బాలీవుడ్... ఇప్పుడు అన్ని వుడ్స్ ఒకటే. ఇప్పటివరకూ హీరోయిన్లు మాత్రమే రక రకాల భాషల్లో సినిమాలు చేసేవారు. అప్పుడప్పుడూ డైరెక్టర్లు కూడా వేరే భాషల్లో వేరే హీరోలతో సినిమాలు చేసేవారు. అయితే ఆ కాంబినేషన్ అరుదుగా సెట్ అయ్యేది. ఇప్పుడు 'పాన్ ఇండియా' హవాతో తెలుగు హీరోలు తమిళ దర్శకులతో... తమిళ హీరోలు తెలుగు దర్శకులతో.... అలానే వేరే భాషల దర్శకులతో ఇంకో భాషకు చెందిన హీరోలు సినిమాలు చేస్తున్నారు. ఈ ట్రెండ్ ఎక్కువైంది. ఒక్క తెలుగు గురించి మాట్లాడుకుంటే... ఇక్కడి టాప్ స్టార్స్ కొందరు తమిళ దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. ఆల్రెడీ అవి సెట్స్ మీద ఉన్నాయి. కొన్ని చర్చల్లో ఉన్నాయి. ఇక 'వాంగ అన్నే... రెడీయా... స్టార్ట్ కెమెరా' (రండి అన్నా... రెడీయా... స్టార్ట్ కెమెరా) అంటూ తెలుగు హీరోలను డైరెక్ట్ చేసే చాన్స్ దక్కించుకున్న తమిళ దర్శకులు, చర్చల్లో ఉన్న దర్శకుల గురించి తెలుసుకుందాం.

అల్లు అర్జున్ · నాగార్జున · ఎన్టీఆర్ · ప్రభాస్ · రామ్ · నాని

వాంగ అన్నే రెడీయా...

తెలుగు హీరోలు... తమిళ దర్శకులు

యంగ్ డైరెక్టర్‌తో నూరవ చిత్రం

నూరవ చిత్రం అనేది ఏ హీరోకైనా వెరీ వెరీ స్పెషల్. ఈ మైల్‌స్టోన్ మూవీ గ్రాండ్‌గా ఉండాలని, మంచి కథతో, మంచి దర్శకుడితో రూపొందించాలని అనుకుంటారు. నాగార్జున కూడా అలానే అనుకుని, పకడ్బందీగా ప్లాన్ చేసుకున్నారు. అయితే తెలుగు దర్శకుడికి కాకుండా తన నూరవ చిత్రం దర్శకత్వ బాధ్యతను తమిళ దర్శకుడు ఆర్ఏ కార్తీక్‌కి ఇచ్చారు. దాదాపు ఏడాది క్రితం నాగార్జునకు కార్తీక్ ఓ స్టోరీ లైన్ వినిపించారని, అది నచ్చి కథగా డెవలప్ చేయమన్నారనీ తెలిసింది. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కార్తీక్‌కి ఇది రెండో చిత్రం. తమిళ చిత్రం 'నిదమ్ ఒరు వానమ్'తో దర్శకుడిగా పరిచయమై, రెండో ఫీచర్ ఫిల్మ్‌కే నాగార్జునలాంటి స్టార్‌ని డైరెక్ట్ చేసే చాన్స్ దక్కించుకోవడం అంటే చిన్న విషయం కాదు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి 'కింగ్ 100, కింగ్ 100 నాటౌట్, లాటరీ కింగ్' అనే టైటిల్స్‌ని పరిశీలిస్తున్నారని సమాచారం. ఈ చిత్రం లాటరీ నేపథ్యంలో ఉంటుందని భోగట్టా. అందుకే 'లాటరీ కింగ్' టైటిల్ ఫిక్స్ అయ్యే అవకాశం ఉందని ఊహాగానాలు ఉన్నాయి. ఈ చిత్రంలో టబు నటిస్తున్నారు. అలాగే అనుష్క ఓ కీలక పాత్రలో కనిపిస్తారట. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్‌పై నాగార్జున నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దసరా సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారని సమాచారం.

మల్టీస్టారర్ మూవీలో ఎన్టీఆర్?

'ఆర్ఆర్ఆర్'లో రామ్‌చరణ్, 'వార్ 2'లో హృతిక్ రోషన్ కాంబినేషన్‌లో నటించిన ఎన్టీఆర్ మరో మల్టీస్టారర్ మూవీ చేయనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. రజనీకాంత్‌తో 'జైలర్' వంటి హిట్ మూవీ తెరకెక్కించి, ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్‌గా రజనీతోనే 'జైలర్' 2' తెరకెక్కిస్తున్న నెల్సన్ దిలీప్‌కుమార్ నెక్ట్స్ ఓ సినిమా ప్లాన్ చేస్తున్నారట. ఎన్టీఆర్ కోసం నెల్సన్ ఓ భారీ యాక్షన్ స్టోరీని తయారు చేశారని సమాచారం. ఆ స్టోరీ లైన్‌ని ఎన్టీఆర్‌కి వినిపించారనే టాక్ కూడా తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్‌తో 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. మరోవైపు కొత్త చిత్రాల కోసం కథలు వింటున్నారట. ఈ నేపథ్యంలోనే నెల్సన్ చెప్పిన స్టోరీ లైన్ విని, గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్. అయితే మల్టీస్టారర్ మూవీగా రూపొందనుందని భోగట్టా. ఎన్టీఆర్‌తో పాటు మరో స్టార్ హీరో ఈ చిత్రంలో నటిస్తారని ప్రచారం అవుతోంది. తెలుగు-తమిళ ద్విభాషా చిత్రంగా రూపొందించాలనుకుంటున్నారట. సో... ఓ తమిళ స్టార్ హీరో నటించే అవకాశం ఉందని అటు చెన్నై ఫిల్మ్‌నగర్ అంటున్న మాట. మరి... ఎన్టీఆర్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సినిమా ఉంటుందా? అది సోలో హీరో సినిమానా? లేక మల్టీస్టారరా? అనే ప్రశ్నలకు సమాధానం కావాలంటే కొన్నాళ్లు వెయిట్ చేయాల్సిందే.

లోకేశ్ కనగరాజ్

ఇద్దరు దర్శకులతో...

వరుసగా ఇద్దరు తమిళ దర్శకులతో అల్లు అర్జున్ సినిమాలు ఒప్పుకోవడం విశేషం. ఇప్పటికే తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఈ హీరో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ భారీ సైన్స్ ఫిక్షన్ మూవీ సెట్స్‌లో ఉండగానే... సంక్రాంతి సందర్భంగా మరో చిత్రాన్ని ప్రకటించారు అల్లు అర్జున్. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. ఆ మధ్య లోకేశ్ హైదరాబాద్ వచ్చి, అల్లు అర్జున్‌కి స్టోరీ లైన్ వినిపించారనే వార్త బయటకు వచ్చింది. దీంతో ఈ దర్శకుడి కాంబినేషన్‌లో ఈ హీరో సినిమా ఉండొచ్చనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఆ ఊహలను నిజం చేస్తూ, ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో చేస్తున్న సినిమాతో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో అల్లు అర్జున్ మూడు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారట. ఈ సినిమా ముగిసే సమయానికి లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోని సినిమా షూట్‌ని ఆరంభించాలనుకుంటున్నారట. యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది ద్వితీయార్థంలో ఆరంభం కానుందని తెలిసింది.

సముద్ర ఖని

అట్లీ

శిబి చక్రవర్తి

తమిళ దర్శకుడు- తమిళ బేనర్...

'ఆంధ్రా కింగ్ తాలూకా' తర్వాత రామ్ ఓ కొత్త దర్శకుడితో సినిమాకి పచ్చ జెండా ఊపారని సమాచారం. ఈ చిత్రాన్ని దర్శకుడు కె. రాఘవేంద్రరావు నిర్మించనున్నారట. కాగా టాలీవుడ్‌కి చెందిన ఈ కొత్త దర్శకుడు చెప్పిన కథ రామ్‌కి నచ్చిందని సమాచారం. త్వరలో ఈ సినిమా ఆరంభం కానుందని తెలిసింది. మరోవైపు తెలుగులో బాగా పాపులర్ అయిన తమిళ నటుడు-దర్శకుడు సముద్ర ఖనితో సినిమా చేయడానికి రామ్ అంగీకారం తెలిపారని భోగట్టా. ఈ చిత్రాన్ని తమిళ బేనర్ కేవీఎన్ నిర్మించనుందట. ఈ సినిమా కథ రెడీ అయిందని, రామ్‌కి సముద్ర ఖని కథ నరేట్ చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ కథ నచ్చి, ఈ హీరో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. రాఘవేంద్ర రావు బేనర్లో నూతన దర్శకుడితో సినిమా పూర్తయ్యే సమయానికి సముద్ర ఖనితో సినిమాని పట్టాలెక్కించాలనుకుంటున్నారట రామ్. ఇక సముద్ర ఖని ఇప్పటికే తెలుగులో 'శంభో శివ శంభో, జెండా పై కపిరాజు, బ్రో' వంటి తెలుగు చిత్రాలకు దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే.

ఉన్నట్లా? లేనట్లా?

'దసరా, హిట్ 3'... ఇలా వరుసగా మాస్ యాక్షన్ సినిమాలు చేస్తున్న నాని ప్రస్తుతం మరో మాస్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నారు. అయితే ఇప్పటివరకూ చేసిన మాస్ సినిమాలు ఒక ఎత్తయితే ఈ సినిమా మరో ఎత్తు అనేలా భారీ యాక్షన్‌తో రూపొందుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మరోవైపు సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు నాని. ఇక రెండు మూడేళ్లుగా ఫలానా దర్శకుడితో నాని సినిమా చేయనున్నారంటూ వినిపించిన లిస్ట్‌లో తమిళ దర్శకుడు శిబి చక్రవర్తి పేరు ప్రముఖంగా ఉంది. శివ కార్తికేయన్ హీరోగా శిబి దర్శకత్వంలో రూపొందిన 'డాన్' (2022) సినిమా చూసి, ఇంప్రెస్ అయ్యారట నాని. ఈ నేపథ్యంలోనే శిబి చక్రవర్తి దర్శకత్వంలో సినిమా చేయాలనుకున్నారనే వార్త ప్రచారమైంది. నానీకి శిబి స్టోరీ లైన్ కూడా చెప్పారట. అయితే ఆ లైన్ అసంతృప్తిగా అనిపించడంతో ఈ ప్రాజెక్ట్ పెండింగ్‌లో పడిందని సమాచారం. మరి... నాని-శిబి చక్రవర్తి కాంబినేషన్‌లో సినిమా ఉన్నట్లా? లేనట్లా... కాలమే సమాధానం చెప్పాలి. ఇదిలా ఉంటే.... ఈ యువదర్శకుడికి సూపర్ స్టార్ రజనీకాంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

నెల్సన్ దిలీప్‌కుమార్

సుందర్ ఔట్ శిబి ఇన్

'తలైవర్ 173' (వర్కింగ్ టైటిల్) పేరుతో రజనీకాంత్ హీరోగా శిబి చక్రవర్తి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. నిజానికి ఈ సినిమాకి ముందు సుందర్. సీని దర్శకుడిగా ఎంపిక చేశారు. ఈ చిత్రానికి ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఓ నిర్మాత. కమల్-రజనీ-సుందర్ కాంబినేషన్‌లో 'తలైవర్ 173' ప్రకటన వచ్చిన కొన్ని రోజులకే సుందర్ ఈ చిత్రం నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత పలువురి దర్శకుల పేర్లు తెర్పైకి వచ్చాయి. ఫైనల్లీ సూపర్ స్టార్ సినిమా శిబి చక్రవర్తికి దక్కింది.

ఇలా తెలుగు-తమిళ దర్శకుల కాంబినేషన్‌లో సినిమాలంటూ కొన్ని ప్రాజెక్ట్స్ గురించి చర్చలు జరుగుతున్నాయి.

- డి.జి. భవాని

ప్రభాస్-లోకేశ్ సినిమా లేనట్లేనా?

ప్రభాస్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమాకి ప్లాన్ జరుగుతోందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు లోకేశ్‌తో అల్లు అర్జున్ సినిమా ఫిక్స్ అయింది కాబట్టి ప్రభాస్‌తో సినిమా లేనట్లే అనే ఊహాగానాలు మొదలయ్యాయి. మరి... ప్రభాస్-లోకేశ్‌ల తాజా కమిట్‌మెంట్స్ పూర్తయ్యాక వీరి కాంబినేషన్‌లో సినిమా షురూ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ...

శివ భక్తితో లీనమై నటించాను - తనికెళ్ల భరణి

'శివోహం' పాట ఆవిష్కరణ కార్యక్రమంలో ఓ దృశ్యం

''పాతికేళ్ల క్రితం 'ఆటగదరా శివ' అనే పుస్తకం రాశాను. అప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ మహాశివుడి గురించి కార్యక్రమం జరిగినా నన్ను అతిథిగా పిలుస్తున్నారు. ఇప్పుడు 'శివోహం...' అనే పాటలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. శివ భక్తితో లీనమై ఈ పాటలో నటించాను'' అని తనికెళ్ల భరణి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రూపొందిన 'శివోహం..' పాట ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందిం చిన ఈ పాటకి యశోకృష్ణ సంగీతం అందించగా, మలయాళ గాయకుడు మధు బాలకృష్ణన్ పాడారు. దామురెడ్డి దర్శకత్వంలో రాధాకేశవ్ సమర్పణలో పొత్తపు కేశవరెడ్డి ఈ పాటని నిర్మించారు. ఈ సాంగ్ తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో కీర్తన టీవీలో అందుబాటులో ఉండనుంది. ఈ పాట ఆవిష్కరణకి శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థాన పీఠాదీశ్వరులు శ్రీశ్రీశ్రీ మదభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి, తనికెళ్ల భరణి, సుద్దాల అశోక్ తేజ, నటుడు గౌతమ్ రాజు అతిథులుగా హాజరయ్యారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ- ''నాతో తొలి పాట రాయించింది తనికెళ్ల భరణిగారు. ఆయన ప్రోత్సాహం లేకుంటే ఇండస్ట్రీకి రాకపోయేవాడిని. నేను రాసిన ఈ మంచి భక్తి గీతాన్ని అందరూ విని ఆనందించాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''భక్తి భావంతో పాటు ఒక గొప్ప సందేశాన్ని భక్తులకు ఇచ్చేలా 'శివోహం..' పాట ఉంటుంది'' అని దామురెడ్డి, పొత్తపు కేశవరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమానికి పాటల రచయిత మౌనశ్రీ మల్లిక్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

లక్నో టు లాహోర్

సన్నీ డియోల్ హీరోగా నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'లాహోర్ 1947'. షబానా అజ్మీ, ప్రీతి జింతా, కరణ్ డియోల్, అలీ ఫజల్, అభిమన్యు సింగ్ ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో ఆమిర్ ఖాన్ నిర్మిస్తున్నారు. కాగా, ఈ సినిమాను ఆగస్టు 13న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. భారత్ - పాకిస్తాన్ దేశాల విభజన కాలం నాటి పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ సమాచారం. అయితే అప్పటి రాజకీయ పరిస్థితుల ఆధారంగా ఈ సినిమా ఉండదట. లక్నోకు చెందిన ఓ ముస్లిం కుటుంబం కొన్ని పరిస్థితుల కారణంగా లాహోర్ వెళ్లాల్సి వస్తుందట. ఆ తర్వాత అక్కడ ఆ కుటుంబం ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది? అనే కోణంలో 'లాహోర్ 1947' సినిమా కథనం సాగుతుందని సమాచారం.

సన్నీ డియోల్

'నువ్వే ఉండిపో ఇలా, నువ్వేలే' పాటల ఆవిష్కరణ కార్యక్రమంలో ఓ దృశ్యం

నువ్వే ఉండిపో ఇలా...

అంకిత జాదవ్, రోహిత్ భోగ జోడీగా సాంగ్స్ ఆల్బమ్ రూపొందింది. కొరియోగ్రాఫర్ సత్య దర్శకత్వంలో అదోనై పిక్చర్స్ క్రియేషన్స్ సమర్పణలో కేకే రెడ్డి నిర్మించారు. జయంత్ ఆర్యన్ సంగీతం అందించిన 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే...' అంటూ సాగే సాంగ్స్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సాయిరాజేశ్, శైలేష్ కొలను, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, నటి ఆషు రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే...' పాటలకి రాంబాబు గోసాల సాహిత్యం అందించగా, లిప్సిక, అదితీ భావరాజు పాడారు. ఈ సందర్భంగా సత్య మాస్టర్ మాట్లాడుతూ- ''ఒక ఈవెంట్ కోసం నేను అమెరికా వెళ్లినప్పుడు కేకే రెడ్డిగారితో పరిచయం ఏర్పడింది. అప్పటికే ఈ సాంగ్స్ హిందీ వెర్షన్ రెడీగా ఉన్నాయి. తెలుగులో చేయాలనే ఆలోచనను ఆయన నాతో షేర్ చేసుకున్నారు. అలా తెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం ప్రారంభించాం'' అని తెలిపారు. కేకే రెడ్డి మాట్లాడుతూ- ''నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' సాంగ్స్‌ని మంచి లవ్ ఫీల్‌తో బ్యూటిఫుల్‌గా పిక్చరైజ్ చేశారు డైరెక్టర్ సత్యగారు. ఈ పాటలు మళ్లీ మళ్లీ వినేలా ఉంటాయి'' అన్నారు. ''నేను బాలీవుడ్‌లో మ్యూజిక్ ఆల్బమ్స్ చేస్తుంటా. నేను చేసిన ఐదో మ్యూజిక్ ఆల్బమ్ ఇది. ఈ పాటలను న్యూయార్క్, షికాగోలో షూట్ చేశాం'' అని అంకిత జాదవ్ చెప్పారు. ''ఈ సాంగ్స్‌ను హిందీలో చేశాం. తెలుగులోకి తీసుకురావాలనుకున్నప్పుడు ఇక్కడ మ్యూజిక్ లవర్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో అని సందేహించాం. కానీ, తప్పకుండా తెలుగు ఆడియన్స్ అంతా ఇష్టపడతారనే నమ్మకం ఉంది'' అని మ్యూజిక్ డైరెక్టర్ జయంత్ ఆర్యన్ పేర్కొన్నారు. ఇంకా లిరిసిస్ట్ రాంబాబు గోసాల, సింగర్ లిప్సిక మాట్లాడారు.

బిజినెస్ రీల్

ఎన్‌ఎస్‌ఈ, ఇండియా పోస్ట్ జట్టు

న్యూఢిల్లీ: మ్యుచువల్ ఫండ్స్‌ని మరింత అందుబాటులోకి తెచ్చే దిశగా పోస్టల్ శాఖ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) జట్టు కట్టాయి. ఇందుకోసం ఇండియా పోస్ట్‌కి చెందిన 1.64 లక్షల పోస్టాఫీసుల విస్తృత నెట్‌వర్క్‌ని, ఎన్‌ఎస్‌ఈ ఎంఎఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫాంని ఉపయోగించుకోనున్నాయి. తొలి దశలో చిన్న పథకాలతో మొదలుపెట్టి రెండో దశలో పూర్తి స్థాయి స్కీములు, పోర్ట్‌ఫోలియో అనలిటిక్స్, ప్రాంతీయ భాషల్లో సపోర్ట్, సలహా సేవలను అందుబాటులోకి తేనున్నాయి. గ్రామీణ, చిన్న పట్టణాల్లోని వారు తమ దగ్గరుండే పొదుపు మొత్తాలను, సంపద సృష్టికి ఉపయోగపడే ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేలా ప్రోత్సహించేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని ఇరు సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ప్రస్తుతం మ్యుచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం రూ. 81 లక్షల కోట్లకు చేరింది.

హైదరాబాద్‌లో పీవీఆర్ ఐనాక్స్ విస్తరణ

హైదరాబాద్: మల్టీప్లెక్స్ చెయిన్ పీవీఆర్ ఐనాక్స్ హైదరాబాద్‌లో తాజాగా హైదరాబాద్‌లో 9 స్క్రీన్స్‌ని ప్రారంభించింది. కంపెనీకి నగరంలో ఇది 18వ ప్రాపర్టీ. దీనితో హైదరాబాద్‌లో తమ స్క్రీన్స్ సంఖ్య 111కి చేరినట్లు కంపెనీ ఎండీ అజయ్ బిజ్లీ తెలిపారు. 9 స్క్రీన్స్‌లో పిక్సెల్ లార్జ్ స్క్రీన్, ప్లేహౌస్ ఫార్మాట్ స్క్రీన్‌లు కూడా ఉన్నయని, మొత్తం సీట్ల సంఖ్య 1,476గా ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబాలు, జెన్ జెడ్ ఆడియెన్స్ అభిరుచులను దృష్టిలో ఉంచుకుని వీటిని రూపొందించినట్లు బిజ్లీ చెప్పారు.

స్మార్టెయిల్ ఏఐ, భారత్‌క్లౌడ్ ఒప్పందం

హైదరాబాద్: ఆసియాలోనే తొలి ఏఐ ఆధారిత గ్రేడింగ్ కంపెనీ స్మార్టెయిల్ ఏఐతో భాగస్వామ్యం కట్టినట్లు దేశీ ఏఐ-రెడీ క్లౌడ్ సేవల సంస్థ భారత్‌క్లౌడ్ వెల్లడించింది. కృత్రిమ మేధ దన్నుతో 2026 ఆఖరు నాటికి భారత్‌లో 3,000 పైగా పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో పరివర్తన తెచ్చేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. డేటా భద్రత, నిబంధనలను పాటించే విషయంలో రాజీపడకుండా ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించుకోవడంలో విద్యా సంస్థలకు తోడ్పాటు అందించనున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-2-2026

విశాఖ	490-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	303.85	5.19
TATASTEEL	207.85	2.9
ONGC	271.6	1.88
M&M	3,677.00	1.87
BAJAJ-AUTO	9,762.00	1.79

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	1,569.50	-2.03
BAJFINANCE	965.3	-1.82
DRREDDY	1,255.70	-1.55
SHRIRAMFIN	1,048.60	-1.33
BHARTIARTL	2,011.50	-1.31

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)

బీఎస్‌ఈ	9,187
ఎన్‌ఎస్‌ఈ	1,18,064
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,67,815
ఎఫ్ఐఐ	+ 69
డీఐఐ	+ 1,174

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.16 (రాత్రి 11.30కు)	$ 64.36 (క్రితం ముగింపు)
బ్రెంట్	68.97 (రాత్రి 11.30కు)	$ 69.04 (క్రితం ముగింపు)

ఏఐ వినియోగంలో భారత్ జోరు

- ఎంటర్‌ప్రైజ్ విభాగంలో అమెరికా తర్వాత రెండో స్థానం
- కానీ భద్రతపరమైన రిస్కులు ఉన్నాయి
- జీస్కేలర్ రిపోర్టులో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా కృత్రిమ మేథ (ఏఐ) వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఎంటర్‌ప్రైజ్ విభాగంలో ఏఐ/ఎంఎల్ (మెషిన్ లెర్నింగ్) కార్యకలాపాలకు సంబంధించి అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉంది. క్లౌడ్ సెక్యూరిటీ సేవల దిగ్గజం జీస్కేలర్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. భారత్‌లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతున్నప్పటికీ భద్రతాపరమైన సవాళ్లు గణనీయంగా ఉంటున్నాయని రిపోర్ట్ పేర్కొంది. ఏజెంటిక్ ఏఐని ఆయుధంగా ఉపయోగించకోవడం, నవకల్పనలు-భద్రత చర్యల మధ్య అంతరం భారీగా ఉండటం మొదలైనవి ఇందులో ఉన్నాయని వివరించింది. 2025 జనవరి-డిసెంబర్ మధ్య జీస్కేలర్ జీరో ట్రస్ట్ ఎక్స్ఛేంజ్ ప్లాట్‌ఫాంపై నమోదైన లక్ష కోట్ల ఏఐ, మెషిన్ లెర్నింగ్ లావాదేవీల విశ్లేషణ ఆధారంగా జీస్కేలర్ ఈ రిపోర్టును రూపొందించింది.

ఫిబ్రవరి 16-20 మధ్య భారత్‌లో ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026 జరగనున్న నేపథ్యంలో ఈ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్, ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, ఆంథ్రోపిక్ సీఈవో డేరియో, క్వాల్‌కామ్ సీఈవో క్రిస్టియానో ఎమోన్ తదితర దిగ్గజాలు ఈ సదస్సులో పాల్గొనున్నారు.

నివేదిక ప్రకారం..

- దేశీ కంపెనీలు 2025 జూన్-డిసెంబర్ మధ్య కాలంలో ఏకంగా 8,230 కోట్ల ఏఐ/ఎంఎల్ లావాదేవీలు నిర్వహించాయి. ఆసియా-పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలో నమోదైన మొత్తం ఏఐ లావాదేవీల్లో ఇది 46.2 శాతం కావడం గమనార్హం. దీనితో ప్రాంతీయంగా భారత్ అగ్రస్థానంలో నిల్చింది.
- డిజిటల్ పరివర్తనకు ప్రభుత్వం దన్నుగా నిలవడంతో పాటు ఏఐ మౌలిక సదుపాయాలు-నైపుణ్యాల అభివృద్ధిపై ప్రభుత్వ-ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఏఐ సామర్థ్యాలున్న సిబ్బంది పెరుగుతుండటం, ఏఐ సేవలను వేగంగా, భారీ స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు వీలు కల్పించే క్లౌడ్-ఫస్ట్ విధానాలనేవి గతంతో పోలిస్తే భారత్ చాలా వేగంగా వృద్ధి చెందేందుకు తోడ్పడ్డాయి.
- దేశీయంగా ఏఐ కార్యకలాపాలకు దన్నుగా నిలుస్తున్న రంగాల్లో టెక్నాలజీ-కమ్యూనికేషన్ (3,130 కోట్ల లావాదేవీలు), తయారీ (1,570 కోట్లు), సర్వీసులు (1,260 కోట్లు), ఫైనాన్స్-ఇన్సూరెన్స్ (1,220 కోట్ల లావాదేవీలు) ఉన్నాయి.
- కంపెనీల పర్యవేక్షణ సామర్థ్యాలకు మించిన వేగంతో ఎంటర్‌ప్రైజ్ ఏఐ వినియోగం పెరుగుతోంది. కానీ చాలా సంస్థల్లో కీలకమైన డేటా ఏ దశలో బహిర్గతమయ్యే అవకాశం ఉందో కనిపెట్టలేని భద్రతపరమైన లోపాలు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం నెలకొంది. ఏఐని దేనికోసం వినియోగిస్తున్నారు, ఏ డేటాను షేర్ చేస్తున్నారనే దానిపై ఓ కన్నేసి ఉంచుతూ, లీకేజీలను కట్టడి చేసేందుకు ఎప్పటికప్పుడు తగు చర్యలను అమలు చేస్తూ ఉండాలి. మార్కెట్ డిమాండ్‌కి తగ్గట్లుగా సురక్షితమైన ఏఐ వైపు మళ్లాలంటే డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వడం చాలా అవసరం.
- ప్రతికూల పరిస్థితులను సృష్టించి ఎంటర్‌ప్రైజ్ ఏఐ సిస్టంలను పరీక్షించినప్పుడు కేవలం నిమిషాల వ్యవధిలోనే వాటి బలహీనతలు బైటపడిపోతుండటమనేది సెక్యూరిటీపరంగా నెల కొన్న రిస్కులను సూచిస్తోంది.
- స్వతంత్రంగా ప్రణాళికలు వేసుకుని, చర్యలు కూడా తీసుకోగలిగే సామర్థ్యాలున్న ఏజెంటిక్ ఏఐ వినియోగం పెరుగుతోంది. ఈ టెక్నాలజీని ఇప్పటికే ఆయుధంగా మార్చుకుంటున్నారు.
- సైబర్‌క్రిమినల్స్, నిఘా గ్రూప్‌లు ఏఐని ఉపయోగించుకుని దాడులకు పాల్పడుతున్నాయనడానికి స్పష్టమైన ఆధారాలు తెరపైకి వస్తున్నాయి. ఏఐ ఏజెంట్లు నిఘా, చొరబాటు, విస్తృత దాడుల బాధ్యతలు తీసుకుంటున్నాయి. స్వతంత్రంగా, మెషిన్ వేగంతో, భారీ స్థాయిలో సైబర్ దాడులకు దిగుతున్నాయి. ఏఐ కేవలం ఉత్పాదకతను పెంచుకునేందుకు ఉపయోగపడే సాధనంగానే ఉండటం లేదు, నేరగాళ్లకు ఆయుధంగా కూడా మారుతోంది.
- డేటా చౌర్యం తీవ్ర ఆందోళనకర అంశంగా మారుతోంది. 2025లో అంతర్జాతీయంగా ఏఐ అప్లికేషన్స్‌లోకి 18,000 టెరాబైట్స్ డేటా వచ్చి చేరింది. ఇది దాదాపు 360 కోట్ల డిజిటల్ ఫొటోలకు సమానం. ఏజెంటిక్ ఏఐ చొరబడిందంటే, సంప్రదాయ రక్షణ పద్ధతులు అడ్డుకోలేవు. నిమిషాల వ్యవధిలో భారీ స్థాయిలో డేటా చౌర్యం జరిగిపోతుంది.
- ఈ రిస్కులను ఎదుర్కొనాలంటే ఏఐని కట్టడి చేసేందుకు కంపెనీలు ఏఐనే ఆయుధంగా మార్చుకోవాలి. దాడులకు ఉపయోగపడే ఆస్కారమున్న అన్ని మార్గాలను మూసివేసేందుకు ప్రతి దశలోనూ భద్రతకు ప్రాధాన్యతనిచ్చే ఇంటెలిజెంట్ జీరో ట్రస్ట్ వ్యవస్థను వినియోగించుకోవాలి.

రిలయన్స్ చేతికి సదరన్ హెల్త్ ఫుడ్స్

మన్నా బ్రాండ్ మిల్లెట్ ఫుడ్స్ సొంతం

న్యూఢిల్లీ: అనుబంధ ఎఫ్‌ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్(ఆర్‌సీపీఎల్) తాజాగా తమిళనాడు కంపెనీ సదరన్ హెల్త్ ఫుడ్స్‌ను సొంతం చేసుకుంటున్నట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. అయితే డీల్ విలువను తెలియజేయలేదు. తాజా కొనుగోలు ద్వారా తృణ ధాన్యాల(మిల్లెట్స్) ఆధారిత ఫుడ్ విభాగంలో రిలయన్స్ కన్జూమర్ విస్తరించనుంది. రెండు దశాబ్దాలుగా ఆరోగ్యకర ఆహార విభాగంలో మన్నా బ్రాండ్‌తో సదరన్ హెల్త్ ఫుడ్స్ విభిన్న ప్రొడక్టులను విక్రయిస్తోంది. ఆర్‌సీపీఎల్ ఇటీవలే ఆస్ట్రేలియా సంస్థ గుడ్‌నెస్ గ్రూప్ గ్లోబల్ పీటీవైను సొంతం చేసుకున్న నేపథ్యంలో తాజా కొనుగోలుకి ప్రాధాన్యత ఏర్పడింది. తద్వారా బెటర్ ఫర్ యు బ్రాండ్ పానీయాల బిజినెస్‌ను సొంతం చేసుకున్న విషయం విదితమే.

'ఈవీ' దిగ్గజంగా భారత్

కేంద్ర మంత్రి కుమార స్వామి

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ వాహనాలను వినియోగించడానికే పరిమితం కాకుండా నాయకత్వ స్థానానికి ఎదగడం భారత్ లక్ష్యమని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పడంపై, యువతకు సుస్థిర జీవనోపాధి అవకాశాలపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు 5వ గ్లోబల్ ఎలక్ట్రిఫికేషన్ మొబిలిటీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన వివరించారు. కనెక్టెడ్ వాహనాలు, డేటా ఆధారిత వాహనాల నిర్వహణ, తెలివైన రవాణా వ్యవస్థలు మొదలైన వాటి ద్వారా సర్వీసులను అందజేసే విధానాలను ఎలక్ట్రిక్ మొబిలిటీ సమూలంగా మార్చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈవీల మార్కెట్ 60 శాతం వృద్ధి చెందినట్లు కుమారస్వామి తెలిపారు.

బీహెచ్‌ఈఎల్ షేర్ల విక్రయం

ఓఎఫ్‌ఎస్‌లో 5 శాతం ప్రభుత్వ వాటా



న్యూఢిల్లీ: విద్యుత్ పరికరాల తయారీ పీఎస్‌యూ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్(బీహెచ్‌ఈఎల్)లో ప్రభుత్వం 5 శాతం వాటా విక్రయించనుంది. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్) ద్వారా షేరుకి రూ. 254 ఫ్లోర్ ధరలో విక్రయానికి నేడు(11న) తెరతీయనుంది. నిజానికి తొలుత 3 శాతం వాటా(10.44 కోట్ల షేర్లు) ఆఫర్ చేయనుంది. డిమాండ్ ఆధారంగా మరో 2 శాతం వాటా విక్రయానికీ వీలునట్లు దీపమ్ కార్యదర్శి అరునిష్ చావ్లా ఎక్స్‌లో పేర్కొన్నారు. 11న సంస్థాగత వాటాదారులకు, 12న రిటైల్ ఇన్వెస్టర్లకు వాటా విక్రయ ఆఫర్ వర్తించనుంది. తద్వారా రూ. 4,422 కోట్లు అందుకోనుంది. మంగళవారం బీఎస్‌ఈ ముగింపు ధర రూ. 276తో పోలిస్తే ఫ్లోర్ ధర 8 శాతం డిస్కౌంట్‌కావడం గమనార్హం! ప్రస్తుతం బీహెచ్‌ఈఎల్‌లో ప్రభుత్వానికి 63.17 శాతం వాటా ఉంది.

పీఎల్‌ఐ పథకానికి 55 కంపెనీలు సై

రూ. 13,203 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: స్పెషాలిటీ స్టీల్ విభాగంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల(పీఎల్‌ఐ) పథకం మూడో రౌండ్‌ను కేంద్ర స్టీల్ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తాజాగా ప్రవేశపెట్టారు. అప్‌గ్రేడెడ్ అలాయ్ స్టీల్ తయారీలో 8.7 మిలియన్ టన్నులను అదనంగా జత చేసుకునే లక్ష్యంతో తాజా రౌండ్‌కు తెరతీశారు. ఇందుకు అనుగుణంగా 55 కంపెనీల మధ్య 85 అవగాహనా ఒప్పందాలు(ఎంవోయూలు) కుదిరాయి. వీటిలో పీఎస్‌యూ దిగ్గజం సెయిల్ సేలం స్టీల్ ప్లాంట్‌తో స్టీల్ శాఖ ఒప్పందం సైతం కలసి ఉంది. వెరసి పీఎల్‌ఐ 1.2లో భాగంగా రూ. 13,203 కోట్ల విలువైన పెట్టుబడులకు తెరలేవనుంది. ప్రధాని నరేంద్ర మోడీ విజన్‌కు అనుగుణంగా ప్రపంచస్థాయి పోటీతత్వ స్పెషాలిటీ స్టీల్ ఎకోసిస్టమ్ ఏర్పాటులో పీఎల్‌ఐ 1.2 కీలక ముందడుగుగా మంత్రి కుమారస్వామి పేర్కొన్నారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్.. లక్ష్యాలు రెండింటికీ తాజా పథకం ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. తద్వారా దేశీయంగా ఆధునిక, వ్యూహాత్మక స్టీల్ ప్రొడక్టుల తయారీ సామర్థ్యాలకు ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు తెలియజేశారు. తాజా ప్రాజెక్టులతో 2030-31కల్లా 8.7 మిలియన్ టన్నుల స్పెషాలిటీ స్టీల్ సామర్థ్యాలు జత కలిసే వీలున్నట్లు అంచనా వేశారు.

వాహన విక్రయాలకు కిక్

రిటైల్ అమ్మకాలు 18% అప్!

- జనవరిలో 27,22,558 యూనిట్ల అమ్మకాలు
- వచ్చే మూడు నెలల్లోనూ ఆశావహ అంచనాలు
- డీలర్ల సమాఖ్య ఫాడా గణాంకాలు వెల్లడి



వాహన విభాగం	జనవరి 2026	జనవరి 2025	వృద్ధి(%)
ప్రయాణికుల	5,13,475	4,78,915	7
టూ వీలర్స్	18,52,870	15,33,556	21
త్రీ వీలర్స్	1,27,134	1,07,013	19
వాణిజ్య	1,07,486	93,410	15
ట్రాక్టర్ల	1,14,759	93,386	23

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి మొత్తం 27,22,558 వాహనాలు రిటైల్‌గా విక్రయమయ్యాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా మంగళవారం వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన 23,14,940 యూనిట్లతో పోలిస్తే ఇవి 18% అధికంగా ఉన్నాయి. జీఎస్‌టీ సంస్కరణల ఉత్సాహం కొనసాగడం, పంట దిగుమతి, పెళ్లిళ్ల ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో నగదు సరఫరా పెరగడం, సరుకు రవాణా రంగంలో డిమాండ్ స్థిరంగా కొనసాగడంతో వాహనాలకు గిరాకీ పెరిగిందని ఫాడా వివరణ ఇచ్చింది. ''ప్యాసింజర్ వాహనాలకు డిమాండ్ పెద్ద నగరాలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మకంగా విస్తరిస్తోంది. వార్షిక ప్రాతిపదికన ప్రయాణికుల వాహన విక్రయాల వృద్ధి గ్రామీణ ప్రాంతాల్లో 14.43%, పట్టణ ప్రాంతాల్లో 2.75%గా ఉంది. కస్టమర్లకు ఎస్‌యూవీ/కాంపాక్ట్ ఎస్‌యూవీలపై అమితాసక్తి, ఎంట్రీ లెవల్ కార్ల తిరిగి మార్కెట్లోకి విడుదల కావడం, డిమాండ్‌కు తగ్గట్లు ఉత్పత్తి, కంపెనీల ఆఫర్లు, స్కీములు కొనసాగడం వాహన విక్రయాల వృద్ధికి తోడ్పడ్డాయి'' అని ఫాడా ప్రెసిడెంట్ సీ ఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.

వచ్చే మూడు నెలలపై ఫాడా అవుట్‌లుక్

రాబోయే మూడు నెలలపై ఫాడా ఆశావహ దృక్పథం వ్యక్తం చేసింది. డీలర్ విశ్వాసం బలంగా కొనసాగుతోందని, సర్వేలో పాల్గొన్నవారిలో 79.70% వృద్ధిని ఆశిస్తున్నారని, కేవలం 1.88% మాత్రమే క్షీణత ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపింది. వృద్ధి ఆధారిత బడ్జెట్ 2026లో కేంద్రం మౌలిక సదుపాయాలు, వ్యవసాయ రంగాలపై దృష్టి సారించింది. జీఎస్‌టీ 2.0 సంస్కరణల కొనసాగింపు, వడ్డీ రేట్లలో స్థిరత్వం, ఫైనాన్సింగ్ సౌలభ్యం తదితర అంశాలు కొనుగోళ్ల సామర్థ్యాన్ని పెంచవచ్చని ఫాడా అభిప్రాయపడింది. ముఖ్యంగా టూ వీలర్స్, వాణిజ్య వాహనాలు, ప్యాసింజర్ వాహనాల విభాగాల్లో డిమాండ్ సానుకూలంగా కొనసాగుతుందని అంచనా వేసింది. అయితే ఎన్నికల ప్రభావం, సీజనాలిటీ, కొన్ని ప్రాంతాల్లో మోడల్ లభ్యత అంశాలు వాహన విక్రయాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపొచ్చని ఫాడా పేర్కొంది.

ఆరు ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సుల సరెండర్

లిస్టులో టాటా మోటార్స్ ఫైనాన్స్, పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్

ముంబై: అనుబంధ సంస్థల్లో విలీనం కావడంతో టాటా మోటార్స్ ఫైనాన్స్, పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్ తమ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్సులను రిజర్వ్ బ్యాంకుకి సరెండర్ చేశాయి. వీటితో పాటు మరో ఆరు సంస్థలు తమ లైసెన్సులను తిరిగి ఇచ్చేశాయి. ఏఆర్ శ్యామ్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, రామా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, శ్రీ రామచంద్ర ఎంటర్‌ప్రైజెస్, శ్రీ నిర్మాణ్, అంకిత ప్రతిష్టాన్, మయూఖ ఇన్వెస్ట్‌మెంట్ ఈ జాబితాలో ఉన్నాయి. టాటా క్యాపిటల్‌లో టాటా మోటార్స్ ఫైనాన్స్ గతేడాది మే 8న విలీనమైంది. 2025 సెప్టెంబర్‌లో పిరమాల్ ఫైనాన్స్‌లో పిరమాల్ ఎంటర్‌ప్రైజ్ విలీనమైంది. మరోవైపు, నిర్దిష్ట ఎన్‌బీఎఫ్‌సీలకు రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపునిచ్చే ప్రతిపాదనకు సంబంధించిన ముసాయిదా సవరణలపై అభిప్రాయాలు తెలపాల్సిందిగా సంబంధిత వర్గాలకు రిజర్వ్ బ్యాంక్ సూచించింది. మార్చి 4 లోగా వీటిని ఆర్‌బీఐకి సమర్పించాల్సి ఉంటుంది. ప్రతిపాదనల ప్రకారం ప్రజల నుంచి నిధులు స్వీకరించని, కస్టమర్లకోసం ప్రత్యేక ఇంటర్‌ఫేస్ లేని, అసెట్స్ పరిమాణం రూ. 1,000 కోట్ల లోపు ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలు ఆర్‌బీఐ వద్ద రిజిస్టర్ చేయించుకోనక్కరలేదు.

చిన్న ఎన్‌బీఎఫ్‌సీలకు నో రిజిస్ట్రేషన్

ప్రజల నుంచి డిపాజిట్లు సమీకరించని చిన్న ఎన్‌బీఎఫ్‌సీలు (బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు) ఇకపై ఆర్‌బీఐ వద్ద నమోదు (రిజిస్టర్) చేసుకోవాల్సిన అవసరం ఉండదు. అది కూడా రూ.1,000 కోట్ల లోపు ఆస్తులున్న వాటికి రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపును ఆర్‌బీఐ ప్రతిపాదించింది. వీటిని టైప్-ఐగా వర్గీకరించనుంది. ఈ మేరకు ముసాయిదా సర్క్యులర్‌ను జారీ చేసింది. వీటిల్లో రిస్క్ తక్కువగా ఉండడం వల్లే ఈ ప్రతిపాదన తెచ్చింది. ఆర్‌బీఐ చట్టం 1934లోని సెక్షన్ 45ఏఐ కింద ప్రతీ ఎన్‌బీఎఫ్‌సీ సేవలు అందించేందుకు రిజిస్ట్రేషన్ పొందడం తప్పనిసరి. కాకపోతే రూ.1,000 కోట్లలోపున్నవి తమ సొంత నిధులనే పెట్టుబడులుగా వినియోగిస్తాయి కనుక, వాటితో వ్యవస్థాగత రిస్క్ తక్కువేనని ఆర్‌బీఐ పేర్కొంది. ఒకవేళ ప్రజల నుంచి డిపాజిట్లు సమీకరిస్తున్నా లేదా కస్టమర్ ఇంటర్‌ఫేస్ (శాఖలు/యాప్/డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు) కలిగి ఉంటే ఇకమీదటా రిజిస్ట్రేషన్ తీసుకోవడం తప్పనిసరి అని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

క్యూ3 ఫలితాలు

టీసీఐ లాభం 13 శాతం అప్

గురుగ్రాం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో లాజిస్టిక్స్ సేవల సంస్థ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (టీసీఐ) కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 116 కోట్ల లాభాన్ని ప్రకటించింది. గత క్యూ3లో నమోదైన రూ. 102 కోట్లతో పోలిస్తే ఇది 13 శాతం అధికం. ఇక ఆదాయం రూ. 1,154 కోట్ల నుంచి 9 శాతం వృద్ధి చెంది రూ. 1,261 కోట్లకు చేరింది. పండుగ సీజన్ డిమాండ్‌తో ఆటోమోటివ్, ఎఫ్‌ఎంసీజీ, ఎంఎస్‌ఎంఈ తదితర రంగాల్లో సానుకూల పనితీరు కనిపించినట్లు సంస్థ ఎండీ వినీత్ అగర్వాల్ తెలిపారు. రైలు, రహదారి మార్గాల ద్వారా రికార్డు స్థాయిలో వాల్యూమ్స్ నమోదయ్యాయని, గిడ్డంగుల వినియోగం కూడా గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు.

సంతోషపెట్టని హ్యాపీయెస్ట్ లాభం!

రూ.40 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ఐటీ సేవల సంస్థ హ్యాపీయెస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో (2025-26 క్యూ3) రూ.40 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 20 శాతం తగ్గింది. కొత్త కార్మిక చట్టాల కోసం రూ.22 కోట్ల కేటాయింపులు చేయడం లాభం తగ్గిపోయేలా చేసింది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 11 శాతం బలపడి రూ.587 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చి చూసినా ఆదాయంలో 2.43 శాతం వృద్ధి నమోదైంది. చురుకైన, డిజిటల్ కంపెనీ ట్యాగ్‌లైన్ నుంచి ఏఐ ఫస్ట్ (ఏఐకి మొదట ప్రాధాన్యం)కు మారింది. 2026-27 మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) నుంచి ఏఐ విక్రయాలను అధికారికంగా వెల్లడిస్తామని కంపెనీ ప్రకటించింది. డిసెంబర్ క్వార్టర్‌లో కంపెనీ కొత్తగా 11 క్లయింట్లను జోడించుకుంది. మొత్తం క్లయింట్ల సంఖ్య 297కు పెరిగింది.

బీఎస్‌ఈలో హ్యాపీయెస్ట్ మైండ్స్ షేరు ధర ఒక శాతం నష్టంతో రూ.393 వద్ద ముగిసింది.

జూబిలెంట్ ఫుడ్ లాభం హైజంప్

రూ. 73 కోట్లు

న్యూఢిల్లీ: డోమినోస్ పిజ్జా, డంకిన్ డోనట్స్ బ్రాండ్ల ఫాస్ట్ ఫుడ్ చైన్ దిగ్గజం జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 69 శాతం జంప్‌చేసి రూ. 73 కోట్లకు చేరింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 43 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 13 శాతంపైగా ఎగసి రూ. 2,437 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 10 శాతంపైగా పెరిగి రూ. 2,307 కోట్లకు చేరాయి. పటిష్ట సామర్థ్య నిర్వహణ, స్టోర్ల విస్తరణతో ఆదాయంలో రెండంకెల వృద్ధిసహా మార్జిన్లను మెరుగుపరచుకున్నట్లు కంపెనీ పేర్కొంది. వెరసి నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 1.1 శాతం బలపడి 19.8 శాతానికి చేరగా.. ఇబిటా 20 శాతం జంప్‌చేసి రూ. 482 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 1.6 శాతం బలపడి రూ. 557 వద్ద ముగిసింది.

బజాజ్ ఎలక్ట్రికల్స్‌కు నష్టాలు

రూ. 34 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో కన్జూమర్ ఎలక్ట్రిక్ ఎక్విప్‌మెంట్ కంపెనీ బజాజ్ ఎలక్ట్రికల్స్ లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో రూ. 34 కోట్ల నికర నష్టం ప్రకటించింది. కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ. 29 కోట్ల కేటాయింపుతోపాటు.. బలహీనపడిన స్థూల మార్జిన్లు ప్రభావం చూపాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 33 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం 19 శాతం క్షీణించి రూ. 1,051 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో రూ. 1,290 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం 14 శాతం తగ్గి రూ. 1,086 కోట్లకు చేరాయి. అధిక మార్జిన్ ప్రొడక్టుల విక్రయాలు మందగించడంతో స్థూల మార్జిన్లు నీరసించినట్లు కంపెనీ పేర్కొంది. కన్జూమర్ ప్రొడక్టుల ఆదాయం 25 శాతం పడిపోయి రూ. 777 కోట్లను తాకింది. అయితే లైటింగ్ సొల్యూషన్ల బిజినెస్ 9 శాతం పుంజుకుని రూ. 274 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం నష్టంతో రూ. 409 వద్ద ముగిసింది.

రాణించిన గ్రాసిమ్ ఇండస్ట్రీస్

29 శాతం పెరిగిన లాభం

న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ గ్రాసిమ్ ఇండస్ట్రీస్ డిసెంబర్ త్రైమాసికంలో మెరుగైన పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 29 శాతం జంప్ చేసి రూ.2,233 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.1,734 కోట్లుగానే ఉంది. అల్ట్రాటెక్ సిమెంట్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, ఆదిత్య బిర్లా రెన్యువబుల్స్‌కు గ్రాసిమ్ ఇండస్ట్రీస్ హోల్డింగ్ కంపెనీగా ఉంది. అన్ని వ్యాపారాలు మంచి పనితీరు చూపించడం అనుకూలించింది. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 25 శాతం పెరిగి రూ.44,312 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.35,378 కోట్లుగానే ఉంది. కన్సాలిడేటెడ్ ఎబిట్డా 33 శాతం ఎగసి రూ.6,215 కోట్లుగా ఉంది. బిల్డింగ్ మెటీరియల్స్ (సిమెంట్, పెయింట్స్) వ్యాపారం ఆదాయం 30 శాతం పెరిగి 25,173 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో గ్రాసిమ్ షేరు ఒక శాతం లాభపడి రూ.2,964 వద్ద ముగిసింది.

శుభారంభం లక్ష్యంగా...

- నేడు బెల్జియంతో టీమిండియా 'ఢీ'
- ప్రో లీగ్ భారత్ అంచె మ్యాచ్‌లు
- రాత్రి గం. 7:30 నుంచి జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

రూర్కెలా: గత ప్రో లీగ్ సీజన్‌లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్న భారత పురుషుల హాకీ జట్టు ఈసారి మెరుగైన ప్రదర్శన కనబర్చాలని పట్టుదలతో ఉంది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్‌లో భాగంగా నేటి నుంచి భారత అంచె మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్న భారత జట్టుతో రెండు మ్యాచ్‌ల చొప్పున ఆడేందుకు ప్రపంచ రెండో ర్యాంకర్ బెల్జియం, నాలుగో ర్యాంకర్ అర్జెంటీనా జట్లు సిద్ధమయ్యాయి. బుధవారం జరిగే తొలి మ్యాచ్‌లో బెల్జియంతో ఆడనున్న టీమిండియా... గురువారం ఒలింపిక్ మాజీ చాంపియన్ అర్జెంటీనాతో తలపడుతుంది. శుక్రవారం విశ్రాంతి దినం తర్వాత శనివారం బెల్జియం జట్టుతో, ఆదివారం అర్జెంటీనాతో భారత్ మళ్లీ ఆడుతుంది. మొత్తం తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రో లీగ్ తాజా సీజన్‌లో భారత్ మాత్రమే చివరి జట్టుగా తమ తొలి మ్యాచ్ ఆడనుంది. నెదర్లాండ్స్, ఇంగ్లండ్ ఎనిమిదేసి మ్యాచ్‌లు... అర్జెంటీనా, బెల్జియం, జర్మనీ నాలుగేసి మ్యాచ్‌లు... పాకిస్తాన్ ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. గత సీజన్‌లో మాదిరిగా ఈసారి కూడా హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోనే భారత్ బరిలోకి దిగనుంది. సీనియర్ స్టార్ మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్‌పై వేటు వేయడంతో అతని లేని లోటు తెలియకుండా తమ సత్తా చాటుకోవాలని అమన్‌దీప్ లాక్రా, మన్‌మీత్ సింగ్, రోషన్ కుజుర్ సిద్ధంగా ఉన్నారు. ముఖాముఖి పోరులో భారత్‌పై బెల్జియందే పైచేయిగా ఉంది. గత 13 ఏళ్లలో రెండు జట్లు 35 సార్లు తలపడ్డాయి. 22 మ్యాచ్‌ల్లో బెల్జియం గెలుపొందగా... 11 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గింది. మరో రెండు మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

రెండో రౌండ్‌లో నగాల్

చెన్నై: నెదర్లాండ్స్‌తో జరిగిన డేవిస్‌కప్ పోరులో ఆడిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లో ఓడిన భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్... స్వదేశంలో జరుగుతున్న చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో శుభారంభం చేశాడు. ఫెలిక్స్ గిల్ (బ్రిటన్)తో జరిగిన తొలి రౌండ్‌లో సుమిత్ నగాల్ 1-6, 6-1, 6-3తో గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. భారత్‌కే చెందిన శశికుమార్ ముకుంద్ 7-5, 6-3తో నితిన్ కుమార్ సిన్హా (భారత్)పై, సిద్ధార్థ్ రావత్ 2-6, 6-3, 6-2తో ఐదో సీడ్ రియో నొగుచి (జపాన్)పై విజయం సాధించారు.

నయా రాకెట్

భారత టెన్నిస్‌లో నిశ్శబ్ద చాంపియన్‌గా ఎదిగిన దక్షిణేశ్వర్

- నెదర్లాండ్స్‌తో డేవిస్‌కప్ పోరులో అసాధారణ ప్రదర్శన
- బరిలోకి దిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం
- తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయని చెన్నై ప్లేయర్

సాక్షి క్రీడా విభాగం

దక్షిణేశ్వర్ సురేశ్... గతేడాదే డేవిస్‌కప్‌లో అరంగేట్రం చేశాడు. తొలి ప్రయత్నంలోనే బోణీ కూడా కొట్టాడు. అయినా మనకెవరికీ తెలియదు. తాజాగా తెలిసింది. తెలియని వారు సైతం తెలుసుకుంటున్నారు. గూగుల్‌లో ఎవరీ దక్షిణేశ్వర్ అని సెర్చ్ చేస్తున్నారు. ఇంతలా నెటిజన్ల కంటపడుతున్న అతను ఏం చేశాడో చెప్పాల్సిన పనైతే లేదు. ఎందుకంటే అతనొక సంచలనం. డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్-1లో నెదర్లాండ్స్ జట్టుతో భారత్ ఆడితే... తలపడింది... ఎదురుపడింది... ఎదుర్కొని గెలిపించింది మాత్రం దక్షిణేశ్వరే! ఇందులో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

పోటీ... నైపుణ్యం నిండిన ప్రస్తుత కాలంలో దక్షిణేశ్వర్ ముమ్మాటికి ఓ నిశ్శబ్ద చాంపియన్. జూనియర్ సర్క్యూట్, ఏటీపీ చాలెంజర్... ఐటీఎఫ్ ... ఇలా ఎన్నో పేర్లతో టోర్నీలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. అన్నింటా ఆడుతూనే ఉన్నా... ఏ టోర్నీలోనూ కంటబడని తమిళనాడు యువతార ఏకంగా చాంపియన్‌గా బయట పడటమే పెద్ద విశేషం. ఒకప్పుడు ఆట కోసం కిట్ బ్యాగులు మోసిన భుజాలే ఇప్పుడు డేవిస్ కప్‌లో భారత బాధ్యతల్ని మోస్తున్నాయి. ఎంతో క్రమశిక్షణతో కూడిన అతని శిక్షణ, పోటీలు, విజయాలు ఇవన్నీ కూడా గమనించిన వారికి ముచ్చటేయకుండా ఉండదు. పొద్దెక్కముందే ట్రెయినింగ్... మధ్యలో పోటీలు... పిడికిలి బిగిస్తే విజయాలు అన్నీ కూడా ఓ క్రమపద్ధతిలో కష్టపడితేనే వచ్చాయి. ఓపికగా, ఒద్దికగా అన్నింటిని భరించిన దక్షిణేశ్వర్ ఈ క్రమంలో క్రీడా జర్నలిస్టుల ప్రాధాన్యంలోనూ లేడు. కానీ ఒక్కసారిగా సంచలన విజయాలతోనే అందరి కళ్లముందుకు వచ్చాడు. ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్ ప్రకారమైతే డేవిస్‌కప్‌లో భారత జట్టు తరఫున నంబర్‌వన్ సుమిత్ నగాల్ తర్వాత ఆర్యన్ షా, కరణ్ సింగ్‌లలో ఒకరికి అవకాశం ఇవ్వాలి. అయితే భారత నాలుగో ర్యాంకర్‌గా ఉన్న దక్షిణేశ్వర్ ఆటతీరుపై నమ్మకంతో భారత జట్టు నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ ఈ తమిళనాడు పొడగరికి ఏకంగా మూడు మ్యాచ్‌లు (సింగిల్స్, డబుల్స్, రివర్స్ సింగిల్స్) ఆడే అవకాశం ఇచ్చాడు. రోహిత్ రాజ్‌పాల్‌తోపాటు భారత టీమ్ మేనేజ్‌మెంట్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా అంచనాలకు మించి రాణించిన దక్షిణేశ్వర్‌కు భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

తొలినాళ్ల ప్రయాణమిది

తమిళనాడులోని దిండిగుల్ పట్టణానికి చెందిన దక్షిణేశ్వర్ తండ్రి సురేశ్ ఎక్కా కూడా టెన్నిస్ ప్లేయరే! రాష్ట్రానికి, దేశానికి ఆడలేదు కానీ క్లబ్ లెవెల్ ఆటగాడు సురేశ్. బహుశా ఈ మూలాలే దక్షిణేశ్వర్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకొచ్చాయేమో! చెన్నైలోని కోచ్ లక్ష్మణ్ చక్రవర్తి శిక్షణలో ఓనమాలు, తర్వాత మెలకువలు నేర్చుకొని రాటుదేలాడు. 2010 నుంచి 2016 వరకు తన ఉండే ఊరి నుంచి 16 కిలోమీటర్లు కిట్ బ్యాగులు మోసుకొని చెన్నై వెళ్లి చక్రవర్తి ఇచ్చే రోజువారీ శిక్షణ ముగించుకొని తిరిగి బస్సులో ఇంటికి చేరేవాడు. నిండా పదేళ్లు (9) లేకపోయినా సురపేట్ నుంచి మొగప్పాయిర్, అక్కడి నుంచి అన్నా నగర్, అటుపై లయోలా కాలేజ్ అతని టెన్నిస్ శిక్షణ సాగేదని కోచ్ చక్రవర్తి వివరించారు. 'అదేంటో ఏమో దక్షిణేశ్వర్ బాల్యం నుంచే ఎవరితోనైనా సరే ఆడేందుకు ఇష్టపడేవాడు. కష్టపడేందుకు, నేర్చుకునే క్రమంలో అడిగేందుకు సిగ్గుపడడు. కానీ తన పనిమాత్రం నింపాదిగా, నిశ్శబ్దంగానే చేసుకునేవాడు. అతనిది చాలా భిన్నమైన వ్యక్తిత్వం. పెప్సీ, కోక్‌లాంటి కూల్‌డ్రింక్స్ తాగేవాడే కాదు. కఠినమైన క్రమశిక్షణతోనే మెలిగేవాడు. అవకాశాలేమో పరిమితంగా వస్తే, ఆర్థిక సమస్యలు అపరిమితంగా చుట్టిముట్టినా కూడా క్రమశిక్షణతోనే అధిగమించాడు. 2016లో ఫ్రాన్స్‌లో శిక్షణకు వెళ్లాడు. ఆ తర్వాతే అండర్-16 జాతీయ టోర్నీలో విజేతగా నిలిచాడు' అని 65 ఏళ్ల కోచ్ లక్ష్మణ్ చక్రవర్తి తన శిష్యుడి ప్రయాణం చెబుతూ మురిసిపోయారు.

ప్రస్తుతం అమెరికాలో...

దక్షిణేశ్వర్ ఆటలో క్రమంగా రాటుదేలుతున్నా... చదువెందుకని ఏనాడు అనుకోలేదు. ఆటలో కష్టపడ్డట్లే ఉన్నత విద్య కోసం కూడా అంతే క్రమశిక్షణతో కష్టపడుతున్నాడు. ప్రస్తుతం అమెరికాలోని 'వేక్ ఫారెస్ట్ యూనివర్సిటీ'లో కమ్యూనికేషన్స్ విద్యను అభ్యసిస్తున్న అతని చదువు ఈ ఏడాది మే నెలలో పూర్తవనుంది. ఆ తర్వాత పూర్తిగా టెన్నిస్‌పైనే దృష్టి సారించనున్నాడు. దీంతో మరిన్ని విజయాలతో 470వ ర్యాంకులో ఉన్న ఈ తమిళనాడు ప్లేయర్ నిలకడైన విజయాలు సాధిస్తే మరో ఏడాది తిరిగేసరికి టాప్-100 ర్యాంకింగ్స్‌లోకి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

నెదర్లాండ్స్‌పై విజయానంతరం భారత జట్టు సంబరం

ఏడాది గడిచే సరికి...

గతేడాది డేవిస్ కప్‌లో భారత్... స్విట్జర్లాండ్‌తో ఆడింది. 3-1తో జయకేతనం ఎగురవేసింది. ఈ మ్యాచ్ ఆడిన భారత డేవిస్ బృందంలో దక్షిణేశ్వర్ ఉన్నాడు. బరిలోకి దిగి సింగిల్స్‌లో గెలిచాడు. అలా భారత్ విజయంలో దక్షిణేశ్వర్ పాత్ర ఉంది. ఏడాది తిరిగేసరికి 22 ఏళ్ల క్రితం లియాండర్ పేస్ రికార్డునే సమం చేసిన ఘనత దక్షిణేశ్వర్‌ది! 2004లో జపాన్‌పై పేస్ 3 మ్యాచ్‌లాడి పేస్ గెలిపించాడు. మళ్లీ రెండు దశాబ్దాల తర్వాత దక్షిణేశ్వర్ నెదర్లాండ్స్‌తో తొలి సింగిల్స్ ఆడి గెలిచాడు. రెండో రోజు డబుల్స్, రివర్స్ సింగిల్స్ వరుసగా ఆడి కూడా గెలిపించాడు. పేస్ తర్వాత... దక్షిణేశ్వర్ కంటే ముందు... సోమ్‌దేవ్, విష్ణువర్ధన్, సాకేత్ మైనేని, సుమిత్ నగాల్, యూకీ బాంబ్రీ, గుణేశ్వరన్, శ్రీరామ్ బాలాజీ, జీవన్ నెడుంజెళియన్ ఇలా ఎంతోమంది వచ్చారు. మెరుగైన ర్యాంకింగ్స్‌లో నిలిచారు. డేవిస్ కప్ ఆడారు. కానీ దక్షిణేశ్వర్ ర్యాంకింగ్స్‌లో వెనుకబడినా... భారత్‌ను ముందుండి గెలిపించే ప్రదర్శనైతే చేయలేదు.

'విజ్డన్' కవర్ పేజీపై సిరాజ్

లండన్: భారత పేస్ బౌలర్, హైదరాబాదీ మొహమ్మద్ సిరాజ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రఖ్యాత క్రికెట్ మేగజీన్ 'విజ్డన్ క్రికెటర్స్ అల్మనాక్' 2026 సంచిక కవర్ పేజీపై పబ్లిషర్లు సిరాజ్ చిత్రాన్ని ముద్రించారు. సిరాజ్‌తోపాటు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ ఫొటో కూడా దీనిపై ఉంది. ఓవల్ టెస్టులో చేతితో గాయంతో జట్టును కాపాడేందుకు కట్టుతోనే మైదానానికి వచ్చిన వోక్స్ ఫొటోనే ఇక్కడ వాడారు. ఇరు జట్ల మధ్య జరిగిన టెస్టు సిరీస్ 2-2తో 'డ్రా'గా ముగియగా... చివరి టెస్టులో సిరాజ్ ప్రదర్శనతోనే భారత్ 6 పరుగుల తేడాతో నెగ్గింది. రెండో ఇన్నింగ్స్‌లో చివరి రోజు 4 వికెట్లతో ఇంగ్లండ్ 35 పరుగులు చేయాల్సి ఉండగా, సిరాజ్ 3 వికెట్లు తీసి ఇంగ్లండ్ ఆట ముగించాడు. మొత్తంగా ఈ సిరీస్‌లో సిరాజ్ 32.43 సగటుతో అత్యధికంగా 23 వికెట్లు పడగొట్టడం విశేషం. కొత్త విజ్డన్ క్రికెటర్స్ అల్మనాక్ సంచిక ఏప్రిల్ 16న మార్కెట్‌లోకి రానుంది.



ఆంధ్ర జట్టుకు ఇన్నింగ్స్ ఓటమి

రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో బెంగాల్

కల్యాణి: లీగ్ దశలో అజేయంగా నిలిచిన ఆంధ్ర పురుషుల క్రికెట్ జట్టు అసలైన నాకౌట్ మ్యాచ్‌లో మాత్రం నిరాశ పరిచింది. ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ టోర్నమెంట్‌లో సెమీఫైనల్ చేరే అవకాశాన్ని రికీ భుయ్ బృందం చేజార్చుకుంది. ఆరుసార్లు చాంపియన్ బెంగాల్ జట్టుతో జరిగిన చివరి క్వార్టర్ ఫైనల్లో ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 90 పరుగుల తేడాతో ఓడిపోయింది. 32వ సారి రంజీ ట్రోఫీలో సెమీఫైనల్‌కు అర్హత సాధించిన బెంగాల్ జట్టు... ఫైనల్లో చోటు కోసం ఈనెల 15 నుంచి కల్యాణిలో జరిగే సెమీఫైనల్లో జమ్మూకశ్మీర్ జట్టుతో ఆడుతుంది. లక్నోలో జరిగే మరో సెమీఫైనల్లోఉత్తరాఖండ్ జట్టుతో కర్ణాటక జట్టు తలపడుతుంది. ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్ జట్లు తొలిసారి సెమీఫైనల్ చేరుకున్నాయి. ఈ రెండు జట్లు ఫైనల్ చేరితే రంజీ ట్రోఫీలో కొత్త చాంపియన్ అవతరిస్తుంది. బెంగాల్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో 334 పరుగులు వెనుకబడి... ఓవర్‌నైట్ స్కోరు 64/3తో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 72.2 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. ఆఖరి రోజు ఆంధ్ర జట్టు 180 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లు చేజార్చుకుంది. భారత క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి 144 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 90 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. త్రిపురాణ విజయ్ (61 బంతుల్లో 46; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి నితీశ్ ఎనిమిదో వికెట్‌కు 85 పరుగులు జోడించాడు. ఆరు పరుగుల తేడాలో నితీశ్, విజయ్ అవుటయ్యారు. గాయం కారణంగా కోన శ్రీకర్ భరత్ బ్యాటింగ్‌కు రాలేదు. బెంగాల్ బౌలర్లలో షహబాజ్ అహ్మద్ 72 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. సూరజ్ సింధు జైస్వాల్ 2 వికెట్లు తీయగా... ఆకాశ్ దీప్, సుమంత గుప్తా, అనుస్తుప్ మజుందార్ ఒక్కో వికెట్ చొప్పున సాధించారు. భారత పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం మూడు ఓవర్లు మాత్రమే వేశాడు. ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 295 పరుగులు చేయగా... బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 629 పరుగులు సాధించింది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ, రష్మిక

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 మహిళల టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ సహజ యామలపల్లి, రెండో ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేశారు. పుణేలో ఈ టోర్నీ జరుగుతోంది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో తెలంగాణ అమ్మాయి సహజ 6-4, 7-6 (8/6)తో ఎకతెరీనా మక్లాకోవా (రష్యా)పై, హైదరాబాద్ ప్లేయర్ రష్మిక 6-3, 6-2తో విక్టోరియా మిలోవనోవా (రష్యా)పై విజయం సాధించారు. మక్లాకోవాతో 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సహజ నాలుగు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన తొలి సర్వీస్‌లో 31 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 14 పాయింట్లు స్కోరు చేసింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మిలోవనోవాతో 86 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో రష్మిక తొమ్మిది ఏస్‌లు సంధించింది. తొలి సర్వీస్‌లో 32 పాయింట్లు, రెండో సర్వీస్‌లో తొమ్మిది పాయింట్లు సాధించింది. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

టాప్ సీడ్ జోడీని ఓడించి...

డబుల్స్ విభాగంలో సహజ (భారత్)-జుజానా పావ్లీకొస్కా (పోలాండ్) జోడీ సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో సహజ-జుజానా ద్వయం 4-6, 7-6 (7/4), 11-9తో టాప్ సీడ్ ప్రార్థన తొంబారే (భారత్)-నికోల్ ఫోసా హ్యార్గో (అర్జెంటీనా) జంటను బోల్తా కొట్టించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ అమ్మాయి చిలకలపూడి శ్రావ్య శివాని-ఆకాంక్ష (భారత్) జోడీ 4-6, 3-6తో డెయోన్ బ్యాక్-సోహున్ పార్క్ (దక్షిణ కొరియా) జంట చేతిలో ఓడిపోయింది.

వచ్చేనెలలో ముంబైలో సానియా చందోక్‌తో జరిగే తన కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆహ్వానించారు. ఈ మేరకు కాబోయే వధూవరుల కుటుంబసభ్యులు మంగళవారం మోదీని కలిశారు.

రంజాన్ మాసం సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం యూపీలో ప్రయాగ్‌రాజ్‌లోని ఓ ఫ్యాక్టరీలో సేమియా తయారు చేస్తున్న కార్మికులు

భారత్‌లో అవినీతి తగ్గుముఖం!

182 దేశాలకు గాను 91వ ర్యాంకు

- గత ఏడాది కంటే ఐదు స్థానాలు మెరుగు
- అమెరికాకు 29వ ర్యాంకు, యూకేకు 20వ ర్యాంకు
- కరప్షన్ పర్‌సెప్షన్స్ ఇండెక్స్ నివేదిక వెల్లడి
- నివేదికను విడుదల చేసిన 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్'

న్యూఢిల్లీ: భారత్‌లో అవినీతి కొంత తగ్గుముఖం పట్టినట్లు అంతర్జాతీయ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ అయిన ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ మంగళవారం విడుదల చేసిన కరప్షన్ పర్‌సెప్షన్స్ ఇండెక్స్(సీపీఐ)–2025 నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 182 దేశాల్లో అవినీతి నిర్మూలనపై అధ్యయనం చేయగా, భారత్‌కు 91వ స్థానం దక్కింది. గత ఏడాది 96వ స్థానంలో నిలిచిన భారత్ ఈ ఏడాది తన స్థానాన్ని మెరుగుపరుచుకుంది. ఆసియా పసిఫిక్ దేశాల్లో అవినీతి వ్యతిరేక కార్యక్రమాలు క్రమంగా పెరుగుతున్నాయని, వాటి ఫలితాలు సైతం కనిపిస్తున్నాయని ఈ నివేదిక పేర్కొంది. అవినీతి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన వస్తోందని తెలియజేసింది. ప్రపంచంలో ప్రతిచోటా అవినీతి అనేది అతిపెద్ద జాడ్యంగా మారినట్లు ఆందోళన వ్యక్తంచేసింది. అవినీతికి అడ్డుకట్ట వేయాలంటే తొలుత పాలకులు, రాజకీయ నేతలు చొరవ చూపాలని, వారు అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని సూచించింది. జవాబుదారీతనం లేని నాయకుల పట్ల ప్రజలు విసుగెత్తిపోయారని, అందుకే ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళన కార్యక్రమాలు, నిరసనలు జరుగుతున్నాయని వెల్లడించింది. వారంతా వ్యవస్థల్లో సంస్కరణలు కోరుకుంటున్నారని తెలియజేసింది. వ్యవస్థల ప్రక్షాళనతో అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని అభిప్రాయపడింది.

- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 182 దేశాల్లో ప్రభుత్వ రంగంలో అవినీతిని అధ్యయనం చేసి ర్యాంకులు ఇచ్చింది. సున్నా నుంచి 100 దాకా స్కోర్ కేటాయించింది. సున్నా స్కోర్ అంటే అత్యంత అవినీతి దేశమని అర్థం. 100 దాకా స్కోర్ వస్తే అక్కడ అవినీతి ఆనవాళ్లు పెద్దగా లేనట్లే.
- పలుదేశాల్లో అవినీతిని బహిర్గతం చేస్తున్న జర్నలిస్టులకు హెచ్చరికలు ఎదురవుతున్నాయి. దాడులు జరుగుతున్నాయి. ఈ జాబితాలో భారత్ కూడా ఉంది.
- అవినీతిపై పరిశోధన చేసి, ప్రజలకు తెలియజేస్తున్న జర్నలిస్టులకు హత్యకు గురవుతున్నా, దాడులను ఎదుర్కొంటున్నా పాలకులు సరిగ్గా స్పందించడం లేదని కరప్షన్ పర్‌సెప్షన్స్ ఇండెక్స్ నివేదిక ఆక్షేపించింది.
- 2012 నుంచి ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా 829 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. అవినీతిని బయటపెట్టడమే వీరు చేసిన నేరం.
- సీపీఐ స్కోర్ 50 కంటే తక్కువ ఉన్న దేశాలైన బ్రెజిల్, ఇండియా, మెక్సికో, పాకిస్తాన్, ఇరాక్‌లో ఎక్కువ మంది జర్నలిస్టులు దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. బ్రెజిల్ స్కోర్ 35, ఇండియా స్కోర్ 39, మెక్సికో స్కోర్ 27, పాకిస్తాన్ స్కోర్ 28, ఇరాక్ స్కోర్ 28గా ఉంది.
- 31 దేశాల్లో 2012 నుంచి అవినీతి గణనీయంగా తగ్గిపోయింది. మిగిలిన దేశాలు అవినీతిని నియంత్రించడంలో విఫలమయ్యాయి. కొన్ని దేశాల్లో అవినీతి అదేస్థాయిలో ఉండగా, మరికొన్ని దేశాల్లో కొంత పెరిగింది.
- ప్రపంచ సగటు సీపీఐ స్కోర్ 42గా నమోదైంది. మూడింట రెండొంతుల దేశాల స్కోర్ 50 కంటే తక్కువే ఉన్నట్లు తేలింది.
- అవినీతి వల్ల ప్రజలకు భారీగా నష్టం జరుగుతోంది. వారి జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. మౌలిక వసతులు అందడం లేదు. యువత ఆశలు సాకారం కావడం లేదు.
- కరప్షన్ పర్‌సెప్షన్స్ ఇండెక్స్ రిపోర్టులో డెన్మార్క్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ దేశం స్కోర్ 89. అవినీతి నిర్మూలనలో ఫిన్‌లాండ్, సింగపూర్ కంటే డెన్మార్క్ ముందంజలో ఉంది. చిట్టచివరి స్థానాల్లో దక్షిణ సూడాన్, సోమాలియా, వెనెజులా నిలిచాయి.
- అగ్రదేశం అమెరికాకు 29వ ర్యాంకు, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)కు 20వ ర్యాంకు లభించింది.
- ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, యూకే, న్యూజిలాండ్‌లో అవినీతి నిర్మూలన ఆశించిన స్థాయిలో కొనసాగడం లేదని నివేదిక పేర్కొంది. అవినీతిని అంతం చేయాలన్న సంకల్పం అక్కడి పాలకుల్లో కనిపించడం లేదని వెల్లడించింది.
- అవినీతి పెరగడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ప్రధానంగా రాజకీయ వర్గాల్లో పెచ్చరిల్లుతున్న అవినీతి సమాజానికి ముప్పుగా పరిణమిస్తోంది. పాలకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ జర్నలిస్టులను, ఎన్జీఓలను కట్టడి చేయాలని చూస్తున్నారు. పాలకుల్లో పారదర్శకత గానీ, జవాబుదారీతనం గానీ లోపిస్తున్నాయి. అంతిమంగా ఇది అవినీతికి బాటలు వేస్తున్నట్లు కరప్షన్ పర్‌సెప్షన్స్ ఇండెక్స్ నివేదిక తేల్చిచెప్పింది.

రద్దీగా ఉన్న రోడ్డుపై ల్యాండైన విమానం

మూడు వాహనాలు ధ్వంసం, ఇద్దరికి గాయాలు

గెయిన్స్‌విల్లె: వాహనాల రద్దీ తీవ్రంగా ఉన్న సమయంలో ఓ సింగిల్ ఇంజిన్ విమానం రోడ్డుపై అత్యవసరంగా ల్యాండయ్యింది. అంత ట్రాఫిక్‌లోనూ కేవలం మూడు కార్లకు మాత్రమే ఆ విమానం తాకింది. ఆ వాహనాల్లోని ఇద్దరు మాత్రమే, అదీ స్వల్పంగా గాయపడ్డారు. విమానంలోని వారు కూడా సురక్షితంగా బయటపడ్డారు. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో సోమవారం చోటుచేసుకుంది. హాకర్ బీచ్‌క్రాఫ్ట్ రకానికి చెందిన సింగిల్ ఇంజిన్ విమానం అట్లాంటాకు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న గెయిన్స్‌విల్లెలోని బ్రౌన్స్ బ్రిడ్జి రోడ్డుపై అకస్మాత్తుగా దిగింది. ఇంజిన్‌లో లోపం తలెత్తడంతో తిరిగి వెనక్కి వెళ్లాలని మొదట భావించాం. అయితే, ఎంత దూరం వరకు ఇంజిన్ సక్రమంగా పనిచేస్తుందో తెలియదు. దీంతో, ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో కనిపించిన రోడ్డుపైనే ల్యాండవ్వాలని నిర్ణయం తీసుకున్నాం'అని పైలట్ థామస్ రోజెర్స్ చెప్పారు. ఘటనపై గెయిన్స్‌విల్లె పోలీస్ కెప్టెన్ కెవిన్ హోల్‌బ్రూక్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'రోడ్డుపై ఆ సమయంలో వందల సంఖ్యలో వాహనాలున్నాయి. అయినప్పటికీ వాటి మధ్యలో విమానం ల్యాండవ్వడం, కేవలం మూడు వాహనాలను మాత్రమే ఢీకొట్టి, విద్యుత్ తీగలను తాకకుండా క్షేమంగా దిగడం అసాధారణమైన విషయం' అని పేర్కొన్నారు. ఈశాన్య జార్జియాలోని అతి ప్రధానమైన రహదారిపై జరిగిన ఇలాంటి ఘటనలో ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడం, చనిపోకపోవడం చూస్తే నిజంగా ఆశ్చర్యమేస్తోంది' అని ఆయన చెప్పారు.

చమురు కొనకుండా భారత్‌ను అడ్డుకుంటోంది

అమెరికాకు కావాల్సింది ఆర్థికపరమైన ఆధిపత్యం

- అందుకే ఇతర దేశాలపై టారిఫ్‌లు, ఆంక్షలు
- రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపణలు

మాస్కో: ప్రపంచ దేశాలపై ఆర్థికపరమైన ఆధిపత్యం సాధించేందుకు అమెరికా టారిఫ్‌లు, ఆంక్షలు, ప్రత్యక్ష నిషేధాల వంటి అనేక రకాల అక్రమ విధానాలను అమలు చేస్తోందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. అదేవిధంగా, భారత్ తదితర దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకుండా అమెరికాయే అడ్డుకుంటోందన్నారు. రష్యా చమురు కంపెనీలపై ఆంక్షలు విధించడం ద్వారా పోటీ లేకుండా చేయడం వంటి అక్రమ విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సోమవారం టీవీ బ్రిక్స్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో లావ్రోవ్ అమెరికా వైఖరిని ఎండగట్టారు. భారత్, ఇతర బ్రిక్స్ సభ్య దేశాలు, కీలక వ్యూహాత్మక భాగస్వాములతో మాకున్న వాణిజ్యం, పెట్టుబడి సహకారం, సైనిక, సాంకేతిక సంబంధాలను నియంత్రించడానికి అమెరికా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గతంలో చలాయించిన ఆధిపత్యాన్ని వదులుకోవడానికి ఇప్పటికీ పాశ్చాత్య దేశాలు ఇష్టపడటం లేదని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టాక ప్రత్యర్థులను అణచివేసే చర్యలు మరింత బాహాటంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఇంధన సరఫరా మార్గాలపై పెత్తనం

గతేడాది రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య అలాస్కాలో జరిగిన చర్చలను లావ్రోవ్ ప్రస్తావించారు. 'ఉక్రెయిన్ సమస్య పరిష్కారం తప్పనిసరని అమెరికా తెలిపింది. మేం కోరుకున్నదీ అదే. అందుకే ఆ దేశం అందజేసిన ప్రతిపాదనలకు వెనువెంటనే ఆమోదం తెలిపాం'అన్నారు. 'అయితే, జరిగింది వేరుగా ఉంది. అలాస్కా చర్చల తర్వాత మాపై మరిన్ని ఆంక్షలు విధించారు. అంతర్జాతీయ జలాల గుండా వెళ్లే మా ఆయిల్ ట్యాంకర్లపై దాడులు పెంచారు. మా చమురు కొనుగోలు చేసే భారత్, తదితర దేశాలపై ఒత్తిడులను తీవ్రతరం చేశారు. తక్కువ ధరకు మేం సరఫరా చేసే చమురు, గ్యాస్‌లను కాదని, అమెరికా నుంచి అత్యధిక ధరకు సహజవాయువును యూరప్ దేశాలు కొనుక్కుంటున్నాయి. ఆ విధంగా, అమెరికా తన ఆర్థిక ఆధిపత్యాన్ని సాధించుకుంది'అని లావ్రోవ్ వివరించారు. నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్లు, ఉక్రెయిన్ గ్యాస్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్, టర్క్ స్ట్రీమ్ పైప్‌లైన్ తదితర అన్ని ఖండాల్లోని ఇంధన సరఫరా మార్గాలను చెప్పుచేతల్లో పెట్టుకోవాలన్నదే అమెరికా లక్ష్యమని తెలిపారు. 'ఆర్థికపరమైన ఆధిపత్యం కోసం అమెరికా ప్రభుత్వం ఆంక్షలు, టారిఫ్‌లు, ప్రత్యేక నిషేధాలు, కొన్ని దేశాల కమ్యూనికేషన్ వ్యవస్థలపై పరిమితులు సైతం విధిస్తోంది. వీటన్నిటినీ మనం గమనంలోకి తీసుకోవాలి'అని లావ్రోవ్ చెప్పారు. 'భారత్, ఇండోనేసియా, బ్రెజిల్ మాదిరిగా మేం కూడా అన్ని దేశాలతో సహకార భావనతో వ్యవహరిస్తున్నాం. ఆ మాటకొస్తే అమెరికాతోనూ సాధారణ సంబంధాలనే కోరుకుంటున్నాం. అమెరికా మాత్రం అవరోధాలను సృష్టిస్తూనే ఉంది'అని విమర్శించారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించినందునే ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు గత వారం ట్రంప్ ప్రకటించడం తెల్సిందే. ఆయిల్‌ను రష్యా నుంచి కొంటున్నట్లు తెలిస్తే మళ్లీ టారిఫ్‌లను విధిస్తామని కూడా ఆయన హెచ్చరికలు చేశారు.

రూ. 500 కోట్ల పరువు నష్టం దావా

కాంగ్రెస్ నేతలపై దాఖలు చేసిన అస్సాం సీఎం హిమంత

గౌహతి: కాంగ్రెస్ నాయకులు తన ప్రతిష్టను దెబ్బతీయడానికి అసత్య ఆరోపణలు చేశారని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మండిపడ్డారు. 12,000 బిఘాల భూమిని శర్మ, ఆయన కుటుంబ సభ్యులు ఆక్రమించినట్లు అస్సాం పీసీసీ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ తదితరులు ఆరోపించడం తెలిసిందే. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ నేతుల జితేంద్ర సింగ్, భూపేశ్ బఘేల్, గొగోయ్‌పై రూ.500 కోట్లకు పరువు నష్టం దావా వేసినట్టు హిమంత మంగళవారం తెలిపారు. కబ్జాలపై సాక్ష్యాధారాలుంటే కోర్టులో నిరూపించాలని సవాలు విసిరారు. పాకిస్తాన్ ఏజెంట్ అలీ తౌకీర్ షేక్‌తో గొగోయ్, ఆయన భార్యకు సంబంధాలున్నాయని, అతడికి నిఘా సమాచారం చేరవేశారని ఆరోపించడం తెలిసిందే. ప్రతిగా శర్మ, ఆయన కుటుంబ సభ్యులపై గొగోయ్ భూ ఆక్రమణ ఆరోపణలు చేశారు.

ఫోర్జరీ కేసులో పప్పూ యాదవ్‌కు బెయిల్

పట్నా: మూడు దశాబ్దాలనాటి ఫోర్జరీ కేసులో స్వతంత్ర ఎంపీ పప్పూయాదవ్‌కు ఎంపీ/ఎమ్మెల్యే కేసులను విచారించే ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 1995లో ఐపీసీ సెక్షన్–467 కింద నమోదైన కేసులో వారెంట్లు జారీ చేసిన పట్నా పోలీసులు శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఉన్న పప్పూ యాదవ్‌ను అరెస్ట్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు శనివారం ఉదయం పట్నా మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్పించారు. యాదవ్ బెయిల్‌పై సోమవారం విచారణ చేపట్టాల్సి ఉంది. అయితే, బాంబు బెదిరింపు కారణంగా కోర్టు కార్యకలాపాలు నిలిచిపోవడంతో మంగళవారం విచారణ చేపట్టారు. అయితే, సోమవారం వరకు ఆస్పత్రిలో ఉంచాల్సి ఉండగా, తనను ఆదివారమే ఎలాంటి చికిత్స జరపకుండానే జైలుకు తీసుకెళ్లారని పప్పూ యాదవ్ న్యాయమూర్తికి తెలిపారని ఆయన లాయర్ వెల్లడించారు. జనరల్ వార్డులో చేర్పించిన పోలీసులు అక్కడ బెడ్లు లేకపోవడంతో స్ట్రెచర్‌పైనే ఉంచారని, ఎటువంటి ఆహారం ఇవ్వలేదని చెప్పారన్నారు. ఆ ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారంటూ ఆయన కోర్టులో కన్నీళ్లు పెట్టుకున్నారని లాయర్ తెలిపారు. పోలీసుల విధులకు అవరోధం కలిగించిన కేసులో పప్పూయాదవ్‌పై బుధవారం విచారణ జరగనుందని, అప్పటి వరకు ఆయన జైలులోనే ఉంటారని చెప్పారు.

రన్‌వే నుంచి నేరుగా సముద్రంలోకి..

ఎమర్జెన్సీ ల్యాండింగ్ వేళ అదుపుతప్పిన విమానం • సోమాలియాలో ఘటన

మొగదిషు(సోమాలియా): టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతికలోపం తలెత్తడంతో విమానం వెంటనే ల్యాండింగ్‌కు ప్రయత్నించి రన్‌వే మీద అదుపుతప్పి ఎదురుగా ఉన్న సముద్రజలాల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం సోమాలియాలోని మొగదిషు నగరంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో మరణాల వివరాలు తెలియరాలేదు. ఘటన జరిగినప్పుడు విమానంలో దాదాపు 50 మంది ప్రయాణికులు ఉన్నారని అధికారులు తెలిపారు. విషయం తెల్సి విమానాశ్రయ అత్యయక సిబ్బంది హుటాహుటిన తీరానికి చేరుకుని ముమ్మర సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. మొగదిషులోని ఆడెన్ అబ్దుల్లే అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గాల్కకోయో నగరానికి విమానం బయల్దేరిన 15 నిమిషాలకే సమస్య మొదలైందని, తప్పనిపరిస్థితుల్లో ల్యాండింగ్‌కు ప్రయత్నించగా రన్‌వే నుంచి పక్కకు జరిగి హిందూమహాసముద్ర జలాల్లోకి వెళ్లిందని ఆ దేశ సివిల్ ఏవియేషన్ అథారిటీ డైరెక్టర్ అహ్మద్ మోవాలిమ్ చెప్పారు. ఘటనపై విమాన యాజమాన్యం 'స్టార్‌స్కై ఏవియేషన్' నుంచి ఎలాంటి స్పందన లేదు. ఘటనపై దర్యాప్తు మొదలుపెట్టామని అధికారులు వెల్లడించారు.

రష్యాలో భారత విద్యార్థులపై దాడి... పోలీసుల అదుపులో నిందితుడు

మాస్కో: రష్యాలో నలుగురు భారత వైద్య విద్యార్థులతోపాటు ఇద్దరు పోలీసులపై దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడైన 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. రెండు నెలల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. నిందితుడు స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నేరం రుజువైతే అతనికి 15 ఏళ్ల దాకా జైలుశిక్ష పడవచ్చని అధికారులు తెలిపారు. బాలునికి నాజీ అనుకూల నేషనల్ సోషలిజం (వైట్ పవర్) అనే సంస్థతో అతడికి సంబంధాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నలుగురు భారత విద్యార్థులను భారత కాన్సులేట్ అధికారులు పరామర్శించారు. వారికి ప్రాణాపాయం తప్పిందని, వేగంగా కోలుకుంటున్నారని పేర్కొన్నారు.

లైంగిక దాడి కేసుల్లో వ్యాఖ్యలు కోర్టులకు మార్గదర్శకాలు

ఎన్‌జేఏతో సమగ్ర నివేదిక: సుప్రీం

న్యూఢిల్లీ: లైంగిక దాడుల వంటి సున్నితమైన కేసుల్లో చేసే వ్యాఖ్యల విషయంలో హైకోర్టులతో పాటు దిగువ కోర్టులకు మార్గదర్శకాలు జారీ చేసే దిశగా సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై సమగ్ర నివేదిక సిద్ధం చేయాల్సిందిగా నేషనల్ జ్యుడీషియల్ అకాడెమీ (ఎన్‌జేఏ)కి సూచిస్తామని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం మంగళవారం ఈ మేరకు వెల్లడించింది. కేవలం మైనర్ బాలిక వక్ష భాగాన్ని ఒడిసిపట్టడం, పైజామా దారాన్ని తెంచేయడం, దాన్ని కిందకు లాగేందుకు ప్రయత్నాలను అత్యాచార యత్నంగా పరిగణించలేమంటూ అలహాబాద్ హైకోర్టు 2025 మార్చిలో వివాదాస్పద తీర్పు వెలువరించడం, అది దేశవ్యాప్తంగా దుమారానికి దారితీయడం తెలిసిందే. దాంతో ఆ తీర్పుపై సుప్రీంకోర్టు వెంటనే స్టే విధించింది. ఇలాంటి కేసుల్లో చేసే వ్యాఖ్యల విషయంలో హైకోర్టులు, దిగువ కోర్టులకు మార్గదర్శకాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు గత డిసెంబర్‌లోనే స్పష్టం చేసింది. సదరు తీర్పును పూర్తిగా పక్కన పెడుతున్నట్టు జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం మంగళవారం వెల్లడించింది. మార్గదర్శకాల అంశాన్ని ఎన్‌జేఏకు అప్పగిస్తామని కూడా తెలిపింది. ఇది దేశవ్యాప్త కసరత్తుగా కొనసాగాలని అభిప్రాయపడింది. అత్యాచార కేసుల్లో తొమ్మిదేళ్లుగా కనీసం బాధితుల వాంగ్మూలం కూడా దాఖలు చేయని పెండింగ్ కేసులు చాలా ఉన్నట్టు పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్.ఫూల్కా ఆవేదన వెలిబుచ్చారు. సమాజహితం కోసం దానిపై స్వయంగా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయాల్సిందిగా ఆయనకు ధర్మాసనం సూచించింది.

బెంగాల్‌లో సవరించిన 'సర్' షెడ్యూల్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ఓటరు జాబితా సర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్(ఈసీ) మంగళవారం సవరించింది. దీని ప్రకారం తుది ఓటరు జాబితా ఈ నెల 28వ తేదీన వెలువడనుంది. ఈ నెల 9వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ మేరకు పొడిగించినట్లు పశ్చిమ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసులపై వివరణలను ఈ నెల 14వ తేదీ వరకు తీసుకుంటారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన, కేసుల పరిష్కారం 21వ తేదీ వరకు కొనసాగుతాయి. పోలింగ్ బూత్‌ల కేటాయింపు 25వ తేదీ వరకు, ఇతర పరామితుల పరిశీలన 27 వరకు జరుగుతాయి. తుది జాబితాను 28వ తేదీన ప్రచురిస్తారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 14వ తేదీనే తుది ఓటరు జాబితాను ప్రకటించాల్సి ఉంది. అయితే, సర్ ప్రక్రియ హడావుడిగా జరుగుతోందని, లక్షలాది మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదముందంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో సుప్రీంకోర్టు గడువు పొడిగిస్తూ ఆదేశాలివ్వడం తెల్సిందే.

ఐ-ప్యాక్ దాడుల్లో సీఎం మమత జోక్యం ఈడీ పిటిషన్‌పై విచారణ 18కి వాయిదా

న్యూఢిల్లీ: జనవరి 8వ తేదీన కోల్‌కతాలోని ఐ–ప్యాక్ కార్యాలయంలో సోదాల సమయంలో రాష్ట్ర యంత్రాంగంతోపాటు సీఎం మమతా బెనర్జీ అవరోధం కలిగించారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదిస్తున్న సీనియర్ లాయర్ కపిల్ సిబాల్ అస్వస్థతకు గురైనట్లు సమాచారం ఇవ్వడంతో జస్టిస్ ప్రశాంత్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం మంగళవారం ఈ నిర్ణయం తీసుకుంది. వాయిదాకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా అంగీకరించారు. ఈడీ పిటిషన్‌పై జనవరి 15వ తేదీన విచారణ చేపట్టిన ధర్మాసనం.. బెంగాల్ సీఎం బెనర్జీ దర్యాప్తును అడ్డుకోవడాన్ని తీవ్రమైన అంశంగా పేర్కొనడం తెల్సిందే. దీంతోపాటు, ఈడీ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా స్టే విధించింది. బొగ్గు కుంభకోణంపై దర్యాప్తులో భాగంగా ఐ–ప్యాక్ కార్యాలయంలో సోదాలకు వెళ్లగా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు సీఎం మమత అక్కడికి చేరుకుని, ముఖ్యమైన ఫైళ్లను తీసుకెళ్లినట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ఎన్‌ఐఏ కోర్టుల ఏర్పాటు ప్రతిపాదన 17 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద 10, అంతకంటే ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉన్న ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర తదితర 17 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ రాష్ట్రాల్లో స్పెషల్ ఎన్‌ఐఏ(జాతీయ దర్యాప్తు సంస్థ) కోర్టుల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర హోం శాఖ అందజేసిన ప్రతిపాదనలపై మూడు వారాల్లోగా స్పందన తెలపాలని ఆదేశించింది. ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సాయం అందజేసేందుకు ఉద్దేశించిన నిబంధనల రూపకల్పన పూర్తయిందని మంగళవారం కేంద్ర హోం శాఖ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలపడంతో ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల ధర్మాసనం ఈ మేరకు రాష్ట్రాల అభిప్రాయం కోరింది. ఒక్కో స్పెషల్ కోర్టు నిర్మాణం, సామగ్రి, ఇతర కొనుగోళ్ల కోసం ఒకేసారి రూ.కోటి గ్రాంట్‌గా ఇవ్వడంతోపాటు నిర్వహణ, సిబ్బంది వేతనాలు తదితరాల కోసం ఏడాదికి రూ.కోటి చొప్పున కేంద్రం అందజేస్తుందని ఐశ్వర్య భాటి వివరించారు.

ఏనుగుల దాడిలో ముగ్గురు మహిళల మృతి

ముగ్గురికి గాయాలు • ఒడిశాలో విషాదం

డెంకనాల్: వంటచెరకు కోసం అడవిలోకి వెళ్లి ఏనుగుల దాడిలో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన ఒడిశాలోని దెన్‌కనాల్ జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. లోఛపాలీ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలకు దట్టమైన అడవిలో నాలుగు అడవి ఏనుగులు తారసపడ్డాయి. దూరంగా పరుగెత్తేలోపే దాడి చేశాయి. ఇందూ ప్రధాన్(60), తునీ బెహెరా(50), కుంతాల ప్రధాన్(40) చనిపోగా మరో ముగ్గురిని అటవీ గస్తీ బృంద సభ్యులు ఎలాగోలా కాపాడారు. కానీ అప్పటికే వాళ్లకూ గాయాలయ్యాయి. దీంతో వీళ్లను జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం వీళ్ల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. మృతుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం ఎక్స్‌గ్రేషియా ఇస్తామని జిల్లాలోని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సుమిత్ కార్ వెల్లడించారు.

బంగ్లాలో హిందూ వ్యాపారి దారుణ హత్య

దుకాణంలోనే నరికి చంపిన దుండగులు

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఓ హిందూ వ్యాపారిని గుర్తు తెలియని దుండుగులు ఆయన దుకాణంలోనే నరికి చంపారు. మైమన్ సింగ్ జిల్లా త్రిశాల్‌లోని బోగర్ బజార్‌లో సోమవారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. సౌత్కండా గ్రామానికి చెందిన సుసేన్ చంద్ర సర్కార్ 'భాయి భాయి ఎంటర్‌ప్రైజెస్'పేరుతో బియ్యం దుకాణం నడుపుకుంటున్నారు. సోమవారం రాత్రి సుసేన్ చంద్ర సర్కార్ దుకాణంలో ఉండగా కొందరు దుండగులు లోపలికి ప్రవేశించి కత్తితో నరికారు. నేలకొరిగిన సర్కాను వదిలేసి దుకాణం షట్టర్ మూసేసి వెళ్లిపోయారు. కుటుంబీకులు ఆయన కోసం వెతుకుతూ వచ్చి దుకాణం షట్టర్ తెరిచి చూడగా రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే ఆస్పత్రి తరలించగా ఆయన అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దుండగులు దుకాణంలో పెద్దమొత్తంలో ఉన్న డబ్బును ఎత్తుకెళ్లారని సర్కార్ కుమారుడు తెలిపారు.

నదిలో పడిన బస్సు..12 మంది మృతి

కఠ్మాండు: నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు నదిలో పడిపోవడంతో అందులోని 12 మంది చనిపోగా, డ్రైవర్ సహా 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఒఖాల్దుంగా నుంచి కఠ్మాండుకు వెళ్తుండగా బాగ్మతి ప్రావిన్స్‌లోని రమెఛాప్ వద్ద మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో దుర్ఘటన చోటుచేసుకుంది. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఘటనకు కారణాలు, ఆ సమయంలో బస్సులోని ప్రయాణికుల సంఖ్య వంటి వివరాలు తెలియరాలేదు.

రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులెన్ని?

సామాజిక జీవనంలో వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, నమ్మకం, గౌరవం లాంటి వాటిని ఉదాత్తమైన మానవీయ పరిపక్వతా లక్షణాలుగా పేర్కొంటారు. సమాజం ద్వారానే వ్యక్తి అన్ని లక్షణాలను, స్వభావాలను అలవర్చుకుంటాడు. అదేవిధంగా సమాజం నుంచి అనేక ప్రయోజనాలు పొందుతాడు. దీనికి ప్రతిగా సమాజానికి సేవలను, సహాయాన్ని అందించాల్సిన కనీస బాధ్యతప్రతి వ్యక్తిపై ఉంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక విధులు

విధి అంటే ఒక వ్యక్తి ఇతరుల కోసం నిర్వర్తించాల్సిన పని లేదా బాధ్యత అని అర్థం. విధులు సమాజ వికాసానికి, దేశాభివృద్ధికి, సామాజిక స్ఫూహ కల్పించడానికి దోహదం చేస్తాయి. ఇవి దేశ ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయి. ప్రాథమిక హక్కులనే ఫలాలు విధులుగా పరిపక్వం చెందినప్పుడే సమాజ జీవనం సాఫల్యం అవుతుంది.

విధులు – రకాలు: సాధారణంగా విధులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

ఎ) నైతిక విధులు

బి) చట్టబద్ధమైన విధులు

నైతిక విధులు అనేవి ప్రజల నైతిక విలువలు, సామాజిక స్పృహపై ఆధారపడి ఉంటాయి. **ఉదా:** పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం; అభాగ్యులను, విధివంచితులను ఆదుకోవడం.

చట్టబద్ధమైన విధులు సమాజంతో ఆమోదం పొంది, ప్రభుత్వం గుర్తించిన బాధ్యతలు. వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారు.

ఉదా: ట్రాఫిక్ నియమాలు పాటించడం, పన్నులు సక్రమంగా చెల్లించడం.

భారత రాజ్యాంగం – ప్రాథమిక విధులు

ప్రతి పౌరుడు దేశం పట్ల, తన తోటి పౌరుల పట్ల కొన్ని కనీస బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అందువల్ల వీటిని ప్రాథమిక విధులు అంటారు. వీటిని రష్యా రాజ్యాంగం నుంచి గ్రహించారు. మౌలిక రాజ్యాంగంలో ప్రాథమిక విధుల ప్రస్తావన లేదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్దార్ స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో పొందుపర్చారు. ప్రారంభంలో పది ప్రాథమిక విధులు ఉండేవి. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక విధిని రాజ్యాంగంలో చేర్చడంతో వీటి సంఖ్య పదకొండుకు పెరిగింది. ప్రాథమిక విధులు 1977 జనవరి 3 నుంచి అమల్లోకి వచ్చాయి. అందువల్ల ఈ రోజును ప్రాథమిక విధుల దినోత్సవంగా పరిగణిస్తారు.

ప్రాథమిక విధులు – లక్షణాలు:

ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. అవి..

- ప్రాథమిక విధులకు న్యాయ సంరక్షణ లేదు. ఇవి నేరుగా అమల్లోకి రావు. వీటి అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక చట్టాలు చేయాలి.
- ప్రాథమిక విధులు కేవలం పౌరులకు మాత్రమే వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక విధులు నైతికపరమైన బాధ్యతలు, మరికొన్ని పౌర బాధ్యతలు.
- కొన్ని ప్రాథమిక విధులను భారత సనాతన సంప్రదాయాలు, మత విలువలు, పురాణాల ఆధారంగా తీసుకున్నారు.

ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలోని 4–ఎ భాగంలో నిబంధన 51–ఎలో పొందుపర్చారు.

51–ఎ:

ఎ) రాజ్యాంగానికి కట్టుబడి ఉండి దాని ఆదర్శాలను,సంస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలి.

బి) జాతీయ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ఉన్నత ఆదర్శాలను పాటించాలి.

సి) భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను పరిరక్షించాలి.

డి) దేశ రక్షణకు, జాతీయ సేవకు సదా సన్నద్ధంగా ఉండాలి.

ఇ) భారత ప్రజల మధ్య మత, భాష ప్రాంతీయ, వర్గ వైవిధ్యాలకు అతీతంగా సోదర భావాన్ని, స్ఫూర్తిని పెంపొందించాలి. స్త్రీల గౌరవాన్ని భంగపరిచేవాటిని త్యజించాలి.

ఎఫ్) భారత మిశ్రమ సంస్కృతి, ఔన్నత్యం, సంప్రదాయాలను గౌరవించి, పరిరక్షించాలి.

జి) అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులు సహా ప్రకృతిలోని పరిసరాలను కాపాడాలి, అభివృద్ధి చేయాలి, జీవులపట్ల కారుణ్యాన్ని కలిగి ఉండాలి.

హెచ్) శాస్త్రీయ దృక్పథాన్ని, మానవ జిజ్ఞాసను, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.

ఐ) ప్రజల ఆస్తిని సంరక్షించాలి, హింసను ప్రేరేపించే చర్యల్లో పాల్గొనకూడదు.

జె) వ్యక్తిగత, సమష్టి చర్యల ద్వారా ప్రతి కార్యరంగంలోనూ అత్యున్నత స్థానాన్ని పొందడానికి కృషి చేయాలి. తద్వారా దేశ అత్యున్నత అభ్యుదయానికి తోడ్పడాలి.

కె) 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు విద్యావకాశాలను కల్పించే బాధ్యతను తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు నిర్వర్తించాలి.



విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చడంపై అనేక విమర్శలున్నాయి.

- దేశంలో భారత పౌరులు సహజంగా చట్ట విధేయులు, క్రమశిక్షణ ఉన్నవారు అయినప్పుడు వారి బాధ్యతలను ప్రత్యేకంగా గుర్తు చేయడం సమంజసం కాదని కొంతమంది అభిప్రాయం.
- అత్యంత ముఖ్యమైన విధులైన సక్రమంగా పన్నులు చెల్లించడం, కుటుంబ నియంత్రణ, ఎన్నికల్లో ఓటు వేయడం లాంటి వాటిని ప్రాథమిక విధుల్లో పొందుపరచలేదు.
- ఈ విధులు కేవలం నైతికపరమైన నియమావళిపైనే ఆధారపడి ఉన్నాయి. వీటిని పాటించకపోతే శిక్షించే ఆస్కారం లేదు.
- ప్రాథమిక విధుల్లో పేర్కొన్న కొన్ని పదాలకు స్పష్టత లేదు. **ఉదా:** శాస్త్రీయ దృక్పథం, మిశ్రమ సంస్కృతి, పరిశోధనా స్ఫూర్తి అనే పదాలకు నిర్దిష్ట అర్థాలు లేవు. వీటిని నాలుగో భాగంలో కాకుండా మూడో భాగంలోనే చేర్చి ఉండాల్సింది.
- సాధారణంగా ప్రాథమిక విధులు ప్రజాస్వామ్య రాజ్యాంగంలో అంతర్భాగంగా ఉండవు. నియంతృత్వ దేశాల రాజ్యాంగంలో మాత్రమే ఇవి ఉంటాయి.
- ఇవి చట్ట నిర్దేశానికి, ఆత్మ ప్రబోధానికి మధ్య వైవిధ్యాన్ని కలిగించవచ్చు.

ప్రాథమిక విధుల ప్రయోజనాలు

- ప్రాథమిక విధులకు న్యాయసంరక్షణ లేకపోయినా, కొన్ని లోపాలున్నా.. వీటిని రాజ్యాంగంలో చేర్చడం సమంజసమే. ఎందుకంటే విధులు లేకుండా హక్కులను మాత్రమే గుర్తిస్తే అది బాధ్యతారాహిత్యానికి దారితీస్తుంది. అదేవిధంగా హక్కులు లేని బాధ్యతలు బానిసత్వానికి ప్రతీక అవుతాయి. కాబట్టి హక్కులు, విధులు, పరస్పర పోషకాలు. అవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల లాంటివి.
- ప్రాథమిక విధులు కూడా ఆదేశిక సూత్రాల్లా ప్రభుత్వ విధానాలు, కార్యాచరణను ప్రభావితం చేస్తాయి.
- ఆచరణాత్మకమైనవి కాకపోయినా నిరంతరం పౌరుల నైతిక బాధ్యతలను గుర్తు చేస్తాయి.
- అనేక వైవిధ్యాలున్న భారతదేశంలో పౌరులు చిత్తశుద్ధితో విశాల దృక్పథంతో బాధ్యతాయుత పౌరులుగా దేశ ఐక్యతకు, సమగ్రతకు, కృషి చేసేలా దోహద పడతాయి.
- ప్రాథమిక విధులను, ప్రాథమిక హక్కులపై ఉన్న హేతుబద్ధమైన పరిమితులుగా పరిగణించవచ్చని 1992లో సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

ప్రాథమిక విధులు – సుప్రీంకోర్టు తీర్పులు

శ్యాం నారాయణ్ చౌక్సీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా

ఈ కేసులో జాతీయ పతాకాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రచారం కోసం వినియోగించరాదని సుప్రీం కోర్టు పేర్కొంది.

బిజో మాన్యువల్ Vs కేరళ (1986)

ఈ కేసులో సుప్రీం కోర్టు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జాతీయ గీతాలాపన అనేది మత విశ్వాసాలకు విరుద్ధమైతే ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. జాతీయ గీతాన్ని ఆలపించినప్పుడు మాత్రం అందరూ గౌరవ సూచకంగా నిలబడాలని పేర్కొంది.

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ Vs స్టూడెంట్ యూనియన్ (2002)

ప్రాథమిక విధులను విస్మరించరాదని, అవి దేశ సమగ్రతకు, సామాజిక జీవనానికి ఆదర్శంగా ఉంటాయని ఈ కేసులో సుప్రీం కోర్టు పేర్కొంది.

డాక్టర్ దాశరథి Vs ఆంధ్రప్రదేశ్

ఈ కేసులో ఆస్థాన కవుల హోదా చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

గ్రామీణ వ్యాజ్యాల హక్కుల కేంద్రం Vs ఉత్తరప్రదేశ్ (1986)

పర్యావరణ పరిరక్షణలో ప్రాథమిక విధులను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

నవీన్ జిందాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2004)

జాతీయ జెండాను ఎగురవేయడం భావ వ్యక్తీకరణ కిందకి వస్తుందని, పౌరులకు స్వేచ్ఛగా జెండా ఎగురవేసే హక్కు ఉంటుందని పేర్కొంది.

ప్రాథమిక విధులు – జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ సూచనలు

1999లో నియమించిన వర్మ కమిటీ ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని సిఫారసులు చేసింది. అవి..

- జాతీయ పతాకం, జాతీయ గీతం, భారత రాజ్యాంగ పరిరక్షణకు, గౌరవానికి సంబంధించి 1971లో చేసిన చట్టం సరిపోతుందని పేర్కొంది. అదేవిధంగా భారత శిక్షాస్మృతిలో ఉన్న చట్టాల ద్వారా కొన్ని విధులను అమలు చేయవచ్చని చెప్పింది. ఉదాహరణకు..
  పౌర హక్కుల పరిరక్షణ చట్టం – 1955,
  ప్రజాప్రాతినిధ్య చట్టం – 1951,
  చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం–1967,
  వన్యప్రాణి సంరక్షక చట్టం – 1972,
  అడవుల పరిరక్షణ చట్టం – 1980,
- ఏటా జనవరి 3ను ప్రాథమిక విధుల దినోత్సవంగా పాటించాలి.
- అన్ని విద్యా ప్రణాళికల్లో ప్రాథమిక విధులను పాఠ్యాంశంగా చేర్చాలి.
- అన్ని విద్యా సంస్థల్లో ఎన్‌సీసీలను తప్పక ప్రవేశ పెట్టాలి.
- ప్రసార మాధ్యమాల ద్వారా ప్రాథమిక విధుల గురించి విస్తృత ప్రచారం కల్పించాలి.

ప్రముఖుల వ్యాఖ్యానాలు

ఆదేశిక సూత్రాల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధిపై ఆధారపడి ఉన్న విధంగానే ప్రాథమిక విధుల అమలు అనేది వ్యక్తుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది **– దుర్గాదాస్ బసు**

ప్రాథమిక విధులు కేవలం అలంకార పూర్వకమైనవి **– జస్టిస్ కె.వి. ముఖర్జీ**

హక్కులు, విధులనేవి ఒకే నాణేనికి ఉన్న పార్శ్వాలు (Two sides of a same coin) **– హెచ్.జె. లాస్కీ**

ప్రాథమిక విధులు అసంబద్ధంగా, గందరగోళంగా ఉన్నాయి **– నానీ పాల్కీవాలా**

మాదిరి ప్రశ్నలు

1. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులెన్ని?
   1) 8 2) 9 3) 10 4) 11
2. ఏ కమిటీ సూచనల మేరకు ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చారు?
   1) రాజమన్నార్ 2) సర్కారియా
   3) స్వరణ్ సింగ్ కమిటీ
   4) బల్వంత్ రాయ్ కమిటీ
3. ప్రాథమిక విధులకు సంబంధించి కిందివాటిలో సరైన వాక్యం ఏది?
   1) ప్రాథమిక హక్కులతోపాటే వీటిని ప్రవేశ పెట్టారు
   2) ఆదేశిక సూత్రాల స్థానంలో వీటిని ప్రవేశ పెట్టారు
   3) వీటిని ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు
   4) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో కలిపి ప్రవేశ పెట్టారు
4. కిందివాటిలో ప్రాథమిక విధులేవి?
   1) జాతీయ గీతాన్ని గౌరవించడం
   2) మన సుసంపన్న సంస్కృతి, వారసత్వాన్ని గౌరవించడం, పరిరక్షించడం
   3) వన్యప్రాణులను కాపాడటం
   4) పైవన్నీ
5. ప్రాథమిక విధులను రాజ్యాంగంలో గుర్తించిన మరో ప్రజాస్వామిక దేశం?
   1) అమెరికా 2) ఆస్ట్రేలియా
   3) కెనడా 4) జపాన్

సమాధానాలు: 1) 4 2) 3 3) 3 4) 4 5) 4

జగన్నాథ పండితరాయల కావ్య నిర్వచనం?

కావ్య స్వరూపం - ప్రయోజనాలు - శైలి

కావ్య స్వరూపం

- 'కవిః కర్మమ్ కావ్యమ్' – కవి కలం నుంచి జాలువారిన అపూర్వ సృష్టి కావ్యం. కవి ఆత్మీయతలు కావ్యంలో ప్రతిఫలిస్తాయి. ప్రాచీనుల దృష్టిలో కవిత్వం అంటే కేవలం ఛందోబద్ధ రచనగా రూఢమైంది. పద్యం, గద్యం, పద్య గద్యాత్మక చంపూ కావ్యమైనా కావ్యమే.
  కాంతా సమ్మితమైన కావ్యానికి భారతీయ ఆలంకారికులు,పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాల ద్వారా కావ్య స్వరూపాన్ని నిర్ధారించొచ్చు.

భారతీయ ఆలంకారికుల కావ్య నిర్వచనాలు

- **భరతుడు:** 'ఇతివృత్తంతు కావ్య శరీరమ్'.. నాట్య శాస్త్రంలో ఇతివృత్తమే కావ్య శరీరమని చెప్పారు.
- **దండి:** 'కావ్యాదర్శం'లో 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యమ్'.. మనోహరమైన అర్థంతో కూడిన పదాల సమూహమే కావ్యమన్నారు.
- **భామహుడు:** 'కావ్యాలంకారం'లో 'శబ్దార్థౌ సహితౌ కావ్యమ్'.. హితంతో కూడిన శబ్దార్థాల సమూహమే కావ్యమని చెప్పారు.
- **రుద్రటుడు:** శబ్దార్థాల సమాహారమే కావ్యమన్నారు.
- **భోజుడు:** సరస్వతీ కంఠాభరణంలో 'నిర్దోషం గుణవత్కావ్యమలంకృతై రలంకృతమ్ రసాన్వితం కవిః కుర్వన్ కీర్తిం ప్రీతించవిదంతి'.. దోషరహితంగా, గుణసహితంగా, అలంకార యుక్తంగా రసాన్వితమైన కావ్యాన్ని రచించిన కవి యశాన్ని, ఆహ్లాదాన్ని పొందగలడు.
- **మమ్మటుడు:** 'తదదోషౌశబ్దార్థౌ సగుణావనలం కృతే పునఃక్వాపికావ్యమ్'.. దోష రహితంగా, గుణ సహితంగా ఉన్న శబ్దార్థాలే కావ్యమని, ఒక్కొక్కసారి అలంకార రహితమైనా దాన్ని కావ్యంగా పరిగణించవచ్చని చెప్పారు.
- **హేమచంద్రుడు:** మమ్మటుడిలా మరింత స్పష్టంగా 'అదోషౌసగుణౌ సాలంకారౌచ శబ్దార్థౌ కావ్యమ్'.. దోష రహితమైన, గుణసహితమైన, సాలంకారమైన శబ్దార్థాలే కావ్యమని చెప్పారు.
- **విశ్వనాథుడు:** సాహిత్య దర్పణంలో మమ్మటుడు, హేమచంద్రుడు చెప్పిన నిర్వచనాలను ఖండించారు. ఆయన అభిప్రాయంలో రస సంబంధ దోషమే దోషమని, శాబ్దిక దోషాలున్నా కావ్యత్వ హాని జరగదని రస ప్రాధాన్యంలో 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నారు. రస ప్రాధాన్య దృష్టితో రసవత్తరమైన ఒక మహావాక్యమే కావ్యమన్నారు.
- **జగన్నాథ పండిత రాయలు:** విశ్వనాథుడి నిర్వచనంలో అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలున్నాయని జగన్నాథ పండిత రాయలు విమర్శించారు. రసం లేకున్నా లోకోత్తర చమత్కార జనకాలైన వ్యంగ్య రచనలు లోకంలో కావ్యాలుగా గొప్పగా విలసిల్లుతున్నాయన్నారు. ఆయన 'రమణీయార్థక ప్రతిపాదక శబ్దఃకావ్యమ్'..రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దాల సమూహమే కావ్యమన్నారు. రమణీయమైంది రసవత్తరం కాకపోదని, విశ్వనాథుడి రస ప్రాధాన్యం కూడా ఇందులో ఉన్నందువల్ల దీన్ని నిర్దుష్టమైన నిర్వచనంగా ఆలంకారికులు నిర్ధారించారు.
- వామనుడు 'రీతి'ని కావ్యాత్మగా నిర్వచించారు. ఆనంద వర్ధనుడు 'ధ్వని' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పీయూష వర్ధనుడు పండిత రాయల అభిప్రాయానికి అనుగుణంగా కావ్యాన్ని నిర్వచించారు. శౌద్ధోదని.. విశ్వనాథుడి రస సిద్ధాంతానికి అనుగుణంగా కావ్యాన్ని ప్రతిపాదించారు. కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతాన్ని వ్యక్తీకరించారు. క్షేమేంద్రుడు ఔచిత్య సిద్ధాంతాన్ని నిర్వచించారు.
- భారతీయ ఆలంకారికుల అభిప్రాయాలను అనుసరించి దోష రహితమైన, గుణ సహితమైన, రసవత్తరమైన రమణీయ శబ్దార్థాల సముదాయాన్ని కావ్యంగా పరిగణించడం సమంజసంగా ఉంటుంది.

పాశ్చాత్య విమర్శకులు - కావ్య నిర్వచనాలు

- **శామ్యూల్ జాన్సన్:** కవిత్వమంటే ఛందోబద్ధమైన రచన అన్నారు. బుద్ధి భావనలతో ఆనంద సత్యాలను సమైక్యంగా సంఘటించే కళగా పేర్కొన్నారు.
- **వర్డ్స్‌వర్త్:** ప్రశాంత మానసిక స్థితిలో ఉద్రిక్తత నుంచి ఆవిర్భవించే తీవ్ర అనుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వమని చెప్పారు.
- **షెల్లీ:** సాధారణంగా భావానుగుణమైన వ్యక్తీకరణమే కవిత్వం అన్నారు.
- **హాజ్లిట్:** షెల్లీ అభిప్రాయాన్ని మరికొంత స్పష్టంగా వివరిస్తూ భావనాశక్తికి అనుకూలమైన శబ్ద సముదాయమే కవిత్వం అని చెప్పారు.
- **కార్లయిల్:** సంగీత లయాత్మక భావనే కవిత్వం అన్నారు.
- **మాథ్యూ ఆర్నాల్డ్:** 'సత్య నిబంధనలతో కూడిన జీవిత విమర్శనమే కవిత్వం' అన్నారు.
- **కోల్‌రిడ్జ్:** ఉత్తమ పదాలను సముచిత రీతిలో అమర్చడమే కవిత్వం అని చెప్పారు.
- **ఎడ్గార్ ఎలెన్ పో:** లయాత్మక సౌందర్య సృష్టి కవిత్వం అని చెప్పారు.
  పాశ్చాత్య విమర్శకుల్లో ఎడ్గార్ ఎలెన్ పో నిర్వచనాన్ని ఉత్తమమైందిగా విమర్శకులు పరిగణించారు.

కావ్య ప్రయోజనాలు

- ఆలంకారికుల్లో మమ్మటుడు, అభినవ గుప్తుడు, ఆనంద వర్ధనుడు, భామహుడు, జగన్నాథ పండిత రాయలు వంటివారు కావ్య ప్రయోజనాలను సవివరంగా చర్చించారు. పాశ్చాత్య విమర్శకులు లోవెల్, జాన్ డ్రైడెన్, స్కాలిజర్ వంటి వారు కావ్య ప్రయోజనాలను వివరించారు. వాటిని పరిశీలిద్దాం.
- **మమ్మటుడు:**
  1) యశస్సు, అర్థం లభిస్తుంది.
  2) వ్యవహార జ్ఞానం సిద్ధిస్తుంది.
  3) అమంగళ పరిహారం కలుగుతుంది.
  4) జీవన్ముక్తి ప్రదాయకాలైన ఆహ్లాద తన్మయత్వాలు కలుగుతాయి.
- **అభినవ గుప్తుడు:** కావ్యం కాంతా సమ్మితంగా ఉపదేశం చేస్తుంది.
- **భామహుడు:**
  1) సత్కావ్యం ధర్మార్థ కామమోక్షాదులైన చతుర్విధ పురుషార్థాలను కలిగిస్తుంది.
  2) లలిత కళా పరిజ్ఞానాన్ని అందిస్తుంది.
  3) సత్కీర్తిని, నిరంతర ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.
- **జగన్నాథ పండిత రాయలు:** సాహితీవ్రతుడైన కవికి ఎనలేని గౌరవం కలుగుతుందని చెప్పారు. సాహితీవ్రతుడు కానివాడు వ్యాసుడైనా, గౌతముడైనా, పతంజలైనా కానిమ్ము వానికి తిరస్కారం, పురస్కారం చూపక నా శిరస్సు ఉదాసీనతను ప్రకటిస్తుందన్నారు.
- **లోవెల్:** కావ్యంలో తత్వబోధ ఉండాలన్నారు. తత్వబోధ లేని కావ్యం తనకు పాథేయం కాదన్నారు.
- **జాన్ డ్రైడెన్:** కావ్యానికి ముఖ్య ప్రయోజనం ఆనందం అని, అనుషంగిక ప్రయోజనం ఉపదేశమని చెప్పారు.
- **స్కాలిజర్:** 'ఆనందకరమైన బోధనే' కావ్య ప్రయోజనం అన్నారు.
  పాశ్చాత్య విమర్శకులు ఆనందం, ఉపదేశం, తాత్వికత, బోధనలను కావ్య ప్రయోజనాలుగా భావించారు.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

కావ్య శైలి

- ఆలంకారికులు కావ్య శైలికి సంబంధించి గుణాలు, రీతులు, పాకాలను పేర్కొన్నారు. ప్రాచీన, ఆధునిక పద్య కావ్యాల శైలికి సంబంధించి ఇవి ప్రామాణికాలు. ఆధునిక సృజనాత్మక వచన ప్రక్రియలైన కథానిక, నవల, నాటకం వంటి వాటిలో శైలికి సంబంధించి కథన చాతుర్యం, పాత్రలు, సంభాషణలు వంటివి ప్రధానమైనవి. ఆంగ్లంలో 'స్టైల్' అనే పదానికి సమానార్థకంగా 'శైలి' పదాన్ని విమర్శకులు పరిగణిస్తున్నారు.
- ఆలంకారికుల్లో భామహుడు మూడు కావ్య గుణాలను పేర్కొన్నారు.
  1) ప్రసాదం 2) ఓజస్సు 3) మాధుర్యం.

1. **ప్రసాదం:** ప్రసిద్ధ పదాల ప్రయోగంతో, సులువుగా అర్థాన్ని స్ఫురింపజేసే రచన ప్రసాద గుణం. **ఉదా:** మొల్ల, వేమన, కరుణశ్రీ వంటి వారి పద్య రచనలు ప్రసాద గుణభరితాలు.
2. **ఓజస్సు:** క్లిష్టమైన అక్షరాల కూర్పుతో, దీర్ఘ సమాస భూయిష్టమైన రచన ఓజో గుణం. **ఉదా:** శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలు, భట్టుమూర్తి వంటి వారి పద్య రచనలు ఓజో గుణ ప్రధానాలు.
3. **మాధుర్య గుణం:** స్పష్టంగా అర్థమయ్యే విడివిడి పదాలతో కూడిన రచన మాధుర్య గుణం. తిక్కన, పోతన, కరుణశ్రీ వంటి వారి రచనలు మాధుర్య గుణభరితాలు.

- **రీతులు:** వామనుడు కావ్యాత్మగా రీతిని ప్రతిపాదించాడు. విశిష్ట పద రచనతో కూడిన కావ్యం రీతి ప్రధానం. రీతులు మూడు విధాలు. అవి..
  1) వైదర్భీ రీతి
  2) గౌడీ రీతి
  3) పాంచాలి రీతి

1. **వైదర్భీ రీతి:** సమాస రహితమైన, సరళమైన అక్షరాల కూర్పుతో కూడిన రచన వైదర్భీ రీతి. **ఉదా:** మొల్ల రామాయణం, వేమన పద్యాలు.
2. **గౌడీ రీతి:** పరుషమైన అక్షరాల కూర్పుతో, మహా ప్రాణాక్షరాల బంధంగా, దీర్ఘ సమాస భూయిష్టమైన రచన గౌడీ రీతి. కాశీఖండం, భీమ ఖండం, ఆముక్తమాల్యద, వసు చరిత్ర, పాండురంగ మహత్త్యం, శ్రీమద్రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు ఈ రీతికి ఉదాహరణలు.
3. **పాంచాలి రీతి:** కొంత సరళంగా, కొంత కఠినంగా, పై రెండు రీతులు కలయికగా ఉండే రచన 'పాంచాలి రీతి'. తిక్కన భారతం, పోతన భాగవతం, శివ భారతం వంటి కావ్యాలు ఉదాహరణలు.

- **వృత్తులు:** ఆలంకారికులు మూడు వృత్తులను పేర్కొన్నారు. కావ్య శైలికి సంబంధించిన రచనా విధానాలు వృత్తులు.
  1) కైశికీ వృత్తి
  2) సాత్వతీ వృత్తి
  3) ఆరభటీ వృత్తి

1. **కైశికీ వృత్తి:** సరళమైన విడి పదాలతో కూడిన రచనా శైలి కైశికీ వృత్తి. శృంగార రస శైలికి అనువైంది.
2. **సాత్వతీ వృత్తి:** మరీ క్లిష్టంగా, మరీ సరళంగా కాకుండా మధ్యస్థంగా ఉండే శైలీ విధానానికి సంబంధించింది.. సాత్వతీ వృత్తి. వీర రస ప్రధానమైన రచనలకు అనువైంది.
3. **ఆరభటీ వృత్తి:** ప్రౌఢమైన సమాస భూయిష్టమైన రచనా శైలికి సంబంధించింది.. ఆరభటీ వృత్తి. బీభత్స, భయానక రసాలకు అనువైంది.

- **పాకాలు:** రసోచిత శబ్దార్థాల సమ్మేళనాలే కావ్య శైలికి సంబంధించిన పాకాలు. కావ్య గుణాలు, కావ్య రీతులు, వృత్తులు కలిపి పాకాలుగా ఏర్పడతాయి. ఆలంకారికులు మూడు పాకాలను పేర్కొన్నారు.
  1) ద్రాక్షాపాకం
  2) కదళీపాకం
  3) నారికేళపాకం

1. **ద్రాక్షాపాకం:** సులువుగా అర్థమయ్యే రచనా శైలి ద్రాక్షాపాకం. మాధుర్య గుణం + వైదర్భీ రీతి + కైశికీ వృత్తుల సమ్మేళనమే ద్రాక్షాపాకం. శృంగార రసానికి అనువైన శైలి ద్రాక్షాపాకం.
2. **కదళీపాకం:** కొంత కఠినంగా, కొంత సరళంగా ఉండే రచనా శైలి కదళీపాకం. ప్రసాద గుణం + పాంచాలి రీతి + సాత్వతీ వృత్తుల కలయిక కదళీపాక శైలి. వీర రస స్ఫోరకమైన రచనలకు అనుకూలమైంది.
3. **నారికేళపాకం:** ప్రౌఢ రీతిలో ఉన్న పద్య శైలీ రచన నారికేళ పాకం. ఓజో గుణం + గౌడీ రీతి + ఆరభటీ వృత్తుల కలయిక నారికేళ పాకం. బీభత్స, భయానక రసాలకు అనువైన శైలి.

గత డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

1. విశ్వనాథుడి కావ్య నిర్వచనం?
   1) ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం
   2) రమణీయార్థక ప్రతిపాదక శబ్దం కావ్యం
   3) శబ్దార్థౌ సహితౌ కావ్యం
   4) వాక్యం రసాత్మకం కావ్యం
2. వేద పురాణ కావ్యాలు వరుసగా?
   1) ప్రభు కాంతా మిత్ర సమ్మితాలు
   2) కాంతా ప్రభు మిత్ర సమ్మితాలు
   3) మిత్ర కాంతా ప్రభు సమ్మితాలు
   4) ప్రభు మిత్ర కాంతా సమ్మితాలు
3. జగన్నాథ పండితరాయల కావ్య నిర్వచనం?
   1) నను శబ్దార్థేః కావ్యం
   2) నిర్దోష లక్షణ వతీస కావ్య శబ్దభాక్
   3) ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం
   4) రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం

సమాధానాలు

1) 4; 2) 4; 3) 4.

మాదిరి ప్రశ్నలు

1. 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) విశ్వనాథుడు 2) దండి
   3) భోజుడు 4) భామహుడు
2. 'శబ్దార్థౌ సహితౌ కావ్యం' అని నిర్వచించిన ఆలంకారికుడు?
   1) అభినవ గుప్తుడు
   2) దండి 3) భామహుడు
   4) భరతుడు
3. 'నిర్దోషం గుణ వత్కావ్య మలంకారై రలంకృతమ్' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) రుద్రటుడు 2) భోజుడు
   3) వామనుడు 4) మమ్మటుడు
4. 'అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) విద్యాధరుడు 2) భట్టతౌతుడు
   3) ఆనంద వర్ధనుడు
   4) వామనుడు
5. శృంగార రసానికి అనువైన కవిత్వ పాకం?
   1) నారికేళ పాకం 2) కదళీ పాకం
   3) ద్రాక్షాపాకం 4) కైశికి పాకం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 3.

వనరుల కొరత వల్ల ఏర్పడే సమస్య?

అర్థశాస్త్రం - పరిధి

- అర్థశాస్త్రం అనే పదం గ్రీకు భాషలోని 'OIKOS', 'NEMEIN' అనే రెండు పదాల నుంచి ఆవిర్భవించింది. OIKOS అంటే ఇల్లు, NEMEIN' అంటే నిర్వహణ. గృహ, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో నైపుణ్యమని అర్థం. అర్థశాస్త్ర పితామహుడు 'ఆడమ్‌స్మిత్' అర్థశాస్త్రాన్ని సంపదకు సంబంధించిన శాస్త్రంగా నిర్వచించారు. ఆయనకు ముందు అర్థశాస్త్రాన్ని రాజనీతి ఆర్థిక వ్యవస్థగా పిలిచేవారు. ఆడమ్ స్మిత్ రచించిన 'దేశాల సంపద, స్వభావం, కారణాల పరిశోధన' 1776లో ప్రచురితమైన తర్వాత అర్థశాస్త్రం ప్రత్యేక శాస్త్రంగా రూపొందింది. 'సామాజిక శాస్త్రాల్లో అర్థశాస్త్రం రాణి వంటిది' అని పాల్ శామ్యూల్‌సన్ పేర్కొన్నారు.
- మానవుడు, అతని శ్రేయస్సును గురించి అధ్యయనం చేసే శాస్త్రం.. అర్థశాస్త్రమని ఆల్‌ఫ్రెడ్ మార్షల్ నిర్వచించారు.
- అమర్త్యసేన్ – సంక్షేమ ఆర్థిక శాస్త్రం గురించి వివరించారు. ఆడమ్ స్మిత్‌తో సహా సంప్రదాయ ఆర్థికవేత్తలందరూ అర్థశాస్త్రం సంపదకు సంబంధించిన శాస్త్రమని అభిప్రాయపడ్డారు. అర్థశాస్త్రానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనాన్ని ఇచ్చిన మొదటి వ్యక్తి ఆడమ్‌స్మిత్. సంపద నిర్వచనాన్ని బలపర్చినవారు జె.బి.సే, జె.ఎస్.మిల్, వాకర్ మొదలైన ఆర్థికవేత్తలు. ఆడమ్ స్మిత్ సంపదకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వగా మార్షల్ శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. కార్లే, రస్కిన్‌లు సంపద నిర్వచనాన్ని విమర్శిస్తూ కేవలం సంపద అనే ఒకే విషయాన్ని గురించి చర్చించే శాస్త్రం శాస్త్రమే కాదని అది ఒక శూన్య శాస్త్రమని పేర్కొన్నారు. లయోనెల్ రాబిన్స్ 1932లో ప్రచురించిన ప్రఖ్యాత పుస్తకం 'యాన్ ఎస్సే ఆన్ ది నేచర్ అండ్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ ఎకనామిక్ సైన్స్' లో వనరుల కొరతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు.
- **పరిధి:** అర్థశాస్త్రం ముఖ్యంగా సంపదకు సంబంధించిన శాస్త్రం. మానవుడు కోర్కెలను సంతృప్తి పర్చుకోవడానికి ధనాన్ని ఏ విధంగా ఉపయోగిస్తాడో తెలియచేస్తుంది. మానవుల కోర్కెలు తీర్చే వస్తు సేవల ఉత్పత్తి ఎలా జరుగుతుంది? తయారైన వస్తువులు మార్కెట్ల ద్వారా వ్యక్తులకు ఎలా చేరతాయి? వాటి ధరలను ఎలా నిర్ణయిస్తారు వంటి విషయాలను అర్థశాస్త్రం తెలుపుతోంది. ఉద్యోగిత, ఆదాయ పంపిణీ, ధరల పెరుగుదల, వస్తుమార్పిడి మొదలైన అంశాల్లో వ్యక్తులు, ప్రభుత్వ ప్రవర్తనను అర్థశాస్త్రం వివరిస్తుంది. ఆధునిక కాలంలో అర్థశాస్త్ర ప్రాముఖ్యత పరిధి పెరిగింది.



ప్రాముఖ్యత, ఆవశ్యకత

- అర్థశాస్త్రం ఒక సామాజిక, మానవీయ శాస్త్రం. ఇది శాస్త్రరూపం దాల్చి 200 ఏళ్లే అయినప్పటికీ దీన్ని 'సామాజిక శాస్త్రాల రాణి'గా పరిగణిస్తున్నారు. ఈ శాస్త్రంలో విశేషమైన ప్రతిభ కనబర్చిన వారికి 1969 నుంచి అత్యున్నత పురస్కారమైన నోబెల్ బహుమతి ఇస్తున్నారు. మనదేశానికి చెందిన భారతరత్న అవార్డ్ గ్రహీత అమర్త్యసేన్‌కు 1998లో నోబెల్ బహుమతి లభించింది. ప్రస్తుత ప్రణాళికా యుగంలో ఆర్థికాభివృద్ధికి ఈ శాస్త్ర అధ్యయనం ఎంతో ఉపయోగకరం. భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి, వనరుల సమతౌల్య వినియోగానికి అర్థశాస్త్రం ఉపయోగపడుతుంది. దేశ ఆర్థిక వనరులు పరిమితంగా ఉంటాయి. కాబట్టి ఆర్థిక వనరులను వినియోగ వస్తువుల తయారీకి ఎక్కువగా ఖర్చు చేస్తే ఆర్థికాభివృద్ధికి అవసరమైన వస్తువుల తయారీకి కావాల్సిన వనరుల కొరత ఏర్పడుతుంది. అందువల్ల వనరుల వాడకంలో సమతూకాన్ని పాటించాల్సి ఉంది.
- వస్తువుకు ఉండే కోరికలను తీర్చగలిగే శక్తిని ఉపయోగ విలువ అంటారు. ఉదాహరణకు గాలి, నీరు, ఆహారం, వస్త్రం, ఇల్లు, కారు వీటన్నింటికీ ఉపయోగ విలువ ఉంటుంది.
- ఒక వస్తువు కొనుగోలు శక్తిని వినిమయ విలువ అంటారు. ఇది ఆ వస్తువు మారక విలువకు సంబంధించింది. అర్థశాస్త్రంలో మారక విలువ ఉన్న వస్తువులను అధిక వస్తువులు అంటారు. ఉత్పత్తి అయిన వస్తు సేవలు వాటి ఉత్పత్తికి కారణమైన కారకాల మధ్య ఎలా సరఫరా అవుతాయో పంపిణీ తెలుపుతుంది. భూమికి, శ్రమకు, మూలధనాలకు చెల్లించే ప్రతిఫలాలు వరుసగా భాటకం, వేతనం, వడ్డీ. వ్యవస్థాపనకు చెల్లించే ప్రతిఫలం లాభాలు.
- వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తులకు ఆదాయం వస్తుంది. ద్రవ్య రూపంలో వచ్చే ఆదాయాన్ని 'ద్రవ్య ఆదాయం' అంటారు. ద్రవ్య ఆదాయాన్ని అది కొనుగోలు చేయగల వస్తు సేవల రూపంలో చెప్పినట్లయితే దాన్ని 'నిజ ఆదాయం' అంటారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

- ఆర్థిక వ్యవస్థలో అమలులో ఉన్న వేతనస్థాయి వద్ద పనిలో చేరడానికి ఇష్టపడిన వారందరికీ పని కలిగించగలిగే స్థితిని 'సంపూర్ణ ఉద్యోగిత' స్థితి అంటారు.
- నార్వేలోని ఓస్లో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రాగ్నర్ ఫ్రిష్ 1933లో మొదటిసారిగా సూక్ష్మ, స్థూల అర్థశాస్త్రాలు అనే భావనలను అభివృద్ధి చేశారు. అర్థ శాస్త్రంలో నోబెల్ బహుమతిని 1969 నుంచి ఇస్తున్నారు. మొదటి విజేత రాగ్నర్ ఫ్రిష్.
- సూక్ష్మ అర్థశాస్త్రం అనేది 'మైక్రాస్' అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. మైక్రో అంటే చిన్న అని అర్థం. సూక్ష్మ అర్థశాస్త్రం వైయక్తిక ఆర్థిక యూనిట్లను అధ్యయనం చేస్తుంది. దీనికి ఎక్కువ ప్రాచుర్యం కల్పించిన వారు మార్షల్. ఆయన రచించిన గ్రంథం 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్'. సూక్ష్మ అర్థశాస్త్రాన్ని ధరల సిద్ధాంతం అని కూడా అంటారు.
- స్థూల అర్థశాస్త్రం మాక్రోస్ అనే గ్రీకు పదం నుంచి ఆవిర్భవించింది. మాక్రో అంటే పెద్ద అని అర్థం. స్థూల అర్థశాస్త్రం మొత్తం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేస్తుంది. ఉదా: జాతీయాదాయం, మొత్తం వినియోగం, మొత్తం రాబడి, మొత్తం ఉద్యోగిత మొదలైన సమష్టి అంశాలను స్థూల అర్థశాస్త్రం వివరిస్తుంది. జె.ఎం. కీన్స్ స్థూల అర్థశాస్త్రానికి ఎక్కువ ప్రాధాన్యాన్ని కల్పించారు. సూక్ష్మ అర్థశాస్త్రాన్ని మార్షల్, స్థూల అర్థశాస్త్రాన్ని కీన్స్ వివరించారు. ధరల సిద్ధాంతాన్ని సూక్ష్మ అర్థశాస్త్రం అని, ఆదాయ ఉద్యోగిత సిద్ధాంతాన్ని స్థూల అర్థశాస్త్రం అని పిలుస్తారు.
- ప్రజల కోరికలను సంతృప్తి పర్చగలిగే దృశ్యరూప పదార్థాలన్నింటినీ వస్తువులుగా పరిగణించొచ్చు. ప్రకృతి పరంగా అందరికీ అందేవాటిని ఉచిత వస్తువులని అంటారు. వీటి విషయంలో డిమాండ్ కంటే సప్లయ్ ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. వీటికి ఉపయోగితా విలువ ఉంటుంది. వినిమయ విలువ ఉండదు. **ఉదా:** సూర్యరశ్మి, నదిలో నీరు, గాలి. పెద్ద నగరాల్లో నీటిని ఉచిత వస్తువుగా చెప్పలేం.
- కొరతగా ఉన్న వస్తువులన్నీ ఆర్థిక వస్తువులే. డిమాండ్‌తో పోల్చి చూసినప్పుడు సప్లయ్ ఎప్పుడూ తక్కువగా ఉండి ధర చెల్లించాల్సిన వస్తువులను ఆర్థిక వస్తువులని అంటారు. పబ్లిక్, ప్రైవేట్ వస్తువులు అన్నీ ఆర్థిక వస్తువులే. ప్రజలు కోరే వస్తువులను ఉత్పత్తి చేసేందుకు వనరులను అత్యుత్తమ పద్ధతిలో వాడుకోవడాన్ని ఆర్థిక సామర్థ్యం అంటారు. ప్రస్తుతం ఉపయోగించుకోవడానికి ఉత్పత్తి చేసే వస్తువులను వినియోగ వస్తువులంటారు. ఇతర వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగపడుతూ మానవుని కోర్కెలను పరోక్షంగా తీర్చగలిగే వస్తువులను ఉత్పాదక వస్తువులు లేదా మూలధన వస్తువులు అని అంటారు. **ఉదా:** యంత్రాలు, పరికరాలు. పూర్తిగా తయారు కాకుండా ఉత్పత్తి ప్రక్రియలో వివిధ దశల్లో ఉన్న వస్తువులను మాధ్యమిక వస్తువులు అంటారు.
- **ఉదా:** సిమెంట్, ఇటుకలు, ఉక్కు.
- అర్థశాస్త్రంలో ఆర్థిక వస్తువులన్నింటినీ సంపదగా పరిగణిస్తారు. ఒక వినియోగదారుడు లేదా సంస్థ కలిగి ఉన్న ఆదాయాన్ని ఆర్జించడానికి అవకాశం ఉన్న ఆస్తుల నిల్వ.. సంపద. ఆదాయానికి మూలం సంపద. సంపద ఒక విలువ. దీని ద్వారా ఆదాయం ప్రవాహం రూపంలో వస్తుంది. ప్రతి ఆర్థిక వ్యవస్థలో ఆదాయం కుటుంబాల నుంచి వ్యాపార సంస్థలకు, వ్యాపార సంస్థల నుంచి కుటుంబాలకు ప్రవహిస్తుంది. మానవుని కోరికలను సంతృప్తి పర్చగలిగే వస్తు, సేవల శక్తిని ప్రయోజనం అంటారు. ఒక వస్తువు ఆకారం, రంగు, పరిమాణం మొదలైనవి మార్చడం ద్వారా ఆ వస్తువుకు మానవుని కోరికను తీర్చగలిగే శక్తి పెరిగినట్లయితే దాన్ని రూప ప్రయోజనం అంటారు. **ఉదా:** చెక్కతో కుర్చీ లేదా టేబుల్ తయారు చేసినప్పుడు దాన్ని రూప ప్రయోజనం అంటారు. అదేవిధంగా స్థల, కాల, సేవల ప్రయోజనం కూడా ఉంటుంది.
- వ్యక్తులు తమ ప్రస్తుత కోరికలను తీర్చుకోవడానికి వస్తు సేవలను ఉపయోగించడాన్నే వినియోగం అంటారు. వస్తువులు ఉపయోగించే వ్యక్తిని వినియోగదారుడంటారు.
- అర్థశాస్త్రంలో ఉత్పత్తి అంటే ముడి పదార్థాలకు ప్రయోజనం చేకూర్చి అంతిమ వస్తువులుగా మార్చే ప్రక్రియ. వస్తువులను ఉత్పత్తి చేసేవారు ఉత్పత్తిదారులు.
- ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించే ప్రతి వ్యక్తి ఆర్థిక ప్రతినిధి. ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనే వారందరూ ఉత్పత్తిదారులే. సేవలను ఉత్పత్తి చేసే వర్తకుడు కూడా ఉత్పత్తిదారుడే.

ప్రత్యక్ష వినియోగానికి తోడ్పడే ఉత్పత్తులను అంతిమ ఉత్పత్తులు అంటారు. వస్తువు లేదా సేవలను ఉపయోగించుకొనే ప్రతి వ్యక్తి వినియోగదారుడే. వస్తు ఉత్పత్తికి ఉపయోగపడే వస్తువులను ఉత్పాదక వస్తువులు అంటారు. చిల్లర వర్తకులు విక్రయించే ధరను చిల్లర ధర అంటారు.

- వ్యాపారానికి కావాల్సిన పెట్టుబడిని వాటాలుగా (షేర్స్)గా విభజించి వాటిని ఎంపిక చేసిన కొంతమందికి, ప్రజలకు అమ్మి ఆ ధనంతో వ్యాపార వ్యవస్థను నిర్వహించడాన్ని 'జాయింట్ స్టాక్ కంపెనీ' అంటారు. ఈ కంపెనీలను 'లిమిటెడ్' అనడానికి కారణం వాటాదారు బాధ్యత పెట్టిన పెట్టుబడి మేరకే పరిమితంగా ఉంటుందని అర్థం.
- ప్రతి ధరకు, డిమాండ్‌కు సంబంధాన్ని డిమాండ్ ఫలం అంటారు. అంటే 'డిమాండ్ పరిమాణానికి ఆధారం ధర. కాబట్టి ధర తగ్గినప్పుడు డిమాండ్ పెరుగుతుంది. ధర పెరిగినప్పుడు డిమాండ్ తగ్గుతుంది. ధరకు డిమాండ్‌కు మధ్య విలోమ సంబంధం ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఏ నిర్వచనం వల్ల అర్థశాస్త్రానికి సార్వజనీనత లభిస్తుంది?
   1) కొరత 2) శ్రేయస్సు
   3) సంపద 4) అన్నీ
2. సూక్ష్మ అర్థశాస్త్రానికి మరొక పేరు?
   1) క్షీణోపాంత ప్రయోజన సూత్రం
   2) ఆదాయ ఉద్యోగితా సిద్ధాంతం
   3) ధరల సిద్ధాంతం
   4) ఏదీకాదు
3. 'Wealth of Nations' గ్రంథాన్ని ఎవ రు రాశారు?
   1) పిగూ 2) వాల్రస్
   3) మార్షల్ 4) ఆడం స్మిత్
4. 1970లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత?
   1) రాబిన్స్ 2) అమర్త్యసేన్
   3) మార్షల్ 4) పాల్ శామ్యూల్‌సన్
5. వనరుల కొరత వల్ల ఏర్పడే సమస్య?
   1) ఎంపిక 2) కొరత
   3) ఆర్థిక 4) శ్రేయస్సు
6. పూర్తిగా తయారుకాకుండా ఇంకా తయారీలో ఉన్న వస్తువులను ఏమంటారు?
   1) వినియోగ వస్తువులు
   2) మాధ్యమిక వస్తువులు
   3) ఆర్థిక వస్తువులు
   4) ఉచిత వస్తువులు
7. 'ఉద్యోగిత, వడ్డీ, ద్రవ్య సాధారణ సిద్ధాంతం' అనే పుస్తకాన్ని ఎవరు రాశారు?
   1) కె.ఇ. బోల్డింగ్ 2) రాగ్నర్ ఫ్రిష్
   3) జె.ఎం. కీన్స్ 4) స్టిగ్లర్
8. అర్థశాస్త్రంలో 'సూక్ష్మ అర్థశాస్త్రం', 'స్థూల అర్థశాస్త్రం' భావనలను 1933లో అభివృద్ధి చేసినవారు?
   1) కీన్స్ 2) ఆడమ్ స్మిత్
   3) రాగ్నర్ ఫ్రిష్ 4) రాబిన్స్
9. ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్ అనే గ్రంథాన్ని రచించింది?
   1) మార్షల్ 2) కీన్స్
   3) ఆడమ్ స్మిత్ 4) రాబిన్స్
10. చెక్కతో కుర్చీ తయారు చేసినప్పుడు దానికి ఏ ప్రయోజనం చేకూరుతుంది?
    1) రూప ప్రయోజనం
    2) స్థల ప్రయోజనం
    3) సేవల ప్రయోజనం
    4) కాల ప్రయోజనం
11. అర్థశాస్త్రాన్ని 'సామాజిక శాస్త్రాల్లో రాణి' వంటిదని చెప్పినవారు?
    1) జాకోబ్ వైనర్ 2) మార్షల్
    2) ఆడమ్ స్మిత్ 4) పాల్ శామ్యూల్ సన్
12. అర్థశాస్త్రానికి కొరత నిర్వచనాన్ని ఇచ్చిన ఆర్థికవేత్త?
    1) రాబిన్స్ 2) ఆడమ్ స్మిత్
    3) మార్షల్ 4) జాకోబ్ వైనర్

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 4;
5) 1; 6) 2; 7) 3; 8) 3;
9) 1; 10) 1; 11) 4; 12) 1;

Audit adopted by banking company is?

Model Questions

1. Which of the following is most important contributing factor affecting the profitability of banks?
   a) Deteriorating productivity
   b) Heavy establishment expenses
   c) Huge "dead credit" in sick industries and the mounting NPAs
   d) Heavy losses on investment port-folio
   e) None of these
2. No license from RBI is required for:
   a) Opening a new bank branch in India
   b) Opening a new bank branch outside India
   c) Shifting an existing branch outside the city , village or town
   d) Shifting an existing branch within the same city, village or town
   e) None of these
3. "Pure Banking Nothing Else" is a slogan raised by:
   a) ICICI Bank
   b) HDFC Bank
   c) SBI
   d) Axis Bank
   e) None of these
4. How much bad loans was accumulated with the public sector banks by 31st March 2015, as disclosed by the Finance Ministry on 21st July 2015?
   a) Rs.4.50 lakh crores
   b) Rs.1.50 lakh crores
   c) Rs.2.67 lakh crores
   d) Rs.3.57 lakh crores
   e) Rs.5.50 lakh crores
5. What are the RBI guidelines for the development of interest rate swaps (IRS):
   a) Banks can use IRS for hedging and trading both
   b) MIFOR is a benchmark for IRS
   c) Under ISDA agreement Banks can opt for dual jurisdction i.e; Indian as well as common law
   d) All of the above
   e) None of these
6. Which bank has become the first to launch Watch Banking in India?
   a) ICICI b) HDFC c) Axis
   d) SBI e) None of these
7. Which of the following countries are top three largest shareholders in Asian Infrastructure Investment Bank (AIIB)?
   a) China, India and Australia
   b) China, Australia and Canada
   c) China, India and Russia
   d) China, Russia and India
   e) None of these
8. Which of the following is NOT a banking related term?
   a) SME finance
   b) Overdraft
   c) Drawing power
   d) Term Loan e) None of these
9. Which of the following agencies is associated with business of Insurance sector as a regulator?
   a) NPCI b) IRDA c) SEBI
   d) AMFI e) None of these
10. Which of the following is the major function of an ATM installed by banks:
    a) To determine cash by way of withdrawl from one's account
    b) To transfer money from one place to another place
    c) To detect fake currency notes
    d) To arrange currency notes in serial order and count them
    e) None of these
11. Khandelwal Committee relates to study of _____ issues in public sector banks:
    a) Capital Adequacy Ratio
    b) Human Resources
    c) Branch Expansion
    d) Foreign Exchange
    e) None of these
12. Which among the following country has least contribution in the capital of the New Development Bank (NDB)?
    a) Brazil
    b) India
    c) South Africa
    d) Russia
    e) None of these



13. Liquidty ratio is fixed by Reserve Bank of India under the powers conferred on it by:
    a) Reserve bank of India Act, 1934
    b) Companies Act, 1956
    c) Bank Regulation Act, 1949
    d) Special Powers given by the Union Ministry of Finance
    e) None of these
14. Which of the following is not a member of the World Bank Group:
    a) International Bank for Reconstruction and Development
    b) International Development Association
    c) Bank of International Settlement
    d) International Finance Corporation
    e) None of these
15. The growth of commercial banks advances has proportionately been less than that in deposits. This is because:
    a) The commercial banks follow a conservative credit policy
    b) The reserve Bank of India always apply a restrictive credit policy
    c) There has been a progressive increase in the statutory liquidity ratio which banks are required to maintain
    d) The demand for bank credit has not increased correspondingly
    e) None of these

BANK EXAMS

BANKING AWARENESS

16. Audit adopted by banking company is:
    a) Regular Audit & Concurrent Audit
    b) Periodical Audit
    c) Internal Audit
    d) Balance Sheet Audit
    e) None of these
17. Financial literacy is a serious issue for RBI because:
    a) It would enable better understanding of banking business
    b) With better understanding more and more people can utilize the banking services
    c) It would mean banks can do more business
    d) It would mean the maximum number of people
    e) None of these
18. The function of back office are:
    a) It verifies and settles the deals
    b) It maintains proper record if Book keeping
    c) It submits financial returns of RBI
    d) All of the above
    e) None of these
19. "Brown projects" means:
    a) Projects envisaged in metropolitan cities
    b) Projects where capital infusion is of a very high order
    c) Any project other than those for Agricultural activities
    d) Projects aimed at modernization, diversification and expansion
    e) None of these
20. The government of India has signed a USD 300 million loan pact to support the National Urban Health Mission (NUHM) with which of the following?
    a) World Bank
    b) Asian Development Bank
    c) New Development Bank
    d) All of the above
    e) None of these
21. For a foreigner temporarily residing in India, type of account to be opened is:
    a) Resident account
    b) NRO Account
    c) NRE Account
    d) All of these
    e) None of these
22. Medium-term loan will be granted:
    a) To meet working capital deficit
    b) For acquisition of fixed assets
    c) To clear short-term debts
    d) To pay public depositors
    e) None of these
23. RBI is the apex Bank of India, similarly the apex Bank of USA is called:
    a) Federal Reserve
    b) The Central Bank of USA
    c) Bank of America
    d) All of these
    e) None of these
24. To commemorate the International Day of Yoga, the Reserve Bank of India (RBI) recently announced to issue coins of which denominations?
    a) Rs. 2 b) Rs. 5 c) Rs. 10
    d) Rs. 50 e) Rs. 25
25. What is the government equity in the proposed Rs. 20,000 crore National Investment and Infrastructure Fund (NIIF)?
    a) 26% b) 49% c) 51%
    d) 75% e) 85%
26. Exports in India get insurance cover and risk cover from which of the following organizations?
    a) SIDBI b) NABARD
    c) ECGC d) RBI
    e) None of these
27. Which of the following banks have launched 'Dhanchayat', an educational film to raise awareness on the dangers of borrowing money from unorganised sources?
    a) State bank of India
    b) Bhartiya Mahila Bank
    c) HDFC Bank
    d) Axis Bank
    e) None of these
28. Which of the following is NOT the name of multinational bank?
    a) BNP Paribas
    b) British bank of Middle East
    c) Standard Charted Bank
    d) Cathay Pacific
    e) None of these
29. How much capital would be infused in Public Sector Banks by Union Government over a period of four years to improve capital ratio and fight with rising bad loans?
    a) Rs. 1,00,000 crore
    b) Rs. 1,75,000 crore
    c) Rs. 70,000 crore
    d) Rs. 54,000 crore
    e) Rs. 10,000 crore
30. Which of the following cannot be called as a Debt Instrument as referred in financial transactions?
    a) Certificate of Deposits
    b) Bonds
    c) Stocks
    d) Commercial Papers
    e) None of these
31. The bank which has launched 'PayZapp' app with a complete payment solution?
    a) IDBI
    b) HDFC
    c) Laxmi vilas Bank
    d) AXIS
    e) ICICI

Answers

1) c; 2) d; 3) c; 4) c; 5) d;
6) b; 7) a; 8) e; 9) c; 10) a;
11) b; 12) c; 13) c; 14) c; 15) c;
16) a; 17) b; 18) d; 19) d; 20) b;
21) b; 22) b; 23) a; 24) c; 25) b;
26) c; 27) c; 28) d; 29) c; 30) c;
31) b.